ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం fb.com/vaartha Digital

Published from Srikakulam ,Visakhapatnam, Vijayawada, Hyderabad,Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem

30-7-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 180 పేజీలు: 16 వెల: 6.50

ఏడేళ్లు నివసిస్తేచాలు.. అమెరికాలో గ్రీన్‌కార్డు!

భర్తను నెలవారీ లీజుకు ఇచ్చిన భార్య

5లో

'పరీక్షల' బిల్లు పాస్

- విపక్షాల నిరసనల మధ్య మూజువాణి ఓటుతో ఆమోదించిన లోక్‌సభ
- చట్టం మరింత కఠినంగా అమలుకే ఈ సవరణలు: మంత్రి జితేంద్ర సింగ్
- విపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శలపై రగడ
- కొన్ని వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించిన స్పీకర్ ఓం బిర్లా

న్యూఢిల్లీ,జులై 29: ప్రభుత్వపరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రభుత్వ పరీక్షలు (అక్రమ మార్గాలనిరోధం) సవరణ బిల్లు- 2026కు లోక్‌సభ బుధవారం ఆమోదం తెలిపింది. ప్రతిపక్ష సభ్యుల నిరసన నినా దాల మధ్య బిల్లును సభ ఆమోదించింది. సవరణ బిల్లుకు లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది. ఈ సవరణల ప్రకారం నేరస్తులకు గరిష్ఠంగా 10 సంవత్స రాల జైలు శిక్షతో పాటు రూ.50 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం కల్పిం చారు. ఈ సవరణ బిల్లును కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ముందురోజులోక్‌సభలో ప్రవేశ పెట్టారు. ఇటీవల

లోక్‌సభలో మంత్రి జితేంద్ర సింగ్

విపక్ష నేత రాహుల్ గాంధీ

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనల నేపథ్యంలో విద్యార్థులు పెద్దఎత్తున చేపట్టిన ఆందోళనల అనంతరం విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన కొద్ది రోజులకే ప్రభుత్వం ఈ సవరణ బిల్లును తీసుకొచ్చింది. బిల్లుపై జరిగిన చర్చకు సమాధానమిచ్చిన జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, నీట్ ప్రశ్నాపత్రం లీక్‌ఘటనలో ప్రభుత్వం అత్యంతవేగంగా స్పందించిందన్నారు. 2024లో పేపర్ లీక్ నిరోధక చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 52 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు తెలిపారు. అనుభవాల ఆధారంగా చట్టాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం >>2

లాఠీ-ఛార్జి, పెల్లెట్ గన్స్ ప్రయోగం అమిత్‌షాకు తెలియదా?

ఆయన రాజీనామా చేయాల్సిందే: రాహుల్

న్యూఢిల్లీ,జులై 29: కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. విద్యార్థులపై లాఠీఛార్జికి, హింసకు కారకుడు అమిత్ షా అని, ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాని మోడీ చర్య తీసుకోవాలని కోరారు. ఢిల్లీలో బుధవారం జరిగిన ఒక మీడియా సమావేశంలో రాహుల్‌మాట్లాడారు. నీట్ పేపర్‌లీకేజీ, సిజెపి ర్యాలీ సందర్భంగా విద్యార్థులపై జరిగిన దాడి గురించి స్పందించారు. ఢిల్లీ పోలీసు వ్యవస్థ కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పని చేస్తుంది. కేంద్ర బలగాలు కూడా హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోనే >>2

బుధవారం ఉద్యోగాల కల్పనకు ఏర్పాటైన సమీక్షా సమావేశంలో మంత్రి నారా లోకేష్, అధికారులు

జాబ్ కేలండర్-2లో 3168 ఉద్యోగాల భర్తీ

సెప్టెంబర్ 15న నోటిఫికేషన్ విడుదల

మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో సమీక్ష

విజయవాడ,జులై29,ప్రభాతవార్తప్రతినిధి: ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ నోటిఫికేషన్ విడుదలకు చర్యలు తీసుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. జాబ్ కేలండర్2026పై మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఉద్యోగాల కల్పనకు ఏర్పాటైన మంత్రుల బృందం ఉండవల్లి నివాసంలో సమీక్ష నిర్వహించింది. ఈ సమావేశానికి మంత్రులు ఆన్ లైన్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ శాఖల్లో భర్తీ చేయాల్సిన పోస్టుల గురించి అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జాబ్ కేలండర్26లో విడుదల చేసిన 10,060 ఉద్యోగాలను నాలుగు దశల్లో భర్తీ చేయనున్నారు. ఇప్పటికే మొదటి దశ కింద వివిధ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 1,523 అధ్యాపక పోస్టుల భర్తీకి ఈ ఏడాది మే 15న నోటిఫికేషన్ విడుదల చేశారు. రెండో దశ కింద 3,168 పోస్టుల భర్తీకి ఆగష్టు 15 నోటిఫికేషన్ విడుదల చేయాలని మొదట నిర్ణయించినప్పటికీ రాష్ట్రపతి ఉత్తర్వుల అమలులో వివిధ సాంకేతిక కారణాలు, ఉద్యోగ సంఘాల వినతి మేరకు జాప్యం జరిగింది. దీంతో సెప్టెంబర్ 15న >>2

బిల్లుకు రాజ్యసభ ఆమోదం

న్యూఢిల్లీ,జులై 29: జాతీయ గేయం వందేమాతరంను ఉద్దేశపూర్వకంగా అవమానించడాన్ని శిక్షార్హ నేరంగా ప్రకటించే జాతీయ గౌరవానికి అవమాన నిరోధక (సవరణ) బిల్లు2026కు రాజ్యసభ బుధవారం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం జాతీయ జెండా, జాతీయ గీతానికి ఉన్న చట్టపరమైన రక్షణను ఇకపై వందేమాతరానికీ వర్తింపజేయనున్నారు. బిల్లుపై సుదీర్ఘ చర్చ అనంతరం ఎగువ సభ దీన్ని ఆమోదించింది. బిల్లుపై చర్చ సందర్భంగా సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకురావాలని ప్రతిపక్షసభ్యులు నినాదాలు చేశారు. ఆప్, కాంగ్రెస్, >>2

మావోయిస్టు అగ్రనేత మిసిర్ బెస్రా అరెస్టు

మరికొందరు అనుచరులను కూడా నిర్బంధించిన జార్ఖండ్ పోలీసులు

12లో

అరుదైన వృక్షజాతి మొక్కకు నామకరణం చేసిన డి.సిఎం పవన్

3లో

బుధవారం సిఎం చంద్రబాబుతో సమావేశమైన తైవాన్ ప్రతినిధి బృందం

ఎపిలో తైవాన్ ఎలక్ట్రానిక్స్

సెమీ కండక్టర్ల తయారీకి సుముఖం, సిఎం చంద్రబాబుతో తైవాన్ ప్రతినిధి బృందం చర్చలు

తయారీ రంగంలో సాంకేతిక సహకారం బలోపేతం చేయడానికి అంగీకారం

విజయవాడ, జులై 29,ప్రభాతవార్తప్రతినిధి: ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు సహా అధునాత తయారీ, సాంకేతిక రంగాల్లో ఏపీతో భాగస్వామ్యాన్ని మరింత పెంచుకునే దిశగా తైవాన్ పారిశ్రామిక ప్రతినిధుల బృందం సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యింది. తైవాన్ కంపెనీలు, పరిశ్రమలకు చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రితో వివిధ అంశాలపై చర్చలు జరిపింది. తైవాన్ కు చెందిన డెల్టా ఎలక్ట్రానిక్స్, బెన్‌క్యూ, సీటీబీసీ బ్యాంక్, డైమెర్కో, మాస్టర్ హిల్, నాన్ పావోరెసిన్స్, ఎవర్ క్లియర్ ఎన్విరానమెంటల్ ఇంజనీరింగ్, షెంగ్ హుయ్ టెక్, టెక్ టాప్ ఇంజనీరింగ్, కేఎస్ టెర్మినల్స్, శాండ్ సన్, జిలీ కనస్ట్రక్షన్స్ అండ్ ఇంజనీరింగ్, కపెల్లా స్టోర్స్ వంటి అంతర్జాతీయ స్థాయి దిగ్గజ సంస్థల కంపెనీల ప్రతినిధులు ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న పారిశ్రామిక అనుకూల విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైలు, రోడ్డు మార్గాల వంటి పటిష్టమైన లాజిస్టిక్స్ నెట్వర్క్ సహా ఏపీలోని తయారీ రంగ ఎకోసిస్టమ్ గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు తైవాన్ ప్రతినిధుల బృందానికి వివరించారు. ఎలక్ట్రానిక్స్, సెమికండక్టర్లు, ఐటీ, అడ్వాన్స్డ మాన్యుఫాక్చరింగ్ సహా ఎగుమతి ఆధారిత పరిశ్రమలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులకు >>2

పులుల సంరక్షణలో ఎపి ఆదర్శం

నల్లమలలో పులి గర్జనను శాశ్వతం చేస్తాం: డి.సిఎం పవన్

బుధవారం పులల సంరక్షణపై అధికారులతో సమీక్షిస్తున్న డి.సిఎం పవన్ కల్యాణ్

విజయవాడ.జులై 29,ప్రభాతవార్తప్రతినిధి: పులి కేవలం మన జాతీయ జంతువు మాత్రమే కాదు, మన దేశ అటవీ సంపదకు, జీవ వైవిధ్యానికి, పర్యావరణ సమతుల్యతకు ప్రతీక అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కొణిదెల అన్నారు.పులులను సంరక్షించడం అంటే మన అడవులను, జల వనరులను, వన్యప్రాణులను, భావితరాలకు అందించాల్సిన సహజ వారసత్వాన్ని కాపాడుకోవడవే అన్నారు. డీసీఎంవో నిర్వహించిన సమీక్షలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ప్రపంచ పులుల దినోత్సవం 2010లో పులుల సంరక్షణ కోసం అంతర్జాతీయ సమాజం తీసుకున్న సంకల్పాన్ని మనకు గుర్తు చేస్తుంది. అదే సమయంలో పులుల పరిరక్షణలో మన దేశం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన తీరును గుర్తు చేస్తుంది. 'ప్రాజెక్ట్ టైగర్'వంటి దూరదృష్టితో కూడిన కార్యక్రమా >>2

తిరుమల బ్రహ్మోత్సవాలకు కొత్త విద్యుత్ బస్సులు

తిరుమల,జులై 29ప్రభాతవార్తప్రతినిధి: ఏడుకొండల వేంకటేశ్వరునికి ఏడాదికోసారి జరిగే సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ప్రజా రవాణా సంస్థ(పూర్వపు ఆర్టీసి,ప్రస్తుతం పిటిసి)నూతన బస్సులు తిరుమల-తిరుపతి ఘాట్‌రోడ్లపై ప్రవేశపెట్టడం ఆనవాయితీ. ఈ ఆనవాయితీని గత ఐదేళ్ళలో అధికారంలోని వైసిపి ప్రభుత్వం విస్మరించింది. అయితే 2023లో ఆర్టీసి యాజమాన్యం విద్యుత్‌తో నడిచే బస్సులను తొలివిడతగా ప్రవేశపెట్టింది. ఇదే విషయాన్ని ఆర్టీసి ఉద్యోగులు కూడా ఘంటాపథంగా చెబు తున్నారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ప్రభుత్వం రెండువేలవరకు నూతనంగా విద్యుత్‌తో నడిచే ఆర్టీసి బస్సులను ప్రజలకోసం ప్రవేశపెట్టనుందనేది ఆర్టీసి >>2

ఎమ్మెల్యే అఖిల ప్రియపై సిఎం అసహనం

3లో

బుధవారం ప్రకాశం జిల్లావ్యాప్తంగా పొగాకు రైతుల రాస్తారోకో దృశ్యం

పొగాకు రైతుల భారీ రాస్తారోకో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరుతూ రోడ్డెక్కిన వేలాది మంది రైతులు

ఒంగోలుకలెక్టరేట్, జులై29, ప్రభాతవార్త: వర్జీనియా పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా, రైతు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ప్రకాశం జిల్లావ్యాప్తంగా రైతులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ముదిగొండ బ్రిడ్జి, టంగుటూరు టోల్‌గేట్, ఒంగోలు సమీపంలోని త్రోవగుంట వద్ద జాతీయ రహదారి-16పై బైక్ ర్యాలీలతో చేరుకున్న రైతులు రాస్తారోకో నిర్వహిం చడంతో ఒంగోలు-విజయవాడ హైవేపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. వాహ నదారులు గంటల తరబడి ఇబ్బందులు పడగా, పోలీసులు భారీగా మోహరించి పలువురు రైతు నాయ కులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆవి కృష్ణయ్య మాట్లాడుతూ మూడు నెలలుగా ఆందోళనలు చేస్తున్నా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడం లేదని విమర్శించారు. వెంటనే రూ.1,000 కోట్లు కేటాయించి ఎఫ్‌టీసీ ద్వారా నిల్వ ఉన్న పొగాకును ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం ఏ గ్రేడ్‌కు రూ.240, బీ గ్రేడ్‌కు రూ.190, సీ గ్రేడ్‌కు రూ.110తో పాటు కిలోకు రూ.20 బోనస్ ప్రకటించినా అది రైతులకు ఏమాత్రం మేలు చేయదని, కనీసం సగటున కిలోకు రూ.250 ధర లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుత ధరలతో కార్పొరేట్ >>2

బందరు పోర్టు, మంగినపూడి బీచ్‌ను అభివృద్ధి చేయండి

మచిలీపట్నం- బంటుమిల్లి రోడ్డు నిర్మాణానికి సహకరించండి

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరిన మంత్రి కొల్లు రవీంద్ర

బుధవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి ప్రతిపాదనలు అందించిన మంత్రి కొల్లు రవీంద్ర

విజయవాడ,జులై29,ప్రభాతవార్తప్రతినిధి: కృష్ణా జిల్లా సమగ్రాభివృద్ధికి, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి అండగా నిలిచే మచిలీ పట్నం బంటుమిల్లి రోడ్డు నిర్మాణానికి సహకరించాలని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ జైరాం గడ్కరీని ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేసారు. ఈ రోడ్డు నిర్మాణంతో మచిలీపట్నం పోర్టు, మంగినపూడి బీచ్‌కు రోడ్డు కనెక్టివిటీ పెరుగుతుంది. తద్వారా ఈ ప్రాంతంలో పర్యాటకం, పారిశ్రామిక అభివృద్ధి వేగవంతం అవుతాయి. ప్రధానంగా మచిలీపట్నం పోర్టు అనుసంధానంగా వచ్ ఇండస్ట్రియల్ కారిడార్స్, లాజిస్టిక్స్ పార్క్లు, ఎంఎస్ఎంఈ క్లస్టర్స్ కు సానుకూల వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు. సుమారు రూ.150 కోట్ల వ్యయంతో కృష్ణా జిల్లాలోని బందరు పోర్టు నుండి మంగినపూడి బీచ్ మీదుగా బంటుమిల్లి వరకు జాతీయ రహదారి 216కు అనుసంధానించాలని విన్నవించారు. ఈ రోడ్డు >>2

క్రిటికల్ మినరల్స్ పార్క్, రేర్ ఎర్త్ కారిడార్ కు సహకరించండి: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరిన మంత్రి కొల్లు రవీంద్ర

2లో

బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ఆగస్టు 1న ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు

17 నుంచి కొత్త ఎయిర్‌పోర్ట్‌లో పూర్తిస్థాయి సేవలు: మంత్రి అచ్చెన్నాయుడు

విజయనగరం, జులై 29 ప్రభాతవార్త: ఆగస్టు 1వ తేదీన ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవంతో ఉత్తరాంధ్ర ప్రజల కలలు సాకారం కానున్నాయని రాష్ట్ర వ్యవసాయ, అనుబంధ శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభమయ్యే శుభ ఘడియ కోసం ఈ ప్రాంత ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికార >>2

30-7pg2exHMNWJQE.qxd:30-7pg2exHMNWJQE.qxd 1/1/02 7:20 AM Page 1

బుధవారం పొగాకు రైతుల ధర్నాలో జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

పొగాకు రైతుల భారీ రాస్తారోకో

>> కంపెనీలు మరింత తక్కువకు కొనుగోళ్లు చేసే అవకాశం ఉందని, గత అనుభవాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత ఏడాది ఇదే సమయానికి 90 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు జరగ్గా, ఈసారి కేవలం 30 మిలియన్ కిలోలే కొనుగోలు జరిగిందని, కనిగిరి ప్రాంతంలో 62 శాతం వరకు నోబిడ్లు నమోదైనట్లు రైతు నాయకులు తెలిపారు. దీనివల్ల పెట్టుబడి ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడి రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పొగాకు సాగుకు ఎకరాకు భారీగా పెట్టుబడి పెట్టినా ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తున్న ధరలు సాగు వ్యయానికీ సరిపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు గణనీయంగా పెరగడంతో రైతులపై అప్పుల భారం మరింత అధికమైందన్నారు. పొగాకు కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం వల్ల వ్యాపార సంస్థలు రైతులను నష్టపరుస్తున్నాయని ఆరోపించారు. ఎఫ్‌టీసీ ద్వారా ప్రభుత్వ కొనుగోళ్లు చేపడితే రైతులకు న్యాయం జరుగుతుందని, దళారుల ప్రమేయం తగ్గుతుందని పేర్కొన్నారు. పొగాకు ద్వారా ప్రభుత్వాలకు భారీ పన్ను ఆదాయం లభిస్తున్నప్పటికీ రైతుల సంక్షేమానికి తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా ముందుకు రావాలని, ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన బోనస్ కంటే గిట్టుబాటు ధర కల్పించడమే రైతులకు నిజమైన మేలు చేస్తుందని స్పష్టం చేశారు. ప్రతి బేల్‌కు నాణ్యమైన గ్రేడింగ్ నిర్వహించి రైతులకు అన్యాయం జరగకుండా పర్యవేక్షణ పెంచాలని కోరారు. నిల్వల్లో ఉన్న పొగాకును వెంటనే కొనుగోలు చేయకపోతే రైతులు మరింత నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతుల ప్రతినిధులతో తక్షణమే సమావేశం నిర్వహించి స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఆందోళనల కారణంగా జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు చాలా సేపు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అత్యవసర సేవల వాహనాలకు మార్గం కల్పించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రైతులు ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలతో భారీగా తరలివచ్చి నిరసనలో పాల్గొన్నారు. రైతుల డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని పలువురు రైతు సంఘాల నాయకులు కోరారు. పొగాకు రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత విస్తరించనున్నట్లు హెచ్చరించారు. రైతుల అరెస్టులను ఖండిస్తూ వెంటనే వారిని విడుదల చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటికీ అనంతరం పరిస్థితి అదుపులోకి వచ్చింది. రైతు సంఘాల నేతలు కృష్ణయ్య, చుండూరు రంగారావు, పమిడి వెంకట్రావు తదితరులు నిరసన కార్యక్రమాలకు నాయకత్వం వహించారు.

క్రిటికల్ మినరల్స్ పార్క్, రేర్ ఎర్త్ కారిడార్ కు సహకరించండి

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరిన మంత్రి కొల్లు రవీంద్ర

విజయవాడ,జులై29,ప్రభాతవార్తప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అపారమైన ఖనిజ వనరులు, రేర్ ఎర్త్ మినరల్స్ అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని రాష్ట్ర మైనింగ్ రంగాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి గారిని ఢిల్లీలోని వారి కార్యాలయంలో రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కలిసి విన్నించారు. రాష్ట్రంలో క్రిటికల్ మినరల్స్ ప్రాసెసింగ్ పార్క్ ఏర్పాటు, ఆంధ్రాయూనివర్శిటీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ కెమికల్ ఇంజనీరింగ్ ఏర్పాటు, ఏపీ రేర్ ఎర్త్ కారిడార్ అభివృద్ధిపై ప్రతిపాదనలు అందించారు. రాష్ట్రంలోని ఖనిజాలు, స్ట్రాటజిక్ మినరల్స్‌కు ప్రపంచ స్థాయి వేల్యూ యాడెడ్ పరిశ్రమ ఏర్పాటు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ కెమికల్ ఇంజనీరింగ్ ఏర్పాటు ద్వారా సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధికి కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. తయారీ, ఎగుమతులను కలుపుతూ సమగ్రమైన రేర్ ఎర్త్ వ్యవస్థ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం తరఫున సహకారం అందించాలని కోరారు. దేశ మైనింగ్ అవసరాలు తీర్చేలా స్థానికంగానే అన్ని పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హామీ ఇచ్చినట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.

పులుల సంరక్షణలో ఎపి ఆదర్శం

>>ల ఫలితంగా నేడు ప్రపంచంలోని పులులలో దాదాపు 75 శాతం మన దేశంలో నివసిస్తున్నాయి. ఇది భారతదేశం సాధించిన అపూర్వ పర్యావరణ విజయానికి నిదర్శనం. దేశంలోనే అతి పెద్ద పులుల సంరక్షణ ప్రాంతమైన నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఆంధ్రప్రదేశ్‌లో ఉండటం మనందరికీ గర్వకారణం. నల్లమల అటవీ ప్రాంతంలో 5,442.83 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈ రిజర్వ్ పులులతోపాటు చిరుతలు, ఎలుగుబంట్లు, అడవి కుక్కలు, శాకాహార జంతువులు మరియు వందలాది వన్యప్రాణులకు సురక్షిత ఆవాసంగా నిలుస్తోంది. తాజా అంచనాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్ఎస్ఆర్‌టీ -శేషాచలం పరిధిలో 68 పులులు, 11 పులి పిల్లలు నమోదుకావడం సంతోషకర విషయం. ఎన్ఎస్‌టీఆర్ టైగర్ కన్జర్వేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 11 చెక్‌పోస్టులు నెలకు రూ. కోటికి పైగా ఆదాయం సమకూరుస్తూ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. తూర్పు కనుమల ప్రాంతంలో పులుల జన్యు వైవిధ్యాన్ని, జనాభాను పెంపొందించేందుకు మహారాష్ట్రలోని చంద్రపూర్ అటవీ పరిధి నుంచి రెండు ఆడ పులులను, మధ్యప్రదేశ్ నుంచి మరో రెండు ఆడ పులులను తీసుకురావడానికి సూత్రప్రాయ అంగీకారం లభించడానికి సహకరించిన కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల శాఖమంత్రి భూపేందర్‌యాదవ్ ఈ సందర్భంగా నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అదే సమయంలో సుమారు 800 మంది గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయని పేర్కొన్నారు. కర్ణాటక ప్రభుత్వం, ప్రజలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ఈ సందర్భంగా కర్ణాటక ముఖ్యమంత్రి డి కె శివకుమార్‌కి, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకి, అప్పటిఅటవీశాఖ మంత్రి, ప్రస్తుత పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి ఈశ్వర్ ఖండ్రే ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. వారి సహకారం, స్నేహభావం రెండు రాష్ట్రాల మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత పెం చాయి" అన్నారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం శాసనసభ్యులు బోనెల విజయ్ చంద్ర, పాలకొండ శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ, శాసన సభ విప్ తోయక జగదీశ్వరి, అటవీ పర్యావరణశాఖల ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, పీసీసీఎఫ్ పి.వి.చలపతిరావు, అటవీశాఖ సలహాదారు మల్లికా ర్జునరావు, సీసీఎఫ్ వైల్డ్ లైఫ్ఎన్.నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనే జింగ్ డైరెక్టర్‌నందిని సలారియా, విశాఖపట్నం చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఐ.కె.వి.రాజు, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి,పార్వతీపురం మన్యం జిల్లా అటవీ అధికారి ప్రసూన పాల్గొన్నారు.



బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో మంత్రి కొల్లు రవీంద్ర భేటీ

అభివృద్ధి చేయండి

>> మార్గం పూర్తైతే.. అంతరాయం లేని కనెక్టివిటీ లభిస్తుంది. ఎంతో వ్యూహాత్మక ప్రాముఖ్యతను సంతరించుకుంది. ప్రతిపాదిత రోడ్డు మార్గం మొత్తం ప్రభుత్వ భూమి గుండా వెళుతుండడంతో భూసేకరణ సమస్యలు లేకుండా కొత్త రహదారి నిర్మాణం చేయడానికి ఆస్కారం ఉంది. మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ జాతీయ మరియు అంతర్జాతీయ వాణిజ్యానికి ప్రధాన ద్వారంగా మారబోతోంది. ఈ రోడ్డు పూర్తైతే పోర్ట్ ద్వారా ఎగుమతి దిగుమతులు, కంటైనర్ ట్రాఫిక్, భారీ వాణిజ్య వాహనాలు మరియు లాజిస్టిక్స్ కార్యక లాపాల కదలికలకు సులువు అవుతుంది. ప్రతిపాదిత రోడ్డు మచిలీపట్నం ప్రాంతంలో రాబోయే ఇండస్ట్రియల్ కారిడార్లు, లాజిస్టిక్స్ పార్కు లు, ఎంఎస్ఎంఇ క్లస్టర్‌లు, మత్స్య మౌలిక సదుపాయాలు మరి యు అనుబంధ వాణిజ్య సంస్థలకు సమర్థవంతమైన కనెక్టివిటీని అందించగలుగుతుంది. తద్వారా వ్యవసాయ ఉత్పత్తులు, సముద్ర ఉత్పత్తులు, పారిశ్రామిక వస్తువులు రవాణాను సులభతరం చేస్తుంది. ఈ ప్రాజెక్టు పూర్తైతే కృష్ణా జిల్లా మరియు రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి గణనీయంగా దోహదపడు తుంది. లక్షలాది మంది పర్యాటకులను ఆక ర్షించే మంగినపూడి బీచ్‌కు రోడ్డు సదుపాయం మెరుగవుతుంది.

తద్వారా పర్యాటకం పెరిగి.. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఆతిథ్యం, వినోదం మరియు ఇతర పర్యాటక కార్యక లాపాలకు వెన్నుదన్నుగా నిలుస్తుంది. పారిశ్రా మిక, పర్యాటక అభివృద్ధిని, ఉద్యోగ ఉపాధి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర అభివృద్ధికి అండగా నిలిచే ఈ రోడ్డు మార్గానికి వీలైనంత త్వరగా అనుమతులు మంజూరు చేసి పూర్తి చేయాలని విన్నవించారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

నెల్లూరు క్రైం, జులై 29, ప్రభాతవార్త: నెల్లూరు నగరంలోని నిర్మలానగర్‌లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. అనుదీప్ సాయి (22) అనే యువకుడు ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతూ బలవన్మరణానికి పాల్పడ్డాడు. అనుదీప్ సాయి చిన్నప్పటి నుంచి చదువులో కొద్దిగా వెనుకబడి ఉన్నాడు. ఇటీవల యూనివర్సిటీ పరీక్షల్లో కొన్ని సబ్జెక్టులు ఫెయిల్ అయ్యాడు. ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ, గురువారం తెల్లవారు జామున ఇంటికి వచ్చిన యువకుడు తన పడక గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తెల్లవారు జామున నిద్రలేచిన తల్లి ఈ విషయాన్ని గమనించి వెంటనే భర్తకు తెలిపింది. భార్యా భర్తలిద్దరూ కలిసి కిందకు దించి, 108కి సమాచారం అందించారు. 108 సిబ్బంది అక్కడికి వచ్చి పరిశీలించి, అప్పటికే యువకుడు మృతి చెందనట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జిజిహెచ్ ఆసుపత్రికి తరలించారు.

అనంతలో తొలి కరోనా కేసు

గుంతకల్లు వృద్ధురాలికి ఐసోలేషన్ చికిత్స

అనంతపురం క్రైమ్, జులై 29 ప్రభాతవార్త: అనంతపురం జిల్లాకు కూడా కరోనా మహమ్మారి పాకింది. తాజాగా జిల్లాలోని గుంతకల్లు పట్టణానికి చెందిన ఓ 65 ఏళ్ల వృద్ధురాలికి కరోనా పాజిటివ్ గా ధ్రువీకరణ అయ్యింది. గత మూడు రోజులుగా తీవ్ర జ్వరం, దగ్గు, తలనొప్పి, తదితర సమస్యలతో గుంతకల్లులోని ఏరియా ఆసుపత్రికి వైద్యం కోసం వెళ్ళింది. కరోనా లక్షణాలపై అనుమానం వచ్చిన వైద్యులు కోవిడ్ పరీక్షలు నిర్వహించారు. రిపోర్ట్ చూసిన వైద్యులు ఒక్కసారిగా షాక్ అయ్యారు. కోవిడ్ పాజిటివ్ గా నిర్ధారణ అయ్యింది. దీంతో అప్రమత్తం అయిన ఆసుపత్రి వర్గాలు తగిన చర్యలు తీసుకున్నారు. వెంటనే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కోవిడ్ ఐసోలేషన్ వార్డు కు ఆమెను తరలించారు. కోవిడ్ కు సంబంధించిన వైద్య సేవలు అందిస్తున్నారు. కరోనా లక్షణాలు ఉంటే భయపడకుండా సమీప ప్రభుత్వాసుపత్రికి వెళ్ళి పరీక్షలు చేసుకోవాలని సూచిస్తున్నారు.

'పరీక్షల' బిల్లు పాస్

>> భావిస్తోందని, అందుకే ఈ సవరణలు తీసుకొచ్చినట్లు చెప్పారు. ప్రశ్నాపత్రాల లీకేజీల కారణంగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడే ఘటనలు గత కొన్ని సంవత్సరాల్లో తగ్గుముఖం పట్టాయని కూడా ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై జితేంద్ర సింగ్ విమర్శలు గుప్పించారు. పార్లమెంటరీ సంప్రదాయాలు, ప్రభుత్వ వ్యవహార తీరుపై ఆయనకు సరైన అవగాహన లేదని ఆరోపించారు. బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపిన అనంతరం సభను వాయిదా వేశారు. బిల్లును సభలో ప్రవేశపెట్టిన సమయంలో ప్రతిపక్ష సభ్యుల నినాదాలు, ఆందోళనల మధ్య తీవ్ర గందరగోళం నెలకొంది. అధికార, ప్రతిపక్ష సభ్యులు పరస్పరం తీవ్ర విమర్శలు చేసుకోవడంతో సభలో ఉద్రిక్త వాతావరణం కనిపించింది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రసంగంతో ప్రధానంగా రాజకీయ దుమారం రేగింది. ఆయన కేంద్ర హోంమంత్రి, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు ఆర్ఎస్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. సభలో నిరసనలు వ్యక్తమవడంతో రాహుల్ గాంధీ ప్రసంగంలోని కొన్ని వ్యాఖ్యలను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా రికార్డుల నుంచి తొలగించారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు స్పందిస్తూ, రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధమని విమర్శించారు. ఆధారాలు లేని ఆరోపణలు చేయడానికి ముందు పార్లమెంట్ గౌరవాన్ని కాపాడాలని ఆయన సూచించారు. సభ పలుమార్లు వాయిదా పడిన అనంతరం జితేంద్ర సింగ్ బిల్లును అధికారికంగా సభ ముందుంచారు. అప్పటికీ ప్రతిపక్ష సభ్యులు 'వీ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు కొనసాగించారు. గందరగోళం మధ్యే బిల్లును వాయిస్ ఓటుకు పెట్టగా, లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం పరీక్షా పత్రాల లీకేజీలను అరికట్టేందుకు తీసుకొచ్చిన కీలక చట్ట సవరణగా పేర్కొంటోంది. పేపర్ లీక్ నేరాలకు పాల్పడే వారిపై మరింత కఠిన చర్యలు తీసుకోవడమే ఈ బిల్లు ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం స్పష్టంచేసింది. కొత్త సవరణ బిల్లులో ఈ నేరాలకు మరింత ఎక్కువకాలం జైలుశిక్షలు, భారీ ఆర్థిక జరిమానాలు విధించేలా నిబంధనలు తీసుకురానున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఉభయసభలు ఆమోదించిన తర్వాత రాష్ట్రపతి ఆమోదిస్తే చట్టరూపంలోకి ఈ కొత్తబిల్లు రానున్నది.

రాజ్యసభ ఆమోదం

>> సిపిఎం సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేయగా, అనంతరం ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ఇరు పక్షాల సభ్యులు తమ అభిప్రాయాలు వెల్లడించిన తర్వాత కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా నిత్యానంద్ రాయ్ మాట్లాడుతూ, 1971లో జాతీయ చిహ్నాల పరిరక్షణ కోసం ఈ చట్టాన్ని తీసుకొ చ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు అదే రక్షణను వందేమాతరానికీ విస్తరిస్తున్నామని చెప్పారు. బంకించంద్ర చటర్జీ 1875లో ఈ గీతాన్ని రచించారని, 1896 కాంగ్రెస్ సమావేశంలో రవీంద్రనాథ్ ఠాగూర్ ఆలపించారని వివరించారు.

ఆగస్టు 1న ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు

>> సంబంధాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ తో కలిసి మంత్రి అచ్చెన్నాయుడు బుధవారం భోగాపురం ఎయిర్‌పోర్ట్ వద్ద పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రమాన్ని ప్రారంభిస్తారని, 17వ తేదీ నుంచి ఇక్కడ సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. 16 వ తేదీ రాత్రి సింగపూర్ నుంచి విమానం వచ్చి, 17వ తేదీ తెల్లవారుజామున ఇక్కడినుంచి బయలుదేరుతుందని వివరించారు. హూద్ హూద్ తుఫానును ఎదుర్కొనే సమయంలోనే ఈ ప్రాంతంలో విమానాశ్రయాన్ని నిర్మించాలన్న ఆలోచన ముఖ్యమంత్రి చంద్రబాబుకి వచ్చిందని, ఆయన దూరదృష్టి, పరిపాలనా దక్షత కారణంగా, ఈ ఆలోచన సాకారం అయ్యిందని అన్నారు. అలాగే ఆగస్టు 13 న పోలవరం ఎడమ కాలువ నుంచి నీరు విడుదల చేసి, మరో స్వప్నాన్ని సాకారం చేయనున్నారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన కేవలం 24 నెలల్లోనే ఉత్తరాంధ్రలో ఎన్నో అద్భుత కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నం రైల్వే జోన్, ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, గూగుల్ డేటా సెంటర్ తదితర ప్రాజెక్టులను సాధించడమే కాకుండా, స్టీల్ ప్లాంట్ మూతపడకుండా ఎన్నో చర్యలను తీసుకున్నామని వివరించారు. అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి భూములిచ్చిన రైతులకు అన్నివిధాలా న్యాయం చేస్తామని, వారికి విమాన ప్రయాణ యోగాన్ని కల్పించి గౌరవిస్తామని తెలిపారు. డీఎస్సీ పరీక్షలు అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా జరిగాయని, దీనిపై ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలను అచ్చెన్నాయుడు కొట్టి పడేశారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతానికి తీరని అన్యాయం జరిగిందని విమర్శించారు.

ఎపిలో తైవాన్ ఎలక్ట్రానిక్స్

>> విధానపరమైన స్థిరత్వం, వేగంగా అనుమతులు జారీ చేయటంతో పాటు పూర్తి స్థాయి ప్రోత్సాహాన్ని అందించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. భారత్ లో తమ దేశానికి చెందిన సంస్థలు ఇప్పటికే తయారీ రంగంలో కీలకంగా ఉన్నాయని తైవాన్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏపీలో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. తయారీ రంగం, సాంకేతికత, పారిశ్రామికాభివృద్ధిలో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని చర్చల సందర్భంగా ఏకగ్రీవంగా అంగీకారం కుదిరింది.

ఐటీ మంత్రితో తైవాన్ బృందం చర్చలు: సీఎం చంద్రబాబుతో మాట్లాడిన అనంతరం తైవాన్ ప్రతినిధుల బృందం ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ తో ప్రత్యేకంగా భేటీ అయ్యింది. ఏపీలో మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాల కల్పన విద్యాపరమైన సహకారంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. తైవాన్‌కు చెందిన మాన్యుఫ్యాక్చరింగ్, టెక్నాలజీ రంగాలలోని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా ఏపీకి చెందిన యువతకు తగిన నైపుణ్యం, టెక్నికల్ ట్రైనింగ్ సహా ఉన్నత విద్య భాగస్వామ్యాలపై తైవాన్ ప్రతినిధుల బృందంతో చర్చలు జరిగాయి. ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ల తయారీ, ప్రిసిషన్ ఇంజనీరింగ్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, హెల్త్‌కేర్, ఇతర హైస్కిల్ రంగాలలో పరస్పర సహకారం అందించుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ప్రపంచ స్థాయి నైపుణ్య గ్రిడ్‌ను నిర్మించడంతో పాటు మాండరిన్ భాషలో శిక్షణ, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సర్టిఫికేషన్, ఇంటర్న్‌షిప్‌లు, విద్యార్థిఫ్యాకల్టీ మార్పిడి కార్యక్రమాలు, సంయుక్త పరిశోధనలు, ఉద్యోగసన్నద్ధత కార్యక్రమాలపై కూడా చర్చలు జరిగాయి. తైవాన్ ఏపీ మధ్య ఈ సమావేశం కీలక మైలు రాయిగా నిలవనుంది.

జాబ్ కేలండర్-2లో 3168 ఉద్యోగాల భర్తీ

>>నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. జాబ్ కేలండర్ లో భాగంగా ఒకేసారి మూడు, నాలుగు దశల్లో ఉద్యోగాల భర్తీకి అక్టోబర్ 15న నోటిఫికేషన్ విడుదలకు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. మూడో దశలో 2,388, నాలుగో దశలో 2,981 పోస్టులను భర్తీ చేయనున్నారు. వివిధ విభాగాల్లోని ఖాళీలను డిపార్ట్ మెంట్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని భర్తీ చేయాలని సీఎం గారు నిర్దేశించారని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. రెండో దశలోని 2,388 ఉద్యోగాల్లో 2,225 పోస్టులు హోంశాఖలో భర్తీ చేయనున్నారు. గ్రూప్1లో ఇప్పటికే సూచించిన ఉద్యోగాల కంటే మరికొన్ని ఉద్యోగాలు పెంచాల్సిన ఆవశ్యకత ఉందని మంత్రుల బృందం అభిప్రాయపడింది. మొత్తంగా 10,060 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా సకాలంలో పోస్టులు భర్తీ చేసి ప్రతి ఏడాది జాబ్ కేలండర్ విడుదల చేయాలని ఆదేశించారు. జాబ్ కేలండర్2026 పూర్తి ఖాళీల వివరాలను ఆరో తేదీన జరిగే కేబినెట్ ముందు ప్రవేశపెట్టనున్నారు. ఈ సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, పి.నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, కందుల దుర్గేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, సాధారణ పరిపాలనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్, స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ రాజీవ్ కుమార్ మీనా, ఆర్థికశాఖ కార్యదర్శి వి.వినయ్ చంద్, ఏపీపీఎస్సీ కార్యదర్శి పి.రవి సుభాష్, ఆర్థికశాఖ సంయుక్త కార్యదర్శి గౌతమ్ అల్లాడ పాల్గొన్నారు.

అమిత్‌షాకు తెలియదా?

>> పని చేస్తాయి. దేశ రాజధాని ఢిల్లీలో వారంతా కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలోనే పని చేస్తారు. ఢిల్లీలో నిరసన చేసిన యువత, విద్యార్థులపై పెల్లెట్ గన్స్, ఎలక్ట్రిక్ బ్యాటన్స్, మేకులున్న లాఠీలు ప్రయోగించారు. పెల్లెట్ గాయాలు, లాఠీ గాయాలున్న విద్యార్థుల్ని చూశాను. విద్యార్థులపై పోలీసులు, భద్రతా బలగాల దాడికి ఆదేశాలిచ్చింది హోం మంత్రి అమిత్ షానే. ఒకవేళ ఈ విషయం అమిత్ షాకు తెలియకుంటే ఆయన ఈ పదవిలో కొనసాగడానికి అనర్హుడు. ఒకవేళ ఈ దాడికి అమిత్ షా ఆదేశించి ఉంటే ప్రధాన నిందితుడు కూడా ఆయనే. విద్యార్థులపై జరిగిన ఈ దారుణ ఘటనలకు బాధ్యుడైన అమిత్ షాను మంత్రివర్గం నుంచి తప్పించాలి. ఈ విషయంలో ప్రధాని మోడీకి కూడా నేను సలహా ఇస్తున్నా అంటూ రాహుల్ చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో ఈ అంశంపై పార్లమెంట్‌లో ప్రభుత్వం తనను మాట్లాడనివ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను మాట్లాడేందుకు వీలుగా ఆర్డర్ ఇవ్వాలని లోక్‌సభ స్పీకర్‌ను కోరారు. కానీ, అనుమతి ఇవ్వలేదు. అమిత్ షాపై ఆరోపణలు చేసినందుకు నన్ను అనుమతించడం లేదని, క్షమాపణలు చెప్పాలి అంటున్నారు. క్షమాపణలు చెబితేనే అనుమతిస్తాం అంటున్నారు. నేను బిజెపికి కానీ, ఆర్ఎస్ఎస్‌కు కానీ, ఏ ఒక్క వ్యక్తికి కానీ క్షమాపణ చెప్పబోను అంటూ రాహుల్ వ్యాఖ్యానించారు. సిజెపి నిరసనల సందర్భంగా మైనర్లపై కూడా పోలీసులు దాడిచేశారని రాహుల్ ఆరోపించారు. విద్యార్థులపై అద నపు బలగాల్ని ఉపయోగించడం తీవ్రమైన చర్యగా అభివర్ణించారు.

మాజీ మంత్రి కారుమూరికి సుప్రీంకోర్టులో ఎదురు దెబ్బ

విజయవాడ,జులై 29,ప్రభాతవార్తప్రతినిధి: మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ నేత కారుమూరి నాగేశ్వరరావుకు సుప్రీంకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. ఏపీ మద్యం రవాణా కుంభకోణానికి సంబంధించి ముందస్తు బెయిల్ కోరుతూ కారుమూరి దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం ఇవాళ కొట్టివేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును సమర్థించింది. ఈ స్కామ్‌తో తమకు ఎలాంటి సంబంధం లేదని, పిటిషనర్ ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ముందస్తు బెయిల్ ఇవ్వాలని కారుమూరి తరఫు న్యాయవాది సుప్రీంకోర్టును అభ్యర్థించారు. ఇరు వైపులా వాదనలు విన్న ధర్మాసనం మద్యం స్కామ్‌లో రూ.350 కోట్లకుపైగా అక్రమాలు జరిగినట్లు దర్యాప్తులో కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ కేసు దర్యాప్తులో కీలక అంశాలు వెలుగులోకి రావాల్సి ఉందని సుప్రీంకోర్టు తెలిపింది. నిందితుడి విచారణ అవసరమని న్యాయస్థానం అభిప్రాయపడింది. కస్టోడియల్ దర్యాప్తు లేకుండా పూర్తిస్థాయిలో నిజాలను వెలికితీయడం కష్టమని పేర్కొంది.

బిజెపి బలోపేతానికి ప్రత్యేక కమిటీ: రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్

విజయవాడ,జులై29,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న భారతీయ జనతా పార్టీ ఎన్నికల సన్నాహాలను ముమ్మరం చేసింది. పార్టీని గ్రామస్థాయి వరకు బలోపేతం చేయడంతో పాటు ఎన్నికల నిర్వహణ, సమన్వయం, వ్యూహరచన కోసం రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్ర, గోదావరి, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాలను నాలుగు జోన్లుగా విభజించి, ప్రతి జోన్‌కు సీనియర్ నాయకులకు బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల నిర్వహణ, సంస్థాగత సమన్వయం, క్షేత్రస్థాయి కార్యాచరణ, అభ్యర్థుల ఎంపిక, పార్టీ శ్రేణులతో నిరంతర సమన్వయం వంటి అంశాలను కమిటీ పర్యవేక్షించనుంది. ప్రత్యేక కమిటీలో రాష్ట్ర ఆరోగ్య మంత్రి వై. సత్యకుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నా యుడు, ఎమ్మెల్యేలు ఈశ్వర్‌రావు, ఎమ్మెల్యే సి. ఆదినారాయణ రెడ్డి, డాక్టరు పీవీ పార్థసారథి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అడారి ఆనంద్ కుమార్. ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణలను నియమించారు.

మహిళా కోర్టుని ఆశ్రయించిన జోగి రమేశ్ ఫ్యామిలీ

విజయవాడ.జులై29,ప్రభాతవార్తప్రతినిధి: మాజీ మంత్రి జోగి రమేశ్ కుటుంబ సభ్యులు విజయవాడ మహిళా కోర్టును ఆశ్రయించారు. తమను ఈ కేసులో అరెస్ట్ చేయొద్దంటూ వారు కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వరకట్న వేధింపులు, హత్యాయత్నం కేసు నమోదు కావడంతో వీరు ముందస్తు చర్యలు చేపట్టారు. దీనిపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఇబ్రహీంపట్నం పోలీసులను కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 4కు కోర్టు వాయిదా వేసింది. జోగి రమేష కుమారుడు జోగి రాజీవ్ సతీమణి ఇబ్రహింపట్టణం పోలీసు స్టేషన్‌లో ఇటీవల గృహహింస, ఆర్థిక అంశాల్లో వేధింపులకు తనపై భర్త, అత్త మామలు, ఇతర కుటుంబసభ్యులు మొత్తం 11మందిపై ఆమె ఫిర్యాదు చేసారు.

కొత్త విద్యుత్ బస్సులు

>> వర్గాల సమాచారం. రానున్న సెప్టెంబర్‌లో తిరుమలేశుని సాలకట్ల బ్రహ్మోత్సవాలకు వందవరకు నూతన విద్యుత్‌తో నడిచే ఆర్టీసి బస్సులు తిరుపతి జిల్లాకు రానున్నాయనేది సమాచారం. ఈ బస్సులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బ్రహ్మోత్సవాలకు తిరుమల పర్యటనరోజు లాంఛనంగా ప్రారంభించేందుకు తిరుపతి జిల్లా ఆర్టీసి అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే బ్రహ్మోత్సవాలనాటికి తిరుమల-తిరుపతి మధ్య ఘాట్‌రోడ్డులో కొత్తబస్సులు తీసుకురావాలనేది నిర్ణయం. ప్రస్తుతం 50వరకు తిరుమల ఘాట్‌రోడ్డులో తిరుపతి, అలిపిరి, మంగళం డిపోలకు చెందిన విద్యుత్ ఆర్టీసి బస్సులు నడుస్తున్నాయి. ప్రతిరోజూ యాత్రికులను సురక్షితంగా తిరుమలకు తీసుకువచ్చి తిరిగి తిరుపతికి చేరవేస్తున్నాయి. ఈ బస్సులు యాత్రికులకు మరింతగా సేవలందిస్తుండటంతో పూర్తిస్థాయిలో ఘాట్‌లో పర్యావరణ హిత బస్సులు నడపాలనేది అటు టిటిడి ఇటు ఆర్టీసి అధికారుల ఉద్దేశ్యం. తిరుమలకు నడుపుతున్న ఆర్టీసి డీజిల్ బస్సుల ఛార్జీ 90 రూపాయలుకాగా విద్యుత్‌తో నడిచే బస్సుల్లో 110రూపాయలుగా వసూలుచేస్తున్నారు. ఛార్జీల్లో తేడాను కూడా యాత్రికులు పెద్దగా పట్టించుకోవడంలేదు. శేషాచలంకొండల్లోని తిరుమలపుణ్యక్షేత్రంపై పర్యావరణాన్ని కాపాడేందుకు టిటిడి కూడా విద్యుత్‌తో నడిచే వాహనాల వినియోగంపై దృష్టిసారించింది. ఇప్పటికే దాదాపు టిటిడిలో విభాగాధిపతులు పూర్తిగా విద్యుత్‌తో నడిచే వాహనాలను వినియోగిస్తున్నారు. దీనివల్ల ఘాట్‌లో కాలుష్యం శాతం పూర్తిగా తగ్గింది. సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధంతోబాటు డీజిల్‌తో నడిచే వాహనాలను క్రమేణా నిషేధించి విద్యుత్‌తో నడిచే వాహనాలను ఘాట్‌లో తిరిగేలా మరింతగా ప్రోత్సహించాలని భావిస్తున్నారు. తిరుపతి రీజియన్‌కు మరో నెలరోజుల్లో వందకుపైగా విద్యుత్ బస్సులు వస్తున్నాయని తెలుస్తోంది.

వారం - వర్జ్యం

30-07-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పుష్యమి కార్తె
పాడ్యమి రా.9.28
శ్రవణ సా.5.41
వర్జ్యం : రా.9.58-రా.11.41
దు.ఉ.10.05-ఉ.10.57,
2) మ.3.14-సా.4.06
రాహుకాలం - మ.1.30-3.00

వార్తాఫలం

మేషం: అందివచ్చే అవకాశములను నేర్పుతో మీకు అనుకూలంగా మార్చుకోండి. ఆర్థిక అభివృద్ధి చెందుతుంది.

వృషభం: దూరప్రాంతంలోని సన్నిహిత వర్గం ద్వారా మాట సహాయం పొందుతారు. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

మిథునం: మాటల చాతుర్యంతో ఎంతటి వారినైనా ఆకట్టుకుని ముందుకు సాగుతారు. ఋణాలు తీరి ఊపిరి పీల్చుకుంటారు.

కర్కాటకం: జీవితభాగస్వామి ద్వారా ధనలాభం పొందుతారు. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. కాంట్రాక్టులు దక్కించుకుంటారు.

సింహం: భూ వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. గృహనిర్మాణ ఆలోచనలు కలసి వస్తాయి. ప్రయత్నాలు నిదానంగా పూర్తిచేస్తారు.

కన్య : ఇతరుల విషయాలలో అతి జోక్యం వల్ల అభాసుపాలవుతారు. సంఘంలో గౌరవం పొందుతారు. బంధువుల కలయిక.

తుల: ఊహించని ఆహ్వానాలు అందుకుంటారు. సమస్యల పరిష్కారాన్ని కాలానికి వదిలివేస్తారు. శుభకార్యాలలో పాల్గొంటారు.

వృశ్చికం: కార్యాలయంలోని నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. మీ కృషిని పట్టుదలను అందరూ మెచ్చుకుంటారు.

ధనుస్సు: వ్యవహారాలలో తొందరపాటు వద్దు. ఆరోగ్య విషయాలలో మెలుకువ పాటించండి. మీ ఆలోచన విధానంలో మంచి మార్పువస్తుంది.

మకరం: మాటమీద నిలకడ లేని మనుషుల వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. జాగ్రత్తలు పాటించండి.

కుంభం: గృహ సంబంధమైన విషయాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారనే భావన మీ వారిలో రానివ్వకుండా జాగ్రత్తలు వహించండి.

మీనం: ముఖ్యమైన వస్త్రాలకు జతచేయవలసిన వాటిని మర్చిపోయే అవకాశం వుంది. జాగ్రత్తలు పాటించండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

30-7Pg3exHMNWJQEBG.qxd:30-7Pg3exHMNWJQEBG.qxd 1/1/02 7:22 AM Page 1

రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం

- నిర్మాణాత్మక సలహాలు ఇస్తే స్వాగతిస్తాం
- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి: మిత్రపక్షంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా అధికారంలో ఉన్నా రాజకీయ నాయకుడిగా రైతుల శ్రేయస్సు కోరుకోవడం ప్రధాన లక్షణమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. రైతులకు మేలు చేసే సహేతుకమైన, నిర్మాణాత్మకమైన సలహాలను ఏ రాజకీయ పార్టీ నుంచి వచ్చినా ప్రభుత్వం తప్పకుండా స్వాగతిస్తుందని తెలిపారు. అయితే ప్రభుత్వం రైతుల సమస్యలపై సక్రమంగా స్పందిస్తూ, వారికి అండగా నిలుస్తున్న సమయంలో నెగిటివ్ స్టేట్‌మెంట్లతో రైతులను మరింత ఇబ్బందుల్లోకి నెట్టడం సరికాదని హితవు పలికారు. పొగాకు రైతులను గతంలోనూ.. ఇప్పుడూ సక్రమంగా ఆదుకున్నది తెదేపా, కూటమి ప్రభుత్వాలేనని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతు కష్టాల్లో ఉన్నప్పుడు ప్రభుత్వం బాధ్యతగా స్పందించాలన్నదే తమ విధానమని స్పష్టం చేశారు. రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ఇన్ని చర్యలు తీసుకుంటుంటే జగన్‌మోహన్ రెడ్డికి ఇవేవీ కనిపించడం లేదా? అని మంత్రి ప్రశ్నించారు. నెగిటివ్ స్టేట్‌మెంట్ల ద్వారా మార్కెట్‌ను ప్రభావితం చేసి, రైతుల్లో ఆందోళన పెంచేలా వ్యవహరించడం వల్ల రైతులకే నష్టం జరుగుతుందని అన్నారు. తన వ్యాఖ్యల వల్ల రైతులు మరింత డిస్ట్రెస్‌లోకి వెళ్లే ప్రమాదం ఉందని, కనీసం ఆ విషయమైనా జగన్‌మోహన్ రెడ్డి ఆలోచించాలని సూచించారు. రైతులకు మంచి చేసే నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాలని, అంతే తప్ప రైతులను మరింత ముంచేలా నెగిటివ్ వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు హితవు పలికారు.

ఎమ్మెల్యే అఖిలప్రియపై సిఎం అసహనం

- ఆళ్లగడ్డ రాజకీయాలు, అహోబిలం దేవాలయ టెండర్ల వివాదంపై టిడిపి అధిష్టానం మండిపాటు

విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి: ఆళ్లగడ్డ నియోజకవర్గ రాజకీయాలు, అహోబిలం దేవాలయ టెండర్ల వివాదంపై తెలుగుదేశం పార్టీ అధిష్టానం తీవ్రంగా మండిపడింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి పిలిపించి, ప్రత్యేకంగా భేటీ అయ్యారు. నియోజకవర్గ వ్యవహారాల్లో ఆమె భర్త భార్గవ్ రామ్ జోక్యం చేసుకోవడంపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని పల్లా స్పష్టం చేసినట్లు తెలిసింది. అహోబిలం ఆలయంలో తలనీలాల కాంట్రాక్ట్ వ్యవహారంలో అఖిలప్రియ జోక్యం చేసుకోవడం, ఆమె భర్త కారణంగా స్థానికంగా మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నాయకులతో విభేదాలు తలెత్తడం వంటి అంశాలపై అధిష్టానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎమ్మెల్యేగా కేవలం అఖిలప్రియ మాత్రమే బాధ్యతలు చూడాలని, ఆమె భర్త జోక్యం ఎంతమాత్రం ఉండటానికి వీల్లేదని పల్లా కరాఖండిగా చెప్పారు. పార్టీ క్రమశిక్షణను దాటితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఈ సందర్భంగా, భూమా నాగిరెడ్డి, శోభా నాగిరెడ్డిల రాజకీయ స్థాయికి తగినట్లుగా పనిచేయాలని, వారి పేరు నిలబెట్టాలని అఖిలప్రియకు పల్లా సూచించారు. పార్టీ సూచనలు తప్పక పాటిస్తానని అఖిలప్రియ హామీ ఇచ్చారు. అధిష్టానం ఆదేశాల మేరకు నడుచుకుంటే పార్టీ పూర్తి అండగా ఉంటుందని పల్లా భరోసా ఇచ్చారు.

భేటీ అనంతరం అఖిలప్రియ మాట్లాడుతూ.. ఆళ్లగడ్డలో ఏ చిన్న సంఘటన జరిగినా దానిని పెద్ద సెన్సేషన్‌గా మారుస్తున్నారని అన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో అనవసరంగా హైప్ క్రియేట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని వివాదాలు, సమస్యలపై పార్టీ అధ్యక్షుడికి పూర్తి స్పష్టత ఇచ్చానని, పార్టీ శ్రేణుల్లో ఎలాంటి అయోమయం ఉండకూడదనే ఉద్దేశంతోనే ఆయన్ను కలిశానని వివరించారు.

ముగిసిన అమరావతి ఛాంపియన్‌షిప్

తిరుపతి (క్రీడ), జులై 29 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్-2026 నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు బుధవారం తిరుపతి జిల్లాలో విజయవంతంగా ముగిశాయి. తిరుపతి, చంద్రగిరి, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, శ్రీకాళహస్తి మరియు సత్యవేడు నియోజకవర్గాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల్లో బాలురు, బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలలో సుమారు 616 మంది బాలురు, 273 మంది బాలికలు పాల్గొన్నారు. వీరితో పాటు కోచ్‌లు, పిడిలు, పిఇటిలు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, అధికారులు, నిర్వాహకులు, క్రీడాభిమానులు కలిపి సుమారు 10,000 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు. విజేతలుగా ఎంపికైన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లో తప్పనిసరిగా పాల్గొనాలని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ఎన్. శశిధర్ తెలిపారు.

పార్టీలు వేరైతే... నేతలు కలవడం కూడదా?

- మాజీ మంత్రి అంబటి రాంబాబు

విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి: ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభలో తన పక్కన కూర్చున్నందుకు టిడిపి నేత బొండా ఉమాకు ఆ పార్టీ అధిష్ఠానం నోటీసులు ఇవ్వడంపై వైసిపి సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసారు. పార్టీలు వేరైనా సామాజికవర్గ కార్యక్రమాల్లో నేతలు కలవడం సహజమన్నారు. అంత మాత్రానికే బొండా ఉమా నుంచి వివరణ కోరడం చంద్రబాబు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. “తామిద్దరం పక్కపక్కనే కూర్చోవడం అంత పెద్ద తప్పా అన్ని అంబటి ప్రశ్నించారు. రాష్ట్రంలో వర్షాల్లేక, నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. వాటిపై దృష్టి పెట్టకుండా తన పక్కన బొండా ఉమా కూర్చోవడాన్నే చంద్రబాబు పెద్ద సమస్యగా మార్చారని అంబటి ఎద్దేవా చేశారు.

డిఎస్సీ నియామకాలు రద్దు చేయాలి

- హైకోర్టులో మరో పిల్ వేసిన వైసిపి ఎమ్మెల్సీ

విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన డిఎస్సీ 2025 ఉపాధ్యాయ నియామక ప్రక్రియను పూర్తిగా రద్దు చేయాలని కోరుతూ వైసిపి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హైకోర్టులో మరోసారి ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ నియామక ప్రక్రియలో భారీ ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆయన పిటిషన్‌లో ఆరోపించారు. ఈ వ్యవహారంపై కేంద్ర దర్యాప్తు సంస్థ సిబిఐతో విచారణ జరిపించాలని కోరారు. దర్యాప్తు పారదర్శకంగా సాగేందుకు వీలుగా డిఎస్సీ నియామకాలకు సంబంధించిన అధికారిక రికార్డులు, అభ్యర్థుల సమాధాన పత్రాలు (ఆన్సర్ షీట్లు), లాగిన్ ఐడిలతో పాటు సంబంధిత డేటానంతటినీ వెంటనే సీజ్ చేసి భద్రపరిచేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని న్యాయస్థానాన్ని విజ్ఞప్తి చేశారు. గతంలో కూడా ఈ విషయమై పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి దాఖలు చేసిన పిల్‌ను ఈనెల 20న ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. అయితే, తగిన ఆధారాలు, డాక్యుమెంట్లు జత చేయకుండా చాలా సాధారణంగా పిటిషన్ దాఖలు చేశారంటూ ఆనాడు ధర్మాసనం ఆక్షేపించింది. పిటిషనర్ తరఫు న్యాయవాది క్షమాపణలు కోరడంతో, సదరు పిటిషన్ ఉపసంహరణకు అనుమతిస్తూనే అన్ని ఆధారాలతో తాజాగా మరొక పిటిషన్ వేసుకునేందుకు స్వేచ్ఛనిచ్చింది. కోర్టు ఇచ్చిన ఆ ఆదేశాల మేరకు చంద్రశేఖర్‌రెడ్డి తాజాగా ఈ పిల్‌ను దాఖలు చేశారు.

అరుదైన వృక్ష జాతి మొక్కకు నామకరణం

- ‘క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్’ అని పేరు పెట్టిన డి.సిఎం పవన్ కల్యాణ్
- తూర్పు కనుమల్లోని ఉబ్బలమడుగు జలపాతం ప్రాంతంలో గుర్తించిన కొత్త వృక్ష జాతి

విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి జిల్లా పరిధిలోని తూర్పు కనుమల్లో కొత్తగా గుర్తించిన అరుదైన వృక్ష జాతికి చెందిన మొక్కకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ నామకరణం చేశారు. యుఫోర్బియేసీ కుటుంబానికి చెందిన ఈ కొత్త జాతికి ‘క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్’ పేరు పెట్టారు. ఉబ్బల మడుగు జలపాతానికి సమీపంలోని కంబకం కొండల ప్రాంతం ఈ మొక్కకు సహజ ఆవాసంగా ఉండటంతో, ఆ ప్రాంత పర్యావరణ ప్రాధాన్యాన్ని ప్రతిబింబించేలా ఈ పేరును ఖరారు చేశారు. అద్భుతమైన సుగంధ పరిమళాలను వెదజల్లే ఆకులు కలిగిన ఈ మొక్క ప్రత్యేకతలు పవన్ కల్యాణ్ ఆకట్టుకున్నాయి. ప్రధాన అటవీ సంరక్షణాధికారి పి.వి. చలపతిరావు తన పరిశోధనా సహచరులతో కలిసి తూర్పు కనుమల్లో నిర్వహించిన విస్తృత వృక్షశాస్త్ర పరిశోధనల సందర్భంగా ఈ కొత్త జాతి మొక్కను గుర్తించారు. శాస్త్రీయ పరిశీలనల్లో, సమీప సంబంధిత జాతి అయిన క్రోటన్ అరోమాటికస్‌తో పోలిస్తే ఈ మొక్క ప్రత్యేకమైన నిర్మాణం, పునరుత్పత్తి లక్షణాలను కలిగి ఉన్నట్లు నిర్ధారించారు.

ఈ ఆవిష్కరణ తూర్పు కనుమల అపార జీవ వైవిధ్య సంపదను ప్రతిబింబించడమే కాకుండా, ఆ ప్రాంతంలో మరింత లోతైన శాస్త్రీయ పరిశోధనల ఆవశ్యకతను చాటింది. అత్యంత పరిమిత ప్రాంతంలో మాత్రమే కనిపించడం, సహజ ఆవాసాలపై పెరుగుతున్న ముప్పు క్రోటన్ ఉబ్బల మడుగెన్సిస్ జాతిని అంతరించిపోయే ప్రమాదంలో ఉన్న జాతిగా పరిశోధకులు గుర్తించారు. ఈ శాస్త్రీయ ఆవిష్కరణలు జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ, రాష్ట్ర సహజ వారసత్వ సంపద సంరక్షణ పట్ల కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోంది.

వైకాపాది గొడ్డలి పార్టీ.. కూటమిది అభివృద్ధి పార్టీ

- తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్

ఆదోని, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి: వైకాపా పాలన గొడ్డలి సంస్కృతికి నిదర్శనమని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ఎన్డీయే కూటమి అభివృద్ధికి చిరునామా అని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ విమర్శించారు. ఆదోనిలో నిర్వహించిన కార్యకర్తల విస్తృత స్థాయిలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదోని నియోజకవర్గంలోని మైనారిటీలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు.

కార్యకర్తలకు హెచ్చరిక: “ఆదోనిలో గెలుపైనా, ఓటమైనా 5050గానే ఉంటుంది. నేను చంద్రబాబు గారి అంత మంచోడిని కాదు. ఒక్కసారి, రెండుసార్లు చెప్తాను.. ఆ తర్వాత నా ఇష్టం“ అంటూ కార్యకర్తల పనితీరుపై కఠినంగా ఉంటానని స్పష్టం చేశారు.

రాయలసీమ అభివృద్ధి: రాయలసీమ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా (తోటబడి పంటల కేంద్రంగా) తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

కోటి మంది సభ్యత్వంతో రికార్డు: ప్రతి కార్యకర్తే అధినేతగా భావించే ఏకైక పార్టీ తెలుగుదేశం అని కొనియాడారు. దేశంలోనే కోటి మంది సభ్యత్వం కలిగిన ఘనత ఒక్క టీడీపీకే దక్కుతుందన్నారు.

సంక్షేమంపై ఇంటింటికీ నిఘా: ఆదోనిలోని పార్టీ కార్యకర్తలు ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయో లేదో పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజును కలసిన మంత్రి శ్రీనివాస్

విజయనగరం, జులై 29 ప్రభాతవార్త: గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజును రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గవర్నర్ బంగ్లాలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అరగంటకు పైగా ఇష్టాగోష్టి నిర్వహించారు. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేసిన మీరు పునాది వేసిన భోగాపురం ఎయిర్‌పోర్ట్ తమరి కల మరో రెండు రోజులలో సాకారం కావడం చాలా ఆనందాన్ని కలిగిస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విమానయాన రంగంలో జిఎంఆర్ సంస్థకు మంచి అనుభవం ఉందని, త్వరితగతిన పూర్తి చేసిన జిఎంఆర్ సంస్థకు గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు గారు అభినందనలు తెలిపారు. విమానాశ్రయానికి ప్రభుత్వం అల్లూరి సీతారామరాజు నామకరణం చేయటం శుభ పరిణామం అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించడం బాగున్నదన్నారు. పరిశ్రమలు, రవాణా వ్యవస్థ బాగుంటే ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ఆ దిశగా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని గవర్నర్ సూచించారు. ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డిఎస్సీపై మాట్లాడే హక్కు వైసిపికి లేదు: ప్రశాంతిరెడ్డి

బుచ్చి (నెల్లూరు), జులై 29 ప్రభాతవార్త: మెగా డిఎస్సీ మాట్లాడే హక్కు ప్రతిపక్షాలకు లేదని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తీవ్రంగా విమర్శించారు. బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీలోని రామచంద్రాపురంలో నిర్వహించిన ఇంటింట ప్రచార కార్యక్రమంలో ఆమె మాట్లాడుతు గత ప్రభుత్వ హయాంలో డిఎస్సీని విమర్శించి ఇప్పుడు మెగా డిఎస్సీపై విమర్శలు చేయడం సిగ్గు చేటు అని ఆమె విమర్శించారు. నెల్లూరులో డిఎస్సీలో అక్రమాలంటు ర్యాలీలు నిర్వహించే ముందు వైసిపి నేతలు గత ఐదేళ్లలో ఎందుకు ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. 16 వేల కుటుంబాలు బాగుపడడం ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక పోతున్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుందని ఆమె కొనియాడారు. ఎన్నిలకు ముందు ఇచ్చిన ప్రతి హామి నెరవేరుస్తు ప్రజల మన్ననలు పొందుతుందని అన్నారు.

ప్రధాని పర్యటనలో ఉత్సాహంతో పనిచేయాలి

విజయనగరం, జులై 29 ప్రభాతవార్త: దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఆగస్టు 1న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో బందోబస్తు విధులు నిర్వహించే ప్రతీ ఒక్కరూ ఉత్సాహంతో పనిచేయాలని బుధవారం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ ప్రధాని పర్యటనలో ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది బాధ్యతతో పనిచేయాలన్నారు. జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్, ఆక్టోపస్, గ్రేహౌండ్స్ ఐజీ కే.శ్రీకాంత్, విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి, గ్రేహౌండ్స్ డీఐజీ అట్టాడ బాపూజీ, వెల్ఫేర్ డీఐజీ అన్బురాజన్, బెటాలియన్ కమాండెంట్ రవిశంకర్ రెడ్డి, విజయవాడ డీసీపీ కృష్ణకాంత్ పటేల్ తో కలసి ప్రధాని సభకు బస్సులో ప్రజలు వచ్చే మార్గాలను పరిశీలించారు. నిర్మాణ పనులు అవుతున్నందున ప్రజలకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా బారికేడ్లు నిర్మించాలని, ర్యాంపులు నిర్మించాలని సంబంధిత అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. బందోబస్తు నిమిత్తం వచ్చిన పోలీసు సిబ్బందితో జిల్లా ఎస్పీ మాట్లాడి విధులను అంకిత భావంతోను, క్రమశిక్షణతో నిర్వహించాలని, తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు విధులు నిర్వహించేందుకు కేటాయించిన ప్రాంతాలను విడిచి పెట్టవద్దని జిల్లా ఎస్పీ ఆదేశించారు. బందోబస్తు నిమిత్తం భోగాపురం వచ్చిన పోలీసు సిబ్బందికి వసతులను, భోజనాలను జిల్లా పోలీసుశాఖ ఏర్పాటు చేసింది. సభ నిర్వహించే ప్రాంతాలను, ఎయిర్‌పోర్ట్ ఆవరణంలో పలు ప్రాంతాలను డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు.

జీవించినా, మరణించినా ఈ దేశం కోసమే

- దేశభక్తి, వందేమాతరం విశిష్టతపై రాజ్యసభలో ఎంపి చింతకాయల విజయ్

విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి: నేషనల్ ఆనర్ అమెండ్‌మెంట్ బిల్లుపై తెలుగు దేశం పార్టీ ఎంపి చింతకాయల విజయ్ రాజ్య సభలో మాట్లాడుతూ, ఈ బిల్లుపై తన అభిప్రాయాలను పంచుకునే అవకాశం లభించినందుకు అత్యంత వినమ్రతతో, బాధ్యతాయుత మైన భావనతో సభ ముందు నిలబడ్డానని తెలిపారు. ఈ క్షణం కేవలం ఒక వ్యక్తికి సంబంధించినది కాదని, ప్రజల నమ్మకానికి ప్రతీక అని, మన ప్రజాస్వామ్య శక్తికి మరియు జాతీయ ఆత్మ అయిన ‘వందేమాతర్మ్ స్వరానికి ప్రతీక అని పేర్కొన్నారు. భారతదేశం కేవలం ఒక భౌగోళిక ప్రాంతం లేదా మట్టి ముక్క కాదని, ఇది ఒక సజీవమైన సాంస్కృతిక వారసత్వమని వర్ణించారు. ఇది వందన, అభినందన, అర్పణ, తర్పణ భూమి అని ఉద్ఘాటించారు. దేశంలో పారే ప్రతి నది గంగతో సమానమని, ప్రతి రాయి శంకరునితో సమానమని పేర్కొంటూ, “మనం జీవించినా, మరణించినా ఈ దేశం కోసమే చివరికి మన అస్థికలు గంగాజలంలో కొట్టుకుపోతున్నప్పుడు ఎవరు చెవిపెట్టి విన్నా భారత్ మాతాకీ జై., వందేమాతరం అనే శబ్దాలే వినిపిస్తాయ్యి అని అన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతరం తెచ్చిన స్ఫూర్తిని, త్యాగాలను ఈ సందర్భంగా ఎంపి విజయ్ గుర్తుచేశారు. తన స్వస్థలమైన నర్సీపట్నం ప్రాంతానికి చెందిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగాన్ని ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. బ్రిటిష్ సామ్రాజ్యం అల్లూరిని చెట్టుకు కట్టేసి పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్చి చంపినప్పుడు ఆయన నోటి నుండి వచ్చిన చివరి మాట ‘వందేమాతర్మ్ అని గుర్తుచేశారు. ఈ విప్లవ వీరుని త్యాగానికి గౌరవంగా ఇటీవల ప్రధాని మోడీ ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి అల్లూరి సీతారామరాజుకు శిరస్సు వంచి ప్రణామాలు అర్పించారని కొనియాడారు. ‘వందేమాతర్మ్‌లో మిగిలిన రెండు చరణాలకు సముచిత స్థానం కల్పించి, గౌరవాన్ని పెంచినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలిపారు.

అప్పలరాజును పరామర్శించడానికి జైలుకెళ్లి

సమాజానికి ఏం సందేశమిస్తారు?

- జగన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపాటు

విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి: మాజీ సిఎం జగన్ సిదిరి అప్పలరాజు పరామర్శించడానికి జైలుకు వెళ్లడం ద్వారా సామాజానికి ఏమీ సందేశం ఇస్తారని సిఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.ఒక గొర్రెల కాపరిని దారుణంగా ప్రమాదం చేసి చంపిన సిదిరి అప్పలరాజు కుమారుడిని రక్షించడానికి దుర్మార్గంగాసాక్ష్యాలు మార్చారన్నారు. సిసి కెమెరా ఫుటేజీ ఈ వాస్తవాన్ని వెల్లడిచేసిందన్నారు.అటువంటి అరాచక ఆలోచనా విధానం ఉన్న వ్యక్తిని జగన్ పరామర్శించమేమిటని ప్రశ్నించారు. వ్యవస్థలు నిర్మాణం చేసేవాళ్లు, చట్టాలను గౌరవిస్తూ న్యాయనికి లోబడి నడుచుకుంటారని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గొడ్డలి పార్టీ నేతలకు చట్టాలంటేనే గౌరవం లేదని సిఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. వ్యవస్థలు నిర్మాణం చేద్దామనే సంకల్పంతో ఎవరైనా రాజకీయాల్లోకి వస్తారని, కానీ గొడ్డలి పార్టీ నేతలు అందుకు భిన్నమని సిఎం అభిప్రాయపడ్డారు. సచివాలయంలో అందుబాటులో ఉన్న నేతలతో సిఎం సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. ఈ క్రమంలో సిఎం చంద్రబాబు మాట్లాడుతూ వైఎస్సార్సీ అధినేత తీరుపై అసహనం వ్యక్తం చేశారు. సిసిటివి ఆధారాలు అన్నీ బయటపెట్టే సరికి తోకముడిచారని వ్యాఖ్యానించారు. నేరప్రవృత్తి కలిగిన వారు తాము నేరం చేసి ఎదుటివారిపై రుద్దాలని చూస్తారన్న చంద్రబాబు, ఆలాంటి వారంతా గొడ్డలి పార్టీలోనే ఉన్నారని ఆరోపించారు. గంజాయి బ్యాచ్‌లను వెంటేసుకుని నేరస్థుల్ని పరామర్శించటమే పనిగా గొడ్డలి పార్టీ ఉందని సిఎం చంద్రబాబు దుయ్యబట్టారు.

మాజీ ప్రధాని దేవెగౌడకు సిఎం పరామర్శ

విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి: మాజీ ప్రధాని హెచ్.డి. దేవెగౌడ సతీమణి చెన్నమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆయన్ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫోనులో పరామర్శించారు. చెన్నమ్మ మృతి పట్ల సిఎం సంతాపం వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. చెన్నమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబ సభ్యులు ఈ విషాదాన్ని తట్టుకుని మనోధైర్యంతో ఉండాలన్నారు. ఈ సందర్భంగా దేవెగౌడ సహా ఆయన కుటుంబంతో మూడు దశాబ్దాలుగా తనకున్న అనుబంధాన్ని సిఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు.

పబ్లిక్ ఎగ్జామినేషన్స్ సవరణ బిల్లు ఆమోదం.. డి.సిఎం పవన్ హర్షం

విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి: లోక్‌సభలో పబ్లిక్ ఎగ్జామినేషన్స్ సవరణ బిల్లు, 2026 ఆమోదం పొందిన సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దేశవ్యాప్తంగా ఉన్న ప్రతి విద్యార్థికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ చరిత్రాత్మక చట్టం లక్షలాది మంది విద్యార్థుల కలలు, ఆకాంక్షలను పరిరక్షించడంలో కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. అలాగే దేశ పరీక్షా వ్యవస్థ సమగ్రతపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఇది ముఖ్యమైన ముందడుగు అని అభిప్రా యపడ్డారు. పరీక్షా వ్యవస్థలో దీర్ఘకాలిక సంస్కరణల అవసరాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం.. నందన్ నీలేకని నేతృత్వంలో ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేసి, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీతో పాటు దేశ పరీక్షా వ్యవస్థలో సమగ్ర మార్పులకు శ్రీకారం చుట్టిందని పవన్ కళ్యాణ్ తెలిపారు. విద్యార్థుల కలలను కాపాడటం, విద్యాసంస్థల విశ్వసనీయతను నిలబెట్టడం, ప్రతిభ, నిజాయతీ, సమాన అవకాశాలకు ప్రాధాన్యం ఇచ్చే వ్యవస్థను నిర్మించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భారత భవిష్యత్తును అరాచక శక్తులు కాదు, పట్టుదల, క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో జ్ఞానాన్ని అన్వేషించే యువ మేధావులే తీర్చిదిద్దుతారని, వికసిత భారత్ నిర్మాణంలో ప్రతి విద్యార్థికి సాధికారత కల్పించేందుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

తాటిపూడి ఎపిఆర్‌జెసి కళాశాలలో

51 మంది విద్యార్థులకు అస్వస్థత

విజయనగరం, జులై 29 ప్రభాతవార్త: విజయనగరం జిల్లా గంట్యాడ మండలం తాటిపూడి ఏపీఆర్జేసీ బాలికల కళాశాలలో 51 మంది విద్యార్థులకు అస్వస్థత. బుధవారం ఐదుగురు విద్యార్థులకు ఒళ్ళు నొప్పులు ఫీవర్ కళ్ళు మంటలు రావడంతో వెంటనే వారికి వైద్య పరీక్షలు నిర్వహించమని కళాశాల ప్రిన్సిపాల్ శారదాంబ తెలియజేశారు. అనంతరం ఆ సంఖ్య 51 చేరడంతో కళాశాలలో ఏరియా ఆసుపత్రి డాక్టర్లు వైద్య శిబిరం ఏర్పాటుచేసి వైద్యం నిర్వహిస్తున్నారు. ఏడుగురు విద్యార్థులకు తీవ్రంగా ఉండడంతో వారిని ఎస్ కోట ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం నిర్వహిస్తున్నారు వారికి ఆరోగ్యం నిలకడగా ఉందని ప్రిన్సిపాల్ తెలియజేశారు. వీళ్ళందరికీ ఒళ్ళు నొప్పులు ఫీవర్ కళ్ళు మంటలు రావడంతో తోటి విద్యార్థులు బెంబేలెత్తిపోతున్నారు. ఏం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శాకంబరి ఉత్సవాలకు వేదోక్తంగా మహాపూర్ణాహుతి

ఇంద్రకీలాద్రి, జులై 29 ప్రభాతవార్త: సకల లోకాలను రక్షించడానికి ఈనెల 27 నుండి శాకంబరి మాతగా అనుగ్రహించిన దుర్గమ్మ ఆలయంలో బుధవారం పూర్ణాహుతి నిర్వహించారు. చండీసప్తశతీ పారాయణం, మహావిద్యా పారాయణం, హోమం, శాంతి పౌష్టిక హోమములు, మండపపూజ, మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, మార్జనము, ప్రసాద వితరణము జరిపారు.

వైభవంగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షణం: సకలలోకాలను పాలించే ఆదిదంపతులు అధిరోహించిన రథంతో భక్తులు వెంటనడుస్తుండగా ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షణం వైభవంగా జరిగింది. బుధవారం ఆషాఢమాసం పౌర్ణమి వ్యాస పౌర్ణమి పర్వదినాన శ్రీ ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షణ ఉదయం 5.55లకు ఘాట్ రోడ్ వద్ద కామధేను అమ్మవారి ఆలయం నుండి ప్రారంభయింది. దేవస్థానం ఏర్పాటు చేసిన సంప్రదాయ తప్పెట్లు, కోలాట నృత్యప్రదర్శనలు, భజన సంకీర్తనా గానం వంటి కళాబృందాల కళా ప్రదర్శనలు, మంగళ వాయిద్యముల, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ గిరి ప్రదక్షిణలో శ్రీ దుర్గా మల్లేశ్వరులు కొలువైన వాహనం ముందు రహదారులను వివిధ ప్రాంతాల్లో స్థానిక మహిళలు పసుపు నీళ్లతో శుద్ధి చేసి, హారతులు, కొబ్బరికాయలు సమర్పించి, జయ జయద్వానాలు చేశారు. గిరి ప్రదక్షిణ మార్గమంతా భక్తులకు శ్రీ అమ్మవారి కుంకుమ, ప్రసాదంను భక్తులకు దేవస్థానం నుండి అందజేశారు. ఇఓ వికె శీనా నాయక్, స్థానాచార్య వి శివ ప్రసాద శర్మ, ముఖ్య అర్చకులు ఆర్ శ్రీనివాసశాస్త్రి, ధర్మ కర్తల మండలి సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆషాఢం సారె భక్తులతో రద్దీ: దుర్గమ్మకి ఆషాఢం సారె తెచ్చిన భక్తజనంతో ఆలయంలో బుధవారం రద్దీ నెలకొంది. శ్రీ కనకదుర్గమ్మని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర, సారెలతో ఇంద్ర కీలాద్రికి 16వ రోజు బుధవారం సాయంత్రం వరకు 28 సారె బృందాలకు చెందిన 14,120 మంది మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు.

వార్త

నిస్వార్థత ఎంత అధికంగా ఉంటుందో, విజయం అంత అధికంగా లభిస్తుంది.

- రోజర్

ఉపాధి ఊరట ఎంతదాకా?

ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు ఏమాత్రం లొంగిరాని ఎల్‌నినో దెబ్బకు వ్యవసాయ కూలీలకు పనిలేకుండా పోయింది. దాంతో కూలీలు 'జి రాంజీ' ఉపాధి పనులపై దృష్టి పెట్టక తప్పడం లేదు. 'ఎల్‌నినో'తో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల గందరగోళంలో వ్యవసాయ పనులు మందకొడిగా సాగుతున్నాయి. రెండుమూడు రోజుల పాటు వర్షాలు కురిసినా 'వరి' సాగు సజావుగా సాగుతుందన్న నమ్మకం లేదు. ఈ నేపథ్యంలోనే 'వరి' సాగుకు ప్రత్యామ్నాయంగా వేర్వేరు పంటలసాగు లాభసాటియని ఊదరగొడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే ముమ్మర ప్రచారం చేపట్టారు. వారి సూచనలకు బాసటగాభారతీయ వాతావరణ సంస్థ కూడా రైతాంగానికి హెచ్చరికలు జారీ చేసింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయమేఆలంబన. కానీ సాగు సాగాలంటే వర్షపాతం బాగా తక్కువగా ఉన్నందున మరో చుక్క వర్షం ఎప్పుడు పడుతుందో ఎలా పడుతుందో అర్థంకాని పరిస్థితులలో వ్యవసాయం మీద 'రిస్క్' చేసి పెట్టుబడి పెట్టేందుకు రైతాంగం జంకుతోంది. వ్యవసాయ కూలీలుగా అలవాటుపడిన వారు కూలిపనిగ్యారంటీ లేక పొలం పనులకు వెళ్లడం తగ్గించారు. స్థానికంగా అమలవుతున్న విబి జీ రాం జీ పనులపట్ల ఆసక్తి చూపిస్తున్నారు. ఈ పథకం కింద ఒక్కో కూలీకి వంద రోజుల నుంచి 125 పనిదినాలకు పెంపు ఉపాధి లభిస్తుంది. వ్యవసాయ పనులు సీజన్‌ల వారీగానే ఉన్నా అనిశ్చితి సమయంలో ఆ పనుల మీద దృష్టి పెట్టి వేరే ప్రభుత్వ పథకాలను వదులుకుంటే ఆ మాత్రం ఉపాధి కూడా దొరకదనే ఆలోచనలతో వ్యవసాయ పనులనే వదులుకుంటున్నారు. సాగు పనులకు అత్యంత కీలకంగా భావించే జులై నెల మరో 2,3 రోజుల్లో ముగియనుంది. తెలంగాణలో గత 2రోజుల్నుంచే వర్షం కురుస్తోంది. మరో పదిరోజుల పాటు కురుస్తుందన్న గ్యారంటీ లేదు. కాగా మంగళవారం ఒక్క రోజే ఈ రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల 10వేల 592 మంది కూలీలు ఉపాధి కోసం జీ రాంజీ పథకాన్ని ఆశ్రయించారు. దాదాపు తెలంగాణలోని ప్రతి జిల్లా నుంచి లక్షమంది వ్యవసాయకూలీలు ఉపాధి కూలీలుగా మారారు. నల్గొండ జిల్లాలో మాత్రం 1 లక్షా 72వేల 402మంది ఉపాధి పనులకు హాజరయ్యారు. వీరందరిలో ఎవరికీ వ్యవసాయ పనుల ఒత్తిడి కూడాలేదు. గత యేడాది వానాకాలం సీజన్‌లో నెలకు 5 లక్షల నుంచి 8లక్షల మంది వ్యవసాయ పనుల్లోనే జీవనోపాధి పొందే వారు. గతంలో ఉపాధి పనులకు ఎంతో రద్దీ ఉండేది. గత అనుభవాల దృష్ట్యా వ్యవసాయ కూలీలు ఉపాధి పనులకు వెళ్లిపోవడంతో రైతులంతా వ్యవసాయ యంత్ర పరికరాల ద్వారా వ్యవసాయ కార్యాచరణ చేపట్టేవారు. కూలీల అవసరం తగ్గింది. ఏడాదిలో అధిక కాలం పొలం పనుల ద్వారా జీవనోపాధి కల్పించుకునే వారు సైతం ఇప్పుడు రోడ్ మీద పడ్డారు. అప్పట్లో వ్యవసాయ కూలీలు ఉపాధి కూలీ పనులకు మొగ్గుచూపేరు. కొంతకాలం వ్యవసాయదారుల కూలీల మధ్య సంబంధాలు కూడా మారిపోయాయి. ప్రభుత్వ ఉపాధి పథకాలలో నిర్దిష్ట వేతనం, నిర్ణీత పనివేళలో, కొంతవరకు పనిలో భౌతిక ఒత్తిడి తక్కువగా ఉండటం వల్ల కూలీలు ఉపాధి కూలి పనులకే వెళ్లేవారు. వ్యవసాయ పనులే మర్చిపోయి ఉంటారులే, అని అనిపించేది. ఉపాధి హామీ కూలీల పథకం వచ్చాక రైతు కాస్త కుదేలయ్యాడు. మానవ వనరులు సకాలంలో దొరికేవి కాదు. ఈసారి పరిస్థితులు చక్కబడినవనుకుంటే మళ్లీ సమస్యలు నెత్తిన కూర్చొన్నాయి. సాగు పనిలేని రోజుల్లో కుటుంబ పోషణ కోసం ప్రత్యామ్నాయ ఉపాధి అవసరం. గతంలో ఎంజిఎన్‌రెగా పథకంగా ఉన్న ఈపథకాన్ని తాజాగా విబి జీ రాం జీ పథకంగా మార్చి కొన్ని మార్పులు చేశారు. పంటల సీజన్‌లో రైతులకు అవసరమైన కూలీలు అందుబాటులో ఉంటే మంచిది. వ్యవసాయేతర కాలంలో ఉపాధి పనులను సమన్వయంగా చేసుకుంటే రైతు కూలీలకు నిరంతర ఉపాధి దొరుకుతుంది. ఇప్పుడు వ్యవసాయ పనులు లేకపోవడంతో ఉపాధి కూలీలకు వెళ్లిపోతున్నారు. పల్లెల్లో పనిలేక కొందరు కూలీలు బెంగళూరు, చెన్నై,వంటి ప్రాంతాలకు వలస కూలీలుగా వెళ్లిపోతున్నారు. ఇలా కూలి పనుల తీరు మారడం కొన్ని రోజులు మాత్రమే ఉపాధి లభించడంతో పిల్లల చదువుల మీద దెబ్బతగులుతుంది. గ్రామీణ సమాజంలో సామాజిక ఆర్థికమార్పు కనపడుతున్న రోజుల్లో 'ఎల్‌నినో' ప్రభావం ఎన్నో జీవితాల్లో స్థిరత్వాన్ని మాయం చేస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో రేపెప్పుడో కరువు పరిస్థితులను కూడా ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతో ఉన్నఊళ్లోనే చేతికందిన ఉపాధిని దక్కించుకోవడం వారికి తప్పనిసరి అయింది. ఒకవేళ పంటలు విఫలమైతే ఆదాయం ఉండదని చిన్నకారు, సన్నకారు రైతుల్లో కొందరు కూడా ఉపాధికోసం వెతుక్కోవడమే ఉపాధి వలసలకు కారణం. చెరువుల పూడికతీత, రహదారులనిర్మాణం, భవనాలు, నివాస గృహాల నిర్మాణంలో కూలీల నైపుణ్యాన్ని, మరోమార్గంలోకి మళ్లించాల్సి వస్తోంది. గ్రామీణాభివృద్ధికి వారి కృషి ఉపయోగపడుతుంది. కాగా మరోపక్క 'ఎల్‌నినో' ప్రభావం పంటలు పండకపోవడం, లేదా నాట్లు కుళ్లిపోవడం, చివరి ఎకరానికి నీళ్లు దొరక్కపోవడం పంటలు ఎండిపోవడం వంటి చర్యలవల్లన ఆహార భద్రతకే లోపమేర్పడ్తోంది. ఇప్పుడు ముంచుకొస్తున్న ఎల్‌నినో కానీ, సూపర్ ఎల్‌నినో పరిస్థితులు కానీ గ్రామీణ ఆర్థిక ముఖ చిత్రాన్ని మార్చేస్తున్న తరుణంలో వ్యవసాయ కూలీలకు ప్రత్యామ్నాయం జీ రాంజీ ఉపాధి లభించినా, మరెంతో మంది ఉపాధికి కటకటలాడే పరిస్థితులు దాపురించబోతున్నాయి. వాటి ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వాలు ముందుకొచ్చి 'క్లైమేట్ స్మార్ట్ ఉపాధి'కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. లేకుంటే లక్షలాది మంది కూలీలు దుర్భర దారిద్ర్యంలోకి వెళ్లిపోయే పరిస్థితులను అంచనా వేసుకోవాలి. 'ఎల్‌నినో' పరోక్షంగా ఎంత మంది జీవితాలను అతలాకుతలం చేస్తుందో, వారినెలా ఆదుకోవాలో ప్రభుత్వాలు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం అవసరం.

సంబంధి కాకపోయినప్పటికీ ఎవరు మిత్రభావంతో మసలుతున్నాడో అతడే బంధువు, అతడే మిత్రుడు, అతడే గతి, అతడే ఆశ్రయం.



గోల్డ్‌స్మిత్

సమస్యను చేపట్టేవారి శక్తి సామర్థ్యాలపై వాటి పరిష్కారం ఆధారపడి ఉంటుంది.

స్వామి వివేకానంద

ఆశ నిరాశల మధ్య ఆదివాసీల ఊగిసలాట!

ఆదివాసిల సంక్షేమం అంటే కేవలం పింఛన్లు, సంక్షేమ పథకాలు మాత్రమే కాదు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షి ంచడం, ఉపాధి అవకాశాలను కాపాడడం, భూమిని రక్షి ంచ డం, వారి సంస్కృతిని గౌరవించడం కూడా ప్రభుత్వ బాధ్యతే. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్నివర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉంటామని పలుమార్లు ప్రకటించింది. అదే స్ఫూర్తితో ఆదివాసీల న్యాయమైన ఆందోళనలను కూడా సానుకూలంగా పరిశీలించి, వారి హక్కులు, అవకాశాలు, భవిష్యత్తు దెబ్బతినకుండా చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని గిరిజన సమాజం ఆశిస్తోంది. ఆదివాసీలు కోరేది ప్రత్యేక హక్కులు కాదు. రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణ మాత్రమే. అభివృద్ధి పేరిట హక్కులు కోల్పోకుండా, హక్కుల పరిరక్షణతోపాటు అభివృద్ధి కూడా అందేలా ప్రభుత్వం ముందుకు సాగితేనే ఆదివాసి సమాజానికి నిజమైన సామాజిక న్యాయం అందించినట్లవుతుంది.

ఎస్. సీతారామయ్య

భారత రాజ్యాంగం దేశంలోని బలహీన వర్గాలకు సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన న్యాయం అందించాలనే లక్ష్యంతో ప్రత్యేక రక్షణలను కల్పించింది. ఆ రక్షణల్లో ముఖ్యమైనవి ఆదివాసీల హక్కులు అడవిని, భూమిని, ప్రకృతి వనరులను నమ్ముకుని జీవించే ఆదివాసీల జీవన విధానాన్ని, సంస్కృతిని, ఉపాధిని కాపాడేందుకు అనేక ప్రత్యేకచట్టాలు, విధానాలు అమలులోకి వచ్చాయి. అయితే నేడు చట్టం కల్పించిన హక్కులకు భంగం వాటిలే పరిస్థితి ఏర్పడుతోంది. న్యాయపరంగా ఏర్పడిన కొన్ని అంశాలు ఆధారంగా గిరిజనేతరులు వ్యవహరిస్తున్న తీరు ఆదివాసి సమాజం తీవ్ర అన్యాయానికి గురవుతోంది. ఆదివాసీలు రాజ్యంగం కల్పించిన హక్కులను కాపాడుకోవడానికి పోరుబాట పట్టవలసిన దుస్థితి ఏర్పడింది. ఆదివాసి ప్రాంతాలను పాలన కోసం ప్రత్యేకంగా రాజ్యాంగం 5వ షెడ్యూల్‌లో నియమాలు, నిబంధనలు పొందుపరిచారు. అందులో భాగంగా షెడ్యూల్డ్ ప్రాంత స్థానిక ఆదివాసి అభ్యర్థులతోనే ఉద్యోగాలు భర్తీ చేసేందుకు వీలుగా 2000 సంవత్సరంలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో 3ను తీసుకొచ్చి ఉద్యోగ నియామకాల్లో 100శాతం ఆదివాసీలకు రిజర్వేషన్ కల్పిస్తూ వచ్చింది. దీనిని వ్యతిరేకిస్తూ చెబ్రోలు లీలా ప్రసాద్ అనే వ్యక్తి న్యాయస్థానాన్ని ఆశ్రయించి దాఖలు చేసిన కేసులో ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఏప్రిల్ 2020లో జిఓ నెం.3రద్దు, చేసింది. దాంతో నిరుద్యోగ ఆదివాసీలకు జీవనోపాధితెలుగు రాష్ట్రాలలో ప్రశ్నార్థకంగా మారింది. సుప్రీంకోర్టు తన తీర్పులో రాజ్యాంగ మౌలిక సమాన హక్కులకు విరుద్ధంగా జీవో 3 ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయని, నూరు శాతంషెడ్యూల్డ్ ప్రాంత స్థానిక గిరిజన అభ్యర్థులతో పోస్టులు భర్తీ చేయడం రాజ్యాంగ విరుద్ధమని, అందువల్ల చెల్లనేరవని అన్నది. అలాగే ఆర్టికల్ 309 కింద జారీ అయిన ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ నియామకాల నియమాలను సవరించే అధికారం ఐదవ షెడ్యూల్ పేరా 5(1)కింద గవర్నరుకు లేదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. అప్పటి నుంచి నేటి వరకు కూడా రెండు తెలుగు రాష్ట్రాల్లో పోరాటం చేస్తూనే ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం సాధారణ ఎన్నికలు 2024 ప్రచారంలో భాగంగా అరకు సభలో నేటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి కూటమి ప్రభుత్వం వస్తే మళ్ళీ ఆదివాసీలకు ఉద్యోగ నియామకాల్లో 100 శాతం ఆదివాసీలకు రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 2సంవత్సరాలు పూర్తయినా అది అమలుకాలేదు. ఆదివాసి సమాజం దానికోసం ఎదురు చూస్తూ ఉంది. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మీద నేటికీ కట్టుబడి ఉన్నారు. అయితే న్యాయపరంగా రాబోయే రోజుల్లో ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ఆదివాసీలకున్యాయం చేయడం తన బాధ్యతగా ప్రతిసారి వ్యక్తపరుస్తూ అధికారులను ఆదేశిస్తున్నారు. కానీ కార్యరూపం దాల్చడం లేదు. దానికోసం ఆదివాసి సమాజం వేయికళ్లతోఎదురుచుస్తున్నది. అలాగే అటవీ ప్రాంతాల్లో ఆదివాసీల భూముల పరిరక్షణ

కొరకు ప్రత్యేక చట్టాలను తెచ్చారు. అటువంటి చట్టమే షెడ్యూల్డ్ ప్రాంతాల భూ బదలాయింపు రెగ్యులేషన్ 1/70 ఇది షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసి భూముల పరిరక్షణకు బలమైన కవచంగా నిలిచి ఉన్నది. నేడు చట్టాని నిర్వీర్యం చేయాలని గిరిజనేతరులు జిఓ నెం.3 మీద ఏవిధంగా అయితే సుప్రీంకోర్టుకి వెళ్ళి రద్దు చేయించారో అదే విధంగా 1/70 యాక్ట్‌ని రద్దు చేయించాలని తెలంగాణకు చెందిన ఇతర పీటిషనర్లు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో అనేక గ్రామాలు, మండల కేంద్రాలలో గిరిజనేతరులు అధిక సంఖ్యలో ఉన్నారని వాదిస్తున్నారు. దశాబ్దాలుగా అక్కడ నివసిస్తున్న పేద గిరిజనేతరులకు భూములు కొనుగోలు చేయడానికి లేదా కౌలుకు తీసుకోవడానికి అవకాశం లేకుండాపోయిందని వారు పేర్కొంటూ సుప్రీం కోర్టు ఆశ్రయించారు. ప్రస్తుతం ఈ చట్టం న్యాయ పరిశీలనను ఎదుర్కొంటోంది. దీనితో ఆదివాసి ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తుంది. సుప్రీంకోర్టు కనుక ఈ చట్టాన్ని రద్దు చేసే ప్రయత్నం చేస్తే మా భవిష్యత్ ఏమిటి అని తీవ్ర ఆందోళనలకు దిగుతున్నారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాను కొత్తగా ఏర్పడిన జోనల్‌లో ఎప్పటి నుండో జోన్ 1లో ఉంది. దానిని తీసుకోనివెళ్లి జోన్ 2లో కలిపారు. దీనివల్ల విద్య, ఉపాధి అవకాశాలలో మరింత వెనుకబడిపోతాం అని ఆదివాసిలో ఆందోళన గురవుతున్నారు. ఈ విధంగా ఆదివాసి సమాజంలో అశాంతి ఏర్పడి కొన్ని ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి నేడు పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతున్నారు. ఆదివాసీలు ప్రస్తుతం ఆదివాసీలు కోరుకునేది జి.ఓ నెం.3 బదులుగా రాజ్యాంగ నిబంధనలు, చట్టాలు, న్యాయపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించి 'షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామక చట్టం' రూపొందించాలని లేక 5వ షెడ్యూల్ క్లాస్2 ప్రకారం ఆదివాసీ ప్రాంతంలో 100శాతం రిజర్వేషన్‌తో ప్రత్యేకఆర్డినెన్స్ ఇచ్చి రాష్ట్రపతి ద్వారా ఆమోదం పొందేలా చేయాలని ఆదివాసీలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే షెడ్యూల్డ్ ప్రాంతాల భూ బదలాయింపు రెగ్యులేషన్ 1/70చట్టం రద్దు కోరుతూ సుప్రీం కోర్టులో ఉన్న కేసులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలుచేసి చట్టపరిరక్షణ బాధ్యతను స్వీకరించాలని, అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్1లోనే కొనసాగింపు చేయాలని డిమాండ్‌చేస్తూ ఆందోళనలు తీవ్రతరం చేస్తున్నారు. ఈ విషయాలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి స్పందించి సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్‌లోనే కొనసాగింపు చేసేందుకు వీలుగా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. జి.ఓనెం.3 బదులుగా ఆదివాసీలకు శత శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి అన్ని మార్గాలను అన్వేషించి వారికి ఉద్యోగ నియామకాలలో పూర్తిన్యాయం చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు మరోసారి ఆదేశించారు. దీనితో ఆదివాసిసమాజంలో ముఖ్యమంత్రిపై గౌరవం పెరిగింది అయితే కార్యరూపం కోసం ఆదివాసి సమాజం కూటమిప్రభుత్వంపై కోటిఆశలతో ఎదురుచూస్తోంది. ఆదివాసిల సంక్షేమం అంటే కేవలం పింఛన్లు, సంక్షేమ పథకాలు మాత్రమే కాదు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడం, ఉపాధి అవకాశాలను కాపాడడం, భూమిని రక్షించడం, వారి సంస్కృతిని గౌరవించడం కూడా ప్రభుత్వ బాధ్యతే. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్నివర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉంటామని పలుమార్లు ప్రకటించింది. అదేస్ఫూర్తితో ఆదివాసీల న్యాయమైన ఆందోళనలను కూడా సానుకూలంగా పరిశీలించి, వారి హక్కులు, అవకాశాలు, భవిష్యత్తు దెబ్బతినకుండా చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని గిరిజన సమాజం ఆశిస్తోంది. ఆదివాసీలు కోరేది ప్రత్యేక హక్కులుకాదు. రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణ మాత్రమే. అభివృద్ధి పేరిట హక్కులు కోల్పోకుండా, హక్కుల పరిరక్షణతోపాటు అభివృద్ధి కూడా అందేలా ప్రభుత్వం ముందుకుసాగితేనే ఆదివాసి సమాజానికి నిజమైన సామాజిక న్యాయం అందించినట్లవుతుంది. ●

యువశక్తి 'భద్రత'కు ప్రామాణికాలు పాటించాలి

జానకి

ఉక్కు నరాలు, ఇనుప కండరాల వజ్ర సంకల్ప మనస్సు గల ఓ వందమంది యువతను నాకివ్వండి. ఈ దేశ తలరాతను, స్వరూప స్వభావాల్నే మార్చేస్తాను' అని స్వామి వివేకానంద అంటారు. అంటే యువత తలచుకుంటే దేన్నైనా సాధించగలదనే నమ్మకంతో ఆయన చెప్పిన మాటలవి. ప్రపంచ జనాభాలో 30 ఏళ్ల వయసు కంటే తక్కువ గలవారు సగానికి పైగా ఉన్నారు. యువశక్తి అపారం. శక్తివంతమైన మానవ వనరు. అలాంటియువశక్తి నేడు నిర్వీర్యమైపోతున్నది. ఒకప్పుడు యువత అంటే 15-25 సంవత్సరాల వయస్సుగలవారు. కానీ నేడు 15-35 యేండ్ల వయస్సు గల వారిని యువతగా పేర్కొంటారు. ఎందుకంటే, ఒకప్పటిలా బాల్య వివాహాలు జరగడం లేదు కాబట్టి. ఇంకా మనిషి జీవన ప్రమాణ స్థాయి పెరిగింది కూడా. ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. నేటి యువత మద్యపానం, ధూమపానం, గుట్కా, తంబాకు, గంజాయి, మాదకద్రవ్యాలు, మొదలగు దుర్వ్యసనాలకు బానిసలై శారీరక ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారు. అర్ధరాత్రి, అపరాత్రి అనకుండా స్మార్ట్‌ఫోన్ వినియోగించడంతో నిద్రలేమితో అనారోగ్యం పాలవుతున్నారు. ప్లాస్టిక్ కలిసిన ప్యాకేజ్ ఫుడ్స్, వివిధ రసాయనాలు కలగలిపిన జంక్‌ఫుడ్స్ కి ఆకర్షితులై ఎక్కువగా తినడం వల్ల అనేక జబ్బులకు గురవుతున్నారు. ఈ తిండి కూడా వేళాపాళా ఉండటం లేదు.ఏ అర్ధరాత్రి వేళకో! రాత్రి తిండి తింటే ఆరోగ్యంగాఎలా ఉండగలదు?ఇంకా ఇంటి తిండి వదిలేసి, బయట తిండికై అర్రులు చాస్తున్నారు. ఏ పూటలో ఏ ఆహారం తీసుకోవాలి? అన్న ఇంగితం లేక, ఏది పడితే అది తినటం వల్ల అనారోగ్యాన్ని కోరి తెచ్చుకుంటున్నారు. ఇవేకాక పేదరికం వల్ల సరైన పోషకాహారం అందక కూడా యువతీ యువకులు అనారోగ్యం పాలవుతున్నారు. అమ్మాయిలకు బాల్యవివాహాలు చేయడం వల్ల కూడా వారి పునరుత్పత్తి ఆరోగ్యానికి చేటు కలుగుతుంది. మరో ప్రధాన కారణం యువతలో శారీరక శ్రమ, నిర్దిష్ట వ్యాయామం లేకపోవడం. వీటన్నింటివల్ల చిన్న వయస్సులోనే మధుమేహం, రక్తపోటు, గుండెపోటు, ఊపిరితిత్తుల, జీర్ణకోశ, కాలేయ, మూత్రాశయ, నరాల, సుఖ వ్యాధులకులోనై ఆసుపత్రుల పాలవుతున్నారు. ప్రతిరోజూ మందులు వేసుకుంటే గాని బ్రతకలేని పరిస్థితిని కొని తెచ్చుకుంటున్నారు. ఇంకా కేన్సర్, ఎయిడ్స్, హెపటైటిస్ లాంటి ప్రాణాంతక వ్యాధుల బారినపడి అకాల మరణం పొందుతున్నారు. 'కండ కలవాడేను మనిషోయ్ అని మహాకవి గురజాడ అంటారు. నిజానికి కండ కలవాడంటే ఊబకాయం కల వాడు కాదు. ఎటువంటి క్రొవ్వు పేరుకుపోని కండ కలవాడని అర్థం. కానీ దీనికి విరుద్ధంగా నేడు యువత ఊబకాయంతో బాధపడుతున్నారు. వీటన్నింటికీ కారణం తినే పదార్థాలు, చేసే వ్యవహారాలు సరిగ్గా లేకపోవడమే. క్రమశిక్షణ లేని జీవితం మనిషిని పెడత్రోవకు నెడుతోంది. ఇది మనిషి శారీరక, మానసిక ఆరోగ్యం మీద కూడా ఎక్కువ ప్రభావం చూపుతోంది. ఈపరిస్థితి నేటి యువతలో ఎక్కువ శాతం కనిపిస్తోంది. అలాగే చదువు కోసం, ఉపాధికోసం జరిగే వెతుకులాటలో యువతపై తీవ్ర ఒత్తిడిపడుతున్నది. వీరు ఈ ఒత్తిడిని సాధారణంగా తల్లిదండ్రుల నుంచి తోటి సమాజం నుంచి ఎదుర్కొంటున్నారు. దీనివల్ల వీరి మానసిక ఆరోగ్యం క్షీణిస్తున్నది. ఇంకా అతివేగంగా వాహనాలను నడిపి, తమ ప్రాణాలను పణంగా పెడుతున్నది. ఆడ్రైవింగ్ లోనూ రోడ్డు భద్రత నియమాలు పాటించక ప్రమాదాలు కొనితెచ్చుకొని, చివరికి అంగవైకల్యంతోబాధపడుతున్నారు. ఈపరిస్థితి దేనికి సంకేతం? ఇది ఎటు దారితీస్తుంది?అనారోగ్యంతో నీరసించిన యువలోకం దేశాభివృద్ధికి ఏవిధంగా తోడ్పడుతుంది? ఈవిషయమై ప్రభుత్వాలే ప్రధానబాధ్యత వహించాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ యువత ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నది. అందువల్ల ఈసంస్థ సూచించే ఆరోగ్య ప్రామాణికాలను ప్రజలకు ఎరుకపరచాలి. ఇవన్నీ దేశంలో పెరుగుతున్న అంటువ్యాధులు, ప్రమాదాలు, గాయాల తీవ్రతను విపరీతంగా తగ్గిస్తాయి. ●

పర్యావరణ పరిరక్షణకై 'చెత్త'పై పోరాటం

పాపని నాగరాజు

మహారాష్ట్రలోని మోషి వేస్ట్‌టు ఎనర్జీ ప్రాజెక్టు వద్ద భారీ వర్షాలకు ఏళ్ల తరబడి పేరుకుపోయిన లెగసీ వ్యర్థాల కొండ విరిగిపడి పరిపాలనా భవనాన్ని సజీవ సమాధిచేసిన ఘటన దేశాన్ని కుదిపేసింది. ఒక కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడు. పలువురు గాయపడ్డారు. కానీ ఈ దుర్ఘటనను కేవలం ప్రకృతి వైపరీత్యంగా చూడడం వాస్తవాన్ని కప్పిపుచ్చడమే అవుతుంది. ప్రకృతి చెత్త కొండలను నిర్మించదు. పాలనా నిర్లక్ష్యం, కార్పొరేట్ లాభాల రాజకీయాలు, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణను నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వాలే వాటిని నిర్మిస్తాయి. మోషిలో కూలింది చెత్త కొండ కాదు, ప్రజల భద్రత కంటే లాభాలను ముందుపెట్టిన పట్టణ అభివృద్ధి నమూనా. ఈ హెచ్చరిక మహారాష్ట్రకే పరిమితం కాదు. హైదరాబాద్‌కు ఇది మరింత దగ్గరగా వినిపించాలి. ఎందుకంటే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రతిరోజూ సుమారు 8,000 టన్నుల మున్సిపల్ ఘన వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయని జీహెచ్‌ఎంసీ స్వయంగా అంగీకరించింది. అంతేకాదు, ఈవ్యర్థాలను ప్రధానంగా జవహర్‌నగర్ సమీకృత వ్యర్థాల నిర్వహణ కేంద్రంపైనే ఆధారపడి నిర్వహించడం ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు 2016కు అనుగుణం కాదని కూడా అధికారికంగా పేర్కొంది. అంటే ప్రమాదం గురించి ప్రజలకు మాత్రమే కాదు, ప్రభుత్వానికి కూడా తెలుసు. అయినప్పటికీ పరిస్థితి ఎందుకు మారడం లేదు? కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు-2016 స్పష్టంగా చెబుతున్నాయి. చెత్తను మూలం వద్దనే తడి-పొడి-ప్రమాదకర వ్యర్థాలుగా వేరు చేయాలి. నగరాలన్నీ వికేంద్రీకృత వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను అభివృద్ధి చేయాలి. శాస్త్రీయ ల్యాండ్‌ఫిల్ చివరి ప్రత్యామ్నాయంగా మాత్రమే ఉండాలి. భారీ చెత్త కొండలను సృష్టించడం ఈ నియమాల ఆత్మకు విరుద్ధం. అయినప్పటికీ హైదరాబాద్‌లో నగరమంతా ఉత్పత్తి చేసే వ్యర్థాలను జవహర్‌నగర్‌కు తరలించే కేంద్రీకృత నమూనా కొనసాగుతూనే ఉంది. ఇదే మోషి వంటి ప్రమాదాలకు పునాది. జవహర్ నగర్ కథ కొత్తది కాదు. ఒకప్పుడు మన్సూరాబాద్‌లో ప్రజలు చెత్త కాలుష్యాన్ని అనుభవించారు. తర్వాత సమస్యను అక్కడి నుంచి తరలించి జవహర్‌నగర్‌కు చేర్చారు. నగరం పెరిగే కొద్దీ ఆటోనగర్, సనత్‌నగర్, ఇమ్లీబన్ వంటి ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు ఏర్పడ్డాయి. కానీ మూల సమస్యమాత్రం అలాగే ఉంది. వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ వంటి తెలంగాణ నగరాల్లోనూ ఇదే ధోరణి కనిపిస్తోంది. ఒక ప్రదేశం నిండిపోతే మరో ప్రదేశం వెతకడం తప్ప, చెత్త ఉత్పత్తి విధానాన్ని, నిర్వహణ నమూనాను మార్చే ప్రయత్నం కనిపించడం లేదు. ఇక్కడే 'చెత్త రాజకీయం' ప్రారంభమవుతుంది. ప్రతి ఎన్నికల సమయంలో జవహర్‌నగర్ ప్రజలకు హామీలు ఇవ్వని రాజకీయ పార్టీఉండదు. డంపింగ్ యార్డు తరలిస్తామని, కాలుష్యాన్ని నివారిస్తామని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతామని చెబుతారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత అదే మౌనం.

ఎందుకు? దీనికి సమాధానం కేవలం రాజకీయాల్లో కాదు, రాజకీయ ఆర్థిక వ్యవస్థలో ఉంది. ఒకప్పుడు మున్సిపల్ పారిశుద్ధ్య పనిగా ఉన్న వ్యర్థాల నిర్వహణ ఇప్పుడు వేల కోట్ల రూపాయల ఆర్థిక రంగంగా మారింది. చెత్త సేకరణ, రవాణా, ప్రాసెసింగ్, లీచేట్ శుద్ధి, ల్యాండ్‌ఫిల్ నిర్వహణ, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, ప్రతిదశలో భారీ కాంట్రాక్టులున్నాయి. జవహర్‌నగర్ సమీకృత వ్యర్థాల నిర్వహణ ప్రాజెక్టులో రామ్కీ ఎన్విరో ఇంజనీర్స్ (ప్రస్తుతం రీ సస్టైనబిలిటీ గ్రూప్‌లో భాగం) దీర్ఘకాలంగా భాగస్వామిగా ఉంది. జిహెచ్‌ఎంసి రాంకీ భాగస్వామ్యం 2009లో కుదిరిన కన్సెషన్ ఒప్పందం కింద అమలవుతోందని ప్రభుత్వ పత్రాలే చెబుతున్నాయి. ఇక్కడ ఒక ప్రశ్న వేయడం ప్రజాస్వామ్య హక్కు. వేల కోట్ల ప్రజాధనం, దశాబ్దాల ఒప్పందాలు, కార్పొరేట్ భాగస్వామ్యాలు ఉన్న ఈరంగంలో ప్రజారోగ్యం, పర్యావరణ భద్రతకు ప్రాధాన్యం దక్కుతోందా? లేక కాంట్రాక్టుల నిరంతరత్వానికా? ఈ ప్రశ్నను మరింత తీవ్రతరం చేసింది కాగ్ నివేదిక. ప్రాసెస్ చేయని వ్యర్థాలకు కూడా భారీ మొత్తంలో చెల్లింపులు జరిగాయని, పర్యవేక్షణలో తీవ్రమైన లోపాలున్నాయని, నియంత్రణ వ్యవస్థ బలహీనంగా ఉందని అది పేర్కొంది. అంతటితో ఆగలేదు. జవహర్‌నగర్‌లో తాజా వ్యర్థాల డంపింగ్‌పై ఎన్‌జిటి ఇచ్చిన ఆదేశాల అమలులో లోపాలపై జిహెచ్‌ఎంసి, రాంకీ రెండింటినీ సంయుక్తంగా బాధ్యులుగా పేర్కొంటూ జరిమానా కూడా విధించింది. ఇది కేవలం పరిపాలనా లోపం కాదని, బాధ్యత ప్రశ్నను తప్పించలేమని సూచించే పరిణామం. ఇక్కడితో సమస్య ముగియదు. ఈమొత్తం వ్యవస్థను పర్యవేక్షించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం పాత్ర మరింత ఆందోళన కలిగిస్తోంది. ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు 2016 అమలును నిర్ధారించడం స్థానిక సంస్థలతో పాటు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి టిజిపిసిబిబాధ్యత కూడా. లీచేట్ శుద్ధి, భూగర్భ జలాల నాణ్యత, ల్యాండ్‌ఫిల్ గ్యాస్ నియంత్రణ, గాలి కాలుష్య ప్రమాణాలు, పర్యావరణ అనుమతుల అమలు వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ జరగాలి. కానీ జవహర్‌నగర్ చుట్టుపక్కల ప్రజలు ఏళ్లుగా దుర్వాసన, కలుషిత నీరు, పొగ, ఈగలు, దోమలు, ఆరోగ్య సమస్యలపై ఆందోళనలు వ్యక్తంచేస్తున్నప్పటికీ, వాటికి తగిన స్థాయిలో శాశ్వత పరిష్కారాలు కనిపించడం లేదు. చెత్తలోని రసాయనాలు, లోహాలు, విషపదార్థాలు కలిసిన ఈ కలుషిత ద్రవం వర్షాల సమయంలో భూమిలోకి ఇంకితే భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. పర్యావరణ నిపుణులు సంవత్సరాలుగా ఇదే హెచ్చరిక చేస్తున్నారు. పైకి కనిపించేది చెత్త కొండ మాత్రమే. కానీ కింద నిశ్శబ్దంగా కలుషితమవుతున్నది నేల, నీరు, చివరకు ప్రజల ఆరోగ్యం. ఈ కాలుష్యానికి అత్యధిక మూల్యం చెల్లిస్తున్న వారు ఎవరు? నగర సంపదను నిర్మించే శ్రమజీవులే. డంపింగ్ యార్డులు, ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు, వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాలు ఎక్కు వగా దళితులు, బీసీలు, గిరిజనులు, ముస్లింలు, వలస కార్మికులు, అసంఘటిత రంగ శ్రామికులు నివసించే ప్రాం తాలకే చేరువలో ఉన్నాయి. అదే నగరంలోని అత్యంత ఖరీదైన నివాస ప్రాంతాల్లో ఇలాంటి ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలనే ఆలోచనే ఎందుకు రాదు? వ్యాధులు, చర్మసమస్యలు, కలుషిత నీటి ప్రభావాలు అణగారిన వర్గాలకా? ఇదే నేటి చెత్త రాజకీయం. ఈ రాజకీయాన్ని మార్చకుండా డంపింగ్ యార్డులు మారినా, ప్రభుత్వాలు మారినా, ప్రమాదాలు మాత్రం మారవు. అందుకే చెత్తపై పోరాటం పారిశుద్ధం కోసం మాత్రమే కాదు, ప్రజల జీవించే హక్కుకోసం, పర్యావరణ న్యాయం కోసం, రాజ్యాంగబద్ధమైన సమానత్వం కోసం సాగాల్సినప్రజాఉద్యమం. ●

ప్రజావాక్కు

న్యాయమూర్తులు ఇలా ఉండాలి

సుప్రీంకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ గారు మొన్న మంచి స్టేట్మెంట్ ఇచ్చారు. గంగానది మీద మాంసాహారం తినడం నేరమని, అపవిత్రం అని ఏ రాజ్యాంగంలో ఉందో చెప్పమని సూటిగా ప్రశ్నించాడు. అలాగే రిటైర్ అయిన న్యాయమూర్తులు రాజకీయాలలో ప్రవేశించడం, రాజకీయ పరమైన పోస్టులు తీసుకోవటం కూడా రాజ్యాంగ వ్యతిరేకం అని స్పష్టంగా చెప్పాడు. ఎందుకంటే ఈమధ్య కొన్ని కేసులలో కేంద్రప్రభుత్వానికి అనుకూలంగా తీర్పులు చెప్పినవారికి గవర్నర్ పోస్టులు, ఇతర రాజకీయ పరమైన పోస్టులు వచ్చాయని (రాజ్య సభ సభ్యులుగా) ప్రజలు భావిస్తున్నారు. న్యాయ వ్యవస్థ మీద ఎలాంటి ప్రలోభాలు ఒత్తిళ్లు ఉండకూడదు. ఉన్నట్లయితే న్యాయం సరిగా జరగదు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

నేటి సమాజంలో ఆహార కల్తీ ఒక తీవ్రమైన సమస్యగా మారుతోంది. కొందరువ్యాపారులు అధిక లాభాల కోసం తక్కువ ధరకు లభించే నాసిరకం పదార్థాలతో ఆహారాన్ని తయారు చేసి విక్రయిస్తున్నారు. ఇలాంటి ఆహారాన్ని తీసుకోవడం వల్ల ప్రజలు అనేకరకాల అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలునిర్వహిస్తూ, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటున్నప్పటికీ, కొందరు వ్యాపారులలో మాత్రంమార్పు కనిపించడంలేదు. ప్రతివ్యాపారి నాణ్యతకు ప్రాధాన్యం ఇచ్చి స్వచ్ఛమైన ఆహారాన్ని అందించడం తన బాధ్యతగా గుర్తించాలి. అలాగే ప్రజలు కూడా ఆహారపదార్థాలను కొనుగోలుచేసే సమయంలో నాణ్యత, పరిశుభ్రతపై శ్రద్ధవహించాలి. ప్రజల అప్రమత్తత, వ్యాపారుల బాధ్యత, అధికారుల నిరంతరపర్యవేక్షణతోనే ఆహార కల్తీనిఅరికట్టిఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలం.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

హక్కులను ఉపయోగించుకోవాలి

మానవ జీవితంలో రాజ్యాంగం కల్పించిన ప్రతి హక్కులను అవసరమైన చోట పూర్తిగా వినియోగించుకోవాలి. ఎక్కడ ఎవరికి కూడా భయపడాల్సిన అవసరం లేదు. నీ హక్కులను పూర్తిగా వినియోగించుకున్నపుడే సాధికారితతో కూడిన జీవితం గడపవచ్చు. మన హక్కులను కాల రాయకుండా వినియోగించుకుందాం.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

దుస్తుల కాలుష్యం

మనదేశంలో అనేక రకాల కాలుష్యాలతో పాటు మనం ధరించే దుస్తుల వల్ల కూడా చెత్త ప్రోగు అవటమే కాకుండా ప్రకృతికి కూడా విపరీతమైన నష్టం జరుగుతోంది. దీనికంతకూ కారణం మనం ధరించే దుస్తుల్లో అధిక శాతం ప్లాస్టిక్‌తో తయారయ్యే పాలియిస్టర్ దుస్తులు. ఇదేకాక ఫ్యాషన్ పేరుతో పార్టీలకనీ, టూర్లకు అనీ అవసరం లేకపోయినా దుస్తులు ఇబ్బడి ముబ్బడిగా కొనుగోలుచేయటం. పూర్వం మనదేశంలో పత్తి నూలుతో తయారయ్యే దుస్తులే ఉండేవి. సాంకేతికత పేరుతో పత్తి నూలుతోపాటు పాలియిస్టర్ నూలు మిళితమైన దుస్తులు అధికంగా ఉత్పత్తి అవుతున్నాయి. పత్తి నూలుతో తయారయ్యే దుస్తులు సులభంగా భూమిలో కలిసిపోతాయి. కొందరైతే దుస్తులు ఒకటి రెండు సార్లు వేసుకుని మూలన పడేస్తున్నారు. వాడేసిన దుస్తులు చెత్తకుప్పలకు చేరుతున్నాయి. పాలియిస్టర్‌దారం మిళిత దుస్తులు భూమిలో కలిసిపోక కాలుష్యకారకం అవుతున్నాయి. ఈకాలుష్యం పెరగకుండా ఉండాలంటే అవసరమైన మేరకే దుస్తులుకొనుగోలు చేయాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

వెంటనే స్పందించాలి

వైద్యవిద్యార్థులకు భారతదేశవ్యాప్తంగా ఉమ్మడిగా నిర్వహించే 'నీట్' పరీక్ష లీక్ కావడం ఎంతో చర్చనీయాంశం అయింది. మొదటగా నీట్ పరీక్ష నిర్వహించి లీక్ అయిన విషయం తెలిసినాక ఆ పరీక్షరద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించి ఫలితాలు వచ్చిన తర్వాత మళ్లీ లీక్ అయిందని విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులుప్రధాని ఇంటి వద్దనిరసన, ముట్టడి తెలిపినందుకు పోలీసుల ద్వారా గాయాలు అయ్యేదాకా ప్రధాని నోటి మాట రాలేదంటే స్పందన లేదంటే ప్రజాస్వామ్యస్ఫూర్తి ఎటుపోతుందో అర్థంకావడం లేదు. ఇప్పటికైనా ప్రధాని ప్రజాస్వామ్యస్ఫూర్తిని నిలబెట్టి రక్షించాలి.

- బెజుగాం నరేష్, సిద్ధిపేట జిల్లా

షీ టీమ్ తరహాలో వికలాంగుల టీం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ కోసం, వారిని వేధింపుల కోసం రక్షించడం కోసం షీటీం ఏర్పాటు చేయడం సంతోషకరం. అదేతరహాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు కూడా రక్షణకల్పించాలి. వారిపై హేళనలు. ఈసడింపులు, దాడులు, దౌర్జన్యాలు, దూషణలు, సూటిపోటీ మాటలు, వైకల్యాలను సూచిస్తూ హేళన చేయడం సమాజంలో జరుగుతుంది వికలాంగుల రక్షణ కోసం రక్షణ కవచంగా కొన్ని టీములు ఏర్పాటు చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్‌జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

30-7Pg5.qxd:30-7Pg5.qxd 1/1/02 6:02 AM Page 1

కేంద్రానికి సుప్రీంకోర్టు షాక్

పోస్ట్-ఫ్యాక్టో పర్యావరణ అనుమతులకు బ్రేక్

ఇష్టారాజ్యంగా అనుమతులివ్వడం కుదరదని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జులై 29: పర్యావరణ (పరిరక్షణ) చట్టం, 1986లోని సెక్షన్ 3 కింద జారీ చేసిన చెల్లుబాటు అయ్యే చట్టబద్ధమైన నోటిఫికేషన్ల ద్వారా పనులు పూర్తయిన తర్వాత కూడా పర్యావరణ అనుమతులు (ఇసిలు) మంజూరు చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉన్నప్పటికీ, కేవలం ఒక పరిపాలనా ఆఫీస్ మెమోరాండం ద్వారా అలా చేయలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పర్యావరణ అనుమతులు లేకుండా ప్రాజెక్టులను ప్రారంభించి, ఆ తర్వాత 'పోస్ట్-ఫాక్టో' అనుమతులు పొందే ధోరణికి సుప్రీంకోర్టు చెక్ పెట్టింది. పర్యావరణ పరిరక్షణ చట్టం 1986లోని సెక్షన్-3 కింద చట్టబద్ధమైన గెజిట్ నోటిఫికేషన్ ద్వారా పరిమితంగా ప్రాజెక్టులను క్రమబద్ధీకరించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉన్నప్పటికీ, కేవలం ఒక సాధారణ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ మెమోరాండమ్(ఒఎం) ద్వారా ఇష్టారాజ్యంగా అనుమతులు ఇవ్వడం కుదరదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమల్య బాగ్చి, జస్టిస్ విపుల్ పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పును వెలువరించింది. అయితే, ఈ తీర్పుకు భవిష్యత్ ప్రభావం ఉండేలా చూస్తూ, వివాదాస్పద విధానం కింద ఇప్పటికే మంజూరు చేసిన అనుమతులను కోర్టు పరిరక్షించింది. 2021 నాటి పరిపాలనా ఉత్తర్వు (ఒఎం), చట్టబద్ధమైన నోటిఫికేషన్ ద్వారా కాకుండా పరిపాలనా ఉత్తర్వు ద్వారా ఇప్పటికే ఉన్న పర్యావరణ అనుమతి చట్రాన్ని మార్చడానికి ప్రయత్నించినందున, అది 1986 నాటి పర్యావరణ (రక్షణ) చట్టానికి అతీతమైనదని ధర్మాసనం పేర్కొంది. "చట్టబద్ధమైన నోటిఫికేషన్ ద్వారా సవరించనంత వరకు, 2006 నోటిఫికేషన్ ప్రకారం ముందస్తు పర్యావరణ అనుమతి (ఒఎం) విధానం తప్పనిసర్ణి అని తీర్పు వెలువరించిన సమయంలో జస్టిస్ బాగ్చి అన్నారు. తీర్పు వెలువడిన తర్వాత ఇచ్చే పర్యావరణ అనుమతులపై చట్టపరమైన స్థితిని స్పష్టం చేస్తూ, కామన్ కాజ్, అలెంబిక్ ఫార్మాస్యూటికల్స్ కేసులలో తన మునుపటి తీర్పులు అప్పటికి అమలులో ఉన్న చట్టం నేపథ్యంలోనే ఇవ్వబడ్డాయని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ తీర్పులు, తగిన సందర్భాలలో పరిమితమైన క్షమాభిక్ష పథకాన్ని రూపొందించే కేంద్ర ప్రభుత్వ అధికారంపై సంపూర్ణ నిషేధాన్ని విధించలేదు. కామన్ కాజ్, అలెంబిక్ కేసులలో, తీర్పు వెలువడిన తర్వాత ఇచ్చే పర్యావరణ అనుమతి అనేది పర్యావరణ న్యాయశాస్త్రానికి "విరుద్ధం" అనే వ్యాఖ్యలను, ముందస్తు పర్యావరణ అనుమతిని తప్పనిసరి చేసిన 2006 పర్యావరణ ప్రభావ అంచనా (ఇఐఎ) నోటిఫికేషన్ చట్టబద్ధమైన నేపథ్యంలో అర్థం చేసుకోవాలని కోర్టు పేర్కొంది.

ఎన్‌సిఎస్‌సికి ఆ అధికారం లేదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జులై 28: రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 ప్రకారం జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ (ఎన్‌సిఎస్‌సి) పాత్ర కేవలం సిఫార్సు, సలహా రూపమే తప్ప, తీర్పు చెప్పేది కాదని పేర్కొంటూ, ఆ కమిషన్ కట్టుబడి ఉండే ఆదేశాలు జారీ చేయలేదని లేదా సేవా వివాదాలను పరిష్కరించలేదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ముంబై పోర్ట్ అథారిటీ ఒక షెడ్యూల్డ్ కుల ఉద్యోగికి పదోన్నతికి సంబంధించిన ఆదేశాలను అమలు చేయాలని, 30 రోజుల్లోగా బకాయిలు చెల్లించాలని ఎన్‌సిఎస్‌సి ఇచ్చిన ఆదేశాన్ని సమర్థించిన బాంబే హైకోర్టు తీర్పును జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎ.జి. మసిహ్‌లతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. షెడ్యూల్డ్ కులాల హక్కులు, రక్షణల ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులపై విచారణ జరిపి, సిఫార్సులు చేసే అధికారం ఈ రాజ్యాంగ సంస్థకు ఉన్నప్పటికీ, సేవా విషయాలలో అమలు చేయదగిన ఆదేశాలు జారీ చేయలేదని సుప్రీంకోర్టు పేర్కొంది.

"ఎన్‌సిఎస్‌సి జారీ చేసిన ఆదేశాలు రాజ్యాంగం ప్రకారం కల్పించిన అధికారాల పరిధిలోకి వస్తాయని బొంబాయి హైకోర్టు డివిజన్ బెంచ్ పొరపాటు చేసిందని తాము భావిస్తున్నాము," అని జస్టిస్ కరోల్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఆర్టికల్ 338 కమిషన్‌కు పరిమిత అధికారాలను మాత్రమే కల్పిస్తుందని పేర్కొంది.

అమెరికాలో రష్యాపై ఆంక్షల బిల్లు..

భారత్‌పై 100 శాతం టారిఫ్‌ల ప్రభావం?

వాషింగ్టన్, జులై 29: ఇంధన ఎగుమతులతో రష్యా ఆర్జిస్తోన్న ఆదాయాన్ని కట్టడి చేసేలా అమెరికా మరిన్ని ఆంక్షలకు సిద్ధమైంది. ఆ ఆంక్షల బిల్లును పరిశీలించేందుకు సెనెట్ సభ్యులు అంగీకరించారు. అది చట్టరూపం దాల్చితే రష్యా చమురును దిగుమతి చేసుకుంటున్న భారత్ వంటి దేశాలపై టారిఫ్‌ల ప్రభావం పడనుంది. ఈ ఆంక్షల బిల్లు ఆమోదానికి సెనెట్‌లో ప్రక్రియ ప్రారంభమైంది. దానిని పరిశీలించేందుకు 86-12 తేడాతో సభ్యులు అంగీకరించారు. సెనెట్‌తోపాటు ప్రతినిధుల సభలోనూ దీనికిఆమోదం లభించాల్సి ఉంది. ఈ దశలు దాటిన తర్వాత అది చట్టరూపం దాల్చుతుంది. అదే జరిగితే.. భారత్, చైనా వంటి దేశాలు 100 శాతం టారిఫ్‌ను ఎదుర్కోవాల్సి ఉంటుంది. రష్యా చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తోన్న దేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై ఈ టారిఫ్‌లను విధించే వెసులుబాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు లభించనుంది. 2022 నుంచి ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధం నడుస్తోంది. ఉక్రెయిన్‌కు ఐరోపా, అమెరికా నుంచి సహాయం అందుతున్నా రష్యాను సైనికంగా, ఆర్థికంగా దెబ్బతీయకపోయాయి. అందుకే ఇంధన ఎగుమతులతో పుతిన్ ప్రభుత్వం ఆర్జిస్తున్న ఆదాయాన్ని టార్గెట్ చేసేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది. తాజా ప్రతిపాదనలు కూడా అందులో భాగమే. తమకు మద్దతు ఇవ్వాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అమెరికాలో పర్యటించిన నేపథ్యంలో సెనెట్‌లో ఈ ఓటింగ్ జరగడం గమనార్హం. ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన దగ్గరి నుంచి పశ్చిమ దేశాల హెచ్చరికలను పట్టించుకోకుండా రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తోన్న సంగతి తెలిసిందే. డిస్కౌంట్ ధరలో భారత రిఫైనరీలకు ముడి చమురు లభిస్తోంది. చైనా, జపాన్‌తోపాటు కొన్నిఐరోపాదేశాలు కూడా ఈ ఇంధనాన్ని కొంటున్నాయి. ఈ బిల్లు ఓకేఅయితే భారత్‌పై పరోక్షంగా టారిఫ్‌ల ప్రభావం పడనుంది. ప్రస్తుతానికి వాణిజ్య ఒప్పందాల్లో ఎలాంటి మార్పులు లేదు.

హిందూ మహాసముద్రంలో తేలుతున్న స్పేస్ ఎక్స్ స్టార్‌షిప్

వాషింగ్టన్, జులై 29: ఇటీవల స్పేస్‌ఎక్స్ ప్రయోగించిన ఓ భారీ స్టార్‌షిప్ వ్యోమనౌక హిందూ మహాసముద్రంలో తేలుతోంది. ఈ విషయాన్ని స్పేస్ ఎక్స్ ధ్రువీకరించింది. విశ్లేషణ కోసం దానిని రికవరీ చేయడానికి తమ బృందాలు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపింది. ప్రయోగం తర్వాత నియంత్రణ లేకుండానే అది సముద్రంలో దిగిందని అయినప్పటికీ అందులో ఎలాంటి సమస్య తలెత్తలేదని పేర్కొంది. దానిని తిరిగి తీసుకురావడానికి ఓ నౌకు పంపుతున్నట్లు స్పేస్‌ఎక్స్ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ వెల్లడించారు. స్టార్‌షిప్‌లను పునర్వినియోగించేందుకు వీలుగా తమ సంస్థ చేస్తున్న ప్రయత్నాల్లో ఇదో ముఖ్యమైన మైలురాయి అని పేర్కొన్నారు. ప్రయోగం అనంతరం అంతరిక్షం నుంచి సముద్రంలో దిగడానికి ఎదురైన ఒత్తిళ్లను స్టార్‌షిప్ నిర్మాణం, దాని హీట్ షీల్డ్, ఆన్‌బోర్డు వ్యవస్థలు ఎలా ఎదుర్కొన్నాయనే విషయాన్ని శాస్త్రవేత్తలు పరిశీలించనున్నారు. రికవరీ బృందం స్టార్‌షిప్‌నకు సంబంధించిన చిత్రాలను సేకరిస్తోందని.. కీలక వ్యవస్థల పరిస్థితిని నిర్ధారించడంలో ఇవి సహాయపడతాయని స్పేస్‌ఎక్స్ పేర్కొంది.

ఏమిటీ స్టార్‌షిప్?: చంద్రులు, అంగారకుడు అంతకు మించిన అంతరిక్ష యాత్రల కోసం స్పేస్ ఎక్స్ అభివృద్ధి చేస్తున్న రాకెట్ ఈ స్టార్‌షిప్. దాని సూపర్ హెవీ బూస్టర్‌తో కలిపినప్పుడు ఇది సుమారు 123 మీటర్ల ఎత్తు ఉంటుంది. వ్యోమగాములను చంద్రునిపైకి తీసుకువెళ్లేందుకు నాసా చేపట్టిన ఆర్టెమిస్ కార్యక్రమంలో ఇది కూడా కీలక పాత్ర పోషించనుంది. గతంలో ప్రయోగించిన స్టార్‌షిప్ నమూనాలు పరీక్షల సమయంలోనే ధ్వంసం కాగా ఈ ప్రయోగం అనంతరం కూడా సముద్రంలో యాక్టివ్‌గా ఉండడం గమనార్హం.

భర్తను నెలవారీ లీజుకు ఇచ్చిన భార్య

థాయిలాండ్‌లో ఘటన

సోషల్ మీడియాలో వైరల్

బ్యాంకాక్, జులై 29: థాయిలాండ్‌కు చెందిన ఖున్ క్వాంగ్ (31) అనే మహిళ, ఒక పోలీస్ అధికారిని పదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి 8 ఏళ్ల కుమారుడు కూడా ఉన్నాడు. చాలా కాలం పాటు వీరి కాపురం ఎంతో సంతోషంగా సాగింది. ఇటీవల భర్త ప్రవర్తనలో మార్పు రావడం, రాత్రివేళల్లో ఆలస్యంగా ఇంటికి రావడం గమనించిన క్వాంగ్‌కు అనుమానం వచ్చింది. ఆరా తీయగా, ఒక అపరిచిత మహిళ సోషల్ మీడియాలో తన భర్తను నిరంతరం ఫాలో అవుతుండటం చూసింది. అసలు నిజం తెలుసుకోవడానికి ఆమె ఒక ప్రైవేట్ డిటెక్టివ్‌ను నియమించింది. విచారణలో తన భర్త మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని, ఆమెతో కలిసి ఒక అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నట్లు డిటెక్టివ్ ఆధారాలతో సహా బయటపెట్టాడు. దీంతో సదరు భర్త ఇంటికి వచ్చి, 'నాకు ఈ సంసారం వద్దు.. ఇల్లు, కారు, అప్పులు అన్నీ నీకే ఇచ్చేస్తున్నా.. నేను ఆమెతోనే ఉంటా' అంటూ కట్టుబట్టలతో వెళ్ళిపోయాడు. భార్య సదరు ప్రియురాలి ఇంటికెళ్లి, భర్తకు సర్దిచెప్పి ఇంటికి రప్పించింది. అయితే, 'ఆమెను (ప్రియురాలిని) మర్చిపోలేకపోతున్నాను, ఆమె లేకుండా ఉండలేను' అని భార్య ముందే భర్త ఆవేదన వ్యక్తం చేశాడు. ఇక చేసేదేమీ లేక, ప్రియురాలికి ఫోన్ చేసి, 'నీకు నా భర్త కావాలి, నా భర్తకు నువ్వు కావాలి. కాబట్టి నా భర్తను నీకు అద్దెకు (లీజుకు) ఇస్తాను. కానీ దానికి ప్రతిఫలంగా నెలకు 30,000 థాయ్ బాట్లు (సుమారు రూ.85,000) నాకు చెల్లించాలి. అప్పుడు అతడు నీతోనే ఉండవచ్చు. కానీ నేను చట్టపరంగా విడాకులు మాత్రం ఇవ్వను' అని పేర్కొంది. ఆమె ఆఫర్ విన్న ప్రియురాలు సమ్మతించింది. 'నాకు డబ్బు సమస్య కాదు, అద్దె కట్టడానికి నేను సిద్ధం' అని తెలిపింది. అయితే, సదరు భర్త మాత్రం భార్య అగ్రిమెంట్‌ను నిరాకరించాడు. ప్రస్తుతం ఈ వింత 'హజ్బెండ్ లీజ్ అగ్రిమెంట్' (భర్త అద్దె ఒప్పందం) వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

కోల్ స్కామ్ కేసులో మన్మోహన్‌కు క్లీన్‌చిట్

2015లో జారీ చేసిన సమన్లు కొట్టేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జులై 29: బొగ్గు బ్లాకుల కేటాయింపుల కేసులో దివంగత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు బుధవారం అధికారికంగా విముక్తి లభించింది. విచారణను ఎదుర్కోవాలని కోరుతూ 2015లో ప్రత్యేక సిబిఐకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు కొట్టివేసింది. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) ముగింపు నివేదికలు ఆయనకు క్లీన్ చిట్ ఇచ్చాయని, వాటిని తిరస్కరించడానికి బలమైన కారణాలు లేవని పేర్కొంది. భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, జస్టిస్‌లు జయమల్య బాగ్చి, వి.మోహనలతో కూడిన ధర్మాసనం, సింగ్ అప్పీల్‌ను అనుమతించి, సిబిఐ ముగింపు నివేదికలను తిరస్కరించి, అవినీతి నిరోధక చట్టం కింద మాజీ ప్రధానిపై అభియోగాలు మోపిన పాటియాలా హౌస్ కోర్టుల ప్రత్యేక న్యాయమూర్తి మార్చి 11, 2015నాటి ఉత్తర్వును రద్దు చేసింది. దశాబ్దానికి పైగా గడిచిన తర్వాత ఆ ముగింపు నివేదికలను అంగీకరించిన సుప్రీంకోర్టు, ఇప్పుడు దివంగత మాజీ ప్రధానిపై ఉన్న క్రిమినల్ విచారణను ముగించింది.

బాబ్రీ మసీదు కూల్చివేతను వ్యతిరేకించడం దేశ వ్యతిరేక చర్య కాదు

బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు

ముంబై, జులై 29: అయోధ్యలోని బాబ్రీ మసీదును కూల్చివేతను వ్యతిరేకించడమన్నది 'దేశ వ్యతిరేక చర్య' కిందకు రాదని బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డిపిఐ)కి చెందిన ఇద్దరు సభ్యులపై ముంబై పోలీసులు జారీ చేసిన నగర బహిష్కరణ ఉత్తర్వులను రద్దు చేసింది. కాగా ఎస్‌డిపిఐ కార్యకర్తలు ఫిరోజ్ అబ్దుల్ వహాబ్ ఖాన్, మహమ్మద్ రఫిక్ గులాం రసూల్ అన్సారీలను ఏడాది కాలంపాటు నగరం నుంచి బహిష్కరిస్తూ ముంబై పోలీసులు 2025 డిసెంబర్ 3న ఉత్తర్వులు జారీచేశారు. వక్ఫ్ సవరణ బిల్లు, చెంబూర్ గోవండి ప్రాంతంలోని సిమెంట్ గోడౌన్ల వల్ల కలుగుతున్న వాయు కాలుష్యం, బాబ్రీ మసీదు కూల్చివేతకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలకు సంబంధించి 2024, 2025 సంవత్సరాల్లో నమోదైన మూడు ఎఫ్‌ఐఆర్‌ల ఆధారంగా పోలీసులు ఈ చర్య చేపట్టారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ మాధవ్ జమ్దార్ పోలీసుల చర్యలపై తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. 'వారి అభిప్రాయం ప్రకారం, బాబ్రీ మసీదును కూల్చివేసి ఉండకూడదు. అది వారి వ్యక్తిగత అభిప్రాయం. అది దేశవ్యతిరేక చర్య ఎలా అవుతుంది? ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ భిన్నాభిప్రాయాలు కలిగిఉండే హక్కు ఉంది'అని జస్టిస్ జమ్దార్ వ్యాఖ్యానించారు. కేవలం ఊహాజనిత భయాల ఆధారంగా పౌరుల ప్రాథమిక హక్కులను హరించలేమని, నగర బహిష్కరణ అనేది అసాధారణ చర్యఅని, ఇటువంటి సందర్భాల్లో చట్టపరమైన నిబంధనలను కచ్చితంగా పాటించాలని న్యాయస్థానం తేల్చిచెప్పింది.

మళ్లీ పోరాటానికి సిద్ధం

జంతర్‌మంతర్ అరెస్టులపై కేసులు ఇంకా ఎత్తివేయలేదు: సిజెపి సౌరవ్‌దాస్

న్యూఢిల్లీ,జులై 29: నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై చేపట్టిన ఉద్యమాన్ని విరమించిన కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) మరోసారి కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేసింది. శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌లను ఉపసంహరిస్తామని ఇచ్చిన హామీ అమలు కాకపోతే దేశవ్యాప్తంగా మళ్లీ ఆందోళనలు ప్రారంభిస్తామని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలను సాకుగా చూపుతూ ప్రభుత్వం హామీల నుంచి తప్పించుకోవాలని చూస్తోందని ఆరోపించింది. నిరసనకారులపై కొత్త ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయబోమని, ఇప్పటికే నమోదైన కేసులను కూడా ఉపసంహరిస్తామని ప్రభుత్వం బహిరంగంగా హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే ఇప్పుడు కేసు కోర్టు పరిధిలో ఉందని చెబుతూ ఆ హామీ అమలును వాయిదా వేస్తోందని విమర్శించారు. సుప్రీంకోర్టు శాంతియుత నిరసనకారులపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేసిందని సౌరవ్ దాస్ చెప్పారు. నేరచరిత్ర లేని నిర్బంధితులను విడుదల చేయాలని కూడా ఆదేశించిందన్నారు. ఇప్పటికే నమోదైన ఎఫ్‌ఐఆర్‌లపై దర్యాప్తు కొనసాగించవచ్చని కోర్టు పేర్కొన్న విషయాన్ని ప్రభుత్వం తనకు అనుకూలంగా మార్చుకుంటోందని ఆరోపించారు. మంగళవారంలోగా ఈ విషయంపై కేంద్రం నుంచి లిఖితపూర్వక హామీ వస్తుందని ఆశించామని, కానీ అలాంటి సమాచారం ఇప్పటివరకు అందలేదని సౌరవ్ దాస్ తెలిపారు.

పేపర్ లీక్‌కేసులో కీలక నిందితుడి అరెస్టు

పరీక్షకు ముందే రూ.1.2 కోట్లు వసూలు చేసినట్లు వెల్లడి

పాట్నా,జులై 29: బీహార్‌ను కుదిపేసిన బీపీఎస్సీ టీచర్ రిక్రూట్‌మెంట్ (టీఆర్‌ఈ3) పేపర్ లీక్ కేసులో ఆర్థిక నేరాల విభాగం (ఈవోయూ) దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్ మనీశ్ కుమార్‌ను అధికారులు అరెస్ట్ చేశారు. పరీక్షకు ముందే 30 మంది అభ్యర్థులకు ప్రశ్నాపత్రాలు అందించి, సుమారు రూ.1.2 కోట్లు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఈవోయూ అధికారుల కథనం ప్రకారం డాక్టర్ మనీశ్ కుమార్ ఎలాంటి ఆనవాళ్లు లేకుండా సీల్డ్ ప్రశ్నాపత్రాల బాక్సులను తెరిచి, తిరిగి మూసివేయడంలో నైపుణ్యం సంపాదించాడు.

కేసుల ప్రస్తావన సమయంలో లైవ్‌స్ట్రీమ్ ఆడియో మ్యూట్ చేయాలి

సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, జులై 29: భారత ప్రధాన న్యాయమూర్తి ఎదుట కొత్త విషయాల ప్రస్తావనల సమయంలో, తన లైవ్ వీడియో ఫీడ్ ఆడియోను మ్యూట్ చేయాలని సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. దీనివల్ల, అత్యవసరంగా కేసులను విచారణకు తీసుకోవాలని న్యాయవాదులు చేసే అభ్యర్థనలు, కోర్టు ఇచ్చే మౌఖిక సమాధానాలు ప్రజలకు, మీడియాకు వినిపించకుండా నిరోధించవచ్చు. అత్యవసర విషయాల ప్రస్తావన అనేది న్యాయపరమైన ప్రక్రియ కాదని, అది ఒక 'పరిపాలన్నా చర్య' అని, అందువల్ల దానిని ప్రసారం చేయకూడదని భారత ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించిన కొద్ది రోజులకే ఈ నిర్ణయం వెలువడింది. ఈ తాజా ఆదేశం, కొత్త కేసుల ప్రస్తావనల సమయంలో జరిగే చర్చలు ఇకపై కోర్టు లైవ్‌స్ట్రీమ్‌లో వినిపించకుండా చేయనున్నారు. ఈ ఆదేశంతో పాటు కోర్టు వివరణాత్మక బహిరంగ వివరణను జారీ చేయనప్పటికీ, ఇటువంటి పరిపాలనాపరమైన చర్యలను నివేదించదగిన న్యాయపరమైన కార్యకలాపాలుగా పరిగణించకూడదని ప్రధాన న్యాయమూర్తి గతంలో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలోనే ఈ చర్య తీసుకున్నారు.

యేడేళ్లు నివసిస్తే చాలు..అమెరికాలో గ్రీన్‌కార్డు..

కొత్తబిల్లును ప్రవేశపెట్టిన డెమొక్రాట్ సెనేటర్

వాషింగ్టన్,జులై 29: అమెరికాలో శాశ్వత నివాసం (గ్రీన్ కార్డ్) కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న లక్షలాది మంది వలసదారులకు, ముఖ్యంగా భారతీయులకు ఆశలు రేకెత్తించే ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. సుదీర్ఘకాలంగా దేశంలో నివసిస్తున్న వారికి గ్రీన్ కార్డ్ పొందేందుకు వీలు కల్పించే ఒక కొత్త బిల్లును అమెరికా సెనేట్‌లో తిరిగి ప్రవేశపెట్టారు. ఇది చట్టంగా మారితే, ముఖ్యంగా హెచ్1బీ వీసాలపై ఉండి గ్రీన్ కార్డ్ బ్యాక్‌లాగ్‌లో చిక్కుకుపోయిన భారతీయ నిపుణులకు భారీ ఊరట లభించే అవకాశం ఉంది.

కాలిఫోర్నియాకు చెందిన డెమొక్రటిక్ సెనేటర్ అలెక్స్ పడిల్లా, రిన్యూయింగ్ ఇమ్మిగ్రేషన్ ప్రొవిజన్స్ ఆఫ్ ది ఇమ్మిగ్రేషన్ యాక్ట్ ఆఫ్ 1929 పేరుతో ఈ బిల్లును మరోసారి సెనేట్ ముందుకు తెచ్చారు. అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ నేషనాలిటీ చట్టంలోని సెక్షన్ 249లో ఉన్న రిజిస్ట్రీ అనే నిబంధనను సవరించడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం. ప్రస్తుత చట్టం ప్రకారం 1972 జనవరి 1కు ముందు అమెరికాలోకి ప్రవేశించిన వారు మాత్రమే ఈ నిబంధన కింద గ్రీన్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. గత 50ఏళ్లుగా ఈ తేదీ మారకపోవడంతో ఈ మార్గం దాదాపు నిరుపయోగంగా మారింది. తాజా ప్రతిపాదన ప్రకారం ఈ పాత తేదీని తొలగించి, దాని స్థానంలో సరికొత్త నిబంధనను తీసుకువస్తారు. దీని ప్రకారం ఎలాంటి నేరచరిత్ర లేకుండా, చట్టపరమైన ఇతర షరతులను సంతృప్తి పరిచే వలసదారులు, దరఖాస్తు చేసుకునే నాటికి కనీసం ఏడు సంవత్సరాలుగా నిరంతరాయంగా అమెరికాలో నివసిస్తూ ఉంటే గ్రీన్ కార్డ్‌కు అర్హులవుతారు.

ఎమర్జెన్సీలో నన్ను కూడా పలుసార్లు అరెస్టులు చేసారు

రాజ్యసభలో విపక్ష సభ్యుల విమర్శలపై మంత్రి జెపి నడ్డా కౌంటర్

న్యూఢిల్లీ,జులై 29: రాజ్యసభలో బుధవారం ఢిల్లీ పోలీసుల చర్యలపై అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. కేంద్ర మంత్రి జెపినడ్డా మాట్లాడుతూ, తాను కూడా ఒకప్పుడు విద్యార్థి నాయకుడినేనని గుర్తుచేశారు. ఎమర్జెన్సీ కాలంలో పలుమార్లు అరెస్టయ్యానని చెప్పారు. చట్టాన్ని అమలు చేయడం పోలీసుల బాధ్యతని పేర్కొన్నారు. ఉద్యమాల్లో పాల్గొనాలనుకునే విద్యార్థులు పోలీసు చర్యలను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలతో ప్రతిపక్ష సభ్యులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో నినాదాలు కొనసాగడంతో గందరగోళం నెలకొంది. చివరకు ఛైర్మన్ సభను మధ్యాహ్నం వరకు వాయిదా వేశారు. ఢిల్లీలోని సీపీఎం కేంద్ర కార్యాలయంలోకి పోలీసులు వెళ్లి మాజీ జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షురాలు ఐషే ఘోష్‌ను అరెస్టు చేసేందుకు ప్రయత్నించిన ఘటనను ప్రతిపక్ష సభ్యులు ప్రస్తావించారు. ఈ సందర్భంగా సభలో ఆందోళన, నినాదాలు కొనసాగాయి. దీనిపై స్పందించిన రాజ్యసభ సభా నేత, కేంద్ర మంత్రి జేపీ నడ్డా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఉద్యమాలు చేయాలనుకునే ఏ విద్యార్థైనా పోలీసులను ఎదుర్కోవాల్సిందే అని అన్నారు. సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఈ అంశాన్ని సభ దృష్టికి తీసుకొచ్చారు. జంతర్‌మంతర్‌లో జరిగిన విద్యార్థుల నిరసనలో పాల్గొనడమే ఐషే ఘోష్ చేసిన తప్పని పేర్కొన్నారు. 2020-21 కేసులను చూపిస్తూ పోలీసులు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే జాతీయ రాజకీయ పార్టీ కార్యాలయంలోకి వెళ్లడం ఆందోళన కలిగించే విషయమని అన్నారు. ఈ ఘటనపై కేంద్ర హోంమంత్రి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కూడా దీన్ని ఖండిస్తూ, పార్టీ కార్యాలయంలోకి వెళ్లి నాయకురాలిని అరెస్టు చేయడానికి ప్రయత్నించడం సిగ్గుచేటని అన్నారు. సంబంధిత పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

వయస్సు నిర్ధారణకు ఆధార్ ప్రమాణం కాదు: ఛత్తీస్‌గఢ్ హైకోర్టు

రాయ్‌పూర్, జులై 29: మోటారు ప్రమాద పరిహారం క్లెయిమ్‌ల కేసుల్లో బాధితుల లేదా క్లెయిమ్‌దారుల వయస్సును నిర్ధారించడానికి ఆధార్ కార్డును ఒక నమ్మదగిన అధికారిక పత్రంగా పరిగణించలేమని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు స్పష్టం చేసింది. వయస్సు నిర్ధారణకు సంబంధించి కేవలం ఆధార్ కార్డుపై ఉన్న వివరాలను మాత్రమే ప్రామాణికంగా తీసుకోలేమని ఉన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ మేరకు జస్టిస్ సంజయ్ కె. అగర్వాల్‌తో కూడిన న్యాయస్థానం ఒక మోటారు వాహన ప్రమాద బీమా కేసు విచారణ సందర్భంగా ఈ సంచలన తీర్పును వెలువరించింది.

తమిళనాడు విద్యార్థులకు చికెన్ బిర్యానీ!

చెన్నై,జులై 29: పాఠశాల విద్యార్థులకు మరింత పౌష్టికాహారం అందించడంతో పాటు భోజనాన్ని ఆసక్తికరంగా మార్చేందుకు తమిళనాడులోని విజయ్ ప్రభుత్వం ఒక కీలక ప్రతిపాదనను పరిశీలిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వారానికి ఒకసారి చికెన్ బిర్యానీ అందించే అంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా యోచిస్తోంది. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే, దేశంలోనే సుదీర్ఘకాలంగా అమలవుతున్న ఈ పథకంలో ఇదొక ముఖ్యమైన మార్పు అవుతుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

జపాన్ భూకంపంలో 13 మంది మృతి, వందల మందికి గాయాలు

టోక్యో,జులై 29: జపాన్ నైరుతి ప్రాంతంలోని క్యుషూ ద్వీపాన్ని మంగళవారం సాయంత్రం సంభవించిన 7.1 తీవ్రత గల భారీ భూకంపం అతలాకుతలం చేసింది. ఈ ఘటనలో ఇప్పటివరకు కనీసం 13 మంది మృతి చెందగా, వందల మంది గాయపడ్డారు. పలువురు ఇంకా శిథిలాల కింద చిక్కుకుని ఉండడంతో సహాయక బృందాలు రాత్రంతా సహాయక చర్యలు కొనసాగించాయి. ఈ విషయాన్ని జపాన్ ప్రధాని సనాయే తకైచి బుధవారం వెల్లడించారు. స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం సాయంత్రం 4:27 గంటలకు కుమమోటో ప్రాంతంలో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 7.1గా నమోదైంది.

బస్సుడ్రైవర్ ఇంట్లో పెద్ద ఎత్తున బంగారం, నోట్ల కట్టలు

బీర్‌భూమ్(బెంగాల్),జులై 29: పశ్చిమబెంగాల్‌లో బస్సు డ్రైవర్‌ఇంట్లో పెద్దఎత్తున నోట్ల కట్టలు, బంగారం బిస్కెట్లు బయటపడ్డాయి. ఇసుక, క్వారీ మాఫియా పై దర్యాప్తులో భాగంగా చేపట్టిన సోదాల్లో ఈ సొమ్మును పోలీసులు గుర్తించారు. ఇప్పటివరకు రూ.5.5 కోట్ల నగదు, 15 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. బీర్‌భూమ్ జిల్లాకు చెందిన మీనా మండల్ నివాసంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇసుక మాఫియాపై దర్యాప్తులో భాగంగా పక్కా సమాచారంతో ఈ సోదాలు జరిపారు. ఈ క్రమంలోనే అతడి ఇంట్లో భారీగా అక్రమ నగదు బయటపడింది.

ఒక అధికారికి ఇకపై ఒకే ప్రభుత్వ కారు

న్యూఢిల్లీ,జులై 29: ప్రభుత్వ వనరుల దుర్వినియోగం, వృథా ఖర్చులకు కళ్లెం వేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై అర్హులైన ఒక అధికారికి ఒకే ప్రభుత్వవాహనాన్ని కేటాయించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని వ్యయ విభాగం ఒక అధికారికిఒకే కారు విధానాన్ని అమల్లోకి తెస్తూ అధికారిక మెమో జారీ చేసింది. ప్రభుత్వ వాహనాలను కేవలం అధికారిక ప్రయోజనాల కోసమే వినియోగించేలా చూడటమే ఈ చర్య ముఖ్య ఉద్దేశం.

మోస్ట్ వాంటెడ్ జాబితాలో టెలిగ్రామ్ సిఇఒ పావెల్ దురోవ్

మాస్కో,జులై 29: టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు, సీఈఓ పావెల్ దురోవ్‌పై రష్యా తీవ్ర ఆరోపణలు చేసింది. ఉక్రెయిన్ నిఘా సంస్థలు టెలిగ్రామ్‌ను ఉపయోగించి రష్యాలో దాడులు నిర్వహించేందుకు యువకులను నియమించుకున్నప్పటికీ ఆ కార్యకలాపాలను అడ్డుకోకుండా ఉగ్రవాద చర్యలకు సహకరించారని రష్యా ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ ఆరోపించింది. ఈ కేసును మరింత తీవ్రతరం చేసిన రష్యాదర్యాప్తు సంస్థలు దురోవ్‌పై ఉగ్రవాద కార్యకలాపాలకు సహకరించినట్లు క్రిమినల్ కేసు నమోదు చేసి, అంతర్జాతీయ వాంటెడ్ జాబితాలో చేర్చినట్లు పేర్కొన్నాయి.

చైనాలో ఒక్కనెలలోనే 79 వేల కరోనాకేసులు

బీజింగ్,జులై 29: చైనాలో మరోసారి కోవిడ్19 కేసులు పెరుగుతుండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. చైనా వ్యాధి నియంత్రణ, నివారణ కేంద్రం వివరాల ప్రకారం జూలై 13 నుంచి 19వరకు నిర్వహించిన పరీక్షల్లో కోవిడ్19 పాజిటివిటీ రేటు 16.3శాతానికి చేరుకుంది. ఇది అంతకుముందు వారంతో పోలిస్తే 4.3 శాతం పాయింట్లు ఎక్కువ. అదే సమయంలో ఫ్లూ పాజిటివిటీ రేటు 12.6 శాతంగా నమోదైంది. జూన్ 2026లో దేశవ్యాప్తంగా 79 వేల కొత్త కరోనా కేసులు నమోదవగా, వాటిలో 130 మంది పరిస్థితి విషమంగా మారింది.

పార్టీ లైన్ దాటి మాట్లాడొద్దు

• టిడిపి నేతలకు ఎపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

విజయవాడ, జూలై 29 ప్రభాతవార్త ప్రతినిధి: టిడిపి నేతలు కొంతమంది చేస్తున్న వ్యాఖ్యలతో కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. అందువల్ల నేతలు పార్టీ లైన్ దాటి మాట్లాడవద్దని ఆదేశించారు. ఎవరైనా గీత దాటితే మాత్రం చర్యలు చాలా కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. కూటమి ధర్మాన్ని అందరు తప్పనిసరిగా పాటించాలని దిశానిర్దేశం చేశారు. ఈ విషయాన్ని అందరు దృష్టిలో పెట్టుకోవాలని స్పష్టం చేశారు. బుధవారం అమరావతిలోని టిడిపి కార్యాలయంలో పల్లా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ, బోండా ఉమామహేశ్వరరావు ఇచ్చిన వివరణతో హైకమాండ్ సంతృప్తి చెందిందని తెలిపారు. పార్టీ లైన్ దాటి మాట్లాడిన వారిపై చర్యలు మాత్రం తప్పవని హెచ్చరించారు. పార్టీ నియమావళికి అందరు కట్టుబడి ఉండాలని ఆదేశించారు. వైసిపి నేతలతో టిడిపి నేతలు ఎవరు వేదిక పంచుకోవద్దని హుకుం జారీ చేశారు. ఎక్కడైనా నివాళి అర్పించాల్సి వేస్తే వెళ్లి రావాలని సూచించారు. టిడిపి అధినేత చంద్రబాబు ఈ విషయంలో చాలా సీరియస్గా ఉన్నారని తెలిపారు. అందరు ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

రాష్ట్ర పునర్ నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రయత్నం: మంత్రి నిమ్మల

విజయవాడ, జూలై 29 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర పునర్ నిర్మాణం కోసం కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. రాష్ట్రం కోసం నాడు కూటమి ఏర్పడిందని పేర్కొన్నారు. టిడిపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గొడ్డలి పార్టీ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని ధ్వజమెత్తారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు అందరు కూడా అధినేతకు మద్దతు ఇవ్వాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలకు, లైన్కు కట్టుబడి పని చేయాలని ఆదేశించారు. మనకు వచ్చిన గౌరవం, అధికారం పార్టీ ద్వారా, చంద్రబాబు ద్వారా వచ్చిందని నేతలు అందరు తెలుసుకోవాలని తెలిపారు. పార్టీ లైన్ దాటిన వారిని, పార్టీకి నష్టం కలిగించే వారు ఎవరైనా కూడా ఎంతటివారు అయినా కూడా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా బాధ్యతాయుతంగా ఉండాలని మంత్రి నిమ్మల సూచించారు. కూటమి ధర్మాన్ని పాటించకపోతే మాత్రం ఎంతటివారైనా కూడా ఉపేక్షించేది లేదని సీఎం చంద్రబాబు హెచ్చరించారని అన్నారు. కొంతమంది నేతలను పిలిపించి మాట్లాడుతున్నామని తెలిపారు. వ్యక్తుల కంటే పార్టీ ముఖ్యమనేది అందరు తెలుసుకోవాలని స్పష్టం చేశారు. పార్టీకి, కూటమికి ఎవరైనా విఘాతం కలిగిస్తే మాత్రం హై కమాండ్ ఊరుకోదని హెచ్చరించారు. అంతర్గత ప్రజాస్వామ్యం ఉందని ఎవరైనా మాట్లాడితే మాత్రం ఉపేక్షించవద్దని చంద్రబాబు స్పష్టం చేశారని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

కంగనా రనౌత్ వ్యాఖ్యలు సరికాదు

• సిపిఐ క్రమశిక్షణా సంఘం చైర్మన్ కె. నారాయణ

విజయవాడ, జూలై 29 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రదర్శనకారుల మనోభావాలను దెబ్బతీసిన తన గత 'బొద్దింకల్లు వ్యాఖ్యల విషయంలో సుప్రీంకోర్టు ఛీఫ్ జస్టిస్ సూర్యకాంత్ సానుకూలంగా స్పందించడం అభినందనీయమని సిపిఐ జాతీయ సమితి క్రమశిక్షణా సంఘం చైర్మన్ డాక్టర్ కె. నారాయణ వ్యాఖ్యానించారు. ఆందోళనకారులపై చేసిన వ్యాఖ్యల వల్ల కలిగిన బాధను గుర్తించి, వాటిని సరిదిద్దుకునే వైఖరి న్యాయవ్యవస్థ ఔన్నత్యాన్ని ప్రతిబింబి స్తుందన్నారు. జెన్ జెడ్ యువత, మహిళలను ఉద్దేశించి కంగనా రనౌత్ చేసిన అవమానకరమైన, అభ్యంతరకరమైన వ్యాఖ్యలు ఏమాత్రం సమర్థనీయమైనవి కావని నారాయణ పేర్కొన్నారు. ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తులు తమ అభిప్రాయాలను వ్యక్తంచేసే సమయంలో బాధ్యతాయుతంగా, సంయ మనంతో వ్యవహరించాలి. ఇటువంటి వ్యాఖ్యలు సమాజంలో విభేదాలను మరింత పెంచడమే కాకుండా ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తాయన్నారు. కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. ఆమె అవమానించిన యువతకు, మహిళలకు బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

కరవు మండలాలు ప్రకటించాలి

• సిఎంకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య లేఖ

అనంతపురం, జూలై 29 ప్రభాతవార్త బ్యూరో: ఆంధ్రప్రదేశ్లో ఎల్నినో ప్రభావంతో ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని వర్షాభావ మండలాలను తక్షణమే కరువు మండలాలుగా ప్రకటించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు బుధవారం లేఖ రాశారు. సాధారణంగా 225 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా కేవలం 104 మి.మీ. మాత్రమే కురిసిందని, రాష్ట్రవ్యాప్తంగా 56 శాతం వర్షపాతం లోటు నమోదైందని లేఖలో పేర్కొన్నారు. ఖరీఫ్లో 30.84 లక్షల హెక్టార్ల సాధారణ సాగుకు బదులుగా ఇప్పటివరకు కేవలం 16.35 లక్షల హెక్టార్లలో మాత్రమే సాగు జరిగిందని, వరి, పత్తి, వేరుశనగ, కంది, మొక్కజొన్న, టమాటా తదితర పంటలు ఎండిపోతుండగా ఉద్యాన పంటలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయని వివరించారు. ప్రత్యామ్నాయ పంట విత్తనాలను రైతులకు 100శాతం ఉచితంగా పంపిణీ చేయాలని, అన్ని పంటలకు ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే భరించాలని, పంటల బీమా గడువును ఆగస్టు 31 వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పంట రుణాలను మాఫీ చేయాలని కోరారు. ఉపాధి హామీ పనులు వెంటనే ప్రారంభించడం, పశుగ్రాసం, మంచినీటి సరఫరా కల్పించడం, వ్యవసాయ ఇన్పుట్ల ధరలు తగ్గించడం, పొగాకు రైతులకు మద్దతు నిధి, రొయ్యలకు కనీస మద్దతు ధర నిర్ణయించడం, ఎరువుల యాప్ను రద్దు చేయడం వంటి 14 ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం అత్యవసరంగా అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తన లేఖలో కోరారు.

ఎర్రచందనం స్మగ్లర్కు ఐదేళ్ల జైలు

తిరుపతి, జూలై 29 ప్రభాతవార్త ప్రతినిధి: ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లర్కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఎడిజె న్యాయస్థానం న్యాయమూర్తి నరసింహమూర్తి బుధవారం తీర్పు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం కఠిన చర్యలు అమలు చేస్తోంది. 2019 సంవత్సరంలో కేసులో ముద్దాయి తమిళనాడు తిరువన్నామలై జిల్లా పోలూరు తాలూకా పాదిరి గ్రామానికి చెందినదొరసామి ఏలుమలై ఎర్రచందనం దుంగలతో పట్టుబడ్డాడు. ఇతనిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లర్కు ఐదేళ్ల జైలు శిక్షతో బాటు రూ.6లక్షలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

విద్యుత్ ఉత్పత్తిలో రాజీ లేదు

• పూర్తి సామర్థ్యంతో యూనిట్ల నిర్వహణ.. పిఎల్ఎఫ్ పెంపు • 10 రోజుల బొగ్గు నిల్వలు, ఆర్అండ్ఎం పనులు వేగవంతం • ఎపి జెన్కో ఎండి ఎస్.నాగలక్ష్మి

విజయవాడ, జూలై 29 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర ప్రజలకు 24 గంటల పాటు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించాలంటే థర్మల్ విద్యుత్ కేంద్రాలు పూర్తి సామర్థ్యంతో పనిచేయడం అత్యంత కీలకమని ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపి జెన్కో) మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.నాగలక్ష్మి స్పష్టం చేశారు. విద్యుత్ డిమాండ్కు అనుగుణంగా అన్ని ఉత్పత్తి యూనిట్లను గరిష్ఠ సామర్థ్యంతో నిర్వహిస్తూ రాష్ట్ర గ్రిడ్కు నిరంతర విద్యుత్ అందించేందుకు అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని ఆదేశించారు. బుధవారం విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నంలో ఉన్న డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (టిటిపిఎస్)ను థర్మల్ డైరెక్టర్ అశోక్ కుమార్ రెడ్డితో కలసి ఆమె క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు, బొగ్గు నిర్వహణ వ్యవస్థ, బాయిలర్లు, టర్బైన్లు, స్విచ్యార్డులు, నిర్వహణ ప్రమాణాలు, భద్రతా ఏర్పాట్లు, పర్యావరణ పరిరక్షణ చర్యలను పరిశీలించిన అనంతరం ప్లాంట్ పనితీరుపై ఉన్నతాధికారులతో ఎండి సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పిఎల్ఎఫ్)ను మరింత పెంచడంతో పాటు ముందస్తు నిర్వహణ చర్యలను పటిష్టం చేయాలని ఆదేశించారు. ట్రిప్పింగ్లు, సాంకేతిక లోపాలు, బ్రేక్డౌన్లు తగ్గించేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, హీట్రేట్ను మెరుగుపరిచి ఇంధన వినియోగ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలని సూచించారు. వార్మట్ డివిసి డిసిఎస్ వ్యవస్థ ఆధునికరించటం యూనిట్4 జనరేటర్, బాయిలర్ పనులను పరిశీలించిన నాగలక్ష్మి, నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. సాంకేతిక లేదా పరిపాలనా సమస్యలు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో కనీసం 10 రోజుల అవసరాలకు సరిపడా బొగ్గు నిల్వలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బొగ్గు సరఫరా సంస్థలు, రైల్వే శాఖతో నిరంతర సమన్వయం కొనసాగించాలని సూచించారు. ఎల్నినో పరిస్థితుల కారణంగా విద్యుత్ వినియోగం మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్న ఎండి, పెరుగుతున్న డిమాండ్కు అనుగుణంగా అన్ని యూనిట్లలో స్థిరమైన విద్యుత్ ఉత్పత్తి కొనసాగించేలా అధికారులు, సాంకేతిక సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి, ప్రతి రైతుకు, ప్రతి పరిశ్రమకు నిరంతర నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఏపీజెన్కో పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని నాగలక్ష్మి తెలిపారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపు మరింత సులభతరం

• యుపిఐ యాప్లతో నేరుగా చెల్లించే అవకాశం • ఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

తిరుపతి, జూలై 29 ప్రభాతవార్త ప్రతినిధి: విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పిడిసిఎల్) కృషి చేస్తోంది. వినియోగదారులు సులభంగా విద్యుత్తు బిల్లును చెల్లించే ప్రక్రియను మరింత సరళతరం చేసింది. ఈ ప్రక్రియలో భాగంగానే యూపీఐ యాప్ల నుండి నేరుగా విద్యుత్ బిల్లులను చెల్లించే విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఎపిఎస్పిడిసిఎల్లో ఇప్పటి వరకు అధికారిక వెబ్సైట్, మొబైల్ యాప్, డైనమిక్ క్యూ ఆర్ కోడ్, వాట్సాప్ గవర్నెన్స్ (మనమిత్ర) ద్వారా మాత్రమే విద్యుత్ బిల్లులను చెల్లించేందుకు అవకాశం ఉండేది. అయితే వినియోగదారుల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఫోన్ పే, పేటీఎం, గూగుల్ పే, అమెజాన్ పే తదితర యూపిఐ యాప్ల నుండి నేరుగా బిల్లుల చెల్లింపు ప్రక్రియ ద్వారా వేగవంతమైన, సురక్షితమైన, పారదర్శకమైన చెల్లింపు వ్యవస్థను అమలు చేస్తోంది. యూపిఐ యాప్ల ద్వారా వినియోగదారులు కొన్ని క్షణాల్లో విద్యుత్ బిల్లులను సులభంగా చెల్లించే అవకాశం ఏర్పడింది. సంస్థ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో డిజిటల్ చెల్లింపులను మరింత ప్రోత్సహించే దిశగా సంస్థ చర్యలు చేపట్టడం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయాల (ఇఆర్ఒ)లో కూడా డిజిటల్ చెల్లింపులకే ప్రాధాన్యతనివ్వడం జరుగుతోంది. నగదు లావాదేవీలను పూర్తిస్థాయిలో తగ్గించేందుకు వీలుగా విద్యుత్తు బిల్లు వసూళ్ల కేంద్రాలను మూసివేసే ప్రక్రియను వేగవంతం చేస్తోంది.

విద్యుత్ బిల్లుల చెల్లింపు మరింత సులభం: విద్యుత్ బిల్లుల ఆన్లైన్ చెల్లింపుల ప్రక్రియను మరింత సులభతరంగా తీర్చిదిద్దాం. ఆన్లైన్ చెల్లింపులపై వినియోగదారుల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టాం. యూపీఐ యాప్ల నుండి నేరుగా సామాన్యులు కూడా సులభంగా బిల్లులను చెల్లించే అవకాశం ఏర్పడడంతో డిజిటల్ చెల్లింపులు త్వరలోనే వంద శాతానికి చేరుకుంటాయి. డిజిటల్ చెల్లింపుల శాతాన్ని మెరుగుపరిచేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే దశలవారీగా బిల్లు వసూళ్ల కేంద్రాలను మూసివేస్తాం. డిజిటల్ చెల్లింపుల సందర్భంగా గుర్తు తెలియని లింకులు, సందేశాలు లేదా నకిలీ యాప్లను నమ్మి మోసపోవద్దు. సురక్షితమైన, వేగవంతమైన, పారదర్శకమైన బిల్లుల చెల్లింపు కోసం వినియోగదారులు డిజిటల్ విధానానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పిడిపిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

పోలవరం పూర్తి కోసం యజ్ఞం చేస్తున్నారు: భువనేశ్వరి

కుప్పం, జూలై 29 ప్రభాతవార్త: రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లేది సిఎం చంద్రబాబు నాయుడు మాత్రమేనని ఆయన సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. బుధవారం కుప్పం మండలం వసనాడు గ్రామంలో ఆమె మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ ఐదేళ్ల వైసిపి పాలనలో ఖజానా ఖాళీ చేశారని పేర్కొన్నారు. అలాగే వారి పాలనలో రాష్ట్ర ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. వైసిపి పాలనలో ఏ అభివృద్ధి జరిగిందో ప్రజలకు తెలుసన్నారు. చివరకు రోడ్లపై ఏర్పడ్డ గుంతలకు మట్టి సైతం వేసి పూడ్చలేని దుస్థితి అప్పట్లో ఉండేది అన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రం వెనక్కి వెళ్లిపోయిందని పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రం కోసం ఆలోచిస్తున్నారని, ప్రజలు, పిల్లల భవిష్యత్తుపై పనిచేస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబును నమ్మి ప్రజలు ఓట్లేసారని పేర్కొన్నారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పూర్తికి సిఎం చంద్రబాబు యజ్ఞం చేస్తున్నారన్నారు. ఐదేళ్ల వైసిపి పాలనలో పోలవరం ప్రాజెక్టును పట్టించుకోక నిధులను వారి సొంత అవసరాలకు వాడుకున్నారని పేర్కొన్నారు. ఆచరణలో సాధ్యమయ్యే హామీలను మాత్రమే సిఎం చంద్రబాబు ఇస్తారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను ఎగ్గొట్టరని పేర్కొన్నారు. మహిళలు కష్టపడి ఆర్థికంగా పైకి ఎదగాలని సూచించారు. పిఫోర్ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా తమ గ్రామం తమ పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారామ్, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్ కుమార్, సిఎం పిఎ శ్రీకాంత్, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, క్లస్టర్ ఇంచార్జ్ శ్రీనివాసులు రెస్కో చైర్మన్ ప్రతాప్, ఎఎంసి చైర్మన్ జిఎం రాజు, ఏరియా ఆసుపత్రి వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, స్థానిక నేతలు మునికృష్ణ, వల్లెప్ప, సికె సుబ్రహ్మణ్యం, బాబు, రెస్కో మణి తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 3 నుంచి డిపిటి టీకా కార్యక్రమం

• పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక శిబిరాలు

• రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండియన్

విజయవాడ, జూలై 29 ప్రభాతవార్త ప్రతినిధి: గొంతువాపు(డిఫ్తీరియా), కోరింత దగ్గు (పెర్టురిస్), ధనుర్వాతం (టెటానస్) వంటి ప్రాణాంతక బ్యాక్టీరియా వ్యాధుల నుంచి పిల్లలు, కౌమార దశ యువతకు సంపూర్ణ ఆరోగ్య రక్షణ కల్పించేందుకు ఆగస్టు 3 నుంచి 8 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక టీకా (డిపిటి, టిడి) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ జి. వీరపాండియన్ తెలిపారు. సాధారణ టీకా కార్యక్రమాల్లో టీకాలు వేసుకోలేకపోయిన పిల్లలకు ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా టీకాలు వేయడమే ప్రధాన ఉద్దేశమని ఆయన నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న అర్హులైన విద్యార్థులతో పాటు పాఠశాలలకు వెళ్లని అర్హులైన పిల్లలను కూడా గుర్తించి టీకాలు వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి మహిళా, శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్, పురపాలక శాఖలతో సమన్వయం చేసుకుని జిల్లా, మండల టాస్క్ఫోర్స్ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. తల్లిదండ్రులకు ముందుగానే టీకాలు వేసే తేదీల సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక పరిశీలకులను నియమించి కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించాలని డిఎంహెచ్ఒలు, డిఐఒలను కమీషనర్ ఆదేశించారు.

తిరుమల సమాచారం

గరుడునిపై మలయప్ప అభయం

తిరుమల, జూలై 29 ప్రభాతవార్త ప్రతినిధి: పవిత్రమైన గురుపౌర్ణమి ఘడియల్లో పున్నమివెలుగుల్లో బుధవారం రాత్రి మలయప్పస్వామి గరుడ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం నిత్య కైంకర్యాలు ముగించుకుని సహస్ర దీపాలంకరణసేవలో వయ్యారంగా పూజలందుకున్నారు. అక్కడ నుంచి బయలుదేరి వాహనమండపం చేరుకున్నారు. వాహన మండపం వద్ద ఆలయ అర్చకులు విశేష అలంకార భూషితుడైన మలయప్పను కొలువుదీర్చి వేదమంత్రాల నడుమ కర్పూర హారతులిచ్చారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణల మధ్య గరుడ వాహనం మెల్లగా ఆలయం ముందునుంచి కదులుతూ మాఢవీధుల్లో ఊరేగారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, బోర్డు సభ్యులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్గిరి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సర్వదర్శనానికి 18 గంటలు: తిరుమలేశుని దర్శనం కోసం భారీగా పెరిగిన భక్తులతో ఏడుకొండలు కిటకిటలాడుతున్నాయి. మంగళవారం ఉదయానికి వైకుంఠమ్2లో 31 కంపార్ట్మెంట్లు నిండిపోయాయి. శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి సుమారు 18 గంటల సమయం పడుతోంది. సోమవారం రాత్రివరకు 78 వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. హుండీ ఆదాయం 4.76 కోట్లు చేకూరింది. భక్తుల రద్దీ దృష్ట్యా దర్శనం కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది.

శాస్త్రోక్తంగా జీయర్ల చాతుర్మాస్యదీక్ష సంకల్పం

తిరుమల, జూలై 29 ప్రభాతవార్త ప్రతినిధి: వైష్ణవ సంప్రదాయకర్త రామానుజాచార్యుల పారంపర్యంలో చాతుర్మాసదీక్ష విశేషమైందని టిటిడి పెద్దజీయంగారు తెలిపారు. ఆషాఢ శుద్ధఏకాదశిన శ్రీమహావిష్ణువు యోగనిద్రలోకి వెళ్ళి తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశిన మేల్కొంటారు. ఈ నాలుగునెలల కాలాన్ని చాతుర్మాస్యం అంటారన్నారు. చాతుర్మాస్యదీక్షలో భాగంగా బుధవారం తిరుమలలోని పెద్దజీయర్స్వామి మఠంలో కలశ స్థాపన, కలశపూజ, విశ్వక్సేనారాదన, మేధినపూజ, మృత్సంగ్రహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తరువాత పుట్టమన్ను సేకరించి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం చాతుర్మాస సంకల్పం స్వీకరించారు. అక్కడ నుండి పెద్దజీయర్స్వామి మఠం వద్ద నుండి చిన్నజీయంగారు, శిష్య బృందంతో కలసి మంగళవాయిద్యాల నడుమ బయలుదేరి తొలుత వరాహస్వామిని, అక్కడ నుండి దేవదేవుని ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ మహద్వారం వద్ద టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర,ఆలయ అర్చకులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనానంతరం పెద్దజీయర్కు మేల్ఛాట్ వస్త్రాన్ని, చిన్నజీయర్కు నూలువస్త్రాన్ని బహుకరించారు. అలాగే టిటిడి ఇఒ,ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథంను జీయంగార్లు శాలువతో సన్మానించారు. శ్రావణ, భాద్రపద, ఆశ్వయుజ, కార్తీక పవిత్ర మాసాలలో ఆచార్య పురుషులు స్నాన, జప, హోమ, వ్రత దానాదులను నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, జీయంగార్లు పాల్గొన్నారు.

ఏకం క్షేత్రంలో వైభవంగా గురుపూర్ణిమ వేడుకలు

వరదయ్యపాలెం (తిరుపతి జిల్లా), జూలై 29 ప్రభాతవార్త: చెన్నై- తిరుపతి మధ్య ఉన్న పాలరాతి ఆలయమైన ఏకం క్షేత్రం, పవిత్ర గురు పూర్ణిమ సందర్భంగా రోజంతా ముక్తిగురు దర్శనాన్ని అందించింది. సూర్యాస్తమయం నాటికి, సుమారు 70వేల మంది ఈ ప్రాంగణంలో చేరుకున్నారు. ప్రతి ఒక్కరూ ముక్తి గురు శ్రీకృష్ణాజీ ముందు ఒక క్షణం నిలబడాలని, ఆయన చూపుతో లభించే ఇచ్ఛా సిద్ధి ఆశీర్వాదాల కోసం ఎదురుచూశారు. జార్ఖండ్, బీహార్, మహారాష్ట్ర వంటి సుదూర ప్రాంతాల నుండి ప్రత్యేక రైళ్లు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చిన భక్తులు తమ ప్రయాణ సమయాన్ని ఆరాధనగా మలచుకుని, యాత్ర పొడవునా మంత్రాలు జపించారు. కర్ణాటక, తమిళనాడు నుండి బస్సులు, ప్రైవేట్ వాహనాల నిరంతర తాకిడి కొనసాగింది. పేద, ధనిక అనే తేడా లేకుండా అందరూ ఉచితంగా దర్శనానికి తరలివచ్చారు. హైకోర్టు జడ్జి లక్ష్మణ రావు, నెల్లూరు జిల్లా జడ్జి శ్రీనివాస్, కృష్ణ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్రీనివాస రావు, సత్యవేడు నియోజకవర్గ టిడిపి ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ చక్రవర్తి, శ్రీ కాళహస్తీశ్వరస్వస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, కడూరు పిఎసిఎస్ ఛైర్మన్ ఆణిముత్యం నందాకిషోర్, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ మాజీ డోరేటర్ బొప్పన తిలక్ బాను, తెలుగుదేశం పార్టీ వరదయ్యపాలెం మండలం అధ్యక్షుడు పిన్నమనేని యుగంధర్ రెడ్డి, టిడిపి క్లస్టర్ ఇన్చార్జ్ పి.నిర్మల్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

నకిలీ వెబ్సైట్పై అప్రమత్తంగా ఉండాలి: టిటిడి

తిరుమల, జూలై 29 ప్రభాతవార్త ప్రతినిధి: ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనాల పేరుతో భక్తులను కొందరు మోసగాళ్ళు పలు రకాలుగా మోసం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని అలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని టిటిడి హెచ్చరించింది. సామాజిక మాధ్యమంలో వైరల్ అవుతున్న "టిటిదేవస్థానమ్. ఆన్లైన్" అనే నకిలీ వెబ్సైట్ను టిటిడి విజిలెన్స్ విభాగం గుర్తించింది. ఈ వెబ్ సైట్ టిటిడి అధికారిక ఆన్లైన్ సేవలను పోలి ఉండేలా రూపొందించిన కొందరు వ్యక్తులు భక్తులను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారు. టిటిడి అధికారిక వెబ్సైట్ మాదిరిలోనే ఉండేలా, కేవలం డొమైన్ పేరులో స్వల్ప మార్పులతో ఈ నకిలీ వెబ్సైట్ రూపొందించారు. ఇందులో ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు శ్రీవారి దర్శనం, సేవా టికెట్లు అందుబాటులో ఉన్నట్లు తప్పుడు సమాచారం ప్రదర్శిస్తున్నారు. దర్శన టికెట్ల పేరుతో భక్తుల నుంచి నగదు వసూలు చేయడం ద్వారా వారిని మోసం చేయడంతో పాటు, టిటిడి ప్రతిష్ఠను దెబ్బతీయడమే ఈ నకిలీ వెబ్సైట్ ఉద్దేశం. ఈ నకిలీ వెబ్సైట్ను వెంటనే తొలగించాలని సంబంధిత డొమైన్ ప్లాట్ఫారమ్ నిర్వాహకులకు టిటిడి ఇప్పటికే ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని తిరుమల టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరుగుతోంది. అంతేకాకుండా భవిష్యత్తులో కూడా భక్తులను మోసం చేసే వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. టిటిడి సేవలు, దర్శనం, వసతి, ఆన్లైన్ టికెట్లకు సంబంధించి భక్తులు అధికారిక టిటిడి వెబ్సైట్. అధికారిక మొబైల్ యాప్ ద్వారా మాత్రమే బుకింగ్లు చేసుకోవాలని భక్తులకు విజ్ఞప్తి చేసింది.సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్న అనధికారిక వెబ్సైట్లు, లింకులను నమ్మి మోసపోవద్దని కోరింది.

రాష్ట్ర వ్యాప్తంగా వైభవంగా గురు పూర్ణిమ వేడుకలు

విజయవాడ, జూలై 29 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో గురు పూర్ణిమ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. శిర్డీ సహా రాష్ట్రంలోని వివిధ ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. గురువును పూజించే రోజే గురు పూర్ణిమగా, వ్యాస పూర్ణిమగానూ గురు పూర్ణిమకు పేరు ఉంది. నారాయణుని స్వరూపమైన వ్యాసుడి పుట్టినరోజు సందర్భంగా గురు పూర్ణిమ జరుపుకున్నారు. ఆ నేపథ్యంలో సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తిశ్రద్ధలతో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయా పరిసర ప్రాంతాలు గురునామా స్మరణతో మార్మోగాయి. వివిధ సాయిబాబా ఆలయాల్లో కాకడ హారతి, అభిషేకాలు, పూజలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్రమంతటా సాయిమందిరాలో గురుపూర్ణిమ వేడుకలు ప్రత్యేకంగా నిర్వహించారు.

ఆగస్టు 4 నుంచి ఆడికృత్తిక మహోత్సవాలు

శ్రీకాళహస్తి, జూలై 29 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న కుమారస్వామి కొండపై ఆగస్టు 4 నుంచి ప్రారంభమయ్యే ఆడికృత్తి మహోత్సవాలను విజయవంతం చేయటానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేద్దామని ఆలయ ఇఓ బికె వెంకటేశులు పిలుపునిచ్చారు. చెంగల్వ రాయ స్వామి ధ్వజారోహణంతో ఆడికృత్తిక మహోత్సవాలు ప్రారంభమౌతాయని ఇఓ వివరించారు. డిఎస్పి నరసింహామూర్తి, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, సిఐ వెంకటేశ్, డిప్యూటి ఇఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, పౌరోహితులు అర్ధగిరి, ఎఇఓ లోకేష్బాబు, హేమామాలిని, డిఇఇ శ్రీనివాసు లురెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్, రవి, శ్రీహరి, తహశీల్దార్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షణలో సిఎమ్మార్ ప్రసాద వితరణ

విశాఖపట్నం, జులై 29, ప్రభాతవార్త

శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివారి గిరి ప్రదక్షిణ సందర్భంగా సి.ఎం.ఆర్. ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు. గురు పౌర్ణమి పురస్కరించుకుని ఆషాడ పౌర్ణమి సందర్భంగా సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి గిరి ప్రదక్షిణకు ప్రతి సంవత్సరం లక్షల సంఖ్యలో భక్తులు గిరి ప్రదక్షిణకు పాల్గొంటున్నారు. నడక మార్గంలో భక్తులకు అలసిని రాకుండా సి.ఎం.ఆర్. ఆధ్వర్యంలో కె.ఎం.ఆర్. కాలనీ, సీతమ్మధార శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయం వద్దా సాయంత్రం 3 గంటల నుండి ప్రసాద వితరణ కార్యక్రమాన్ని సి.ఎం.ఆర్. ఫౌండర్ అండ్ చైర్మన్ మావూరి వెంకటరమణ ఆధ్వర్యంలో పైన్ ఆపిల్ కేసరి, చక్కెర పొంగలి, వడతో పాటు చట్నీ, పెరుగు వడ, పుదీనా రైస్,మసాలా బఠాణి, పునుగులు చట్నీ, 3 రకాల జ్యూస్‌లు పైనాపిల్ సబ్జాజ్యూస్, మారేడు సబ్జా జ్యూస్, లెమన్ 8వ పేజీలో

భోగాపురం విమానాశ్రయంపై

క్రెడిట్ చోరీకి వైసీపీ ప్రయత్నం

ప్రాజెక్టును అడ్డుకున్నవారే ఇప్పుడు తమ ఘనతగా చెప్పుకోవడం విడ్డూరం -'ఎక్స్' వేదికగా విమర్శించిన మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా

విశాఖపట్నం, జూలై 29, ప్రభాతవార్త

ప్రతిష్ఠాత్మక భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ ప్రాజెక్టుపై క్రెడిట్ తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విమర్శించారు. ఎక్స్' వేదికగా ఆయన విడుదల చేసిన ప్రకటనలో, భోగాపురం విమానాశ్రయానికి ఊపిరి పోసింది, భూసేకరణ ప్రారంభించింది తెలుగుదేశం ప్రభుత్వమేనని పేర్కొన్నారు. అప్పట్లో విమానాశ్రయానికి భూములు ఇవ్వవద్దని, అవసరమైతే కోర్టులో కేసులు వేసి ప్రాజెక్టును అడ్డుకుందామని చెప్పిన వారే, ఇప్పుడు విమానాశ్రయం ప్రారంభానికి సిద్ధమవుతుండగా తామే ఈ ప్రాజెక్టు రూపకర్తలమని చెప్పుకోవడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని ఆరోపించారు. "ఎర్రబస్సు కూడా రాని భోగాపురానికి ఎయిర్‌బస్సా?", "విశాఖ విమానాశ్రయంలోనే రద్దీ లేదంటే మరో విమానాశ్రయం ఎందుకు?" అంటూ గతంలో విమర్శలు చేసిన నాయకులు, ఇప్పుడు అదే ప్రాజెక్టును తమ విజయంగా ప్రచారం చేసుకోవడం రాజకీయ అవకాశవాదానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్‌లో భాగంగా రూపుదిద్దుకున్న ప్రాజెక్టు అని, కేంద్రంలో టీడీపీ నేతలు అశోక్ గజపతిరాజు, రామ్మోహన్ నాయుడు పౌర విమానయాన శాఖ మంత్రులుగా ఉన్న సమయంలో ఈ ప్రాజెక్టు వేగం పుంజుకుందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోనే విమానాశ్రయ నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధమైందని పేర్కొన్నారు. అదేవిధంగా గూగుల్ డేటా సెంటర్, ఆర్సెలర్‌మిట్టల్ స్టీల్ ప్లాంట్ వంటి భారీ పెట్టుబడి ప్రాజెక్టులు కూడా చంద్రబాబు ప్రభుత్వ కృషి ఫలితమేనని, వాటిపై కూడా అనవసరంగా క్రెడిట్ తీసుకునే ప్రయత్నాలు చేయడం సరికాదని విమర్శించారు. భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానంగా ఏడు మాస్టర్ ప్లాన్ రోడ్లు నిర్మించామని, ఎలివేటెడ్ బీచ్ కారిడార్, ఫ్లైఓవర్లు వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు కూడా దశలవారీగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే ప్రాజెక్టుల విషయంలో వాస్తవాలను ప్రజల ముందుంచాలని, ఇతరుల కృషికి క్రెడిట్ తీసుకునే రాజకీయాలు మానుకోవాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గంటా శ్రీనివాసరావు సూచించారు.

భోగాపురం విమానాశ్రయానికి కేంద్రం గెజిట్

17 నుంచి పూర్తి స్థాయి కార్యకలాపాలు

విశాఖ సివిల్ ఎన్‌క్లేవ్‌లో షెడ్యూల్డ్ వాణిజ్య విమాన సర్వీసులకు 30 ఏళ్లపాటు విరామం - 'వీటీజెడ్' కోడ్ భోగాపురానికి బదిలీ

విశాఖపట్నం, జూలై 29, ప్రభాతవార్త

భోగాపురంలోని అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం కార్యకలాపాల ప్రారంభానికి కేంద్ర ప్రభుత్వం అధికారికంగా బుధవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. కేంద్ర పౌర విమానయాన శాఖ విడుదల చేసిన ఈ నోటిఫికేషన్ ప్రకారం, 2026 ఆగస్టు 17వ తేదీ అర్ధరాత్రి 12.01 గంటల నుంచి భోగాపురం విమానాశ్రయం పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించనుంది. గెజిట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం, భోగాపురం విమానాశ్రయం ప్రారంభమైన తర్వాత విశాఖపట్నం విమానాశ్రయం (ఐఎన్ఎస్ డేగా) సివిల్ ఎన్‌క్లేవ్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న షెడ్యూల్డ్ వాణిజ్య విమాన సర్వీసులను 30 సంవత్సరాలపాటు నిలిపివేయనున్నారు. అయితే, విశాఖ విమానాశ్రయం పూర్తిగా మూతపడదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. భారత నౌకాదళం, భారత వైమానిక దళం, ఇతర సాయుధ దళాలు, పోలీసు విభాగాల విమానాలు, జాతీయ అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ అవసరాల కోసం వినియోగించే విమానాలు, వీఐపీ ప్రత్యేక విమానాల సేవలు యథావిధిగా కొనసాగుతాయి. అలాగే షెడ్యూల్‌లో లేని (నాన్-షెడ్యూల్డ్) వాణిజ్య విమాన సర్వీసులు కూడా విశాఖ సివిల్ ఎన్‌క్లేవ్‌లో కొనసాగేందుకు అనుమతి ఉంటుందని గెజిట్‌లో పేర్కొన్నారు. మరో కీలక నిర్ణయంగా, ప్రస్తుతం విశాఖపట్నం విమానాశ్రయానికి ఉన్న అంతర్జాతీయ విమాన రవాణా కోడ్ 'వీటీజెడ్'ను ఆగస్టు 17 నుంచి భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి బదిలీ చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2016 జనవరి 27న భోగాపురం విమానాశ్రయానికి సైట్ క్లియరెన్స్ మంజూరు చేసిన సమయంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగానే ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ గెజిట్‌లో వెల్లడించింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభంతో ఉత్తరాంధ్రలో విమాన రవాణా, పర్యాటకం, పారిశ్రామిక పెట్టుబడులు, ఎగుమతులు, ఉపాధి అవకాశాలకు కొత్త ఊపు రానుందని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇది రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కీలక మైలురాయిగా నిలవనుందని భావిస్తున్నారు.

ప్రధానమంత్రి భోగాపురం పర్యటనను

సమన్వయంతో విజయవంతం చేయాలి

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టాలి -అధికారులు, ప్రజాప్రతినిధులను కోరిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

విశాఖ ప్రగతికి కృషి చేస్తున్న ఎంపీ శ్రీభరత్ ఆయురారోగ్యాలతో ఉండాలి

విశాఖ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు పట్టాభిరాం

నేడు విశాఖకు జగన్

శ్రీకాకుళం జిల్లాలో పర్యటన -జైల్లో ఉన్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పరామర్శించనున్న వైఎస్ జగన్

విశాఖపట్నం, జూలై 29, ప్రభాతవార్త

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం ఆయన పర్యటన షెడ్యూల్‌ను విడుదల చేసింది. షెడ్యూల్ ప్రకారం ఉదయం 9 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలు దేరి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 10.45 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకోనున్నారు. అనంతరం ఉదయం 11 గంటలకు 8వ పేజీలో

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తులు -వేకువ జాము నుండే సాయిబాబా ఆలయాల వద్ద బారులు తీరిన భక్తులు -శోభాయమానంగా అలంకరించిన ఆలయాలు -ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు

విశాఖపట్నం, జులై 29 ప్రభాతవార్త

స్వస్తిశ్రీ చాంద్రమాన పరాభవ నామ సంవత్సర ఆషాడ శుద్ధ పౌర్ణమి సందర్భంగా గురుపౌర్ణమి వేడుకలు భక్తులు ఘనంగా నిర్వహించారు. సాయిబాబా ఆలయాల్లో వేకువ జాము నుండే భక్తులు బారులు 8వ పేజీలో

వలసల ఉత్తరాంధ్ర నుంచి.. గ్లోబల్ ఉత్తరాంధ్రగా..

ఆగస్టు 1న రూ.17,912 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం -భోగాపురం విమానాశ్రయం గేమ్‌చేంజర్ : మంత్రి కొలుసు పార్థసారథి

విశాఖపట్నం, జూలై 29, ప్రభాతవార్త

ఒకప్పుడు వలసలకు చిరునామాగా ఉన్న ఉత్తరాంధ్ర, నేడు కార్పొరేట్ సంస్థలకు నిలయంగా మారుతోందని రాష్ట్ర సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి 8వ పేజీలో

గంటాకు మంత్రుల పరామర్శ

విశాఖపట్నం, జులై 29, ప్రభాతవార్త

కాలి వేలికి సర్జరీ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును పలువురు మంత్రులు, పార్టీ ముఖ్యనాయకులు బుధవారం ఎంవీపీ కాలనీలోని నివాసంలో కలిసి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గంటాను కలిసిన వారిలో రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, హోం మంత్రి వంగలపూడి అనిత, విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా ఇంచార్జ్ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యేలు కొండ్రు మురళి, అరిమిల్లి రాధాకృష్ణ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు చోడే పట్టాభిరామ్, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు తదితరులు ఉన్నారు.

అవంతి విద్యార్థికి రూ.21 లక్షల భారీ ప్యాకేజీ

జూనిపెర్ స్క్వేర్‌లో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజనీర్‌గా దొగ్గ నిఖిల్ సాయి ఎంపిక.. అభినందించిన అవంతి విద్యాసంస్థల చైర్మన్ మాజీ మంత్రి అవంతి.. నేను సాధించిన ఈ ఘనత అధ్యాపకుల ఉన్నతమైన భోధన.. కళాశాలలో జాబ్ ఓరియోంటెడ్ శిక్షణా తరగతులు విద్యార్థులు పట్ల ఓ వరం.. పండుగ వాతావరణంగా కళాశాల ప్రాంగణం..

రాజ్యసభలో దేశభక్తి, 'వందేమాతరం' విశిష్టతపై

ఎంపీ చింతకాయల విజయ్ ఉద్వేగభరిత ప్రసంగం

విశాఖపట్నం-ప్రభాతవార్త

రాజ్యసభ సమావేశాలలో భాగంగా 'నేషనల్ ఆనర్ అమెండ్‌మెంట్ బిల్లు'పై తెలుగుదేశం పార్టీ ఎంపీ చింతకాయల విజయ్ ప్రసంగించారు. సభలో సభాధిపతిని ఉద్దేశించి మాట్లాడుతూ, ఈ బిల్లుపై తన అభిప్రాయాలను పంచుకునే అవకాశం లభించినందుకు అత్యంత వినమ్రతతో, బాధ్యతాయుతమైన భావనతో సభ ముందు నిలబడ్డానని తెలిపారు. ఈ క్షణం కేవలం ఒక వ్యక్తికి సంబంధించినది కాదని, ప్రజల నమ్మకానికి ప్రతీక అని, మన ప్రజాస్వామ్య శక్తికి, జాతీయ ఆత్మ అయిన 'వందేమాతరం' స్వరానికి ప్రతీక అని పేర్కొన్నారు. భారతదేశం కేవలం ఒక భౌగోళిక ప్రాంతం లేదా మట్టి ముక్క కాదని, ఇది ఒక సజీవమైన సాంస్కృతిక వారసత్వమని వర్ణించారు. ఇది వందన, అభినందన, అర్పణ, తర్పణ భూమి అని ఉద్ఘాటించారు. దేశంలో 8వ పేజీలో

గీతం ఆధ్వర్యంలో డా.ఎమ్.వి.వి.ఎస్ మూర్తి మూట్‌కోర్టు పోటీలు

విశాఖపట్నం, జూలై 29, ప్రభాతవార్త

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలలో ఈ ఏడాది అక్టోబర్ 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు న్యాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు జాతీయ స్థాయి మూట్ కోర్టు పోటీలు గీతం విశాఖపట్నం ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు స్కూల్ ఆఫ్ లా డైరెక్టర్ డాక్టర్ మౌమిత సేన్ చక్రవర్తి తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన గోడ పత్రికను బుధవారం స్కూల్ ఆఫ్ లా డీన్ ప్రొఫెసర్ ఎ.రాజేంద్రప్రసాద్, పోటీల కన్వీనర్‌లు డా.ఎల్.ఆశిష్ కుమార్, ఎస్.నవీన్ తేజ సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గీతం మూట్ మరియు అడ్వకసీ కమిటి ఆధ్వర్యంలో 8వ పేజీలో

శ్రీసత్యనారాయణ స్వామిని దర్శించికున్న హోంమంత్రి అనిత

అవంతి విద్యార్థికి రూ. 21 లక్షల భారీ ప్యాకేజీ

తగరపువలస, జూలై 29, ప్రభాతవార్త

స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాడు. క్యాంపస్ సెలక్షన్స్‌లో భాగంగా ప్రముఖ ఫింటెక్ సంస్థ 'జూనిపెర్ స్క్వేర్'లో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజ నీర్‌గా భారీ వేతనంతో ఉద్యోగం సాధిం చాడు. బీటెక్ చదువుతున్న దొగ్గ. నిఖిల్ సాయి వార్షికంగా రూ. 21 లక్షల రికార్డు స్థాయి ప్యాకేజీతో ఈ అరుదైన అవకా శాన్ని కైవసం చేసుకున్నాడు. విద్యార్థి సాధించిన ఈ అద్భుత విజయంపై అవంతి కళాశాలల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రత్యేక హర్షం వ్యక్తం చేశారు. నిఖిల్ సాయిని కళాశాల ప్రాంగణంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి నిరంతర కృషి, పట్టుదల, కష్టపడే తత్వమే ఈ స్థాయికి చేర్చిందన్నారు. అతడిలో ఉన్న అద్భుతమైన సాంకేతిక నైపుణ్యాలే ఇంతటి భారీ ప్యాకేజీని తెచ్చిపెట్టాయని కొనియాడారు. భవిష్యత్తులో నిఖిల్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. నిఖిల్ సాయి విజయంతో కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.నిఖిల్ మాట్లాడుతూ అవంతి కళాశాలలో విద్యార్థులు పట్ల చైర్మన్ శ్రీనివాసరావు మరియు అధ్యాపకులు చూపించే శ్రద్ధ, అధ్యాపకులు బోదించే విద్యా భోదన, కళాశాల క్రమ శిక్షణ ఇవన్నీ కలిపి ఈరోజు నన్ను అంతర్జాతీయ యూరోపియన్ బెసిడ్ కంపెనీ అయినటువంటి ప్రముఖ ఫింటెక్ సంస్థలో ఉన్నతమైన కెరీర్‌లో స్దిర పడలా చేసింది. అవంతి కళాశాల అకాడమిక్ కార్యక్రమాలతో పాటు జాబ్ ఓరియెంటెడ్ శిక్షణా తరగతులు కూడా నాకు ఎంతో ఉపయోగపడిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.మురళీకృష్ణ, డైరెక్టర్ డా.ఏ.చంద్రశేఖర్, సీఎస్ఈ (ఏఐ-ఎంఎల్, డేటా సైన్స్) విభాగాధిపతి డాక్టర్ పులి శ్రీలక్ష్మి పాల్గొన్నారు. విద్యార్థికి నాణ్యమైన శిక్షణ అందించిన అధ్యాపక బృందాన్ని, ప్లేస్‌మెంట్ విభాగాన్ని వారు అభినందించారు. తోటి విద్యార్థుల విజయం తమకందరికీ ఎంతో స్ఫూర్తినిస్తోందని కళాశాల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. అవంతి విద్యా సంస్థల వైస్ చైర్మన్ ముత్తంశెట్టి శివ నందీశ్ బాబు, జనరల్ సెక్రటరీ ముత్తంశెట్టి ప్రియాంకలు నిఖిల్‌కి శుభాకాంక్షలు తెలిపారు.

రాజ్యసభలో దేశభక్తి, 'వందేమాతరం' విశిష్టతపై ..

7వ పేజీ తరువాయి ..

పారే ప్రతి నది గంగతో సమానమని, ప్రతి రాయి శంకరునితో సమానమని పేర్కొంటూ, "మనం జీవించినా, మరణించినా ఈ దేశం కోసమే... చివరికి మన అస్థికలు గంగాజలంలో కొట్టుకుపోతున్నప్పుడు ఎవరు చెవిపెట్టి విన్నా 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' అనే శబ్దాలే వినిపిస్తాయి" అని ఆవేశపూరితంగా ప్రసంగించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో 'వందేమాతరం' తెచ్చిన స్ఫూర్తిని, త్యాగాలను ఈ సందర్భంగా ఎంపీ విజయ్ గుర్తు చేసుకున్నారు. 1875లో బంకించంద్ర ఛటర్జీ రూపొందించిన 'వందేమాతరం' అనే రెండు పదాలు కోట్లాది మందిలో దేశభక్తిని రగిలించాయని అన్నారు. 1908లో కేవలం 18 సంవత్సరాల వయస్సులోనే ఖుదీరామ్ బోస్ ఉరికంభాన్ని ఎక్కుతూ 'వందేమాతరం' అని నిగర్జించారని తెలిపారు. అలాగే కాలాపానీ సెల్యులార్ జైలులో వీర్ సావర్కర్ క్రూరమైన చిత్రహింసలను తట్టుకుంటూ'వందేమాతరం' అని బదులిచ్చారని గుర్తుచేశారు. ఆల్ఫ్రెడ్ పార్క్‌లో చంద్రశేఖర్ ఆజాద్ లొంగిపోకుండా ప్రాణాలర్పించే సమయం లోనూ ఇదే నినాదాన్ని పలికారన్నారు. తన స్వస్థలమైన ఆంధ్రప్రదేశ్ నర్సీపట్నం ప్రాంతానికి చెందిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగాన్ని ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. బ్రిటిష్ సామ్రాజ్యం అల్లూరిని చెట్టుకు కట్టేసి పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్చి చంపినప్పుడు కూడా ఆయన నోటి నుండి వచ్చిన చివరి మాట 'వందేమాతరం' అని గుర్తుచేశారు. ఈ విప్లవ వీరుని త్యాగానికి గౌరవంగా ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి అల్లూరి సీతారామరాజుకు శిరస్సు వంచి ప్రణామాలు అర్పించారని కొనియాడారు. మాజీ ప్రధాని స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పేయీ రాసిన "బాధాయే ఆతీ హై ఆయే..." అనే ప్రసిద్ధ కవితా పంక్తులను సభలో ప్రస్తావిస్తూ, ఎంతటి ఆటంకాలు వచ్చినా, అగ్నిజ్వాలలు ఎదురైనా అడుగు లో అడుగు వేసి ము ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అందరం కలిసికట్టుగా ముందుకు సాగినప్పుడే దేశం పురోగమిస్తుందని స్పష్టం చేశారు. 'వందేమాతరం'లో మిగిలిన రెండు చరణాలకు సముచిత స్థానం కల్పించి, గౌరవాన్ని పెంచినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు. అలాగే తనకు ఈ అవకాశం లభించేలా ప్రోత్సహించిన తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌లకు ఎంపీ విజయ్ కృతజ్ఞతలు తెలిపారు.

గీతం ఆధ్వర్యంలో డా.ఎమ్.వి.వి.ఎస్ మూర్తి మూట్‌కోర్టు పోటీలు

7వ పేజీ తరువాయి ..

గీతం వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్. మూర్తి పేరుతో గత ఆరు సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ఈ పోటీలను ప్రముఖ న్యాయ నిపుణల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నామన్నారు. న్యాయ వృత్తిలో పాటించాల్సిన మెళకువలపై విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవాన్ని అందించడంతో పాటు, న్యాయ స్థానంలో వాదోపవాదాలపై వృత్తి నైపుణ్యాన్ని పెంచటానికి ఈ మూట్ కోర్టు పోటీలను నిర్వహిస్తున్నామని డైరెక్టర్ తెలిపారు. నూతన నేరచట్టాల ముఖ్యంగా భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత మరియు భారతీయ సాక్ష్య అధినియంలపై ఆధారపడిన సమకాలీన న్యాయ సమస్యలను ఈ పోటీలలో ప్రధాన అంశంగా ఇస్తామన్నారు. నూతన నేర చట్టాలకు సంబంధించిన హత్య, నేరపూరిత కుట్ర, ఎలక్ట్రానిక్ ఆధారాలు, ఫోరెన్సిక్ సైన్స్, అరెస్ట్ సమయంలో రాజ్యాంగ రక్షణలు మరియు అప్పీలేట్ క్రిమినల్ న్యాయ శాస్త్రానికి సంబంధించిన విషయాలపై ఈ ఏడాది మూట్ కోర్టు పోటీలో విద్యార్థుల విశ్లేషణాత్మక మరియు వాదన నైపుణ్యాలను పరిగణలోకి తీసుకుని విజేతలను ఎంపిక చేస్తామన్నారు. జాతీయ స్థాయిలో జరిగే ఈ గీతం మూట్ కోర్టు పోటీల వివరాల కోసం వెబ్ సైట్ పరిశీలించవచ్చన్నారు. ఎల్.ఎల్.బి, ఎల్.ఎల్.ఎమ్ కోర్సులు అభ్యసించే విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనవచ్చన్నారు. ప్రతి న్యాయ కళాశాల నుంచి ముగ్గురు ఒక జట్టుగా మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. గీతం మూట్ కోర్టు పోటీలో విజేతలకు నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేస్తామని తెలిపారు. పోటీల పూర్తి వివరాల కోసం, రిజిస్ట్రేషన్ కోసం డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.గీతం.ఈడియును పరిశీలించాలని సూచించారు.

విశాఖ ప్రగతికి కృషి చేస్తున్న ఎంపీ శ్రీభరత్ ఆయురారోగ్యాలతో ఉండాలి

విశాఖపట్నం-ప్రభాతవార్త

విశాఖ నగర ప్రగతికి కృషి చేస్తున్న పార్లమెంట్ సభ్యుడు మతుకుమిల్లి శ్రీ భరత్ ఆయురారోగ్యాలతో ఉండాలని విశాఖ పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చోడే వెంకట పట్టాభిరాం ఆకాంక్షించారు. బుధవారం జరిగిన ఎంపీ శ్రీ భరత్ జన్మ దినోత్సవ సందర్భంగా జిల్లా టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన జన్మదినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విశాఖ పట్నాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని పార్లమెంట్లోనూ, బయట గట్టిగా కృషి చేస్తున్న మన యువ ఎంపీ శ్రీ భరత్ ఆయురారోగ్యాలతో జీవించాలని భగవంతుని ప్రార్థిస్తున్నా మన్నారు. ప్రఖ్యాత గీతం విశ్వ విద్యాలయాన్ని నెలకొల్పి విద్యారంగంలో విశాఖను జాతీయ స్థాయిలో ఉన్నతంగా నిలబెట్టిన మాజీ ఎంపీ డాక్టర్ ఎంవివిఎస్ మూర్తి ఆశయాలను ఆకాంక్షలను ఆదర్శంగా పనిచేస్తున్న ఆయన మనుమడు ఎంపీ శ్రీ భరత్ తాతకు తగ్గ మనుమడిగా మంచి పేరు తెచ్చు కుంటున్నా రన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్నికల్లో జీవీఎంసీ పై కూటమి జెండా ఎగురవేయాలని, పార్టీ టిక్కెట్టు ఎవరికి వచ్చినా ప్రతి కార్యకర్త అలుపెరుగని కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి లొడగల కృష్ణ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన భోగాపురం ఎయిర్‌పోర్ట్ ను దేశ ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభించడం గర్వ కారణ మన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ దక్షిణ నియోజకవర్గ ఇన్చార్జ్ సీతంరాజు సుధాకర్ విశాఖ పార్లమెంట్ లొడగల కృష్ణ, వాసుపల్లి గాయత్రి పని కుమారి, బొట్ల వెంకటరమణ, పాలిమేర సీతారాం, బైరెడ్డి పోతన రెడ్డి, బిమ్మిడి ఉమా, అబ్దుల్ అనీఫ్, వాసు పల్లి దానిష్, ఎర్రాగుల జగదీష్, గరికిన ఎల్లయ్య, కొల్లి చిరంజీవి బొరా అప్పలనాయుడు, పి ధర్మారావు, ఉమ్మి పోల రావు, బుచ్చిరామిరెడ్డి, సీఎం రమణ, కోట నరేష్, బోయి వెంకటరమణ, శెట్టిపల్లి గోపి, దాసరి శివశంకర్, గొర్నేటి వెంకట సురేష్, ఐ మధుబాబు, సరిపల్లి మహేష్,బొట్ల పరదేశి యాదవ్, అబ్దుల్ చిన్ రెహ్మాన్, నాగోతి శివాజీ, కే.సత్యవమ్మ, తోట శ్రీదేవి, షేక్ బాబ్జి, గనగళ్ల సత్య, చుక్క జోగారావు, కొండపల్లి వరలక్ష్మి, ఏడుకొండలు, మైలపల్లి శ్రీనివాసరావు, గొర్లె నాగమణి, దువ్వాడ లక్ష్మీ భార్గవి, అప్పల నరసింహమ్మ, మంగ వేణి,పైడివాడ శ్రీనివాస్, పీలా లక్ష్మీనారాయణ, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

వలసల ఉత్తరాంధ్ర నుంచి.. గ్లోబల్ ఉత్తరాంధ్రగా..

7వ పేజీ తరువాయి ..

తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న అభివృద్ధి కలలు నిజమయ్యే సమయం ఆసన్నమైందని, ఆగస్టు 1తో ఈ ప్రాంత అభివృద్ధిలో కొత్త అధ్యాయం ప్రారంభం కానుందని అన్నారు. విశాఖ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం "గేట్‌వే ఆఫ్ గ్లోబల్ ఆంధ్ర"గా అవతరిస్తుందని పేర్కొన్నారు. ఈ విమానాశ్రయం కేవలం ప్రయాణికుల రాకపోకలకే పరిమితం కాకుండా, ఎగుమతులు, పారిశ్రామికీకరణ, అంతర్జాతీయ పెట్టుబడులకు కీలక కేంద్రంగా మారుతుందని వివరించారు. దేశంలోనే అత్యాధునిక గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాల్లో ఒకటిగా భోగాపురం విమానాశ్రయాన్ని పర్యావరణ హితంగా, స్థానిక సంస్కృతి ప్రతిబింబించేలా ఎగిరే చేప ఆకారంలో రూపొందించామని తెలిపారు. ఈ విమానాశ్రయం వల్ల విశాఖపట్నం పర్యాటక కేంద్రంగా మాత్రమే కాకుండా, లాజిస్టిక్స్ హబ్‌గా కూడా వేగంగా అభివృద్ధి చెందుతుందని, యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. విమానాశ్రయం చుట్టూ 500 ఎకరాల్లో ఏవియేషన్ హబ్, విమానాల మరమ్మతుల కేంద్రం (ఎంఆర్‌ఓ), విమాన పరికరాల తయారీ పరిశ్రమలు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఎడ్యు సిటీ, ఏఎస్ఈఐ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఉత్తరాంధ్రలో ఏర్పడనున్న అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలతో యువతను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ పాలనపై మంత్రి విమర్శలు గుప్పించారు. గత ఐదేళ్లలో రాష్ట్ర అభివృద్ధి వెనకబడిందని, మూడు రాజధానుల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. భోగాపురం విమానాశ్రయ అవసరాన్ని గత ప్రభుత్వం ప్రశ్నించిందని, భూసేకరణ సమస్యల పరిష్కారంలో కూడా విఫలమైందని అన్నారు. రుషికొండ అభివృద్ధి పేరుతో ప్రజాధనం వృథా చేశారని, గూగుల్ డేటా సెంటర్ వంటి ప్రాజెక్టులపై కూడా ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 1న ప్రధానమంత్రి చేతుల మీదుగా రూ.17,912 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరగనున్నాయని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని, అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం ఉత్తరాంధ్రకే కాకుండా యావత్ ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమవుతుందని

గిరి ప్రదక్షణలో సిఎమ్మార్ ప్రసాద వితరణ

7వ పేజీ తరువాయి ..

సబ్జాజ్యాస్ ప్రసాదాలు తయారు చేయించి పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సి.ఎం.ఆర్. ఫౌండర్ చైర్మన్ మావూరి వెంకటరమణ, డైరెక్టర్లు మావూరి వెంకట పద్మావతి, మావూరి మోహన్ బాలాజీ, మావూరి హారిక తదితరులు ప్రసాదాలు పంపిణీ చేసారు. ప్రతి ఏడాది లాగే శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి నమూనా ప్రతిమను ఏర్పాటు చేసి భక్తులకు చందనం కూడా ఏర్పాటు చేసారు. ఈ నమూనా భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది, భక్తులు అనేకమంది ఈ నమూనాను దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించి ఆనందోత్సాహాలతో గిరి ప్రదక్షిణ కొనసాగించుచున్నారు.

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

7వ పేజీ తరువాయి ..

తీరారు. బాబాకి అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలను శోభాయమానంగా పూలతో అలంకరించి కనుల పండుగ ఏర్పాట్లు చేశారు. బాబాకి అభిషేకం చేసిన వెంటనే హోమాలు మధ్యాహ్నం భోజనాలు నిర్వహించి బాబాని వేడుకున్నారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ వర్గాల చర్యలు చేపట్టారు.

ఈస్ట్ షిరిడి సాయి బాబా ఆలయంలో...

ఈస్ట్ షిరిడి సాయిబాబా ఆలయంలో వేకువ జాము నుండి బాబాకి కాకడ హారతి అనంతరం బాబాకి పాలాభిషేకం, పంచామృత అభిషేకం నిర్వహించారు. 27 రకాల అభిషేకాలు నిర్వహించి అన్నా అవిషేకం కూడా చేశారు. పూర్ణ కలస అభిషేకం చేసిన అనంతరం బాబాని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. బాబా ని దర్శించుకున్న భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు మహా అన్నదాన ప్రసాదాన్ని అందజేశారు.

సీతమ్మధార సాయిబాబా ఆలయంలో...

సీతమ్మధార సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుండి బాబాజీ అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న విషయం నిర్వహించి సాయంత్రం భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు.

నేడు విశాఖకు జగన్

7వ పేజీ తరువాయి ..

రోడ్డు మార్గంలో శ్రీకాకుళం జిల్లా జైలుకు బయలుదేరుతారు. మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా జైలుకు చేరుకున్న అనంతరం జైలులో ఉన్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పరామర్శించి సంఘీభావం తెలియజేయనున్నారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు ఆయనతో భేటీ కానున్నారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు శ్రీకాకుళం నుంచి తిరిగి విశాఖపట్నం విమానాశ్రయానికి బయలుదేరి, సాయంత్రం 5.30 గంటలకు అక్కడికి చేరుకుంటారు. సాయంత్రం 5.50 గంటలకు ప్రత్యేక విమానంలో బెంగళూరుకు బయలుదేరి, రాత్రికి యలహంకలోని తన నివాసానికి చేరుకోనున్నారు.

సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ట్రిపులు పెంపు

జ్ఞానాపురం, జూలై 29, ప్రభాతవార్త

సంబల్‌పూర్ నుంచి ఈరోడ్ మధ్య నడిచే సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు మరో రెండు ట్రిపులు పెంపు చేసినట్టు చీఫ్ పబ్లిక్ రిలేషన్ అధికారి వై.బాలాజీ కిరణ్ తెలిపారు. ఈ వారాంతపు రైలు (08311) ప్రతి బుధవారం నడిచే ఈ రైలు సంబల్‌పూర్‌లో ఉదయం 11.35 గంటలకు బయలుదేరనున్నది ఈ రైలు విశాఖ దువ్వాడకు రాత్రి 09.30 గంటలకు చేరనున్నట్టు ఆయన తెలిపారు మరుసటి రోజు రాత్రి 10.50 గంటలకు సంబల్‌పూర్ చేరనుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు 08312 ఈ రోడ్‌లో మధ్యాహ్నం 02.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 01.08 గంటలకు చేరుతుందని కిరణ్ తెలిపారు. ఈ రైలు తొలి శీతల శ్రేణి ఒకటి, రెండో తరగతి శీతల శ్రేణి ఒకటి, మడో తరగతి శీతల శ్రేణి 5, స్లీపర్ శ్రేణి 07 కోచ్‌లు, జనరల్ శ్రేణి కోచ్ 1 ఈ రైలుతో అనుసంధానం చేసి ఉంటాయన్నారు.

గిరి ప్రదక్షిణ భక్తులకు సేవా సౌకర్యాలు

సింహాచలం, జూలై 29 ప్రభాతవార్త

శ్రీవరహ లక్ష్మీ నరసింహ స్వామి గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు విశాఖపట్నం హనుమంతువాక జంక్షన్ సంజయ్‌గాంధీ కాలనీకి చెందిన విశ్వకర్మ సేవా సంఘం పలు రకాల సేవలు అందించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పర్యవేక్షణలో సేవా సంఘం ప్రతినిధులు మంతిన లక్ష్మణరావు, ఎడ్లపల్లి శంకరరావు, నాగలకొండ శివ, ఎస్.రమణ, పొదిలాపు సింహాచలం, మల్లవరపు రాంబాబుతో పాటు సంఘ ప్రతినిధులు మంగళవారం ఉదయం నుంచి అల్పాహారం, మధ్యాహ్నం భోజన సౌకర్యం, పులిహోర, దద్దోజనం, మజ్జిగ, త్రాగునీరు అవిశ్రాంతంగా భక్తులకు పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమాల పట్ల ఎమ్మెల్యే రామకృష్ణబాబు, వేలాది మంది భక్తులు తమ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో విశ్వకర్మ సేవా సంఘం ప్రతినిధులంతా సేవలందించారు.

ప్రధానమంత్రి భోగాపురం పర్యటనను..

విశాఖపట్నం, జూలై 29, ప్రభాతవార్త

విశాఖపట్నంలో నిర్వహిస్తున్న ప్రతి ప్రభుత్వ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతి నిధులు సమన్వయంతో విజయవంతంగా నిర్వహిస్తున్నారని, అదే స్ఫూర్తితో భారత ప్రధానమంత్రి భోగాపురం పర్యటనతో పాటు అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కూడా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పిలుపునిచ్చారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రవాణా, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, వైద్య సేవలు, భద్రత తదితర అంశాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.ఉత్తరాంధ్ర ప్రజల ఎన్నో ఏళ్ల ఆకాంక్షకు ప్రతిరూపంగా రూపుదిద్దుకున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం ఈ ప్రాంత అభివృద్ధి చరిత్రలో ఒక చారిత్రాత్మక ఘట్టమని మంత్రి పేర్కొన్నారు. ఆగస్టు 1న భారత ప్రధానమంత్రి చేతుల మీదుగా జరగనున్న ఈ మహా కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయనఅధికారులకు,ప్రజాప్రతినిధులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి స్వచ్ఛందంగా హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజల రాకపోకలు, తాగునీరు, ఆహారం, వైద్య సేవలు, భద్రత తదితర అంశాల్లో పకడ్బందీ ఏర్పాట్లు ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చే ప్రజల కోసం ప్రత్యేక రవాణా ప్రణాళిక రూపొందించాలని, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బస్సుల రాకపోకలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అన్ని బస్సులు ఉదయం 9 గంటలకల్లా భోగాపురం చేరుకునేలా, ఆయా ప్రాంతాల దూరం,రహదారి పరిస్థితులను బట్టి ఉదయం 6 గంటల నుంచే దశలవారీగా బయలుదేరేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. గ్రామం, మండలం, రూట్ వారీగా బాధ్యతలను స్పష్టంగా కేటాయించి అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బస్సుల రూట్ మ్యాప్, సమయాలు, ప్రయాణ వివరాలను ప్రత్యేక యాప్ ద్వారా పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల సాధారణ రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళికను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రావడం ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఉపాధి, పెట్టుబడులు, పర్యాటకం, వ్యాపారం, విమానయాన రంగాల్లో విస్తృత అవకాశాలు లభించను న్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ అవకాశాలపై యువతకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, కార్పొరేషన్ చైర్మన్లు సీతంరాజు సుధాకర్, గండి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించేందుకు ఎక్సలెన్సీ సెంటర్లు ఏర్పాటు

ఈ ఏడాది కొత్తగా మరో 3 ఎక్సలెన్సీ సెంటర్‌లు మంజూరు -ఎక్సలెన్సీ సెంటర్లలో విద్యార్థులకు ఇంటర్ తో పాటు జేఈఈ, నీట్ కి ఉచిత శిక్షణ -పేద పిల్లలు సమాజంలో ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు సంకల్పం మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి -మధురవాడ డా .బి. ఆర్. అంబేద్కర్ గురుకులం ఎక్సలెన్సీ సెంటర్ లో మంత్రి స్వామి ఆకస్మిక తనిఖీ

విశాఖ, జూలై 29 ప్రభాతవార్త

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించేందుకు ఎక్సలెన్సీ సెంటర్లు ఏర్పాటు చేశామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం విశాఖ మధురవాడ కొమ్మాదిలోని డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకులం ఎక్సలెన్సీ సెంటర్లో మంత్రి స్వామి ఆకస్మిక తనిఖీ చేశారు. ఎక్సలెన్సీ సెంటర్లోని వంటగది, మరుగుదొడ్లును మంత్రి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ఎక్సలెన్సీ సెంటర్లో సౌకర్యాలు, సమస్యలు అడిగి తెలుసు కున్నారు. విద్యార్థులు నీటి సమస్యను మంత్రి దృష్టికి తీసుకురాగా మంత్రి వెంటనే జీవీఎంసీ కమిషనర్‌తో మాట్లాడి నీటి సమస్యను పరిష్కరించారు. ఎక్సలెన్సీ సెంటర్లో పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగ్గా ఉండాలని సిబ్బందికి మంత్రి సూచించారు. పేద పిల్లలు సమాజంలో ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు సంకల్పమని పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎంత ఖర్చునైనా భరిస్తుందనిమంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు.

లక్ష్యానికి మించి జనసమీకరణ: గంటా

విశాఖపట్నం, జులై 29, ప్రభాతవార్త

భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి లక్ష్యానికి మించి జనసమీకరణ చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ప్రారంభోత్సవ ఏర్పాట్లపై పార్టీ పరిశీలకులు, అధికారులతో బుధవారం ఆయన సమావేశమ య్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సభకు వచ్చే వారికి భోజనం, రవాణా సదుపాయాలు విషయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. పార్టీ నాయకులు, అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. భీమిలి నియోజకవర్గం నుంచి 30 వేల మందిని సమీకరించాలని చెబుతూ మండలాలు, వార్డుల వారీ వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యేలు పులివర్తి నాని, భాష్యం ప్రవీణ్, భీమిలి ఇంచార్జ్ చిక్కాల విజయ్ బాబు, పరిశీలకులు మళ్ల సురేంద్ర, గంటా త్రిమూర్తులు, జోనల్ కమిషనర్లు వి.అయ్యప్ప నాయుడు, ఎం. విజయ్ కుమార్, భీమిలి, ఆనందపురం, పద్మనాభం ఎంపీడీఓలు నరసింహారావు, సత్యనారాయణ, చిన్నారావు పాల్గొన్నారు.

అప్పన్న భక్తులకు 'శ్రీ జై సంపత్ సేవా సంఘ్' ప్రసాద వితరణ



గాజువాక,జూలై 29,ప్రభాతవార్త

సింహాచలం అప్పన్న స్వామి గిరిప్రదక్షిణ సందర్భంగా మంగళవారం విశాఖకు తరలివచ్చిన భక్తులకు 'శ్రీ జై సంపత్ సేవా సంఘ్' ఆధ్వర్యంలో భారీగా ప్రసాదాలు, ఉచిత మందులు పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షులు లక్కరాజు సోమరాజు (సోంబాబు) ఆధ్వర్యంలో, కమిటీ సభ్యుల సహకారంతో గిరిప్రదక్షిణ మార్గంలో సుమారు 50 వేల మంది భక్తులకు ఈ సేవలు అందించారు. గత 18 ఏళ్లుగా తమ సంఘం అలుపెరగకుండా పలు సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని సోమరాజు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన కమిటీ సభ్యులు అవిరెడ్డి సూర్యనారాయణ, శిరం సంజీవరావు, శివ, అగ్గాల రామచంద్రరావు, శ్రీను, అప్పారావు, మేడిశెట్టి కనకరాజు తదితరులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లోనూ సంఘం ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.

గాజువాకలో నేడు భాజపా సమావేశం

గాజువాక,జూలై 29,ప్రభాతవార్త

గాజువాక క్లబ్‌లో గురువారం మధ్యాహ్నం భాజపా సంస్థాగత సమావేశం జరగనుంది. ఏర్పాట్లను పార్టీ రాష్ట్ర సంఘటనా మంత్రి మధుకర్ నూకల, జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు బుధవారం పరిశీలించారు. రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ సూచనల మేరకు సంస్థాగత నిర్మాణంపై ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు తెలిపారు. దిల్లీ కేంద్ర కార్యాలయం నుంచి జాతీయ కార్యదర్శి రీతూరాజ్ సిన్హా, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నాయకులు రెడ్డి పావని, సురేంద్ర మోహన్, కేశవ్‌కాంత్ తదితరులు హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారని పేర్కొన్నారు.

CLASSIFIEDS

CHANGE OF NAME

I, CHOPPARA ASHALATHA W/O KARUMURU RAMAKRISHNA previously called KARUMURU ASHALATHA R/O 32-12-318, MIG-C-15, SHEELA NAGAR, GAJUWAKA, VISAKHAPATNAM now changed my name from KARUMURU ASHALATHA to CHOPPARA ASHALATHA. Henceforth I will be called as CHOPPARA ASHALATHA for all purposes.
(Ro.No. 17206)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

vsp9:vsp9.qxd 29-07-2026 22:25 Page 1

కాఫీ పరిశోధన, గిరిజనాభివృద్ధి ఒక చారిత్రాత్మక మైలురాయి

ఆర్.వి. నగర్ స్వర్ణోత్సవాల్లో కలెక్టర్ టి. నిశాంతి

పాడేరు, జూలై 29 , ప్రభాతవార్త:



ప్రాంతీయ కాఫీ పరిశోధనా కేంద్రం (ఆర్‌సీఆర్ఎస్), ఆర్.వి.నగర్, కాఫీ బోర్డు స్థాపనకు 50 సంవ త్సరాలు (1976–2026) పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకల నిర్వహణపై భాగస్వామ్య సమావేశం బుధవారం పాడేరు కాఫీ హౌస్‌లో కలెక్టర్ టి. నిశాంతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాంతీయ కాఫీ పరిశోధనా కేంద్రం 50 సంవత్సరాల ప్రస్థానం కాఫీ పరిశోధన, గిరిజనా భివృద్ధి , పర్యావరణ పరిరక్షణ రంగాల్లో ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందన్నారు. తూర్పు కనుమల్లో కాఫీ సాగు విస్తరణకు, గిరిజన రైతుల జీవనోపాధి మెరుగుదలకు ఈ కేంద్రం విశేషంగా దోహదపడిందని పేర్కొన్నారు. 1971లో కేవలం 15 టన్నులుగా ఉన్న కాఫీ ఉత్పత్తి ప్రస్తుతం సుమారు 15 వేల మెట్రిక్ టన్ను లకు చేరిందని, కాఫీ సాగు విస్తీర్ణం ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో కలిపి సుమారు 1.12 లక్షల హెక్టార్లకు విస్తరించిందని తెలిపారు. కాఫీ బోర్డు, శాస్త్రవేత్తలు, పరిశోధనా సిబ్బంది, విస్తరణ బృందాలు, ప్రభుత్వ శాఖ లు , గిరిజన కాఫీ రైతుల నిరంతర కృషి ఫలితంగానే ఈ విజయాలు సాధ్యమయ్యాయని కలెక్టర్ కొనియా డారు. సమావేశంలో కాఫీ బోర్డు ఉప సంచాలకులు (విస్తరణ) హెచ్.ఆర్. మురళీధర, ప్రాంతీయ కాఫీ పరి శోధనా కేంద్రం, ఆర్.వి. నగర్ అధిపతి డా. డి. సునీల్‌బాబు, కాఫీ బోర్డు మాజీ పరిశోధన సంచాలకులు డా. ఎన్. సూర్యప్రకాశ్ రావు, కాఫీ బోర్డు సీనియర్ లైజన్ అధికారి ఎస్. రమేష్, జైన్ ఇరిగేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డా. నారాయణ్, కాఫీ బోర్డు అధికారులు, ఐటీడీఏ, జిల్లా ఉద్యానశాఖ, ఏపీఎఫ్‌డీసీ లిమిటెడ్ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఎఫ్‌పీఓలు) ప్రతినిధులు,గిరిజన కాఫీ రైతులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదామును తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్

పాడేరు,జూలై29,ప్రభాతవార్త:

నెలవరి తినిఖీలో భాగంగా స్థానిక డిగ్రీ కళాశాల రూమ్స్ లో భద్రపరిచి ఉన్న ఈవీఎం లను వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు, జిల్లా రెవెన్యూ అధికారి (ఎఫ్ ఏ సి)ఎం వి ఎస్ లోకేశ్వరరావు,కలెక్టరేట్ ఎలక్షన్ సూపరిండెంటెంట్, ఎలక్షన్ డిప్యూటీ తాహశీల్దార్, పాడేరు ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ లతో కలిసి ఈవీఎం గోడం ను జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ పరిశీలించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు, నేషనల్ కాంగ్రెస్ ప్రతినిధి డి. రంజిత్, బిజెపి ప్రతినిధి , వైఎస్ఆర్ సిపి ప్రతినిధి జి. వెంకట్ రెడ్డి , టిడిపి ప్రతినిధి బి. జ్యోతి కిరణ్ ఇతర ప్రజా ప్రతినిధి, పాడేరు మండల్ ఎలక్షన్ డిప్యూటీ తాహశీల్దార్ లక్షణ్ మూర్తి, ఎలక్షన్ కోఆర్డినేషన్ సూపరింటెండెంట్ కుమారస్వామి, ఇతర రెవెన్యూఅధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పెదజడమూరులో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం

గూడెం కొత్తవీధి, జులై 29, ప్రభాతవార్త :

మండల పరిధిలోని సంకాడ పంచాయతీ పెదజడమూరులో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలోని ప్రతి ఇంటినీ సందర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, స్త్రీ శక్తి, అన్నా క్యాంటీన్లు వంటి వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు సమగ్రంగా వివరించారు. అలాగే, స్థానికులను కలుస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎం.వి.వి. ప్రసాద్, మండల అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు, పిఏసిఎస్ చైర్మన్ మొట్టడం నూకరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు దేశగిరి గోవిందరావు, ట్రెజరర్ దేశగిరి సంజీవరావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కాకూరి చిన్న శివకేశవ మరియు అధిక సంఖ్యలో గ్రామస్తులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల మహాధర్నాకు అనుమతి కోరుతూ వినతి

గూడెం కొత్తవీధి, జులై 29, ప్రభాతవార్త :

మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న కలెక్టరేట్ వద్ద సీ.ఐ.టీ.యూ ఆధ్వర్యంలో నిర్వహించబోయే మహాధర్నాకు అనుమతి ఇవ్వాలని కోరుతూ బుధవారం మండల విద్యాశాఖాధికారికి వినతిపత్రం సమర్పించారు. జికె వీధి ఎంఈఓ కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల అధ్యక్షురాలు కె.కుమారి, మండల నాయకురాలు జర్త దేవి తదితరులు ఈ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలల్లో సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 31న జరిగే ధర్నాలో కార్మికులందరూ పాల్గొనేందుకు వీలుగా విద్యాశాఖ అధికారులు అనుమతి మంజూరు చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

ముంచంగిపుట్టు మండలంలో ఎమ్మెల్యే రేగం పర్యటన

ముంచంగిపుట్టు , జూలై 29, (ప్రభాతవార్త):

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం ముంచంగి పుట్టు మండలంలో అరకు నియోజకవర్గం ఎమ్మెల్యే రేగం. మత్య లింగం బుధవారం ఆకస్మిక పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్ర పరిధిలో గల సామాజిక ఆరోగ్య కేంద్రం మరియు పెదగూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను వేరువేరు సమయాల్లో మండల నాయకులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో అరకు ఎమ్మెల్యే రేగం.మత్స్యలింగం మాట్లాడుతూవైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం పాఠశాల రికార్డ్స్ లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో లివైసీపీ ముంచంగి పుట్టు మండల పార్టీ అధ్యక్షుడు పాంగి పద్మ రావు డిసిహెచ్ఎస్ ఎం.నీలవేణి, ఆసుపత్రి సూపరింటెండెంట్ ధరణి, ఎంపీడీవో కే.ధర్మారావు,ఆసుపత్రి సిబ్బంది,ఉపాధ్యాయులు,విద్యార్థులు,వైసీపీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఐదేళ్ల పాలనపై ఆత్మవిమర్శ చేసుకోవాలి : గొర్లె

గూడెం కొత్తవీధి, జులై 29, ప్రభాతవార్త :

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా కోరే ముందు వైఎస్సార్సీపీ నాయకులు తమ ఐదేళ్ల పాలనలో చేసిన తప్పిదాలపై ఆత్మవిమర్శ చేసుకోవాలని జనసేన పార్టీ నాయకుడు గొర్లె వీరవెంకట్ హితవు పలికారు. వైసీపీ ప్రభుత్వం తన ఐదేళ్ల అధికార కాలంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా, ఇప్పుడు మెగా డీఎస్సీపై నిరాధార ఆరోపణలు చేయడం హాస్యాస్పదమన్నారు. రాజకీయ లబ్ధి కోసం నిరుద్యోగులను రెచ్చగొట్టడం బాధ్యతారాహిత్యమని ఆయన తీవ్రంగా విమర్శించారు.

భారీ వర్షాలకు నేలకూలిన ఇల్లు

ముంచంగిపుట్టు, జూలై 29, (ప్రభాతవార్త):

అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలో గడిచిన కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వణుగుమ్మ పంచాయతీ దోమిని పుట్టు గ్రామానికి చెందిన పాంగి. సువర్ణ మట్టి ఇల్లు భారీ వర్షాలకు పూర్తిగా తడిసిపోవడంతో బుధవారం తెల్లవారుజామున ఒక్కసారిగా కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో భారీ ప్రాణనష్టం తప్పింది. ఉన్న ఇల్లు కూలిపోవడంతో కుటుంబం నిరాశ్రయులు కావడంతో తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. నిరుపేదలైన తమను ప్రభుత్వం ఆదుకొని నూతన ఇల్లు మంజూరు చేయాలని వారు ప్రభుత్వాన్నీ, ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక వైసీపీ నాయకులు దేవా వెంటనే స్పందించి దుమిని పుట్టు గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి నూతన గృహం మంజూరయ్యేలా తన వంతు సహాయాన్ని అందిస్తానని బాధితులకు ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సిద్దేశ్వర రావు, గణపతి ,మోదొనో, సొంబ్రా, బుద్ధు, సహదేవ్, సోమనాథ్, జగత్ రాయ్, తదితరులు పాల్గొన్నారు.

దారెల పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

ముంచంగిపుట్టు ,జూలై 29, (ప్రభాతవార్త):

అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలో గల దారెల పంచాయతీలో బుధవారంపొలం పిలుస్తోంది కార్యక్రమము దారెల, గన్నెల గ్రామాల్లో రైతులు సమక్షంలో నిర్వహించటం జరిగిందని మండల వ్యవసాయ శాఖ అధికారి గీరడ. మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాల్లో రైతుల కోసం ఈ కార్యక్రమం ప్రతి వారంలో మంగళ, బుధవారాల్లో రైతుల పొలాలలను సందర్శించి రైతులకి అధిక దిగుబడులు కోసం సూచనలు సలహాలు ఇవ్వటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విహెచ్ఏ వరహాలమ్మ,కాఫీ నైజన్ వర్కర్స్ , ఏపీ సీఎన్ ఎఫ్ సిబ్బంది వనిత, రైతులు పాల్గొన్నారు.

పాడేరులో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

పాడేరు,జూలై29,ప్రభాతవార్త:

గురుపౌర్ణమిని పురస్కరించుకుని పాడేరు పట్టణంలో ఉన్న శ్రీ షిర్డీసాయి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సుంద్రుపుట్టు షిర్డీ సాయినాధుని ఆలయానికి బుదవారం ఉదయాన్నే భక్తులు బారులు తీరారు. షిర్డీ సాయిబాబాకు భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. అలాగే గురు పౌర్ణమి సందర్భంగా ప్రతి ఏడాది ఆలయ నిర్వాహకులు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేయడం అనవాయితీ అయితే వర్షం కారణంగా ఆలయం ప్రాంగణంలో కాకుండా భక్తులు సౌకర్యార్థం వీఆర్ ఫంక్షన్ హాలులో అన్న సమారాధన ఏర్పాటు చేయడంతో ఈ అన్న సమారాధనకు వేలాది మంది భక్తులు హాజరై స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అలాగే పట్టణంలో ఉన్న శ్రీ పూర్ణ పుష్కరాంబ అయ్యప్పస్వామి వారి ఆలయంలో శ్రీ కొలువుదీరి ఉన్న శ్రీ షిర్డీ సాయి నాధుని ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. సాయినాధుని పాలాభిషేకం,సహస్ర బిల్వార్చన, సహస్ర దీపార్చన ప్రత్యేక పూజలు ఆలయ అర్చకులు రాపర్తి ప్రవీణ్ శర్మ భక్తులతో ఘనంగా నిర్వహించారు.

సర్ ప్రక్రియతో దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం

పాడేరు,జులై29,ప్రభాతవార్త:

సర్ ప్తక్రియతో దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం బీజేపీ కార్యకర్తలు సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర జోనల్ ఇంచార్జి మట్టా ప్రసాద్ బీజేపీ కార్యకర్తలుకు పిలుపునిచ్చారు, బుధవారం పాడేరు మొదకొండమ్మ ఆడిటొ రియం బీజేపీ సర్ కార్యశాలలో పాడేరు అసెంబ్లీ కన్వీనర్ సల్లా రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సర్ కార్యశాల మట్టా ప్రసాద్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు, ఈ సందర్భంగా సర్ పై పీపీటీ ప్రోగ్రాం యల్ ఈ డి స్క్రీన్ ద్వారా కార్యకర్తలకు సర్ పై వివరాలు తెలిపారు. ఈ కార్యక్రమం నిద్దేశించి బీజేపీ ప్రధాన కార్యదర్శి మట్టా ప్రసాద్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఓటరు లిస్టు ప్రక్షాళన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు మఠం శాంతకుమారి, బీజేపీ జిల్లా ఇంచార్జి పుట్టా గంగయ్య, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు కురుసా ఉమామహేశ్వరావు, బీజేపీ ట్రైకార్ డైరెక్టర్ కుడా కృష్ణా రావు, బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ పెనుమాక, బీజేపీ సర్ టోలి నంబర్ లకే స్వాతి,గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు లకే అబ్బాయి దొర, బీజేపీ, మార్కెట్ కమిటీ చైర్మన్ మచ్చుల మంగతల్లి, విజిలెన్స్ జిల్లా కమిటీ నెంబర్ వంతలా దేవదాసు,బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాందోలి ఉమా మహేష్, డోంబు నాయుడు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కుడుముల వెంకట రమణ, తంగుల సత్యవతి, లకే భాస్కర్, కేజీయా రాణి, తాజంగి రిజర్వాయర్ చైర్మన్ బోనంగి బాలయ్య పడాల్,యువ మోర్చా అధ్యక్షులు మినుములు గోపాలపాత్రుడు, కురుసా రాజారావు, లక్ష్మయ్యకిసాన్ మోర్చా జిల్లాఅధ్యక్షులు కదుళ్ల శ్రీనివాసరావు, బి ఎల్ వో 2 లు ఐదు మండలాల వారు హాజరయ్యారు.

రింతాడ ఆశ్రమ పాఠశాలలో ప్రపంచ పులుల దినోత్సవం

గూడెం కొత్తవీధి, జులై 29, ప్రభాతవార్త :

ప్రపంచ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చింతపల్లి అటవీ డివిజన్ అధికారి శ్రీ వై.వి. నరసింహారావు ఆధ్వర్యంలో రింతాడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పులుల సంరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణ, అడవుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల కోసం క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి కె. సుమిత్ర, ఉపాధ్యాయులు, ఆర్.వి. నగర్ రేంజ్ అధికారి కె. మణికృష్ణ, బీట్ అధికారులు భద్రం,కె. దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వివరించి, ప్రకృతి పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని సూచించారు.

పాడేరు గిరి కైలాస క్షేత్రంలో గురుపౌర్ణమి వేడుకలు

పాడేరు,జూలై29,ప్రభాతవార్త:

వేద వ్యాసుని జయంతిని పురస్కరించుకొని గురి పౌర్ణమిగా నేడు పాడేరు ఎన్నికల సక్షేత్రం శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి వారి సమేత శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయం వద్ద గురు పౌర్ణమి నిర్వహించారు. ముందుగా గురు దక్షిణామూర్తి వారిని పూజించి ప్రత్యేక అర్చనలు చేసిన అనంతరం విద్యార్థులకు నోట్ బుక్స్ పెన్నులు అందజేశారు. భారతీయ సంస్కృతిలో గురుపౌర్ణమిని అత్యంత పవిత్రమైన రోజుగా జరుపుకుంటాం. గురువును పూజించటం వేదవ్యాసుడ్ని స్మరించుకోవడం ప్రధాన ఆచారాలుగా ఈ గురు పౌర్ణమి రోజు నిర్వహిస్తారు. ఉదయం గురుదక్షిణామూర్తి వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల సీతారామశాస్త్రి గారు ప్రత్యేక పూజలు నిర్వహించారు . భక్తులు స్వామివారిని సేవించి తీర్థప్రసాదములు స్వీకరించారు. గిరి కైలాస క్షేత్ర ధర్మకర్త మండలి సభ్యులు కొట్టగుల్లి రమాదేవి, కిముడు కాత్యాయని, సాధనాల ఈశ్వరమ్మ, క్రాంతి కుమార్, కొట్టగుల్లి మహేష్ జ్యోతి రమణమ్మ పద్మ పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధుల దుర్వినియోగంపై తీవ్ర ఆరోపణలు

గూడెం కొత్తవీధి, జులై 29, ప్రభాతవార్త :

కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గిరిజన రైతులకు అందించాల్సిన ప్రయోజనాలను పీఎన్‌పీ సంస్థ అక్రమాలకు పాల్పడి దారి మళ్లించిందంటూ భారతీయ హ్యూమన్ రైట్స్ జిల్లా వైస్ ప్రెసిడెంట్, జి.కె.వీధి మండల పెసా కార్యవర్గ సభ్యుడు, జెర్రిల పంచాయతీ జనసేన పార్టీ అధ్యక్షుడు సి.హెచ్. అశోక్ తీవ్ర ఆరోపణలు చేశారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పలు అక్రమాలను ప్రస్తావిస్తూ సమగ్ర విచారణ కోరారు. జిల్లాలోని వివిధ మండలాల్లో సుమారు 1,100 మంది గిరిజన రైతులకు సిల్వర్ ఓక్ మొక్కలను పంపిణీ చేసినట్లు అధికారిక రికార్డుల్లో నమోదు చేశారని అశోక్ తెలిపారు. అయితే క్షేత్రస్థాయిలో నిర్వహించిన పరిశీలనలో దాదాపు 300 మంది రైతులకు ఒక్క మొక్క కూడా అందలేదని ఆరోపించారు. మొక్కలు పంపిణీ చేయకుండానే అందించినట్లుగా నకిలీ రికార్డులు సృష్టించి భారీ మొత్తంలో బిల్లులు డ్రా చేశారని పేర్కొన్నారు.

ముంచంగిపుట్టులో వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

ముంచంగిపుట్టు ,జూలై 29, (ప్రభాతవార్త):

అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలో గురు పౌర్ణమి వేడుకల సందర్భంగా దేవాలయాల్లో వైభవోపేతంగా మండల ప్రజలు యువతి యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని గురు పౌర్ణమి పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో గల సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం శ్రీ షిరిడి సాయిబాబా వారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం కాకడ హారతితో పూజలు ప్రారంభమయ్యాయి. విగ్నేశ్వర పూజ, శ్రీ సాయినాధునికి మంగళ స్నానము, వస్త్రాలంకరణ, బాబా వారికి శోడషోపచార, మంత్రపుష్పం పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై బాబా వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు భారీ స్థాయిలో ప్రసాదాలను వితరణ చేశారు. అనంతరం భారీ అన్న సమారాధనా కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అన్న సమారాధనలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

తక్కువ ధరకే బియ్యం పంపిణీ నిర్ణయం అభినందనీయం

ముంచంగిపుట్టు ,జూలై 29, (ప్రభాతవార్త):

బహిరంగా మార్కెట్‌లో బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సామాన్య ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం అభినందనీయమని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ఆర్. శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పౌరసర ఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపినట్టుగా కూటమి ప్రభుత్వం సామాన్య ప్రజలకు సంక్షేమానికి కట్టుబడి ఉందని ఈ నిర్ణయం మరోసారి నిరూపించిందని అన్నారు. ఆగస్టు ఒకటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా 130 రైతు బజార్,500 రైస్ మిల్లర్లు ప్రత్యేక కౌంటర్లలో బీపిటి సూపర్ రైస్ బియ్యం కిలో రూ.52 కు ,గ్రేడ్ వన్ పచ్చి బియ్యం కిలో రూ.50 కు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రజలు ముఖ్యంగా పేద మధ్యతరగతి కుటుంబాలకు ఆగస్టు ఒకటి నుండి రైతు బజార్లు ప్రత్యేక విగ్రహా కేంద్రాల్లో అందుబాటులో ఉండే ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఆర్థిక భారాన్ని తగ్గించుకోవాలని ఆయన కోరారు.

సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు

ఎలమంచిలి, జూలై 29, ప్రభాతవార్త:

మున్సిపాలిటీ పరిధిలోని సాయిబాబా ఆలయాల్లో బుధవారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి భక్తులు ఆలయానికి పోటెత్తారు. సాయిబాబా కి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. మధ్యాహ్నం ప్రతి సాయిబాబా ఆలయాల వద్ద భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు.

ఉపాధ్యాయులు శతశాతం వృద్ధి సాధించాలి

మాకవరపాలెం, జూలై 29, ప్రభాతవార్త :

పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డిప్యూటీ డిఇఓ పి. అప్పారావు అన్నారు. ఈమేరకు బుధవారం మండలంలోని మాకవ రపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల ప్రగతిపై విశ్లేషించారు. ఈసందర్భంగా డిప్యూటీ డిఇఓ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థుల నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు పదిమంది విద్యార్థులను దత్తత తీసుకోవా లన్నారు. ప్రధానంగా విద్యార్థులలో క్రమశిక్షణ తూ.చ తప్పకుండా పాటించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మాకవరపాలెం జిల్లా పరిషత్ హైస్కూలుకు పీఎం శ్రీ వచ్చినందున టెక్నికల్ గా వృద్ధి సాధించినట్లేనన్నారు. ఆడపిల్లలకు ఆరవ తరగతి నుండి ఇంటర్ విద్య వరకు వసతి సౌకర్యం ఉందని దీనిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల మరింత అభివృద్ధి చెందేందుకు ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు మరింత బాధ్యత తీసుకోవాలని డిప్యూటీ డీఈవో ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీటూరి శ్రీను, ఉపాధ్యాయులు ఎన్.శ్రీరామ్మూర్తి, ఆర్. వి.దొర, ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నక్కలపుట్టులో ఇంటింటా టిడిపి కార్యక్రమం

పాడేరు,జూలై29,ప్రభాతవార్త:

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ అమలు చేస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, జిసిసి డైరెక్టర్ బొర్రా నాగరాజు పేర్కొన్నారు. బుదవారం పాడేరు మండలం నక్కలపుట్టు గ్రామంలో ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నక్కలపుట్టు గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్ళి కూటమి ప్రభుత్వం రెండున్నర ఏళ్లుగా చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు,అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు గ్రామస్తులకు వివరించారు. అలాగే చరిత్రాత్మక బోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ఆగస్టు 1వ తేదీన ప్రారంభిస్తున్నారని ఇలా రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో పాటు ఒకటవ తేదీకి పింఛన్లు పంపిణీ కార్యక్రమాలను వివరిస్తూ ప్రజల్లో అవగాహన బొర్రా నాగరాజు కొడుతున్నారు. స్థానిక టీడీపీ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాస మహర్షి జయంతి

పాడేరు,జూలై29,ప్రభాతవార్త:

పాడేరుప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాస మహర్షి జయంతిని పురస్కరించుకొని బుదవారం సదస్సు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్.ఎస్. సత్యనారాయణ అధ్యక్షత వహించారు. వ్యాస మహర్షి పటానికి పూలదండ సమర్పించారు. చరిత్ర విభాగం అధ్యాపకురాలు ఇ.వి. జయలక్ష్మి గారు గురువుని గూర్చి గానం చేశారు. ప్రధాన ఆచార్యులు వారు ఆది గురువైన వ్యాస మహర్షి జననం గూర్చి ,అతను రచించిన అష్టాదశ పురాణాలు, భారతము, అందులో ఉన్న సన్మార్గము మరియు నీతి దాయకమైన కథలను, పాత్రలను గూర్చి విద్యార్థులను ఉద్దేశించి ఉపన్యాసం ఇచ్చారు. పంచేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు ,వీటన్నింటినీ నియంత్రించే శక్తి మనసు కి ఉందని, ఆ మనసుని నియంత్రించే శక్తి గురువుకి ఉందని,గురువు యొక్క స్థానము, ప్రాశస్త్యము, విశిష్టతను గూర్చి వివరించారు. తెలుగు శాఖ అధ్యాపకురాలు ఎం .రాధాకుమారి గురుపౌర్ణిమ విశిష్టతను తెలియజేశారు. తృతీయ సంవత్సరం విద్యార్థిని రాజనీతి శాస్త్రం శాఖకు చెందిన పావని జయసుధ తన గురువులకు కృతజ్ఞతా భావంతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆంగ్ల అధ్యాపకులు గౌరీ శంకర్ ,కామర్స్ విభాగం.శంకర్రావు, బాలరాజు ,చరిత్ర విభాగం మత్స్య రాజు తదితరులు పాల్గొని జయప్రదం చేశారు.

ప్రధాని పర్యటన పై అల్లూరి జిల్లా యంత్రాంగం భారీ ఏర్పాట్లు

పాడేరు,జూలై29, ప్రభాతవార్త:

ఆగస్టు 1వ తేదీన విజయనగరం జిల్లా భోగాపురం వద్ద నిర్మించిన ప్రతిష్టాత్మక 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ విచ్చేస్తున్నందున జిల్లా నుంచి ప్రజల సమీకరణ పై జిల్లా అధికారులతో టి. నిశాంతి సంబంధిత జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ నిషాంతి .టి ఈ చారిత్రాత్మక ఘట్టంలో భాగంగా జిల్లా నుంచి భారీ ఎత్తున గిరిజన ప్రజలు ప్రధాన మంత్రి సమావేశనికి పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రధాని పర్యటన ప్రాధాన్యతను దృష్ట్యా భద్రత, రవాణా, వైద్యం, ఆహారం ఏర్పాట్లు ,ఈ కార్యక్రమంలో పాల్గొనే వారి భద్రతపై జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా నుంచి తరలివెళ్లే ప్రజల సమన్వయం కోసం జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. పక్కా భద్రతా వలయం, పోలీస్ సూపరింటెండెంట్ అమిత్ బర్దార్, ఆధ్వర్యంలో ఘాట్ రోడ్లు, రవాణా మార్గాల్లో కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతీ బస్సులోనూ ఒక పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు.

మొర్రిగూడలో ఉచిత కంటి వైద్య శిబిరం

డుంబ్రిగూడ, జులై 29, ప్రభాతవార్త:

మండలంలోని గసభా పంచాయితీ పరిధిలోని మో ర్రిగూడ గ్రామంలో సిఎస్ఎన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటివైద్య శిబిరాన్ని గసబ గ్రామ పంచాయతీ తాజా మాజీ సిపిఎం పార్టీ సర్పంచ్ పాంగి. సునీత ట్రస్ట్ ఫౌండర్ శ్రీనివాస్ ప్రారంభించారు. పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల నుండి కంటి సమస్యతో భాధపడుతున్న సుమారు 50మంది గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ శ్రీనివాస్ మాట్లాడుతూ వైద్య పరీక్షలు నిర్వహించిన వారికి అవసరమైతే విజయనగరం శ్రీ వెంకటేశ్వర్ల పుష్పగిరి కంటి ఆసుపత్రికి తీసుకొని వెళ్ళి మెరుగైన చికిత్స అందిస్తామనీ చెప్పారు. గసబ మాజీ సర్పంచ్ పాంగి. సురేష్ కుమార్, మాజీ వార్డ్ మెంబర్స్ పాంగి. సత్యనారాయణ, పాంగి. రాజ్‌కుమార్, ఫీసా కార్యదర్శి పాంగి. కొత్తు, ఏఎన్ఎం రత్న కుమారి, ఎం ఎల్ ఎల్ లత మాధురి, ఎం పి హెచ్ డబ్ల్యు కొర్రా. గురుమూర్తి,వివిధ గ్రామాల ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణలో పోలీసులు ఆదర్శం

గూడెం కొత్తవీధి, జులై 29, ప్రభాతవార్త :

శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం బిజీగా ఉండే పోలీసులు పర్యావరణ పరిరక్షణలోనూ తమ సామాజిక బాధ్యతను చాటుకుంటున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి సబ్ ఇన్‌స్పెక్టర్ సురేష్ తన విరామ సమయంలో పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. స్టేషన్ ప్రాంగణాన్ని పచ్చదనంతో నింపాలనే లక్ష్యంతో ఆయన స్వయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. విధుల్లో ఎంత ఒత్తిడి ఉన్నప్పటికీ, ప్రకృతి పరిరక్షణ కోసం సమయాన్ని కేటాయించి మొక్కలు నాటిన ఎస్సై సురేష్ సేవాభావాన్ని స్థానిక ప్రజలు, ఉన్నతాధికారులు అభినందించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

కాన్వెంట్ రోడ్డులో కూలిన భారీ వృక్షం.. మహిళకు గాయాలు

పాడేరు,జూలై29,ప్రభాతవార్త :

ఈదురు గాలులతో కూడిన వర్షాలు గత మూడురోజులుగా వేస్తుండటంతో పాడేరు పట్టణం జి.మాడుగుల వెళ్ళేరహదారి కాన్వెంట్ సమీపంలో భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా కూలిపోయింది. చెట్టు కూలిన సమయంలోఒక మహిళ చిన్నారి ఉండటంతో మహిళకు గాయాలు తగలగా చిన్నారికి సురక్షితంగా బయట పడింది. అలాగే రోడ్డు ప్రక్కన పార్కింగ్ చేసి ఉన్న స్కూటీ పై చెట్టు పడటంతో స్కూటీ ధ్వంసం అయింది. రోడ్డుకద్దంగా చెట్టు కూలడంతో ట్రాఫిక్ జామ్ కావడంతో పాడేరు నీ.మాడుగుల వెళ్ళే వాహనాలు రాకపోకలు స్తంభించుకు పోయాయి. చెట్టు తొలగించి వాహన రాకపోకలు యథావిధిగా తిరిగాయి.

స్పీకర్ చేతుల మీదుగా గండిపేటలో నేడు పింఛన్ల పంపిణీ

మాకవరపాలెం జూలై 29 ప్రభాతవార్త :

గండిపేటలో సామాజిక పింఛను పంపిణీ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్న పాల్గొనబోతున్నట్టు భీమబో యినపాలెం తాజా మాజీ సర్పంచ్ రుత్తల నందకిషోర్ తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ భీమబోయినపాలెం పంచాయతీ శివారు గండిపేటలో గురువారం సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. దీనికి ముఖ్యఅతిథిగా స్పీకర్ హాజరవుతున్నట్లు నందకిషోర్ తెలిపారు. భీమపోయినపాలెం పంచాయతీ అభివృద్ధికి సర్వవిధాల సహకరిస్తూ తనను ముందుకు నడిపిస్తున్న స్పీకర్ అయ్యన్న రావడం తనకు,గ్రామ ప్రజలకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. మండలంలోని టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కిషోర్ పిలుపునిచ్చారు.

vsp10:vsp10.qxd 29-07-2026 21:44 Page 1

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

షిరిడి సాయిబాబాను దర్శించుకున్న భక్తులు

అనకాపల్లి, జూలై 29 (ప్రభాత వార్త):

గురు పౌర్ణమి పర్వదినం సందర్భంగా గవరపాలెం పార్క్ సెంటర్ వద్ద, వేల్పుల వీధిలో, కొత్తూరు ఎన్జీవోస్ కాలనీ లో వేంచేసి ఉన్న శ్రీ శిరిడి సాయిబాబా ఆలయాల్లో బుధవారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారి నుండే భక్తులు షిరిడి సాయిబాబా ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తూరు ఎన్జీవోస్ కాలనీ సాయిబాబా ఆలయంలో బాబా వారికి క్షీరాభిషేకం, పంచామృత అభిషేకం, విభూది అభిషేకం, వివిధ రకాల పండ్ల రసాలతో విశిష్ట పూజలు నిర్వహించారు. షిరిడి సాయినాథుని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ , జిల్లా జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ దర్శించుకున్నారు. వీరిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శిల్పరశెట్టి బాబి, కాండ్రేగుల కృష్ణప్రారావు, దొడ్డి వెంకట సత్యనారాయణ, ఆళ్ల రామచంద్రమూర్తి, ఆళ్ల అప్పలనాయుడు, రాపేటి రామ సత్యనారాయణ, విల్లూరి రాజశేఖర్, దొడ్డి రమణ, షేక్ వల్లి, చిట్టిబాబు, శేషు, హరీష్,పోలిమేర నాయుడు, కోటిపల్లి శ్రీను, మొల్ల రమణబాబు,కొణతల పరదేశి,నాయుడు,ఆడారి రవికుమార్, గాజుల రాంబాబు, కోయిలాడ నాగు, అనిల్, వల్లి, పెంటకోట సాగర్, ఆర్ సోమయాజుల శివ, తదితరులు పాల్గొన్నారు.

కసింకోట మండలంలో..

కసింకోట, జూలై 29, ప్రభాతవార్త;

గురుపౌర్ణమి పర్వదినం సందర్భంగా చింతలపాలెం, కన్నూరు పాలెం, సోమవారం వెదురుపతి గ్రామాలలో గల శిరిడి సాయినాథ ఆలయాల్లో బుధవారం ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. కసింకోట శివారు పిసిని కాడ ఏరియాలో గల శ్రీ షిరిడి సాయి నాధుని ఆలయంలో గురు పౌర్ణమి సందర్భంగా ఆలయ ధర్మకర్త దొడ్డి మహేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం అధిక సంఖ్యలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

రాజయ్యపేటలో ఇంటింటికీ టీడీపీ

(నక్కపల్లి ,ప్రభాతవార్త) :

రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న "ఇంటింటికి తెలుగుదేశం – రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా బుధవారం రాజయ్యపేట గ్రామంలోని వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిటిసి పిక్కి సత్యియ్య, రాజయ్యపేట గ్రామ తెలుగుదేశం పార్టీ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, ఇంటింటికి వెళ్లి ప్రజలను నేరుగా కలిసి, వారికి ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించగా, లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం అనారోగ్యంతో ఉన్న టీడీపీ కార్యకర్తలను వారి నివాసాల్లో కలిసి పరామర్శించారు. వారికి ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పిక్కి అప్పలనర్స, టీడీపీ ఎంపీటీసీ పిక్కి సత్తియ్య, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, యూనిట్ ఇంచార్జీ వాసుపల్లి శివాజీ, సిరిపల్లి అప్పలరాజు, పిక్కి చిన్నతాత, వాసుపల్లి ఏసు, వార్డు సభ్యులు దైలపల్లి శ్రీను, నాయకులు, కార్యకర్తలు అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీ దేవి అలంకరణలో దుర్గాదేవి, కన్యకా పరమేశ్వరి

అనకాపల్లి, జూలై 29 (ప్రభాత వార్త) :

అనకాపల్లి, సతకంపట్టు, గవరపాలెంలో కొలువైన కనకదుర్గ మ్మవారి ఆలయంలో ఆషాడమాసం గురు పౌర్ణమి బుధవారం సందర్భంగా ఆలయ శాశ్వత చైర్మన్, నిర్వాకులు కాండ్రేగుల నాయుడు భాగ్యలక్ష్మి దంపతుల సౌజన్యంతో కనకదుర్గకి శాకాంబరి అలంకరణ చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనకాపల్లి పట్టణంలో 1925 లో స్థాపించిన 100 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం సంఘం ఆధ్వర్యంలో అమ్మవారు మూల విరాట్‌కు వివిధ రకాల కూరగాయలతో శాకాంబరీ దేవిగా అలంకరణ చేశారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్ట వరాహ నూకరాజు, ఆలయ ప్రధాన అర్చకులు కె హరినారాయణ, అలంకరణ కర్త ఉదయగిరి చంద్రశేఖర్, శ్రీ కన్యకా రి ఆలయ అధ్యక్షులు వుప్పల రవిరామ్ జవహర్, కార్యదర్శి, శ్రీధరాల సోమరాజు, కోశాధికారి కడిమిశెట్టి అచ్యుతరామయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి వివిఎస్ మాణిక్యం, భక్తులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయంలో ఘనంగా లక్ష్మీ గణపతి హోమం

అనకాపల్లి, జులై 29 (ప్రభాత వార్త) :

ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెంలో వెలిసిన నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో బుధవారం, ఆషాడ మాసం, గురుపౌర్ణమి సందర్భంగా , ప్రముఖ వ్యాపారవేత్త కూరగాయల దాత మళ్ల జగ్గప్పారావు సహకారంతో అమ్మవారికి శాకాంబరి అలంకరణ చేశారు. మాజీ మంత్రి స్థానిక శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఆగస్టు 1వ తేదీన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానుండగా, ఆగస్టు 17వ తేదీ నుంచి వాణిజ్య విమాన సేవలు ప్రారంభం కానున్న సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ, ఉన్నత అధికారుల సూచన మేరకు అమ్మవారి ఆలయంలో లక్ష్మీ గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. వర్షాలు సంతృప్తిగా పడాలని కూడా యాగం చేశారు.అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహాయ కమిషనర్ యాళ్ళశ్రీధర్ ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు , మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు,యర్రవరపు సంతోషి కుమారినాగేష్, దేవాలయ అర్చకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ శాఖను ప్రైవేటుపరం చేయడం తగదు : సిపిఎం

(నక్కపల్లి, ప్రభాతవార్త)

1908లో చట్టం చేయబడి అప్పటినుంచి పురాతనంగా కొనసాగుతున్న రిజిస్ట్రేషన్ శాఖను ప్రైవేటుపరం చేయడం సరైన విధానం కాదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. అప్పలరాజు అన్నారు. నక్కపల్లి సబ్ రిజిస్టర్ కార్యాలయం పరిధిలోని దస్తావేజులేఖరులు చేయుచున్న పెన్డౌన్ సమ్మెకు సంఘీభావం తెలిపిన ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖ ప్రభుత్వ పరిధిలో చాలా ముఖ్యమైనదని, ఇటువంటి శాఖను ప్రైవేటుపరం చేయాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని రేకిస్తున్నామని, తక్షణం జీవో నెంబర్ 396 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నక్కపల్లి దస్తావేజు లేకర్ల పెన్డౌన్ సమ్మె బుధవారం నాటికి పదో రోజుకు చేరుకుంది. దస్తావేదిలేఖరులు జీవో 396 రద్దు చేయాలని, తమ వృత్తికి భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో దస్తావేజులేఖరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దాతారం మురళీకృష్ణ , కార్యదర్శి బత్తుల శ్రీను, సహాయ కార్యదర్శి డి.ఎం.పి కుమార్, ట్రెజరర్ లోవరత్నం, రాంబాబు, సాయి తేజ, కూరపాటి సూర్యనారాయణ, నూకరాజు, గోవిందు, వరహాలు, బొంతు రాజు, లక్ష్మి, ధారబాబు, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

బ్రోస్ రెస్టారెంట్లో అగ్ని ప్రమాదం.. పూర్తిగా దగ్ధమైన రెస్టారెంట్

మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఎలమంచిలి, జూలై 29, ప్రభాతవార్త:

పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో మెయిన్ రోడ్డు పై గల బ్రోస్ రెస్టారెంట్ లో బుధవారం నాడు విద్యుత్తు షార్ట్ సర్క్యూట్తో మంట్లో చెల్లరేగడంతో స్థానిక ఫైర్ స్టేషన్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. బుధవారం గురుపౌర్ణమి సందర్భంగా రెస్టారెంట్ కు సెలవులు ఉండటంతో షట్టర్ వేసి ఉండటం వల్ల షార్ట్ సర్క్యూట్ అగ్ని ప్రమాదం వల్ల లోపల ఉన్న ఫర్నిచర్ అంతా దగ్ధమై అప్పుడు మంటలు పైకి రావడంతో ఫైర్ సిబ్బందికి స్థానికులు సమాచారం అందించారు. అప్పటికే చాలా నష్టం వాటిల్లింది. ప్రమాదం తీవ్రత పెరగకముందే అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు

(నక్కపల్లి, కోటవురట్ల) జులై 29:

విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు ప్రతిభా పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని స్థానిక ఎంఈఓ రామారావు అన్నారు. వచ్చేనెల ఒకటో తేదీన భోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభోత్సవం సందర్భంగా విద్యార్థులకు "ఉత్తరాంధ్ర కళలకు రెక్కలు " నగర సంస్కృతి గుర్తింపు, ప్రసిద్ధి తీరప్రాంతాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, పర్యాటకం, సముద్ర వాణిజ్యం, ఎగుమతి దిగుమతులు, ప్రత్యేక ఆకర్షణలు అందాలు అనే అంశాలపై చిత్రలేఖన, వ్యాసరచన పోటీలను మండల స్థాయిలో బుధవారం కోటవురట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీల్లో జల్లురు, కే వెంకటాపురం, కేజీబీవీ, బాలికోన్నత, పీఎం శ్రీ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. దీనిలో గెలుపొందిన విజేతలకు ఎంఈఓ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. వీరిలో గెలుపొందిన వారిని జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు కొర్రా షెమో, కృష్ణ, ఉపాధ్యాయులు డేవిడ్, కృష్ణ, ఆర్ట్ ఉపాధ్యాయులు సూరిబాబు, కిషోర్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పతాంజలి యోగా గురువులకు గురుపూజ మహోత్సవం

అనకాపల్లి, జులై 29, (ప్రభాత వార్త):

పట్నంలోని జార్జ్ క్లబ్ ఆవరణలో భారత్ స్వాభిమాన ట్రస్ట్ పతాంజలి యోగ వారి ఆధ్వర్యంలో బుధవారం గురుపూజ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. జార్జ్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులను బిఎస్ఎం కె జోగి నాయుడు, బుద్ధ కాశి మాస్టర్ ను అందరూ అభినందించిన అనంతరం పెంటకోట సుబ్రహ్మణ్యం, కోలపర్తి కన్నబాబు, ఆధ్వర్యంలో గురు పౌర్ణమి సందర్భంగా గురువులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యోగా గురువులు జిల్లా అధ్యక్షులు బీశేటీ దొరమ్మ నాయుడు దంపతులు, రాష్ట్ర అధ్యక్షుడు మంగయ్య, లు మాట్లాడుతూ ప్రకృతి ఫలహారాలను భుజిస్తూ,ప్రకృతిని ఆరాధిస్తూ,ప్రకృతితో మమేకమై జీవిస్తూ,శ్వాస పైనే ధ్యానను ఉంచుతూ,ఓంకార నామాన్ని జపిస్తూ, పతంజలి మహర్షి విరచిత యోగాసనాలు వేస్తూ, అన్ని అంగాల్లో ఉత్తేజాన్ని నింపుతూ, దినకరునికి నమస్కరిస్తూ, ఆయన సాక్షిగా ప్రాణాపాయం గావిస్తూ, యోగాసనాల సాధనతో, రోగ నిరోధక శక్తిని పెంచుకుంటూ సంపూర్ణ ఆయురారోగ్యాలను పొందుతూ, ప్రశాంత జీవనాన్ని ఆస్వాదిస్తూ, ఉన్నత వ్యక్తిత్వాన్ని అలవర్చుకుంటూ, ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదుగుతూ, భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ఆచరిస్తూ, ప్రపంచానికి సనాతన ధర్మాలను పరిచయం చేస్తూ, నైతిక విలువలకు వలువలను తొడుగుతూ యోగాతో పరిపూర్ణ జీవనం వైపు అందరూ వెళ్లాలన్నారు. యోగ అలవర్చుకునేలా జీవితకాలం ఆరోగ్యంగా జీవించాలి. యోగ విద్య ఒక్కటే సరైన మార్గం అని వారు తెలిపారు. అనంతరం వారికి ఘనంగా సత్కరించి జ్ఞాపకను అందజేశారు. మాదేటి జనార్ధన్, కొణతాల శివాజీ, కెవివి సత్యనారాయణ, కాండ్రేగుల చిన్న, ఆడారి చినవీర నాయుడు, ఆళ్ల సూర్య రామకృష్ణ, బుద్ధ సత్యనారాయణ, కొణతాల పెద్ద, కాండ్రేగుల శివ శంకర్, కర్రీ చిన సన్యాసినాయుడు, కర్రీ శివ బలరాం, వైభవ్ ఫ్యాషన్స్ బుజ్జి, ఎస్ ఎం నాయుడు, మహిళాయోగా సాధకులు రోహిణి, జ్యోతి, యోగా సాధకులతో పాల్గొన్నారు.

ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం ప్రారంభం

అగనంపూడి,ప్రభాత వార్త :

జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు , జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఐటీ మరియు విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ బాబు , రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాజువాక శాసనసభ్యులు శ్రీ పల్లా శ్రీనివాసరావు గారి ఆదేశాల మేరకు 85 వార్డులో ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమం 85వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు , ఇన్చార్జ్ కర్రి దశేంద్ర ఆధ్వర్యంలో బొర్రమాంబ అమ్మవారి ఆలయంలో పూజలు చేసి దిబ్బ పాలెం గ్రామంలో డోర్ టు డోర్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు సంవత్సరాల్లో అభివృద్ధి సంక్షేమం చేసినటువంటి కార్యక్రమాల్ని ప్రజలకు వివరించడం జరిగింది. కార్యక్రమంలో పార్లమెంటు ఉపాధ్యక్షులు కరణం సత్యారావు, సగర కార్పొరేషన్ డైరెక్టర్ గుర్రం నూకరాజు, హాస్పిటల్ డైరెక్టర్ లు డొక్కా రమేష్ , గజ్జల రవణమ్మ నూకరాజు,గంతకోరు అప్పారావు, గొల్లవిల్లి నూకరాజు, మాడిస వెంకట్రావు,ఈగల పోలినాయుడు, శీరం శెట్టి బాబ్జి, ఉరుకూటి అప్పలరాజు, పొన్నగంటి వెంకటరమణ, ఉరుకూటి రామనాయుడు, ఎలమంచిలి వీరప్పారావు, పచారి రాము, తలారి శ్రీనివాసరావు, సర్వశుద్ధి అప్పారావు, కర్రి శ్రీనివాసరావు, కర్రి చినరాజు,మొల్లి అప్పారావు, గాజువాక మహిళ ఉపాధ్యక్షురాలు గంతకోరు సత్యవతి, వార్డు మహిళా అధ్యక్షురాలు గీతా అన్నపూర్ణ, జనరల్ సెక్రెటరీ రావాడి శిరీష, ఈగల లోకేశ్వరి, గోపి శెట్టి పద్మ, ప్రకృతి భవాని, పల్లా ఐమావతి, తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో అనంత అరణ్య పెంపకాన్ని పరిశీలించిన ఏపీడీ

గొలుగొండ ,జులై 29, ప్రభాతవార్త:

స్థానిక గురుకుల కళాశాలలో అనంత అరణ్య కార్యక్రమం ద్వారా ఏర్పాటు చేసిన మొక్కల పెంపకాన్ని ఏపిడి సువర్ణ రాజు పరిశీలించారు. ఎన్ఆర్ జి ఎస్ ద్వారా పెంపకం చేపట్టిన మొక్కలు పెంపకం గురుకుల పాఠశాలలో ఇటువంటి వనాలు పెరగడం మంచి వాతావరణాన్ని ఏర్పడుతుందన్నారు. ఈ మొక్కల్లో పండ్ల మొక్కలు కూడా ఉండడంతో వాటి సంరక్షణ పై జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. గురుకుల పాఠశాల, బీసీ హాస్టల్ లో ఈ అనంత అరణ్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నూతన ఏపీడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొట్టమొదటిసారిగా మండలానికి విచ్చేసిన సందర్భంగా సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. వి బి రామ్ జి పథకంలో 125 రోజులు పని దినాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు కానుగుణంగా పనులు కల్పించాలని అన్నారు. నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం అన్ని గ్రామ పంచాయతీల్లో గుర్తించిన పనులు పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు, ఏపీఓ సూర్య మని, టెక్నికల్, కార్యాలయ సిబ్బంది, వి ఆర్ పి లు పాల్గొన్నారు,

ఉత్సాహంగా 'ఇంటింటికీ తెలుగుదేశం'కార్యక్రమం

ఎలమంచిలి, జూలై 29, ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రాంబిల్లి మండలం మూలజంప గ్రామంలో బుధవారం 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనిట్ ఇన్ఛార్జ్ అందుకూరి ప్రసాద్, గ్రామాధ్యక్షులు వేగి రాములు ఉమ్మడి ఆధ్వర్యంలో ఈ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దూళి రంగనాయకులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు .ఈ సందర్భంగా ధూళి రంగనాయకులు మాట్లాడుతూ ?గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి, గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను పత్రాల ద్వారా ప్రజలకు వివరించినట్లు తెలిపారు. ప్రస్తుతం లబ్ధిదారులకు అందుతున్న పథకాల అమలు తీరును నేరుగా ఆరా తీశారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం మరిన్ని నూతన పథకాలను ప్రవేశపెట్టబోతోందని ఈ సందర్భంగా రంగనాయకులు స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు కోరుబిల్లి సత్తిబాబు, వేగి రామ, శంకరరావు, వేగి భాస్కరరావు, వేగే అప్పారావు, రామ సత్యనారాయణ, సిహెచ్ అప్పారావు, నాగేష్ పాల్గొన్నారు.

నేడు సత్తెమ్మతల్లి జాతర.. ఘనంగా ఏర్పాట్లు

(నక్కపల్లి, ప్రభాతవార్త)

మండలంలోని చినదొడ్డిగల్లులో కొలువైయున్న సత్తెమ్మతల్లి జాతర మహోత్సవం గురువారం ఘనంగా జరగనుంది.అందుకు సంబంధించిన పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు.చింతలపాటి రాజవంశీయుల ఇలవేల్పుగా ఆరాధ్యదైవంగా, భక్తులపాలిట కొంగు బంగారంగా గత ఎనిమిది దశా బ్దాలుగా సత్తెమ్మతల్లి అమ్మవారు నిత్య నీరాజనాలందుకుంటున్నారు. ప్రతి ఏడాది ఆషాడమాసంలో ఆషాడంలో తొలి ఏకాదశి తర్వాత వచ్చిన గురువారం నాడు అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఏడాది ఏర్పాటు చేస్తుంటారు. ఈ ఉత్సవాల్లో కోస్తాంధ్ర నలు మూలల నుండి వేలాది భక్తులు పాల్గొని తమ మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. తప్పెటగుళ్ళు, మేళతాళాలతో అమ్మవా రి ఊరేగింపు బుర్రకథ తదితర సాంస్కృతిక, వినోద కార్యక్రమాలలో జాతర మహోత్సవం ప్రారంభమవు తుంది. ఉత్సవ నిర్వహణలోను, ప్రసాద వితరణ, మంచి నీరు వంటి సదుపాయాలను కల్పించడంలో చినదొడ్డిగల్లు సత్తెమ్మతల్లి ఆలయ కమిటీ, యువ సేవాబృందం సేవలను అందిస్తారు. ఆలయ ప్రధాన నిర్వాహకులు నడింపల్లి సూర్యనారాయణరాజు(రాజ బాబు) నేత్రుత్వంలో జరిగే ఈ వేడుకల్లో కాకర్లపూడి వెంకట విజయ గోపాల రాజు (మురళీ), చింతలపాటి శ్రీనివాసరాజు, పిన్నమరాజు శేషువర్మ, వాకర్స్ ఇంటర్నేషనల్ చైర్‌పర్సన్ చింతలపాటి వంశీ కృష్ణవర్మ గొట్టుముక్కల జగన్నాథ రాజు, చింతలపాటి శ్రీనివాసరాజు ఉత్సవాల్లో పాల్గొంటారు. ఈ పండగ సందర్భంగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సీఐ జూరెడ్డి మురళి ఆధ్వర్యంలో ఎస్సై సన్నిబాబు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అగనంపూడిలో నేడు విద్యుత్ అంతరాయం

అగనంపూడి, ప్రభాతవార్త:

అగనంపూడి సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ కార్యనిర్వాహన ఇంజనీర్ మురళీకృష్ణ తెలిపారు. వి ఈ పి జెడ్ ఫీడర్, 33 కెవి షట్ డౌన్, నిర్వహిస్తున్నందువలన, అగనంపూడి లో ఉన్న గ్రామాలు, మంగళ పాలెం, గ్రామాల్లో విద్యుత్తు ఉదయం నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాకు న్యాయం చేయండి.. తహసీల్దార్‌కు ఓ కుటుంబం వినతి

(నక్కపల్లి, ప్రభాతవార్త):

మండలంలోని గునుపూడి రెవెన్యూ పరిధిలో గల సర్వేనెంబర్ 24 /10 కొండ పోరంబోకు భూమిలో సాగులో ఉన్న మా కుటుంబానికి ఏపీఐఐసీ భూసేకరణలో భాగంగా అన్యాయం జరుగుతుందని తక్షణమే న్యాయం చేయాలని ఆ గ్రామానికి చెందిన మాసా వెంకటలక్ష్మి, భర్త సత్యనారాయణ తాసిల్దార్ కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం కొండ పోరంబోకును సర్వే చేసిన సందర్భంలో భూమిలో సాగులో ఉన్న వారిని గుర్తించడం జరిగిందని ఆ గుర్తించిన సమయంలో ఎల్పీ నెంబర్ 1539 ప్రకారం సుమారు రెండు ఎకరాల నర పైబడి ఉన్నట్లు పాసుబుక్ ఆధారంగా సర్వేలో గుర్తించారని ఆ విధంగా 111వ నెంబరు కేటాయించారని ,తాసిల్దార్ కు విన్నవించుకున్నారు. జూన్ ఎనిమిదో తేదీన ఎంజాయ్మెంట్ సర్వేలో గుర్తించిన లబ్ధిదారుల వివరాల్లో ఎటువంటి అభ్యంతరాలు ఉన్న వారం రోజుల్లోగా తెలియజేయమని అధికారులు ప్రకటించారని తెలియజేశారు. ఈనెల 24వ తేదీ వరకు మాస వెంకటలక్ష్మి మీద ఎటువంటి ఫిర్యాదులు తాసిల్దార్ కార్యాలయానికి అందలేదని తాసిల్దారు ఎదుట వివరించారు. ఆ మేరకు పరిహారం కోసం ధ్రువపత్రాలు అందజేయడం జరిగిందని తెలియజేసిన సందర్భంలో అదే గ్రామానికి చెందిన టిడిపి నాయకులు ఒకరు ఆ క్రమ సంఖ్యలో నాకు వాటా ఉందని తన యొక్క బ్యాంకు వివరాలు అధికారులకు తెలియజేయడం నాకు పరిహారం పడుతుందని చెప్పడం దారుణమైన చర్యని ,ఇటువంటి వారిపై చర్య తీసుకోవాలని, క్రమ సంఖ్య 111 లో ఉన్నట్లు విచారణ చేసి పరిహారం చెల్లించాలని తాసిల్దార్ నీ కోరారు. ఇటువంటి వారిపై చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.విచారణ చేస్తామని తాసిల్దార్ తెలియజేశారు.

పంట పొలాల్లోకి రహదారి కోసం కాగిత రైతుల ఆందోళన

(నక్కపల్లి,ప్రభాతవార్త) :

మండలంలోని ఏపీఐఐసీ భూసేకరణలో భాగంగా నిర్మాణం జరుగుతున్న స్టీల్ ప్లాంట్ అవసరాలు అవసరాల కోసం ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక రహదారి విషయం రైతులు పంట పొలాల్లోకి వెళ్లేందుకు అవకాశం లేకుండా రహదారి నిర్మిస్తున్నారని ఆరోపిస్తూ కాగిత రైతులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఎగువ ప్రాంతాల్లో ఉన్న తమ భూములకు రైతులు వెళ్లేందుకు అవకాశం లేకుండా ఆర్ అండ్ బి అధికారులు రోడ్డుకు డివైడర్(గట్టు) వేయటం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులందరూ పూర్వం నుండి తమ భూముల్లోకి వెళ్ళేందుకు రాకపోకలు సాగిస్తున్న గ్రావెల్ రోడ్డుకు ఎదురుగా క్రాసింగ్(యూటర్న్) ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. స్పందించిన వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో తాసిల్దార్, ఆర్డీవో లతోపాటు రైతులందరూ ఆర్ అండ్ బి, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారికి వేరువేరుగా వినతి పత్రం గతంలో కలిసిన సందర్భంలో అందజేశారు. రైతులకు అనుకూలంగా యూటర్న్ ఏర్పాటు చేయకపోవడంతో వీసం రామకృష్ణ నాయకత్వంలో రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ మేరకు రామకృష్ణ ఆర్ అండ్ బి అధికారులతో రైతులు సమస్యను చర్చించారు. తక్షణమే ఈ ప్రాంతంలో క్రాసింగ్ ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో రోడ్డు పనులు అడ్డుకు తీరుతామని హెచ్చరించారు.

రుద్రభూమి ఆక్రమణపై తహసీల్దార్ విచారణ

(నక్కపల్లి, ప్రభాతవార్త):

మండలంలోని అమలాపురం గ్రామం నందు రుద్రభూమి ఆక్రమణ పై తాసిల్దార్ చిన్ని కృష్ణ మంగళవారం గ్రామస్తులు సమక్షంలో విచారణ చేపట్టారు. గత కొద్దిరోజులుగా జరుగుతున్న పరిణామాలపై మంగళ వారం వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ నాయకత్వంలో ఈ ఆక్రమణపై తాసిల్దార్ తోపాటు సిఐ లకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసినదే.! ఈ మేరకు గ్రామ ప్రజలు తో కలిసి అమలాపురం గ్రామ రుద్ర భూమిని తాసిల్దార్ చిన్ని కృష్ణ , ఎస్సై సన్నీ బాబు లు పరిశీలించారు. రెండు రోజుల్లోగా ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. సమస్య పరిష్కరించకపోతే ఆందోళన తప్పదని వీసం రామకృష్ణ అధికారులకు తెలియజేశారు. వైకాపా రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి సూరకాసుల గోవిందు, వంకా కృష్ణ ,తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు మండల స్థాయి పోటీలు

(నక్కపల్లి, ప్రభాతవార్త):

ఆగస్టు ఒకటిన భోగాపురంలో అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టును ప్రధాని నరేంద్రమోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ప్రారంభోత్సవం చేయుచున్న శుభ సంధర్భముగా "ఉత్తరాంధ్ర కళలకు రెక్కలు"– అనే అంశంపై మండల స్థాయిలో వ్యాసరచన పోటీలు,గిరిజన సంస్కృతి,స్థానిక ఉత్పత్తులు ,గ్లోబల్ మార్కెట్ అనే అంశంపై నిర్వహించిన ఛిత్రలేఖనం, క్విజ్ (ప్రశ్నావినోదం) పోటీలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది .ఈనెల 27 న పాఠశాలలో నిర్వహించిన పోటీలలో విజేతలు మండలస్థాయిలో 29న స్థానిక బాలికోన్నతపాఠశాలలో పాల్గొన్నట్లు హెచ్.ఎమ్ వి.శ్రీలక్ష్మి తెలిపారు. ఈ పోటీలకు పరిశీలకులుగా వ్యవహరించిన ఎం.ఈ.వో .కే.నరేష్ , ప్రధానోపాధ్యాయులు వి.బాలాజీ మాట్లాడుతూ రేపటి ఆంధ్రప్ర దేశ్ ఆర్థికాభివృద్ధికి,ప్రపంచంతో అనుసంధానానికి ప్రతీకగా భోగాపురం ఎయిర్పోర్టు ప్రతీకగా నిలిచిందన్నారు. ఉత్తరాంధ్ర కళలకు రెక్కలు అనే పేరుతో పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించడంద్వారా ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధికార్యక్రమాలపై అవగాహన కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. భోగాపురం..ఇప్పుడు ఇది పేరుకాదని ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును ప్రపంచానికి పరిచయం చేసే బ్రాండ్ అని బాలాజీ పేర్కొన్నారు. పోటీలలో అదనపు ఎం.ఈ.వో ఆర్.నాగన్న దొర, చినదొడ్డిగల్లు హైస్కూల్ హెచ్.ఎమ్. వి.బాలాజీ , బాలికల హైస్కూల్ హెచ్.ఎమ్. వి.శ్రీలక్ష్మి,ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, ఎ.సత్యవతి, గుణావతి ,నాగశివరామ్ , తదితరులు పాల్గొన్నారు. క్విజ్ మాష్టర్లుగా పి.నాగేశ్వరరావు, ఎన్.వి.ఎస్. ఆచార్యులు వ్యవహరించారు. మండలంలో వివిధ ఉన్నత పాఠశాలల నుంచి 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం : ఎమ్మెల్యే

ఎలమంచిలి, జూలై 29, ప్రభాతవార్త:

పట్టణంలోని టోయేట్స్ రేర్ ఎర్త్ ఇండియా సంస్థ సామాజిక బాధ్యత సి ఎస్ ఆర్ నిధులు సహకారంతో సామాజిక ఆరోగ్య కేంద్రం సిహెచ్ సి ఆవరణలో నూతన గోపి అదనపు భవనం, నూతన అంబులెన్స్ ను ఎమ్మెల్యే సుందర విజయకుమార్ బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే సుందరపు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. ఆసుపత్రుల్లో నీ మౌలిక సదుపాయాలు మెరుగుపరచడంతో పాటు అత్యవసర వైద్య సేవలను మరింత వేగవంతంగా అందించేందుకు నూతన అంబులెన్స్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రభుత్వంతో పాటు పారిశ్రామిక సంస్థలు కూడా తమ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేయూతనవ్వడం అభినందనీయమని అన్నారు. టోయేట్స్ వేర్ ఎర్త్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అందించిన సహకారానికి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. టోయేట్స్ ఎర్త్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి వైద్యులు నిహారిక ,సిబ్బంది,కూటమి నాయకులు టీడీపీ పచ్చని పార్టీ అధ్యక్షులు గొర్లె నానాజీ, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు అన్నం బాబ్జి, ఊటకూటి రమేష్ నాయుడు, కొటారు శ్రీనివాసరావు, కర్రీ ఝాన్సీ,లాలం సోమినాయుడు, గంధం శివ పాల్గొన్నారు.

అయినంపూడి కుటుంబాన్ని పరామర్శించిన వైకాపా నాయకులు

(నక్కపల్లి, ప్రభాతవార్త):

మండలంలోని వేంపాడు మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు, జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అయినంపూడి బంగారు రాజు (మణి రాజు), జిల్లా యూత్ నాయకులు సురేష్ రాజు, వెంకటపతి రాజు కుటుంబాలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం సాయంత్రం వేంపాడు లో ఉన్న వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. మండలంలోని గునుపూడి మాజీ సర్పంచ్ సీనియర్ నాయకులు అయినంపూడి చిన్న పేర్రాజు (బాబు) అనారోగ్యంతో నాలుగు రోజుల క్రితం మృతి చెందిన విషయం తెలిసినదే. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పాయకరావుపేట నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కంబాల జోగులు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి వీసం రామకృష్ణ బాబులు రాజు చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. బాబుల రాజు కుమారుడు సురేష్ రాజు, లక్ష్మీపతి రాజు లకు ధైర్యం చెప్పారు. వారితో పాటు మండల పరిషత్ అదనపు ఉపాధ్యక్షులు వెలగ ఈశ్వరరావు, మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందు, మాజీ సర్పంచ్ తల్లా భార్గవ్, ఎస్ రాయవరం మండల పార్టీ అధ్యక్షులు మధువర్మ, ఎంపీటీసీ తోట సత్తిబాబు, తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

కరణం రవికుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికీ టీడీపీ

ఎలమంచిలి, జూలై 29, ప్రభాతవార్త:

మున్సిపాలిటీ పరిధిలో ని 12వ వార్డు లోనే ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని బుధవారం క్లస్టర్ ఇంచార్జ్ కరణం రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు కరపత్రాల ద్వారా వివరించారు. టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు గొర్లె శివనారాయణ మూర్తి (నానాజీ) తెలుగు యువత అధ్యక్షులు నమ్మిరమణ, వార్డు అధ్యక్షులు ఊట సతీష్ వార్డు బూత్ ఇన్చార్జులు పాల్గొన్నారు.

గురువుల గౌరవానికి ప్రతీకగా గురుపూజోత్సవం

ఆనందపురం, జూలై 29, ప్రభాతవార్త

గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఆనందపురం మండలం గొట్టిపల్లిలోని శ్రీ సత్యసాయి ఇంటిగ్రేటెడ్ సేవా మందిరంలో శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం గురుపూజోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో సాగగా భక్తులు, విద్యార్థులు, సేవా సమితి సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గురువులు సమాజానికి మార్గదర్శకులని, వారి బోధనల ద్వారానే మంచి పౌరులు రూపుదిద్దు కుంటారని పేర్కొన్నారు. గురువుల సేవలు అమూల్యమైనవని కొని యాడారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పందిరి కనకే శ్వరరావు, ఎస్ఎస్‌పి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అద్దాల వెంకటాచారిలను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. విద్యా రంగంలో వారు అందిస్తున్న విశిష్ట సేవలను అభినందిస్తూ సమితి సభ్యులు శాలువాలతో సత్కరించారు. అనంతరం బాలవికాస్‌లో కొత్తగా చేరిన విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. విద్యార్థులు విద్యాభ్యాసంలో రాణించడంతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సేవాభావాన్ని అలవర్చుకోవాలని నిర్వాహకులు సూచించారు. బాలవికాస్ కార్యక్రమాలు పిల్లల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడుతున్నాయని తెలిపారు. సమితి కో-ఆర్డినేటర్ డబ్బీరు విజయ్ కుమార్, కన్వీనర్ కోరాడ తమ్ము నాయుడు, భజన మండలి కన్వీనర్ డి.పి.రాజు, సేవాదళ్ కో-ఆర్డినేటర్ బుత్తల సత్యం, ఆధ్యాత్మిక కో-ఆర్డినేటర్ వి.కృష్ణమూర్తి రాజు, యూత్ కో-ఆర్డినేటర్ డి.కార్తీక్, మహిళా కో-ఆర్డినేటర్ ఆర్.సునీత, మహిళా యూత్ కో-ఆర్డినేటర్ సంధ్యతో పాటు సేవా సమితి సభ్యులు, భక్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

షిరిడి సాయిబాబాకు విష్ణు సహస్ర పారాయణంతో లక్ష గులాబీలతో పుష్పార్చన

మాధవధార, జూలై 29, ప్రభాతవార్త

స్థానిక మురళి నగర్ రామాలయంలో శ్రీ షిరిడి సాయి ధ్యాన మందిరం 20వ గురు పౌర్ణమి పూజ మహోత్సవ కార్యక్రమాలలో భాగముగా బుధవారం తెల్లవారుజాము నుంచి విశేషమైన ద్రవ్య వనమూలికలు మరియు సుగంధ పంచామృత అభిషేకం అత్యంత వైభవంగా జరిగింది. అనంతరం శ్రీ సాయినాథునికి విశేషమైన అలంకరణ చేసి మాధవధార మురళి నగర్ పరిసర ప్రాంత మహిళ మహిళలతో విష్ణు సహస్ర పారాయణంతో లక్ష గులాబీ పుష్పార్చన వచ్చిన వేలాది మంది భక్తుల చేతుల మీదుగా జరిగింది. తరువాత ఉదయం 10 గంటలకు గురుపాదుకపూజ శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మం ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ శ్రీ గోపి నంబాల కూర్మన్న దాసు బాబుకు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్పెషల్ ఎస్పీ బి.నారాయణరావు విచ్చేశారు అనంతరం సాయి దత్త మూలమంత్రోహం జరిగింది విశేషమైన నక్షత్రారతి పూజా కార్యక్రమాలు చేసి నారాయణ సేవ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి అధ్యక్షులు టి నారాయణరెడ్డి, సనపల వర ప్రసాద్, ఉపాధ్యక్షులు పెంటకోట వెంకటరమణ, ఎస్ సత్యనారాయణ రావు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ 20 సంవత్సరాల నుండి ఎంతోమంది మహానుభావులను తీసుకువచ్చి గురుపాదుకు చేయడం జరిగింది అని అన్నారు ఈ సంవత్సరం తీసుకొచ్చిన గురువు గురించి చెబుతూ ఆయన విద్య సరస్వతి పుత్రులని వారి మంత్ర బలం అనుస్థానం వాత్సల్యం చాలా ఎక్కువ అని వారిని కొనియాడారు.

నేడు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఆనందపురం, జూలై 29, ప్రభాతవార్త

ఆనందపురం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా గురువారం ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు 11 కేవీ గంభీరం ఫీడర్, పెద్దిపాలెం ఫీడర్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆపరేషన్), బి. సింహాచలం నాయుడు తెలిపారు. ఈగలవానిపాలెం, మెట్టమీదపాలెం, పాలవలస, దుక్కవానిపాలెం, నగరంపాలెం, తర్లువాడ, గుడిలోవ, పెద్దిపాలెం, కురాకులవారి కల్లాలు, బావిశెట్టివారి కల్లాలు, సోమీ లేఅవుట్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని తెలిపారు. ఈ ప్రాంతాల్లోని గృహ, వాణిజ్య మరియు పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులు విద్యుత్ అంతరాయాన్ని దృష్టిలో ఉంచుకుని తమ పనులను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. సింహాచలం నాయుడు విజ్ఞప్తి చేశారు.

విమానాశ్రయం ప్రారంభోత్సవానికి జన సమీకరణ సమావేశాలు

ఆనందపురం, జూలై 29, ప్రభాతవార్త

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆగస్ట్ 1న జరగనున్న అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయడానికి ఆనందపురం మండలంలో విస్తృత స్థాయిలో జన సమీకరణ కార్యక్రమాలు చేపట్టారు. భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, ప్రజలను బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రోగ్రామ్ ఇన్‌చార్జి శ్రీధర్, ఆనందపురం మండల పార్టీ అధ్యక్షుడు తాత్రాజు అప్పారావు, క్లస్టర్ ఇన్‌చార్జి మీసాల సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ సోంబాబు, వైకుంఠం, అంగటి రాము, చందవరపు కుమార్, కొట్యాడ లక్ష్మణమూర్తి, కరోతు సత్యనారాయణ, లెంక నర్సింగరావు, బంటుబిల్లి వెంకట్రావు, బంటుబిల్లి బంగార్రాజు పలువురు నాయకులు పాల్గొన్నారు. మండలంలోని తర్లవాడ, శొంట్యాం, మామిడిలోవ, గండిగుండం, రామవరం, కణమాం, గిడిజాల, ముచ్చర్ల గ్రామ సచివాలయాలను సందర్శించి, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా సంఘాల మహిళలు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించారు. ఆగస్టు 1న జరిగే బహిరంగ సభకు గ్రామాల నుంచి ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

భోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభోత్సవాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి

పద్మనాభం, జూలై 29, ప్రభాతవార్త

దేశ ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పెదకూరపాడు నియోజవర్గం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ నాయకుల్ని కోరారు. మండల టిడిపి అధ్యక్షుడు కే.రమణ ఆధ్వర్యంలో బుధవారము మండల పరిషత్ కార్యాలయంలో పిఎం సభ నిర్వహణపై మండల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు ఎయిర్పోర్ట్ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయడానికి అందరూ కృషి చేయాలి. పద్మనాభం మండలానికి 4500 మందిని సభకు తీసుకెళ్లడానికి 90 బస్సులను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు కష్టపడిన వారిని టిడిపి గుర్తించి రానున్న రోజుల్లో మంచి పదవులను ఇస్తుందని ఆయన అన్నారు. ప్రజలకు ప్రభుత్వమే అల్పాహారం ఏర్పాటు చేసిందని చెప్పగానే గంధవరం పిఏసిఎస్ చైర్మన్ జుత్తాడ గణేష్ తో పాటు పలువురు నాయకులు మాట్లాడారు. గతంలో పీఎం సభకు తీసుకెళ్లినప్పుడు ప్రజలకు పాచిపోయిన అన్నం పెట్టారని దీంతో గ్రామాల్లో ప్రజలు నాయకుల్ని దుర్భాషలు ఆడారని అన్నారు. ఆ విషయం నాయకులు దృష్టిలోకి వెళ్ళిందని ఈసారి పసందైన రుచికరమైన భోజనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు, తూర్పు కాపు డైరెక్టర్లు లీలావతి, పెద్ద కాపు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ సభ్యులు దామోదర్ రావు, రామరాజు, ఎర్రి బాబు, కృష్ణంరాజు, కర్రి రమణ, రుబ్బు సూర్యనారాయణ, గెడ్డ ప్రసాదు పాల్గొన్నారు.

హై ఫై ప్రీమియర్ క్రికెట్ లీగ్ ఘనంగా ప్రారంభం

ఎనిమిది జట్ల మధ్య పోటా పోటీ -లీగ్‌ను ప్రారంభించిన రైల్వే డిఎఫ్ఎం హరినాథ్ మోపురి

విశాఖపట్నం, జూలై 29, ప్రభాతవార్త

హై ఫై ప్రీమియర్ క్రికెట్ లీగ్ పోటీలు అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం రైల్వే గ్రౌండ్లో జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రైల్వే డి ఎఫ్ ఎం హరినాథ్ మోపురి ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. మొత్తం ఎనిమిది జట్లు ఈ పోటీల్లో పాల్గొనగా ఆగస్టు 4వ తేదీన ఫైనల్స్ జరగనున్నాయి. సందర్భంగా హరినాథ్ మాట్లాడుతూ ఈవెంట్ మేనేజ్మెంట్ రంగంలో వివిధ శాఖల్లో నిష్ణాతులైన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనడం అభినందనీయ మన్నారు. నిత్యం ఒత్తిడితో కూడుకున్న విధుల్లో ఉండే ఈవెంట్ మేనేజర్లు, కళాకారులు, సాంకేతిక నిపుణులు, క్యాటరర్స్ ఈ క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసాన్ని పొందగలుగుతారు అన్నారు. కార్యక్రమంలో ఆయనతోపాటు శాప్ డైరెక్టర్ రాజా, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు లింగేశ్వరరావు, ఈవెంట్ మేనేజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అరుణ్ కుమార్, ఏపీ చాంబర్ ఆఫ్ ఈవెంట్ ఇండస్ట్రీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి ఎన్ రాజు తదితరులు ఉన్నారు. హై ఫై ప్రీమియర్ క్రికెట్ లీగ్ నిర్వాహకులు ఎం సందీప్ కుమార్, షరీఫ్ ఖాన్, పి.సురేష్ బాబు, సంతోష్ కుమార్ ల నేతృత్వంలో జరుగుతున్న ఈ పోటీలకు అద్భుతమైన స్పందన లభించింది. సుమారు 200 మంది ఈవెంట్ సంబంధిత రంగ క్రీడాకారులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు.

పద్మనాభంలో విజయవంతమైన గీతం ఆసుపత్రి మెగా ఉచిత వైద్య శిబిరం

పద్మనాభం, జూలై 29, ప్రభాతవార్త

పద్మనాభం గ్రామంలో ఎంపీ శ్రీ భరత్ ఆదేశాల మేరకు గీతం ఆసుపత్రి సౌజన్యంతో భీమిలి ఎమ్మెల్యే గంట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక ఎంపీటీసీ కే.లక్ష్మి నాయుడు సహాయంతో బుధవారము నిర్వహించిన గీతం ఆస్పత్రి మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ వైద్య శిబిరాన్ని సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు కె.దామోదర్ రావు ప్రారంభించారు. గీతం ఆసుపత్రికి చెందిన పది డిపార్ట్మెంట్ల వైద్యులు సుమారు 420 మందికి వైద్య చికిత్సలు చేసినట్లు ఎంపీటీసీ లక్ష్మి చెప్పారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ శిబిరం కొనసాగింది. ప్రజల్నించి విశేష స్పందన లభించింది. అలాగే ప్రజలకు ఆరోగ్యంపై వైద్యులు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రి నాయుడు, సుమంత నాయుడు, కె.సత్యనారాయణ, గోపి బాబు, ఆర్.సూర్యనారాయణ, రమణ, కర్రి రమణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

మాజీ సీఎం వైఎస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మొల్లి హేమంత్

ఆరిలోవ, జూలై 29, ప్రభాతవార్త

జననేత వైఎస్ఆర్సిపి జాతీయ అధ్యక్షులు, ఆంధ్ర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ను తాడేపల్లిలో విశాఖ తూర్పు నియోజకవర్గం 12వ వార్డు అధ్యక్షులు మొల్లి హేమంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మొల్లి హేమంత్ కుటుంబ యోగక్షేమాల గురించి జగన్ అడిగి తెలుసుకున్నారు. తూర్పు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, రానున్న స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్ పార్టీ విజయం సాధించే దిశగా ముందుకు వెళ్లాలని తెలియజేశారు.

వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు

చినగదిలి సాయిబాబా ఆలయంలో పోటెత్తిన భక్తజనం

ఆరిలోవ, జూలై 29, ప్రభాతవార్త

గురు పౌర్ణమి మహోత్సవాన్ని పురస్కరించుకొని చినగదిలి నార్త్ షిరిడి సాయిబాబా ఆలయంలో వేకువ జాము నుండి ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ ఆలయంలో ఉన్న గురు బాబా, దైవ బాబా లకు పట్టు వస్త్రంతో, పూలదండలతో విశేషాలంకరణలు ఆలయ పురోహితులు నగేష్ శర్మ, ప్రభాష్ జరిపారు. ఆరిలోవ, ఆదర్శనగర్, హనుమంతవాక, కృష్ణాపురం తదితర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. ఉదయం 11 గంటలకు జరిగిన అన్నాభిషేక కార్యక్రమంలో వ్యాపారవేత్త రమేష్‌బాబు, ఏయూ మాజీ జాయింట్ రిజిస్టర్ గవర్ రాజు దంపతులు పాల్గొన్నారు. మధ్యాహ్నం హారతి కార్యక్రమంలో పాల్గొన్న మహిళలతో బాబా ఆలయం కిక్కిరిసింది. మధ్యాహ్నం 2వేల మంది భక్తులకు ఆలయ కమిటీ విందు భోజనం ఏర్పాటు చేసింది. ఆలయ చైర్మన్ ట్రస్టి వానపల్లి అప్పారావు పర్యవేక్షణలో ఈ వేడుకలు జరిగాయి.

పాట్నూరు గ్రామంలో ఎల్ నినో ప్రభావంపై రైతులకు అవగాహన సదస్సు

పద్మనాభం, జూలై 29, ప్రభాతవార్త

మండలంలో పొట్లూరు గ్రామంలో ఎల్ నేనునినో ప్రభావంపై వ్యవసాయ అధికారులు బుధవారము రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆత్మ ప్రాజెక్టు డిడి చంద్రరావు, భీమిలి ఏడిఏ విజయ ప్రసాద్, శాస్త్రవేత్తలు రవికుమార్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాబావభావ పరిస్థితులు నెలకొన్నాయని, దీంతో రైతులు వరి పంటకు బదులు ఆరుతడి పంటలు వేసుకోవాలని వేసుకోవాలని వారు సూచించారు. తక్కువ నీటితో పండే కొర్రలు, మినుములు, పెసలు, చోడి తదితర పంటలను సాగు చేసుకోవాలని వారు చెప్పారు. పంటల భీమా ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో ఎకరాకు 420 ఆగస్టు 14 లోపు చెల్లిస్తే ఎకరాకు 44 వేల రూపాయలు బీమా వర్తిస్తుందని వారు తెలిపారు. అనంతరం వరి నారుమడులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో సింహాచలం, రైతులు పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆరిలోవ, జూలై 29, ప్రభాతవార్త

విశాఖ పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీ భరత్ జన్మదిన సందర్భంగా బుధవారం 44వ వార్డు గ్రామ ప్రజల ఆరాధ్య దైవం శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంలో టీడీపీ వార్డు అధ్యక్షులు గారపాటి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎంపీ శ్రీ భరత్ ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకున్నారు. వార్డ్ క్లస్టర్ ఇన్‌చార్జ్ మల్ల లక్ష్మి, కో-క్లస్టర్ ఇన్‌చార్జ్ మల్ల నిర్మల, ఐటీడీపీ వార్డు అధ్యక్షులు పోలమరసెట్టి చక్రవర్తి, వార్డు నాయకులు బత్తుల సంజీవరావు, పుష్ప, వెంకట లక్ష్మితో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనంత పద్మనాభ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ

పద్మనాభం, జూలై 29, ప్రభాతవార్త

పద్మనాభ పుణ్యక్షేత్రంలో వేంచేసిన అనంత పద్మనాభ స్వామి పుణ్యక్షేత్రాన్ని బుధవారము పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు రాష్ట్ర కృష్ణ బలిజి కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు, పెద్దాపురం నియోజక వర్గం తూర్పు కాపు డైరెక్టర్ గడ్డం పెదకాపులు అనంతపద్మనాభ స్వామి కొండ దిగిన వేంచేసిన కుంతీ మాధవస్వామిని, లక్ష్మీదేవిని, దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరము ఆలయ అర్చకులు పవన్ కుమార్ అనంత పద్మనాభ స్వామి స్థల పురాణం, చరిత్ర, ఆలయంలో జరుగుతున్న స్వామివారి ఉత్సవాలను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కే.రమణ, నాయకులు దామోదర్ రావు, కాపు డైరెక్టర్ లీలావతి, గంగరాజు, రామరాజు, నందీష్, గోపిబాబు, కే సత్యనారాయణ, శ్రీరామ్ మూర్తి, ఎర్రిబాబు, ఆర్.సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఓమౌజయాః ఏకోపాసన మహాధర్మం ఆధ్వర్యంలో శ్రీగురు పూర్ణిమ మహోత్సవ వేడుకలు

విశాఖపట్నం, జూలై 29, ప్రభాతవార్త

శ్రీశ్రీశ్రీ పరమ పూజ్య మహా ప్రేమావతార మూలాధి పరా స్వయంభూః మహత్తు పరబ్రహ్మ శ్రీ జైమహావిభోశ్రీః వారి దివ్యానుగ్రహ మహిమాన్విత సన్నిధానం విశాఖ, రైల్వే న్యూ కాలనీ, సుబ్బలక్ష్మి కళ్యాణ మండపంలో ఓమౌజయాః శ్రీగురు పూర్ణిమ 'మహోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిపారు. ఓమౌజయాః ఏకోపాసన మహాధర్మం ఆధ్వర్యంలో ప్రేమమయా మహాగురూజీ వారి ఆజ్ఞలో ఉదయం పరానాగేంద్ర స్థాపన, ఓమౌజయాః స్వయంభూః చైతన్య శక్తిపీఠం శోభాయాత్ర పెద్ద ఎత్తున పూర్తి చేశారు. సాయంత్రం మహా పంచముఖ మహా గాయత్రి గురు ఖడ్గ యజ్ఞాన్ని పరార్థ ఓమౌజయా శ్రీపరమోజీ త్రిగుణాత్మ సిద్ధ, కార్యనిర్వాహక అధికారి సత్యోమౌజయా విశ్వ చైతన్య సుందర మూర్తి సమక్షంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం శ్రీధర్మ పరిచయ వేదిక, భక్తి గీతాలు ఆవిష్కరణ ఆధ్యాత్మిక గ్రంథాల ఆవిష్కరణ జరిపారు. యజ్ఞానంతరం భక్తులకు దివ్య ప్రసాదం, ఉచిత అన్నప్రసాద వితరణ చేశారు. ఈ వేడుకల్లో సత్యోమౌజయులు సృజన భారతి, బుద్ధ గౌడ్, విశ్వభర, ఓమౌజయాః వివిధ సేవా సమితి సభ్యులు, అధిక సంఖ్యలో నగరంలోని భక్తులు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

శేరిఖండం గ్రామంలో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

పద్మనాభం, జూలై 29, ప్రభాతవార్త

మండలంలో షేరీఖండం గ్రామంలో ఉన్న సాయినాథ ధ్యాన మందిరంలో బుధవారము ధ్యాన మందిరం ధర్మకర్త సంగు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబాకు ఉదయం కాకడ హారతితో పాటు పంచామృత అభిషేకాలు ఆలయ అర్చకులు నిర్వహించారు. అనంతరం భక్తులు సాయిబాబాకు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రము గ్రామంలో భక్తిశ్రద్ధలతో పల్లకి ఉత్సవమును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సంపత్ సాయి ఆలయంలో అత్యంత వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు

ఈ మహోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జి.వి.రామచంద్రరావు, పల్లా దుర్గారావు

విశాఖపట్నం, ప్రభాతవార్త

విశాఖపట్నం నగరంలోని 28వ వార్డు రామనగర్, పాత జైలు రోడ్ సమీపంలోని రెడ్నమ్ గార్డెన్స్ వద్ద వెలసియున్న శ్రీ శ్రీ సంపత్ సాయి ఆలయంలో గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల కోలాహలం నడుమ ఆధ్యాత్మిక వాతా వరణం సంతరించుకుంది. ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జి.వి.రామచంద్రరావు, నాయకులు పల్లా దుర్గారావు ముఖ్య అతిథులుగా హాజరై అన్నదానాన్ని లాంఛనంగా ప్రారంభించారు.

ప్రసాద స్వీకరణలో వేలాది మంది భక్తులు..

అనంతరం జి.వి. రామచంద్రరావు మరియు ఇతర ప్రముఖులు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వయంగా భక్తులకు ప్రసాద పంపిణీ చేశారు. ఈ మహోత్సవంలో రామనగర్, రెడ్నమ్ గార్డెన్స్ పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన సుమారు 5,000 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కమిటీ అధ్యక్షులు సిమ్మా శ్రీను, డి.భాస్కర్ రావు, కోశాధికారి నూకరాజు, సిమ్మా వినయ్, అప్పల రాజు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నర్సీపట్నం 19వ వార్డులో రూ.25.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, కాలువలు ప్రారంభం

అభివృద్ధికి పట్టంకట్టే నాయకులకే ప్రజలు అండగా ఉండాలి: చింతకాయల పద్మావతి

నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు కొత్త బైపరెడ్డి పాలెంలో రూ.25.50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు, కాలువలను ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి చింతకాయల పద్మావతి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి, అభివృద్ధి పనులను రిబ్బన్ కట్ చేసి జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు, నాయకులు వారికి హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చింతకాయల పద్మావతి మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. గతంలో కౌన్సిలర్‌గా ఉన్నప్పుడు వార్డు అభివృద్ధికి నిధులు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని, కానీ నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి వేగవంతమైందని పేర్కొన్నారు. గతంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇచ్చిన మాట ప్రకారం వార్డుల వారీగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా ఇప్పటికే కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయని, రాబోయే రోజుల్లో ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి సౌకర్యంతో పాటు రహదారులు, డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. అభివృద్ధికి పట్టంకట్టే విజన్ ఉన్న నాయకులకు ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ మాట్లాడుతూ, వార్డులో కౌన్సిలర్ ప్రాతినిధ్యం ఉన్నా లేకపోయినా ప్రతి వార్డునూ సమానంగా చూస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్న ఘనత స్పీకర్ అయ్యన్నపాత్రుడు దేనని అన్నారు. 19వ వార్డులో రూ. 22.50 లక్షల అభివృద్ధి పనులతో పాటు స్మశాన వాటిక అభివృద్ధికి మరో రూ.15 లక్షల నిధులు మంజూరు చేయించడం అభినందనీయమని తెలిపారు. గ్రామస్తులు, నాయకులు చూపిన చొరవను అభినందిస్తూ, రాబోయే రోజుల్లో కూడా ప్రాంతాభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీకి, అభివృద్ధికి తోడ్పడే నాయకులకు ప్రజలు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రాంబాబు, సత్తిబాబు, దనిమిరెడ్డి మధు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

భోగాపురం ఎయిర్‌పోర్ట్ రన్-5 పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

విశాఖపట్నం, జూలై 29ప్రభాత వార్త

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీ శుక్రవారం నిర్వహించనున్న "భోగాపురం ఎయిర్‌పోర్ట్ రన్-5" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్, డిఆర్డిఓ,జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డిఎస్డిఓ) జూన్ శాప్ కోచ్‌లు వి.దాస్, వైకుంఠలతో. కలిసి బుధవారం ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతుందని, ఈ ఎయిర్‌పోర్ట్ ప్రాంతీయ అభివృద్ధికి, ఉపాధి అవకాశాల పెరుగుదలకు, పర్యాటక రంగ విస్తరణకు, పెట్టుబడుల ఆకర్షణకు, అంతర్జాతీయ అనుసంధానానికి కీలకంగా మారనుందని అన్నారు. "ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు తొడిగే మహత్తర ప్రాజెక్టు భోగాపురం ఎయిర్‌పోర్ట్" అని ఆయన పేర్కొన్నారు.ఈ అభివృద్ధికి ప్రజలంతా భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో జూలై 31న ఉదయం 5:45 గంటలకు పార్క్ హోటల్ నుండి తేనేటి పార్క్ వరకు 5 కిలోమీటర్ల రన్ నిర్వహిస్తున్నామని, విశాఖపట్నం ప్రపంచ స్థాయి గ్లోబల్ గేట్‌వేగా ఎదుగుతున్న ఈ చారిత్రక సందర్భంలో ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఈ రన్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ఎటువంటి ప్రవేశ రుసుము లేదని, అలాగే వయోపరిమితి కూడా లేదని తెలిపారు. పురుషులు, మహిళలు, విద్యార్థులు, యువత,క్రీడాకారులు, ఫిట్‌నెస్‌అభిమానులు, అన్నివయస్సులవారుఈరన్‌లో పాల్గొనవచ్చునిపేర్కొన్నారు. డిఎస్డిఓ జూన్ మాట్లాడుతూ, జిల్లా పరిధిలోని అన్ని క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు, శారీరకవిద్య ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సాయిబాబా ఆలయంలో ఘనంగా గురు పూర్ణిమ వేడుకలు

సాలాపు రామారావు దంపతుల ఆధ్వర్యంలో అన్నాభిషేకం-గత 30 ఏళ్లుగా లోక కళ్యాణార్థం ప్రత్యేక పూజలు: చిన్నా

గాజువాక,జూలై 29,ప్రభాతవార్త

గురు పూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ 63వ వార్డు సిందియా న్యూ కాలనీలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. 72వ వార్డు తెదేపా సీనియర్ నాయకులు, శ్రీశ్రీశ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం డైరెక్టర్ సాలాపు రామారావు (చిన్నా) దంపతులు ఈ వేడుకల్లో పాల్గొని సాయిబాబాకు భక్తిశ్రద్ధలతో అన్నాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సాలాపు రామారావు భక్తులందరికీ గురు పూర్ణిమ శుభాకాంక్షలు తెలిపారు. లోక కళ్యాణార్థం గత 30 సంవత్సరాలుగా గురు పూర్ణిమ పర్వదినాన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయిబాబా ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీను, పలువురు భక్తులు పాల్గొన్నారు.

శ్రీ సత్యనారాయణ స్వామిని దర్శించికున్న హోంమంత్రి అనిత

విశాఖపట్నం, జూలై 29ప్రభాత వార్త

విశాఖపట్నంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, పూర్ణ మార్కెట్ సమీపంలోని కొండపై వెలసిన శ్రీ సత్యనారాయణ స్వామి వారిని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత గురుపౌర్ణమి సందర్భంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న హోంమంత్రి అనితకు దేవస్థాన అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను హోంమంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులతో ఆప్యాయంగా మాట్లాడిన హోంమంత్రి అనిత వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గురుపౌర్ణమి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీ సత్యనారాయణ స్వామిని వారిని మంత్రి ప్రార్థించారు.

30-7Pg7exHMNWJQE.qxd:30-7Pg7exHMNWJQE.qxd 1/1/02 6:05 AM Page 1

ఆగస్టు 12న సూర్యగ్రహణం

న్యూఢిల్లీ, జులై 29: సంపూర్ణ సూర్యగ్రహణం వచ్చేనెల 12న సంభవించనుంది. ప్రపంచవ్యాప్తంగా ఖగోళ శాస్త్రవేత్తలు, ఔత్సాహికులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ అరుదైన దృశ్యం భారతదేశంలో మాత్రం కనిపించదు. మన దేశంలో ఆ సమయానికి రాత్రి అవుతుండటమే ఇందుకు ప్రధాన కారణం. సూర్యుడికి, భూమికి మధ్య చంద్రుడు అడ్డుగా వచ్చినప్పుడు సంపూర్ణ సూర్యగ్రహణం ఏర్పడుతుంది. చంద్రబింబం సూర్యుడిని పూర్తిగా కప్పివేయడంతో పగటిపూట కూడా ఆకాశం చీకటిగా మారి, ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోతాయి. ఆ సమయంలో నక్షత్రాలు, గ్రహాలు కూడా స్పష్టంగా కనిపించే అవకాశం ఉంటుంది. నాసా శాస్త్రవేత్తల కథనం ప్రకారం, సూర్యుడు చంద్రుడి కంటే 400 రెట్లు పెద్దదైనప్పటికీ, అదే స్థాయిలో (400 రెట్లు) దూరంగా ఉండటం వల్ల ఆకాశంలో చంద్రుడు, సూర్యుడు దాదాపు ఒకే పరిమాణంలో కనిపిస్తాయి. ఈ సంపూర్ణ గ్రహణం గ్రీన్‌లాండ్, ఐస్‌లాండ్, స్పెయిన్, పోర్చుగల్‌లోని కొన్ని ప్రాంతాలతో పాటు ఉత్తర రష్యా, అట్లాంటిక్ మహాసముద్రం పరిధిలో కనిపిస్తుంది. ఇక ఉత్తర అమెరికా, కెనడా, యూరప్, వాయువ్య ఆఫ్రికాలోని పలు ప్రాంతాల్లో పాక్షిక సూర్యగ్రహణాన్ని వీక్షించే అవకాశం ఉంది. భారత కాలమానం ప్రకారం, ఆగస్టు 12 రాత్రి 9:45 గంటలకు ప్రారంభ మయ్యే ఈ గ్రహణం, ఆగస్టు 13 తెల్లవారుజామున 2:15 గంటల వరకు కొనసాగుతుంది. ఈ సమయంలో మన దేశంలో సూర్యరశ్మి ఉండదు కాబట్టి గ్రహణాన్ని వీక్షించే వీలు లేదు. అందువల్ల, గ్రహణం సమయంలో పాటించే సూతక్ కాలం వంటి సాంప్రదాయ నియమాలు మనకు వర్తించవని పండితులు స్పష్టం చేస్తున్నారు.

స్టాప్ - థింక్ - వెరిఫై - దెన్ యాక్ట్‌తోనే సైబర్ మోసాలకు చెక్

• ప్రతి విద్యార్థి సైబర్ భద్రత రాయబారిగా మారాలి • జిల్లా ఎస్పి డా. అజితా వేజెండ్ల పిలుపు

నెల్లూరు(క్రైం), జులై 29 ప్రభాతవార్త: డిజిటల్ యుగంలో రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి విద్యార్థి సైబర్ భద్రత రాయబారిగా మారి సమాజంలో అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పి డా. అజితా వేజెండ్ల పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరు టౌన్ హాల్‌లో నిర్వహించిన సైబర్ భద్రత – సైబర్ సేఫ్టీ అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నగరంలోని కళాశాలలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు, ప్రజలు, పోలీసు అధికారులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ డిజిటల్ అరెస్ట్, లోన్ యాప్ మోసాలు, ఫిషింగ్ లింకులు, ఓటీపీ, క్యూఆర్ కోడ్, యూపీఐ మోసాలు, ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీములు, పార్ట్‌టైమ్ జాబ్ స్కామ్స్, సోషల్ మీడియా ఇంపర్సనేషన్, ఏపికె ఫైళ్లు, ఏఐ డీప్‌ఫేక్, వాయిస్ క్లోనింగ్ వంటి ఆధునిక సైబర్ నేరాలపై ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని ఫోటోలు మార్ఫింగ్ చేయడం, సోషల్ మీడియా ద్వారా బ్లాక్‌మెయిల్ చేయడం వంటి ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో వ్యక్తిగత ఫోటోలు, బ్యాంకు వివరాలు, ఓటిపి, యుపిఐ పిన్, సివివి వంటి గోప్యమైన సమాచారాన్ని ఎవరికీ తెలియజేయరాదని హెచ్చరించారు. ప్రతి విద్యార్థి కుటుంబం, గ్రామం, కాలనీలో సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తూ సైబర్ నేరస్థులపై పోరాటంలో ఆర్థిక యోధులుగా నిలవాలని పిలుపునిచ్చారు.

సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్, 112 అత్యవసర సేవలు లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. స్టాప్, థింక్, వెరిఫై, యాక్ట్ అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) సీహెచ్. సౌజన్య పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ రకాల సైబర్ మోసాలు, వాటి నుంచి రక్షణ మార్గాలను వివరించగా, టౌన్ ఎస్పీ దీక్ష జిల్లాలో ఇటీవల నమోదైన సైబర్ కేసులను ఉదాహరణలతో వివరించారు. నారాయణ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని చరిష్మా తమ కుటుంబం సైబర్ మోసానికి గురైన అనుభవాన్ని పంచుకుని అప్రమత్తత అవసరాన్ని వివరించారు. దర్గామిట్ట, బాలాజీనగర్, సంతపేట సీఐలు కళ్యాణరాజు, సాంబశివరావు, వైవి సోమయ్య కూడా తమ పరిధిలో నమోదైన సైబర్ కేసులను వివరించి ప్రజలకు సూచనలు అందించారు. అనంతరం సైబర్ భద్రత అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్న ఈ ర్యాలీ ద్వారా బాధ్యతాయుతమైన డిజిటల్ వినియోగం, ఆన్‌లైన్ మోసాల నివారణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు.

ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి రిమాండ్

చంచల్‌గూడ జైలుకు తరలింపు

హైకోర్టులో విచారణ నాలుగు వారాలు వాయిదా

హైదరాబాద్ (శంకర్‌పల్లి), జులై 29 ప్రభాతవార్త: మహిళా ట్రైనీఐపిఎస్ అధికారిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో అరెస్టు అయిన ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డికి రెండు వారాల రిమాండ్ విధిస్తూ ఉప్పర్పల్లి కోర్టు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 18న ఉదయ్ కృష్ణారెడ్డిపై లైంగిక వేధింపులకు సంబంధించి అత్తాపూర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదవడం తెలిసిందే. అనంతరం ఈ కేసును మహిళా భద్రత విభాగానికి బదలీ చేశారు. దీని తర్వాత ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసు అకాడమీ నుంచి సస్పెండ్ చేయగా బోరబండలోని తన స్నేహితుడి ఇంటికి వెళ్లి అతిగా మద్యం సేవించి అనారోగ్యానికి గురయ్యాడు. వెంటనే అతన్ని స్నేహితులు ఆస్పత్రికి తరలించడంతో మూడు రోజుల తర్వాత కోలుకున్నాడు. అనంతరం ఉన్నట్టు ఉండి సెల్ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకొని అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఇదే సమయంలో తనను పోలీసులు అరెస్టు చేయకుండా ఉండేందుకు ఉదయ్ కృష్ణారెడ్డి హైకోర్టును ఆశ్రయించాడు. ఈ కేసు హైకోర్టు విచారణలో ఉన్నది. ఓ వైపు ఉదయ్ కృష్ణారెడ్డికోసం పోలీసులు గాలిస్తుండగా మంగళవారం ప్రకాశం జిల్లా నుంచి ఉదయ్ కృష్ణారెడ్డి మీడియా ప్రకటన విడుదల చేశారు. తాను ఎక్కడికీ పారిపోలేదని, పోలీసులకు అందుబాటులో ఉన్నానని, హైదరాబాద్‌కు వస్తున్నట్లు తెలిపారు. అతని గురించి సమాచారం అందుకున్న పోలీసులు మంగవారం మిరియాలగూడవద్ద అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బుధవారం తెల్లవారుజామున నాటకీయ పరిణామాల మధ్య ఉస్మానియాలో వైద్య పరీక్షలు నిర్వహించి సాయంత్రం 4గంటల సమయంలో ఉప్పర్‌పల్లి కోర్టులో హాజరుపరచగా కోర్టు ఆగస్టు 11వరకు రిమాండ్ విధించింది. పోలీసు బందోబస్తు మధ్య చంచల్‌గూడ జైలుకు తరలించారు.

రైతు బజార్లకు పలమనేరు టమోటాలు

ప్రాంతీయ సంయుక్త సంచాలకులు సి.రామాంజనేయులు

పలమనేరు, జులై 29 ప్రభాతవార్త: రాష్ట్రంలోని రైతు బజార్లకు చిత్తూరు జిల్లా పలమనేరు మార్కెట్ కమిటీ నుండి టమోటాలు సరఫరా చేయనున్నట్లు కడప ప్రాంతీయ సంయుక్త మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు సి.రామాంజనేయులు తెలిపారు. పలమనేరు మార్కెట్ యార్డును మంగళవారం రాత్రి ఆకస్మికంగా సందర్శించిన ఆయన మాట్లాడుతూ ఈ నెల 29 నుండి 30 మెట్రిక్ టన్నుల టమోటాలు రైతు బజార్లకు తరలిస్తామన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడానికి వ్యవసాయ శాఖ ఈ చర్యలు చేపట్టినట్లు వివరించారు. రైతు బజార్లకు తరలించడానికి సిద్ధం చేసిన టమోటాల నాణ్యత గ్రేడింగ్ ప్యాకింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. మార్కెట్‌లో టమోటాల ధరలు పతనం కాకుండా ముందుగా రాజమహేంద్ర వరం, ప్రకాశం జిల్లా ఒంగోలు, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరు రైతు బజార్లకు పంపుతున్నట్లు సహాయ సంచాలకులు సి.రామాంజనేయులు తెలిపారు. అలాగే మదనపల్లె, గుర్రంకొండ, ములకల చెరువు, పుంగనూరు, సోమల మార్కెట్ యార్డులతో పాటు అనంతపురం జిల్లా నుండి కూడా రాష్ట్రంలోని వివిధ రైతు బజార్లకు టమోటాలు సరఫరా చేస్తామని తెలిపారు. పలమనేరు మార్కెట్ కమిటీ కార్యదర్శి సంజీవకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్.. శ్రీకాకుళం జిల్లా పర్యటనలో బహిరంగ సభలకు అనుమతి లేదు

• జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర్ రెడ్డి

శ్రీకాకుళం, జులై 29 ప్రభాతవార్త: మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గురువారం శ్రీకాకుళం జిల్లా పర్యటనకు సంబంధించి జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డి పర్యటన అనుమతులపై స్పష్టత ఇచ్చారు. 'వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, పార్టీ ప్రతినిధులు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి జిల్లా పర్యటనకు అనుమతి కోరుతూ దరఖాస్తు సమర్పించారు. ధరఖాస్తులో బహిరంగ సభ, ర్యాలీ, రోడ్ షో లేదా ప్రజా సమావేశాల నిర్వహణకు ఎలాంటి అనుమతి కోరలేదు. అలాగే ఆ తరహా కార్యక్రమాలకు సంబంధించిన పూర్తి వివరాలు కూడా సమర్పించలేదు. అందువల్ల అటువంటి కార్యక్రమాలకు అనుమతి ఇవ్వబడలేదు. ములాఖాత్‌కు అనుమతి మంజూరు చేసిన పక్షంలో, జైలులో ఉన్న వ్యక్తిని పరామర్శించి తిరిగి వెళ్లేందుకు మాత్రమే పోలీసు అనుమతి వర్తిస్తుంది. విశాఖపట్నం నుండి శ్రీకాకుళం అంపోలు జిల్లా జైలులో ఉన్న వ్యక్తిని ములాఖాత్ ద్వారా కలిసేందుకు సంబంధిత జైలు అధికారులు నిబంధనల ప్రకారం అనుమతిలు మేరకు ఆ పర్యటనకు అవసరమైన అనుమతులను శ్రీకాకుళం జిల్లా పోలీసులు కల్పిస్తారు. ప్రధానమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్ షోలు లేదా ప్రజలు పెద్ద సంఖ్యలో గుమికూడే కార్యక్రమాలకు అనుమతి లేదు. పర్యటన సందర్భంగా గరిష్టంగా 8 వాహనాలతో కూడిన కాన్వాయ్‌కు మాత్రమే అనుమతి ఇవ్వబడుతుంది. ప్రజలు, రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పోలీసు శాఖకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాల్సి అని విజ్ఞప్తి చేశారు.

పేర్ని నాని, జోగి రమేష్‌ల బండారం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు

• రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం

తిరుపతి(హెల్త్), జులై 29 ప్రభాతవార్త: వైసిపి మాజీ మంత్రులు పేర్ని నాని, జోగి రమేష్‌ల అవినీతి, అక్రమాల బండారం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని వారి కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలు సైతం ఛీదరించుకున్న తీరు వీరిదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం విమర్శించారు. బుధవారం తిరుపతి నగరంలోని చంద్రశేఖర్ రెడ్డి కాలనీలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను విమర్శించే అర్హత వీరికి లేదన్నారు. పేదలకు అందాల్సిన ఉచిత రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించి అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా పేర్ని నాని నిలిచారన్నారు. ఐదేళ్ల మంత్రిగా ఉండి మచిలీపట్నానికి ఒక్క మంచి పని కూడా చేయని నాని అధినేత మెప్పు కోసం, మీడియాలో ప్రచారం కోసం ప్రగల్భాలు పలుకుతున్నారని మండిపడ్డారు. పేర్ని నాని ముందుగా తన అవినీతి సామ్రాజ్యంపై ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. జోగి రమేష్ కోడలికి జరిగిన అన్యాయంపై జగన్మోహన్ రెడ్డి ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. నిత్యం మీడియా ముందు మాట్లాడే మాజీ మంత్రి రోజా, వైసిపి నాయకురాలు శ్యామల ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదు. బయటకు వచ్చి బిసి రక్షణ చట్టాలు గురించి మాట్లాడే జోగి రమేష్‌కు తన ఇంట్లో మహిళలను రక్షించుకునే సంస్కృతి లేదు. ఐదేళ్ల అరాచక పాలన చూసి ప్రజలు వైసిపిని 11 సీట్లకే పరిమితం చేశారు. ఇప్పటికీ మారకపోతే సున్నా సీట్లకు పడిపోతారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బిసి నాయకులు కుమ్మలమల సుధాకర్, సత్తు మధుసూదన్ యాదవ్, బాలరాజు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పిల్లల హక్కులను కాలరాస్తే కఠిన చర్యలు

• రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్

నెల్లూరు(కలెక్టరేట్), జులై 29 ప్రభాతవార్త: పిల్లల హక్కులను పరిరక్షించడంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ఎక్కడైనా పిల్లలపై వేధింపులు, దోపిడీ, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, హక్కుల ఉల్లంఘనలు జరిగినా వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి ఏవీఎస్ సూర్యనారాయణ రాజు పిలుపునిచ్చారు. బుధవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి చిన్నారి సురక్షితంగా, విద్యావంతుడిగా, ఆరోగ్యవంతంగా ఎదిగేలా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. పిల్లల్లో పెరుగుతున్న చెడు అలవాట్లు, సోషల్ మీడియా దుష్ప్రభావాలు, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, చిన్నారులను నేర కార్యకలాపాలకు వినియోగించే ధోరణిపై కమిషన్ సభ్యులు, నిపుణులతో కలిసి విస్తృత అధ్యయనం నిర్వహించి సమగ్ర నివేదిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ నివేదికను త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించి, అందులోని సూచనల ఆధారంగా పటిష్టమైన కార్యాచరణ అమలు చేయాలని ప్రతిపాదిస్తున్నామని చెప్పారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నివారణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టనున్నట్లు వెల్లడించారు. పిల్లల హక్కులకు భంగం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని చైర్మన్ స్పష్టం చేశారు. బాల కార్మికులను పనిలో పెట్టుకునే వారు, బాల్య వివాహాలకు పాల్పడే వారు, చిన్నారులను డ్రగ్స్, గంజాయి, మద్యం అక్రమ రవాణా వంటి నేరాలకు వినియోగించే ముఠాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలను నేరాల బారిన పడకుండా కాపాడటం సమాజం, ప్రభుత్వ యంత్రాంగం, తల్లిదండ్రుల ఉమ్మడి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు కేజీ వెంకట పద్మలత, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్, జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మణికంఠేశ్వరాలయంలో కూరగాయలు, పండ్లుతో అలంకరణ

బంగారు ధ్వజస్థంభంకు కూరగాయలతో చేపట్టిన అలంకరణ

కాణిపాకంలో వైభవంగా శాకాంబరి ఉత్సవం

కాణిపాకం, జులై 29 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం ఆషాడ పౌర్ణమి సందర్భంగా బుధవారం శాకాంబరి అలంకారంను వైభవోపేతంగా నిర్వహించారు. కాణిపాకంలో 2022 నుండి ఆషాడ పౌర్ణమి సందర్భంగా శాకాంబరి అలంకారంను దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంభిగా సమేత మణికంఠేశ్వరాలయంలో నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మణికంఠేశ్వరాలయంతో పాటు ప్రధాన ఆలయంలో శాకాంబరి అలంకారంను ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఆలయంలోని అంత్రాలయం, అర్ధమండపం, బంగారు ధ్వజస్థంభంలను వివిధ రకాల కూరగాయలు పండ్లుతో సర్వాంగ సుందర ంగా అలంకరించారు అలాగే మణికంఠేశ్వరాలయంలోని శ్రీమరగదాంభిగా దేవి, దుర్గాదేవి అమ్మవార్లతో పాటు ఆలయ మండపాలను వివిధ రకాల కూరగాయలు, పండ్లుతో శాకాంబరి అలంకారంను నిర్వహించారు. ఇందుకోసం భక్తులు ఉచితంగా కూరగాయాలు సమర్పించాలన్న దేవస్థానం విజ్ఞప్తితో పలమనేరు కూరగాయల మార్కెట్‌కు చెందిన రవీంద్రరెడ్డి వారి మిత్రబృందం పలమనేరు, వడ్డేపల్లె, కోలారు, ముళబాగల్, బెంగళూరు, హోసూరు ప్రాంతాలలోని కూరగాయల మార్కెట్ యజమానుల నుండి విరాళంగా అందజేసిన 15 టన్నుల వివిధ రకాల కూరగాయలు, పండ్లు, కరివేపాకులతో ప్రధాన ఆలయాన్ని, శ్రీమరగదాంభిగా దేవి, దుర్గాదేవి అమ్మవార్లను సరా ్వంగ సుందరంగా అలంకరించారు.

రూ.24కోట్లతో అమృత్ 2.0

మంచినీటి సమస్యకు పరిష్కారం: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జులై 29 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పట్టణ ప్రజలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యకు పరిష్కారం లభించిందని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో పబ్లిక్ హెల్త్ శాఖ నిర్వహించిన కార్యక్రమాల్లో మునిసిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్ నాయుడు, పబ్లిక్ హెల్త్ శాఖాధికారులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.24 కోట్లతో అమృత్ 2.0 పథకంను శ్రీకాళహస్తికి మంజూరు చేసారన్నారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో పవిత్రతను కాపాడుటకు స్వర్ణముఖి పరిరక్షణలో భాగంగా మురుగునీటి పారుదల, సేప్టేజ్ నిర్వహణకు రూ.6.3కోట్ల అంచనాలతో పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. స్వర్ణముఖి నది కలుషితం కాకుండా 1.5 ఎంఎల్‌డి సామర్థ్యం గల మురుగునీటి శద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

భోగాపురం విమానాశ్రయం మా కష్టఫలితమే!

• చంద్రబాబు తన ఖాతాలో వేసుకోవాలనుకుంటున్నారు: మాజీ సిఎం జగన్

విజయవాడ, జులై 29 ప్రభాతవార్త ప్రతినిధి: భోగాపురం విమానాశ్రయాన్ని తన ఖాతాలో వేసుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు దొంగదారులు వెతుకుతున్నారని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి నేత వైఎస్ జగన్మోహనరెడ్డి ఆరోపించారు. కిరీటం వేసుకోవడంలో ఆయన చూపే శ్రద్ధ అభివృద్ధిలో చూపరని వైసిపి అధినేత జగన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "2019 ఎన్నికలకు సరిగ్గా నెల రోజుల ముందు ఎలాంటి అనుమతులు లేకుండా కేవలం ఒక శంకుస్థాపన రాయి వేసి ముచ్చట తీర్చుకోవడం తప్ప చంద్రబాబు చేసిందేమీ లేదు. కానీ 2020లో జిఎంఆర్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవడం నుంచి భూసేకరణ, భద్రతా అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన వరకు ప్రతిదీ వైసిపి ప్రభుత్వ హయాంలోనే రూపుదిద్దుకున్నాయ్ని అని సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశారు. యేళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణను పూర్తి చేసి నిర్వాసితులకు పునరావాసం కల్పించడంతో పాటు నీరు, విద్యుత్, రోడ్ల కనెక్టివిటీ కోసం తమ ప్రభుత్వం ఏకంగా రూ.1200 కోట్లు ఖర్చు చేసిందని జగన్ అన్నారు. కోవిడ్ సంక్షోభం ఎదురైనా రన్‌వే, టెర్మినల్ పనులను వేగవంతం చేసి 2026 నాటికే విమానాల రాకపోకలు మొదలవుతాయని అప్పుడే ప్రకటించామని చెప్పారు. తాము పడ్డ కష్టానికి ఇప్పుడు ఫలాలు అందుతుంటే ఏమీ చేయని చంద్రబాబు దొంగ క్రెడిట్ కొట్టేసేందుకు శాయశక్తులా తాపత్రయ పడుతున్నారని ధ్వజమెత్తారు.

డిఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ, స్పోర్ట్స్ కోటాలో జరిగిన అన్యాయంపై జగన్ ఆరోపణలు చేసారు. ఈ విషయంలో యువతలో తీవ్ర ఆగ్రహాన్ని, నిరాశను రేకెత్తించాయని పేర్కొన్నారు. వైసిపి విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత, ప్రజలతో కలిసి జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన నిరసన ర్యాలీలు విజయవంతమయ్యాయని జగన్ తెలిపారు. డిఎస్సీ అక్రమాలకు పూర్తి బాధ్యత వహిస్తూ విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని యువత బలంగా డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు. పేపర్ లీకేజీ నుంచి స్పోర్ట్స్ కోటా నియామకాల వరకు జరిగిన ప్రతి అక్రమంపై సమగ్ర సిబిఐ విచారణ జరిపించాలని ఆయన కోరారు.

మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మిసిర్ బెస్రా అరెస్టు

అనుచరులు గౌరవ్ హోస్ధా మోచూ సహా జార్ఖండ్‌లో అదుపులోకి తీసుకున్న పోలీసులు

చర్ల, జులై 29, ప్రభాతవార్త: మావోయిస్టు కేంద్ర కమిటీలో ఉన్న ఒకే ఒక్క సభ్యుడు మిసిర్ బెస్రాను ఝార్ఖండ్ పోలీసులు సిఆర్పిఎఫ్ సిబ్బందికి చేతికి చిక్కాడు. ఆపరేషన్ కగార్ చేపట్టిన నాటి నుండి ఆయన ఆయన అనుచరులకోసం ఝార్ఖండ్ పోలీసులు గత రెండు సంవత్సరాలుగా విశృత సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. కేంద్ర కమిటీలో ఉన్న 40 మంది సభ్యుల్లో చాలా మంది లొంగిపోగా మరికొందరు ఎన్ కౌంటర్లలో మరణించారు. కమిటీలో గణపతి మిసిర్ బెస్రానే ఉండగా వీరిద్దరి ఆచూకి కోసం కేంద్ర రాష్ట్ర బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. ఝార్ఖండ్ రాష్ట్రంలోని వెస్ట్ సింగ్ భూమ్ జిల్లాలో మావోయిస్టుల ప్రభావం అధికంగా ఉండటంతో ఆ జిల్లాను మావోయిస్టు ప్రభావిత జిల్లాగా కేంద్రం ప్రకటించింది. బెస్రా అతని అనుచరులు గౌరవ్ హాస్ధా మోచు మరికొంత మంది కోసం గత కొంతకాలంగా భద్రతా బలగాలు సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో సిఆర్పిఎఫ్ బలగాల వత్తిడి ఎక్కువ అవ్వడంలో 16 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోగా భుదవారం బెస్రాను ఆయన అనుచరులు గౌరవ్ హాస్ధా మోచూలను ధన్ బాధ్ గిరిడి జిల్లాల సరిహద్దులో భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. పట్టుబడిని మోస్టు వాండెట్ మావోయిస్టు నేత బెస్రా పై కోటి రూపాయల రివార్డు ఉంది. ఆపరేషన్ కగార్ చేపట్టిన కేంద్ర ప్రభుత్వం మార్చి 31 నాటికి మావోయిస్టు రహిత దేశం చూస్తారని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించి అందుకు అనుగుణంగా అడుగులు వేయడంతో మావోయిస్టుల నిర్మూలన సాధ్యం అయ్యింది. మావోయిస్టు రహిత భారత్ అని కేంద్ర ప్రకటించి విజయం సాదించినా కేంద్ర కమిటిలో ఉన్న బెస్రా గణపతి ఆచూకి తెలియక పోవడం కొంత వెలితిగా అనిపించింది. ఇప్పుడు మిసిర్ బెస్రా పట్టుబడటంతో గణపతి ఆచూకి కోసం కేంద్ర ఇంటిలిజెన్సీ నిఘా విబాగం గణపతిపై మరింత ఫోకస్ పెట్టనున్నారు. కాగా చత్తీస్‌గఢ్ అటవి ప్రాంతంలో అక్కడక్కడగా మావోయిస్టుల ఉనికి వినిపిస్తుండటంలో భద్రతా బలగాలు సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నట్లు సమాచారం మావోయిస్టుల డంప్‌లు ఐఈడిల కోసం దండకారణ్యంలో నిరంతరం ఆపరేషన్ కొనసాగుతుంది.

30skl13:30skl13.qxd 29-07-2026 23:31 Page 1

ఏపీఎస్ ఆర్టీసీ కొన్ని సర్వీసులకు రెండు రోజులు అంతరాయం

శ్రీకాకుళం, జూలై 29, ప్రభాతవార్త

ఆగస్టు 1 వ తేదీన భోగాపురంలో జరగబోయే అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి, భారత ప్రధాని నరేంద్ర మోడీ విచ్చేస్తున్న సందర్భంగా, ప్రభుత్వ ఆదేశాల మేరకు శ్రీకాకుళం జిల్లా నుండి ప్రత్యేక విధులకు పంపవలసి ఉన్నది. దీని కారణంగా జులై 31 మరియు ఆగస్టు 1వ తేదీలలో కొన్ని సర్వీస్‌లు పాక్షికంగా మాత్రమే నడుస్తాయి. కొన్ని సర్వీస్‌లకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని, శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్.అప్పలనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేసారు. దూరప్రాంత సర్వీస్‌లు యధావిధంగా నడుస్తాయని, కావున ప్రయాణికులు ఈ రెండు రోజులు ముందస్తుగా ప్లాన్ చేసుకోవాలని, ఏర్పడే అసౌకర్యానికి క్షమించి ఏపీఎసఆర్టీసీకి సహకరించాలని కోరారు.

కూటమి పాలనతోనే ఇంటింటా సంక్షేమం, అభివృద్ధి

కవిటి, జూలై 29, ప్రభాతవార్త :

కూటమి పాలనతోనే ఇంటింటా సంక్షేమం-అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ జడ్పిటిసి పొందల కృష్ణారావు పిలుపునిచ్చారు. కవిటి మండలం నెలవంక పంచాయతీలో బుధవారం రెండేళ్ల నమ్మకం ఇంటింటికి సంక్షేమం అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి తమ చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేసే కార్యక్రమాన్ని చేపట్టారు. మాజీ జెడ్పిటిసి కృష్ణారావు మాట్లాడుతూ రెండేళ్ల పాలనలో కూటమి ప్రభుత్వము సంక్షేమం-అభివృద్ధి రెండు కళ్ళుగా భావిస్తూ గ్రామాల్లో అభివృద్ధి బాటలు వేస్తుందని అన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు తూచా తప్పక ప్రజలకు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి విజయాన్ని అందుకోవాలని ప్రజల కోరారు. ఈ కార్యక్రమంలో సదానంద రౌళో, ఏఎంసీ అధ్యక్షులు మణి చంద్రప్రకాష్, పిఎసిఎస్ అధ్యక్షులు బాసుదేవ్ ప్రధాన్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చిన్నబాబు, మాజీ సర్పంచ్ ప్రతినిధి కుమార్ రెడ్డి మాజీ ఎంపీటీసీ హరికృష్ణ బిసాయి, రైల్వే మెంబర్ శ్రీనివాసరావులతోపాటు పలువురు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అవసరం

కవిటి, జూలై 29, ప్రభాతవార్త :

పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అవసరమంటూ భారతీయ విద్యా కేంద్రం హర్షవిజ్ఞాన భారతి కరస్పాండెంట్ బల్లెడ కృష్ణారావు అన్నారు. బుధవారం పండి క్రిస్తవ్ నారాయణ జన్మదిన సందర్భంగా తల్లిదండ్రులు సత్యనారాయణ రోజా రాణిలు పాఠశాలలో రూ.20 వేలు విలువ చేసే విద్యార్థులు ఆటలాడుకునే ఊయలను అందించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.అనిల్ మాట్లాడుతూ విద్యార్థుల జన్మదినం వారి పేర్లతో పాఠశాల అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో బెందాళం తిరుమలరావు, శ్రీకాంత్, చంద్రకాంత్‌లతోపాటు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాని సభను విజయవంతం చేయండి : రాము

రణస్థలం, జూలై 29 ప్రభాతవార్త :

ఆగస్టు 1న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి విచ్చేయుచున్న భారత ప్రధాని నరేంద్ర మోడీ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము ఉత్తరాంధ్ర ఎన్డీఏ కూటమి నాయకులను ప్రజలను కోరారు. బుధవారం మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ విమానాశ్రయం భోగాపురంలో ఏర్పాటుతో ఉత్తరాంధ్రకు ఎంతో మేలు చేకూరుతుందని దీంతో ఈ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఉత్తరాంధ్ర ప్రజలంతా విజయవంతం చేయాలని ఆయన కోరారు.

34 కిలోల గంజాయితో ఇద్దరు అరెస్ట్

ఇచ్ఛాపురం, జూలై 29, ప్రభాతవార్త :

ఒడిశా నుండి గుజరాత్ రాష్ట్రంకు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకొని సీజ్ చేసినట్లు సీఐ మీసాల చిన్నంనాయుడు చెప్పారు. ఈ మేరకు సర్కిల్ కార్యాలయంలో విలేఖర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన అనిల్ కుమార్ గౌడ, మున్నా ప్రధాన్ వీరి ఆర్థిక పరిస్థితి బాగులేకపోవటంతో గంజాయి వ్యాపారం చేసే ఒడిస్సా బహరగుడాకు చెందిన కుంజో జనా చెప్పగా గంజాయిని తరలిస్తే కీలోకి రూ.10వేలు చొప్పున ఇస్తానని చెప్పటంతో వీరిద్దరు ఒప్పుకుని గుజరాత్ రాష్ట్రం సూరత్ జిల్లా విది రోడ్ ఏరియాలో ఉంటున్న గంగా మహంతికి గంజాయిని అప్పగించాలని చెప్పడంతో అంగీకరించారు. ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ మీదుగా గంజాయిని సూరత్‌కి తరలించేందుకు సిద్ధమై బరంపురం నుండి ఇచ్ఛాపురం వరకు బస్సులో వచ్చి బస్టాండ్‌లో దిగారని. అక్కడ నుంచి రైలుమార్గం ద్వారా గుజరాత్‌కి తరలించే క్రమంలో రైల్వే స్టేషన్‌కి రెండు సూట్ కేసులతో గంజాయితో పాటు ఒక లగేజ్ బ్యాగ్‌తో వస్తుండగా అనుమానస్పదంగా కనిపించటంతో పట్టణ ఎస్సై ముకుందరావు ఇద్దరిని అరెస్ట్ చేయటంతో పాటు వీరి వద్ద ఉన్న గంజాయిని సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శాంతినికేతన్ స్కూల్‌లో గురుపౌర్ణమి వేడుకలు

ఇచ్ఛాపురం, జూలై 29, ప్రభాతవార్త :

స్థానిక శాంతినికేతన్ పాఠశాలలో స్కూల్ చైర్మన్ డి.కృష్ణమూర్తి రెడ్డి అధ్యక్షతన గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు స్కూల్ చైర్మన్ డి.కృష్ణమూర్తి రెడ్డి బహుమతులను అందజేశారు. స్కూల్ మేనేజర్ కె.సి.పూరి ఉపాధ్యాయులు సురేఖ, పద్మజ, శంకర్, రవి, కృష్ణ, సద్గుణరావు, యశోద, మీనా, జయలక్ష్మి, స్నేహ, పార్వతి, సరోజిని, ప్రమీల, శిరీష, తేజేశ్వరి ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ డి.హర్ష వర్ధన్ రెడ్డి, సెక్రటరీ డి.భార్గవ్, యస్.పి.యల్ స్వాతి పాల్గొన్నారు.

దస్తావేజు లేఖర్ల వ్యవస్థను కొనసాగించాలి

-పదవ రోజు కొనసాగిన పెన్‌డౌన్ నిరసన

రణస్థలం, జూలై 29, ప్రభాతవార్త :

ప్రభుత్వం తక్షణమే 396 జీవోను రద్దు చేసి దస్తావేజు లేఖర్ల వ్యవస్థను కొనసాగించాలని రణస్థలం దస్తావేజు లేఖర్లు డిమాండ్ చేశారు. రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంఘం ఆదేశాల మేరకు బుధవారం రణస్థలం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రణస్థలం దస్తావేజు లేఖర్ల సంఘం 10వ రోజు పెన్ డౌన్ నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం 396 జీవోను అమలు చేస్తే లక్షల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దస్తావేజు లేఖర్ల పొట్టకొట్టే 396 జోవోను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మీసాల రామారావు, అరసాడ విజయ సారధి, పులగ్గుర్త మల్లిబాబు, పారుమూడి వెంకటేశ్వర్లు, బైరి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేటలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

సీతంపేట, జూలై 29, ప్రభాతవార్త :

మండల కేంద్రమైన సీతంపేటలో వెలసిన శ్రీ షిరిడి సాయినాథుని ఆలయంలో బుధవారం ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించి సాయంత్రం తిరువీధుల్లో బాబా విగ్రహాన్ని పల్లకిలో ఊరేగించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి శిరిడీ సాయినాథుని దివ్య ఆశీస్సులను పొందారు. ఆలయ ధర్మకర్తలు హెచ్.కాంతారావు సావిత్రి, దేవాలయ అర్చకులు వి.వి.గిరి, ఆలయ కమిటీ నిర్వాహకులు తమ సహాయ సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో జిసిసి డివిజనల్ మేనేజర్ దాసరి కృష్ణ, ఎలక్ట్రికల్ ఏఇ నీలిమ, నరసింహులు, భక్తులు పాల్గొన్నారు.

31న విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసన్నపేట, జూలై 29, ప్రభాతవార్త:

నరసన్నపేట సబ్ స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా ఈ నెల 31 శుక్రవారం 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని ప్రాంతాల్లో అనగా నరసన్నపేట పట్టణం, పిరువాడ, చీడివలస, జిల్లేడుమాకివలస, కంబకాయ, చినకారగం, పెద్దకరగం, అంపలం, దూకులపాడు, జమ్మూ, తామరపల్లి ప్రాంతాల్లో ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గం. వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడును.

రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

కృషీ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ కుమార్

మెళియాపుట్టి, జూలై 29, ప్రభాతవార్త :

మండలంలోని చాపర, మెళియాపుట్టి గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాలను నిర్వ హించారు. దీనికి ముఖ్య అతిథులుగా కృషీ విజ్ఞాన కేంద్రం, ఆముదాలవలస శాస్త్రవేత్తలు కిరణ్ కుమార్, రాయ్, బాలకృష్ణ హాజరై రైతులకు వ్యవసాయంలో పలు సలహాలు అందించారు. అలాగే ప్రస్తుతం వరి 20 నుంచి 25 రోజులకు మధ్య ఉండటం వలన భూములు తేమగా ఉన్న పొలాలకు బిస్పిరిబిక్ సోడియం మరియు ఆల్ మిక్స్ పిచికారి చేసుకున్నట్లయితే కలుపు నివారించుకోవచ్చని తెలియజేశారు. అలాగే ప్రస్తుతం ఏల్ నినో ప్రభావం ఉన్నందువలన పంటలు మార్పిడి వైపు రైతులు మొగ్గు చూపాలని కోరారు. ముఖ్యంగా తక్కువ నీటితో పండే మినుము, పెసర, రాగి మరియు కంది పంటలు వేయాలని సూచించారు. అనంతరం మత్స్య పరిశోధన శాస్త్రవేత్త బాలకృష్ణ మాట్లాడుతూ రైతులకు చేపలు పెంపకంపైన అవగాహన కల్పించారు. తదుపరి పశు గ్రాసం పెంపకం పైన అవగాహన కల్పించారు. కూటమి నాయకులు పోలినాయుడు, నాగభూషణ, శంకర్ గ్రామ వ్యవసాయ సహాయకులు జగదీష్, పలువురు రైతులు పాల్గొన్నారు.

సైకాలజిస్టులకు సన్మానం

ఆముదాలవలస, జూలై 29 (ప్రభాతవార్త) :

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో భారతీయ సైకాలజీ దినోత్సవం-2026 గురు పౌర్ణమి (వ్యాస పూర్ణిమ) రోజున జరుపుకునే కార్యక్రమం ఆమదాలవలసలో ఒక ప్రైవేటు పాఠశాలలో ఘనంగా జరిగింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎనఎసఎస్ కోఆర్డినేటర్ జలుమూరు రవిబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంసుందర్ మాట్లాడుతూ మనిషి ఆలోచనలు, భావేద్వేగాలు, ప్రవర్తనలను అర్థం చేసుకునే శాస్త్రమే సైకాలజీ అని, సైకాలజీ మనకు మనల్ని తెలుసుకోవడం మాత్రమే కాదు ఇతరులను అర్థం చేసుకోవడం నేర్పుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమం ముఖ్య అతిథి రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షులు జలుమూరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజంలో అన్ని రంగాల్లోనూ సైకాలజిస్ట్ సేవలు చాలా విస్తృతమైన అని, అలాగే చాలామంది విద్యార్థులు సోషల్ మీడియాకి, ఇంస్టాగ్రామ్, పేస్‌బుక్, వాట్సప్‌లో ఎక్కువ సమయం గడపడం వల్ల విద్యార్థులు చదువుల్లో వెనుకబడిపోతున్నారని, వారందరికీ సైకాలజిస్టులు, కౌన్సిలర్లు పాత్ర చాలా కీలకమని అన్నారు. అలాగే కళాశాల కరస్పాండెంట్ వి.టి.చౌదరి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సినిమాలు, కేబుల్ టీవీ, చాటింగు, సెల్ ఫోన్లు, సోషల్ మీడియా, బెట్టింగ్ యాప్‌ల ద్వారా విద్యార్థులు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని పిలుపునిచ్చారు. అలాగే పిఓ జె.రవిబాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం, జీవన నైపుణ్యం పెంపొందించడానికి సమాజానికి సైకాలజిస్టు అవసరమని, ఈ సైకాలజీని అన్ని తరగతులలో, రోజువారి విద్యార్థులకు నేర్పించవలసిన అవసరం ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమం అనంతరం జిల్లా సైకాలజిస్టులు అయినా డాక్టర్ బుడుమూరు సూర్యారావు, డి.సురేష్ కుమార్, పంచాది సూర్యప్రభ, పసగాడ సూర్యనారాయణలకు భారతీయ సైకాలజీ దినోత్సవం సందర్భంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థిని ,విద్యార్థులు పాల్గొన్నారు.

బోరుభద్రలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

సంతబొమ్మాళి, జులై 29, ప్రభాతవార్త :

బోరుభద్రలో బుధవారం గురుపౌర్ణమి సందర్భంగా శివాలయం దగ్గర ముద్దపు రమణమూర్తి ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు జరిగాయి. భక్తులు ఉదయం తిరువీధి, కోలాటం మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడు తూ అచలం అంటే చలనం లేనిది అని ప్రతి ఒక్కరు తల్లి దండ్రులు, గురువులను గౌరవించాలని అప్పుడే మన జీవితానికి సార్థకత వస్తుందని మనం ఎలా నడిస్తే మన పిల్లలు కుటుంబాలు వారు చుట్టుపక్కల వారు అలాగే నడుచుకుంటారని ప్రతి ఒక్కరు దైవ భక్తి కలిగి సమాజానికి అభివృద్ధి చేయడానికి మనవంతు కృషి చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో ముద్దాడ రఘుపతినాయుడు, బైపల్లి బీమారావు, మైలపల్లి జంగాలు, నవిరి చిరంజీవి, రాజు పూర్ణానంద ఆశ్రమం, రొట్టవలస శ్రీరామ ఆశ్రమం అదినేత వెంకట రామానుజన్, నక్క ఆదినారాయణ, రోణగాల సన్యాసి,కొమర అప్పలస్వామి, భక్తులు గ్రామస్తులు పెద్ద స్థాయిలో పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన జిల్లా సోషల్ మీడియా జనరల్ సెక్రటరీ గౌరినాయుడు

రణస్థలం, జూలై 29, ప్రభాతవార్త :

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో బుధవారం వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం జిల్లా సోషల్ మీడియా జనరల్ సెక్రటరీ పిన్నింటి గౌరి నాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గౌరినాయుడుతో జగన్‌మోహన్‌రెడ్డి ఆత్మీయంగా మాట్లాడారు. జిల్లాలో సోషల్ మీడియా సైన్యం క్రియాశీలకంగా పని చేయాలని, ప్రజల పక్షాన నిలబడి నిజాన్ని ధైర్యంగా వినిపించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిరంతరం సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో డిజిటల్ వింగ్ పాత్ర అత్యంత కీలకమైనదని స్పష్టం ఆయన చేశారు. సోషల్ మీడియా సైన్యం నిరంతరం ప్రజల పక్షాన పోరాడాలని జగన్ సూచించారు.

ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించండి

ఎమ్మెల్యే, పియు సి కమిటీ చైర్మన్ కూన

ఆమదాలవలస, జూలై 29, ((ప్రభాతవార్త):

శ్రీకాకుళం కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ స్థాయి సమావేశం ఘనంగా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల ముందు తీసుకుని వెళ్లాలని అన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయడంతో పాటు కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వివరించాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారంలో పార్టీ శ్రేణులు ఎల్లప్పుడూ ముందుండాలని, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేయాలని సూచించారు. జిల్లా పరిశీలకులు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని పేర్కొన్నారు. పార్టీ అధిష్ఠానం నిర్దేశించిన కార్యాచరణను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి, ప్రజల్లో పార్టీపై మరింత విశ్వాసం పెంచేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లాలోని పార్లమెంటరీ పరిధికి చెందిన ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా కమిటీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

గురు పౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు

రాజాం, జూలై 29, ప్రభాతవార్త :

రాజాం అమ్మవారి కాలనీ సుందరం మందిరంలో గురు పౌర్ణమి సందర్భంగా సత్య సాయి బాబాకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు సత్య సాయి బాబా మహిమలను, అలాగే వారి యొక్క సేవలను తెలిపారు. అదేవిధంగా ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన శ్రీకాకుళం సత్యసాయి జోనల్ కన్వీనర్ జనార్ధనరావు సత్కరించారు. బాబా నామంను తలుచుకుంటే ఏ కార్యక్రమమైనా సజావుగా నెరవేర్చి స్వామిగా అవతరించారని తెలిపారు. అదేవిధంగా భక్తులు విశ్వసించే విధంగా సత్యసాయి సేవలు అమోఘమని కొనియాడారు. సాయి బృందం భక్తులు స్థానికులు పాల్గొన్నారు.

అయ్యప్ప దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలు

ఆమదాలవలస, జూలై 29, ((ప్రభాతవార్త)

ఆమదాలవలస పట్టణంలో శ్రీఅయ్యప్ప దేవాలయంలో బుధవారం గురుపౌర్ణమి సందర్భంగా పూజలు నిర్వహించారు. స్వామివారికి సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రత్యేక పూజల్లో భాగంగా అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సతీమణి కూన ప్రమీల భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. ఆలయ నిర్వాహకులు తమ్మినేని విద్యాసాగర్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీతా, అన్నెపు సురేష్, జిల్లా మల్లికార్జునరావు, పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొని సుమారు నాలుగువేల మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అదేవిధంగా వంశధార కార్యాలయంలో వెలసిన షిరిడి సాయి ఆలయంలో పూజలతో పాటు అన్నప్రసాదాన్ని కార్యక్రమాలు చేపట్టారు.

శాకంబరి అలంకరణలో భ్రమరాంబిక

కోటబొమ్మాళి, జూలై 29, ప్రభాతవార్త :

కురుడులోని భ్రమరాంభిక అమ్మవారు బుధవారం శాకంబరి అలకంరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామస్థులు వివిధ రకాల కాయగూరలతో అమ్మవారిని అలంకరించారు. కురుడు గ్రామస్థులతో పాటు పాకివలస, రామయ్యపేట, చౌదరి కొత్తూరు, బావిజీపేట, వీరరాఘవపురం, తదితర అనేక గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అలాగే గురుపౌర్ణమి సందర్భంగా అమ్మవారి సన్నిధిలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.

శ్రీకాకుళం వార్త

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

కోటబొమ్మాళి, జూలై 29, ప్రభాతవార్త :

ఊడికలపాడు, దంత, హరిశ్చంద్రపురం, కురుడు, యలమంచిలి, లఖందిడ్డి తదితర గ్రామాల్లో బుధవారం గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఊడికలపాడు శ్రీరామక్షేత్రం అవరణలో ప్రవచనకారులు సనపల కరుణ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు శ్రీవేదవ్యాస మహర్షి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మనం ఈ రోజు చదువుతున్న వేదం, ఉపవిషత్తులు, గీత, పురాణాలు ఇవన్నీ వ్యాస మహర్షి మహోన్నత కృషి ఫలితమేనని కురుణ్ కుమార్ విద్యార్థులకు వివరించారు. కొత్తపేటలో గల నాగసాయి దేవాలయంలో, హరిశ్చంద్రపురం షిరిడి సాయి ఆలయంలో భక్తి శ్రద్ధలతో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి దర్శనం చేసుకున్నారు. దేవాలయం ప్రాంగణంలో సుపరితంగా అలంకరణలు చేసి, సంప్రదాయ బద్ధంగా ప్రత్యేక హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. వేద పండితులు గురు పౌర్ణమి ప్రాముఖ్యతను వివరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బొగాబెణిలో పొలంపిలుస్తోంది కార్యక్రమం

కంచిలి, జూలై 29, ప్రభాతవార్త :

పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా బుధవారం బొగాబెణి రైతు సేవ కేంద్రం పరిధిలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కొంకేన సురేష్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన గూర్చి వివరిస్తూ ఆగస్టు 15, 2026వ తేదీ ఆఖరి తేదీగా ఉన్న కారణంగా పంట రుణం తీసుకోని ప్రతి రైతు ఎకరానికి 160 రూపాయలు చెల్లించి 40 వేల వరకు పంట కోత ప్రయోగాల యొక్క దిగుబడుల ఆధారంగా నష్టాన్ని అంచనా వేసి పొందవచ్చని సూచించారు. బ్యాంకుల్లో పంట రుణం తీసుకున్నటువంటి రైతులు తమ యొక్క పంట బీమా ప్రీమియం చెల్లించినది లేనిది సరిచూసుకోవాలని సూచించారు. ప్రస్తుతం వెదజల్లే వరి పంట ఉన్న దగ్గర కలుపు నివారణకు గాను బిస్ పైరిబాక్ సోడియం 100 ఎంఎల్ ఒక ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. యూరియాను ఏ పి ఏ ఐ ఎం ఎస్ యాప్ ద్వారా ఇస్తున్నందున ప్రతి రైతు ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని తమకు లభ్యమయ్యే ఎరువులు గూర్చి అవగాహన పొందాలని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు జీవిత, రైతులు పాల్గొన్నారు.

'కలలకు రెక్కలు'పై వ్యాసరచన పోటీలు

కంచిలి, జూలై 29, ప్రభాతవార్త :

కలలకు రెక్కలు పై వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు కలలకు రెక్కలపై ఆరు నుంచి 10వ తరగతి చదువుకుంటున్న విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎంఎస్ పల్లి గ్రామానికి దగ్గరలో గల మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రత్యూష నాయక్ పదవ తరగతి చిత్రలేఖనంలో, క్విజ్ పోటీల్లో జామి సిరి, 10వ తరగతి, డీజీపురం ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థిని కదంబల స్పందన వ్యాసరచన పోటీలు ప్రథమ స్థానంలో నిలిచారు. గురువారం శ్రీకాకుళంలో జరుగుతున్న పోటీల్లో గెలిచిన విద్యార్థులు పోటీలలో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు సప్పటి శివరాం ప్రసాద్, చిట్టిబాబు, ఎంఆర్సి సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రుపుట్టుగ స్మశానంలో బోరు ఏర్పాటు

కంచిలి, జూలై 29, ప్రభాతవార్త :

కంచిలి మండలం చిన్న కొజ్జిరియా పంచాయతీ చంద్రుపుట్టుగ గ్రామంలో గల స్మశానంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ముద్దపు రమణ ఆధ్వర్యంలో బోరు ఏర్పాటు చేశారు. సంవత్సరాలుగా బోరు ఏర్పాటు కోసం ప్రభుత్వాలకు, అధికారులకు విన్నవించిన పట్టించుకోలేదని ఎట్టకేలకు అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వంలో చెప్పిన వెంటనే బోరు మంజూరు చేశారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రకు రెక్కలొచ్చాయి విజేతలు వీరే

కవిటి, జూలై 29, ప్రభాతవార్త :

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఉత్తరాంధ్రకు రెక్కలొచ్చాయి కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో ఆరు నుంచి పదవ తరగతి విద్యార్థులకు మండల స్థాయిలో నిర్వహించిన క్విజ్, వ్యాసరసన, డ్రాయింగ్ పోటీల్లో పలువురు విద్యార్థులు విజేతలుగా నిలిచారంటూ ఎంఈఓ ధనుంజయ మజ్జి, ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. క్విజ్ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బోరివంకకు చెందిన డి.చందు, వ్యాసరచన పోటీల్లో ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని బాగా దీక్షిత, డ్రాయింగ్‌లో బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మనోహర్ విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా ఎంఈఓ ధనుంజయ మజ్జి మాట్లాడుతూ ఉత్తరాంధ్రకు రెక్కలొచ్చాయి అనే భావన కేవలం అభివృద్ధి కార్యక్రమాలకు మాత్రమే పరిమితం కాకుండా విద్యార్థుల్లో తమ ప్రాంత చరిత్ర సంస్కృతి మరియు అభివృద్ధి అవకాశాలు పట్ల గర్వకారణాన్ని పెంపొందించే ఒక ఉద్యమమని తెలిపారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

కోటబొమ్మాళి, జూలై 29 ,ప్రభాతవార్త :

ప్రధాని నరేంద్రమోదీ బోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఆగస్టు 1న ప్రారంభించడానికి వస్తున్న నేపథ్యంలో విధుల్లో ఉన్న ఉద్యోగులంతా అలసత్వం వహించవద్దని మండల ప్రత్యేక అధికారి గడ్డెమ్మ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక సహాయకులు, వెలుగు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ ప్రసాదరావు, ఎంపీడీఓ నారాయణరావు, డిప్యూటీ ఎంపీడీవోలు డి.బాలక్రిష్ణ, లీలరాజు, ఏపీవో జి.హరిప్రసాద్, ఐసీడీఎస్ పీవో హైమావతి, సీఎసఓటీ రామచంద్ర, ఏపీవో సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వివిధ క్లబ్‌ల ఆవిష్కరణతో విద్యార్థుల్లో ప్రతిభా వికాసానికి శ్రీకారం

కంచిలి, జూలై 29, ప్రభాతవార్త :

జేఎంజే ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ (సీబీఎసఈ), కంచిలిలో విద్యార్థుల సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, శాస్త్రీయ దృక్పథం మరియు సమగ్ర వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే లక్ష్యంతో పాఠశాలలో వివిధ క్లబ్‌లను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ క్లబ్, మ్యాథ్స్ క్లబ్, ఐటీ/కోడింగ్ క్లబ్, సైన్స్ క్లబ్, సోషల్ సర్వీస్ క్లబ్, ఇంటిగ్రిటీ అండ్ వ్యాల్యూ ఎడ్యుకేషన్ క్లబ్, హెల్త్ అండ్ వెల్‌నెస్ క్లబ్, స్పోర్ట్స్ క్లబ్, హెరిటేజ్ క్లబ్, మ్యూజిక్ అండ్ డ్యాన్స్ క్లబ్, ఇంగ్లీష్ క్లబ్లను ప్రారంభించారు. ప్రతి క్లబ్‌కు సంబంధించిన లక్ష్యాలు, వార్షిక కార్యాచరణ ప్రణాళికను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తమ ఆసక్తులు, ప్రతిభకు అనుగుణంగా క్లబ్‌లలో పాల్గొని విద్యతో పాటు జీవిత నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని పాఠశాల యాజమాన్యం సూచించింది. ఉపాధ్యాయులు, క్లబ్ ఇన్‌ఛార్జిలు , విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని క్లబ్‌ల విజయవంతమైన నిర్వహణకు తమ పూర్తి సహకారాన్ని అందిస్తామని తెలిపారు.

లోకేష్‌ను విమర్శించే స్థాయి నానికి లేదు : బోయిన

కోటబొమ్మాళి, జూలై 29 ప్రభాతవార్త :

పేదలకు అందాల్సిన ఉచిత రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఆరోపణలు ఎదుర్కొంటున్న పేర్ని నానికి నాలుగు వేలు కిలోమీటర్లుకు పైగా పాదయాత్ర చేసి ప్రజల సమస్యలు తెలుసుకొని రెండేళ్ళుగా వారిని పరిష్కరిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న మంత్రి నారా లోకేష్‌ను విమర్శించే స్థాయి లేదని రాష్ట్ర కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు మండిపడ్డారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చట్టసభలోనైనా, ప్రజాక్షేత్రంలోనైనా ముఖాముఖి చర్చకు లోకేష్ ఎప్పుడూ సిద్ధమేనని స్పష్టం చేశారు. చర్చకు సిద్ధమని చెబుతున్న వైకాపా నేతలు ముందుగా తమ అధినేత జగన్‌ను అసెంబ్లీకి రావాలని చెప్పాలని సవాల్ విసిరారు.

30- 7 pg 9 ...:30- 7 pg 9 ....qxd 7/29/2026 5:52 PM Page 1

సంగీత బాణీల జర్నీలో జ్యోతిర్మయి!

హిందూస్థానీ శాస్త్రీయ సంగీతమంటే చెవికోసుకునే జ్యోతిర్మయి తన జర్నీలో మొదటి మైలురాయిని దాటుకుని రెండో మైలురాయి దగ్గరకు చేరుకున్నారు. మ్యూజిక్ షో 'ఇండియన్ ఐడల్ సీజన్ 16' గ్రాండ్ ఫినాలేలో ఒడిశాకు చెందిన జ్యోతిర్మయి నాయక్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఈ విజయంతో ఆమె రూ.20 లక్షల నగదు బహుమతి గెలుచుకున్నారు. ఇండియన్ ఐడల్ చరిత్రలో ఒడిశా నుంచి టైటిల్ గెలుచుకున్న తొలి కంటెస్టెంట్‌గా ఆమె రికార్డు సృషించారు. పాతికేళ్ల జ్యోతిర్మయి ఇండియన్ ఐడల్ ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందకముందే ఒడిశా ప్రాంతీయ సంగీత పరిశ్రమకు సుపరిచితురాలు. ఆమె ఒక గాయని మాత్రమే కాదు, శిక్షణ పొందిన మ్యూజిక్ థెరపిస్ట్ కూడా. సంగీతం ద్వారా మానసిక, భావోద్వేగ సమస్యలకు చికిత్స అందించడంలో ఆమెకు నైపుణ్యం ఉంది. జ్యోతిర్మయి భువనేశ్వర్‌లోని కీట్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్ బిటెక్ పూర్తి చేశారు. ఆ తర్వాత చెన్నై స్కూల్ ఆఫ్ మ్యూజిక్ థెరపీ నుంచి సర్టిఫికేషన్ పొందారు. గురు శారదా ప్రసన్నసాహు వద్ద బాలీవుడ్ పాటలపై ప్రత్యేక శిక్షణ తీసుకున్న జ్యోతిర్మయి పాటల భావాలను తెలుసుకుని బాణీలను పలికించడాన్ని నేర్చుకొన్నారు. ఎప్పటికైనా అలియాభట్, దీపికా పదుకుణెలకు నేపథ్య గాయనిగా పాడగలగడమే తన జీవితాశయంగా చెబుతుంటారు. జర్నీ సాగుతున్న కొద్దీ సంగీతంలో అత్యున్నత స్థాయిని చేరుకోవాలని ఆకాంక్షతో ఆమె ముందడుగు వేస్తున్నారు. □

చీడ వదిలిద్దాం ..

మొక్కలు పెంచే వాళ్లకి వచ్చే చీడపీడల్ని నివారించడం పెద్ద సవాలనే చెప్పాలి. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కొన్ని రకాల తెగుళ్ల ఒకపట్టాన వదలవు. అలాంటి వాటిలో పేనుబంక ఒకటి. కొన్ని చిట్కాలు పాటిస్తే మొక్కల నుంచి దీన్ని సులువుగా దూరం చేయొచ్చు.

✦ వేపనూనె లేదా డిష్‌వాష్ లిక్విడ్లు అఫిడ్స్‌ను నియంత్రించడానికి బాగా పనిచేస్తాయి. ఈ రెండిటినీ చెంచా చొప్పున ఒక లీటరు నీటిలో కలపాలి. ఈ మిశ్రమాన్ని మొక్కలపై ప్రతిరోజూ సాయంత్రం స్ప్రే చేయాలి.

✦వెల్లుల్లి సహజ క్రిమి సంహారిణిగా పనిచేస్తుంది. నాలుగైదు వెల్లుల్లి రెబ్బల్ని దంచి నీటిలో కలిపి సోకిన మొక్కలపై పిచికారీ చేయాలి.

✦ వీటితోపాటు పసుపు రంగు అట్టముక్కలకు కొద్దిగా ఆముదం లేదా నూనె రాసి మొక్క దగ్గర వేలాడదీయాలి కర్రకు అతికించి మట్టిలో గుచ్చిన అఫిడ్స్ దానికి అతుక్కుంటాయి.

✦ సమస్య మరీ ఎక్కువగా ఉంటే మొక్కలను నీటితో కడిగి ఆపై వేపనూనెను స్ప్రే చేసినా చక్కగా పనిచేస్తుంది. ఇంటి తోటను శుభ్రం చేయడం, ఎండిన మొక్కల్నీ, తెగులు సోకి వాడిపోయిన వాటిని వేరు చేయాలి. ఈ జాగ్రత్తలుతీసుకుంటే మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయి. □

ఆపిల్: మంచి బ్యాక్టీరియా

ఒక రోజు ఒక ఆపిల్ తింటే.. ఎన్నో రకాల వ్యాధుల నుంచి తప్పించుకోవచ్చని పెద్దలు చెబితే విప్పపంటుంటాము. కానీ, ఒక్క ఆపిల్‌ను తింటే 10 కోట్ల బ్యాక్టీరియాలు మన పొట్టలోకి చేరినట్టే అని మీకు తెలుసా! మరీ అంత ఆశ్చర్యపోకండి. అదంతా మనకు మంచి చేసే బ్యాక్టీరియానే! 240 గ్రాముల బరువున్న ఒక ఆపిల్‌లో సుమారు 10 కోట్ల బ్యాక్టీరియా ఉంటుందట. తాజాగా ఆస్ట్రియాలోని గ్రాజ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ చేసిన పరిశోధనలో ఈ విషయం వెల్లడైంది. ఆపిల్‌లోని కాడ, గుజ్జు, విత్తనాలు, తొక్క.. ఇలా ప్రతి భాగమూ.. బ్యాక్టీరియా మయమేనట. ఇక గుజ్జు, విత్తనాలైతే బ్యాక్టీరియా హాట్‌స్పాట్‌లే. అయితే, సేంద్రియ పద్ధతుల్లో పండించిన ఆపిల్ రకాలే ఉత్తమం అంటున్నారు పరిశోధనలు. ఎందుకంటే, ఈ రెండు రకాల ఆపిల్ పండ్లలో బ్యాక్టీరియా సంఖ్యలో పెద్దగా మార్పు లేనప్పటికీ, అందులో ఉండే మంచి బ్యాక్టీరియాలో మాత్రం తేడా ఉంటుందట. పంట పండే ప్రాంతం, భద్రపరిచే విధానాలను బట్టి వాటిలోని మైక్రోబయోమ్‌ల కంపోజిషన్ మారిపోతుందట. దాన్నిబట్టే ఆపిల్ రంగూ, రుచీ, రూపంలోనూ మార్పులొస్తాయట. ఏదిఏమైనా ఈ ఆపిల్‌లో ఓ బ్యాక్టీరియా సామ్రాజ్యమే ఉందన్నమాట! □

ప్రశ్న: నా వయస్సు 40 ఏళ్లు. ప్రభుత్వ సంస్థలో అధికారిగా పనిచేస్తున్నాను. ఇటీవల కొంతకాలంగా రోజంతా నీరసం, నిస్సత్తువగా అనిపిస్తోంది. తరచూ తలనొప్పి వస్తోంది. ఒక్కోసారి రాత్రిళ్లు పీడకలలు వస్తున్నాయి. ఎనిమిది గంటలు నిద్రపోయినా అలసట, ఒత్తిడి తగ్గడం లేదు. స్నేహితులు ఒక్కొక్కరు ఒక్కో సలహా ఇస్తున్నారు. కౌన్సెలింగ్ తీసుకోమని ఒకరు, విటమిన్ బి12 లేదా విటమిన్ డి లోపం కావచ్చని మరొకరు, హార్మోన్ల సమస్య కూడా ఉండొచ్చని ఇంకొకరు చెప్పారు. నేను ముందుగా వైద్యుడిని కలవాలా? లేక సైకాలజిస్టును సంప్రదించాలా?

– ఒక సోదరి, నెల్లూరు

ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

జవాబు: అమ్మా, మీరు చెప్పిన లక్షణాలను బట్టి ఒకే కారణాన్ని ఖచ్చితంగా చెప్పడం సాధ్యం కాదు. మీ సమస్యకు

వ్యథ పీడకలలు బాధిస్తున్నాయి !

శారీరక కారణాలు, మానసిక కారణాలు లేదా ఈ రెండూ కలిసి కారణమై ఉండవచ్చు. అందువల్ల ఊహాగానాలపై ఆధారపడకుండా సరైన పరీక్షలు చేయించుకుని అసలు కారణాన్ని గుర్తించడం చాలా ముఖ్యం.మీకు ఉన్న నీరసం, నిస్సత్తువ, తలనొప్పి, తగినంత నిద్రపోయినా అలసట, పీడకలలు వంటి లక్షణాలు విటమిన్ బి12 లేదా విటమిన్ డి లోపం, రక్తహీనత, థైరాయిడ్ లేదా ఇతర హార్మోన్ల అసమతుల్యత, మధుమేహం వంటి శారీరక సమస్యల వల్ల రావచ్చు. అదే సమయంలో అధిక మానసిక ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ లేదా బర్నౌట్ సిండ్రోమ్ వంటి మానసిక పరిస్థితుల్లో కూడా ఇలాంటి లక్షణాలు కనిపిస్తాయి. అందువల్ల ముందుగా ఒక ఫిజీషియన్‌ను సంప్రదించడం మంచిది. ఆయన మీ ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, అవసరమైన రక్తపరీక్షలు, విటమిన్ బి12, విటమిన్ డి, థైరాయిడ్, రక్తహీనత తదితర పరీక్షలు సూచిస్తారు. పరీక్షల ద్వారా శారీరక కారణం ఉందో లేదో నిర్ధారించవచ్చు. పరీక్షల్లో ప్రత్యేకమైన శారీరక సమస్య కనిపించకపోయినా, ఒత్తిడి, ఆందోళన, నిద్రలో ఇబ్బందులు, పీడకలలు కొనసాగితే క్లినికల్ సైకాలజిస్టు లేదా కౌన్సెలింగ్ సైకాలజిస్టును సంప్రదించండి. అవసరమైతే వారు సైకాలజికల్ అసెస్‌మెంట్ చేసి, కౌన్సెలింగ్, రిలాక్సేషన్ టెక్నిక్స్, కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ వంటి చికిత్సా విధానాలను సూచిస్తారు. ఒకవేళ తీవ్రమైన డిప్రెషన్ లేదా ఆందోళన రుగ్మత ఉన్నట్లు తేలితే సైకియాట్రిస్ట్ వద్దకు రిఫర్ చేస్తారు.రోజూ కనీసం 30 నిమిషాలు నడక లేదా వ్యాయామం చేయండి. సమతుల ఆహారం తీసుకోండి. కాఫీ, టీ అధికంగా తీసుకోవద్దు. నిద్రపోయే ముందు మొబైల్, ల్యాప్‌టాప్ వినియోగాన్ని తగ్గించండి. పనిలో మధ్య మధ్యలో చిన్న విరామాలు తీసుకోండి. సమస్యలను మనసులో దాచుకోకుండా కుటుంబ సభ్యులు లేదా నమ్మకమైన వ్యక్తులతో పంచుకోండి. వైద్యుల సలహా లేకుండా స్వయంగా విటమిన్ మాత్రలు లేదా ఇతర మందులు వాడకండి. మీ లక్షణాలు రోజువారీ పనితీరుపై ప్రభావం , లేదా నిరాశ, జీవితంపై విరక్తి వంటి భావనలు కలిగితే ఆలస్యం మానసిక వైద్యుడు లేదా నిపుణుడిని సంప్రదించండి. సరైన నిర్ధారణ, సమయానికి చికిత్సతో ఇటువంటి సమస్యలు చాలా వరకు పూర్తిగా నియంత్రణలోకి వస్తాయి. □

ఓం సాయి లీల

శిరిడీ సాయిబాబాను ఆరాధించే భక్తులు అశేషమైన సంఖ్యలో వున్నారు. ఆపదల నుంచి .. అనారోగ్యాల నుంచి .. ఆర్థిక పరమైన ఇబ్బందుల నుంచి తమని ఆయనే కాపాడుతూ ఉంటాడని వాళ్లంతా విశ్వసిస్తూ వుంటారు. బాబా చూపిన లీలావిశేషాలను కథలు కథలుగా చెప్పుకుంటూ వుంటారు. బాబా శిరిడీలో తిరుగాడుతున్నప్పుడు మహిమలెన్నో చూపాడు .ఒకసారి బాబా భక్తుడైన శ్యామా పాము కాటుకు గురవుతాడు. పాముకాటుకు మంత్రం వేసే వాళ్లు .. మందిచ్చే వాళ్లు వేరే వున్నా, ఆయన బాబా దగ్గరికే వస్తాడు. ఆయనని చూడగానే కిందికి దిగిపొమ్మనీ .. పైకి వస్తే ఏం చేస్తానో చూడమని బాబా కోపంగా అంటాడు. బాబా ధోరణి శ్యామాకి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. బాబా ఆ మాట అన్నది శ్యామా శరీరంలో పైకి ఎక్కుతోన్న విషాన్ని అనే విషయం ఆ తరువాత అక్కడి వాళ్లకి అర్థమవు తుంది. బాబా మాట .. ఆయన కంటి చూపే విషానికి విరుగుడుగా పనిచేశాయని గ్రహిస్తారు. తనకి ప్రాణ భిక్ష పెట్టిన బాబా పాదాలపై పడి శ్యామా కృతజ్ఞతలు తెలియజేస్తాడు. □

పుదీనా పూరి

కావలసినవి: పుదీనా: ఒక కప్పు, గోధుమ పిండి: రెండు కప్పులు, పచ్చిమిర్చి: నాలుగు, అల్లం: అంగుళం ముక్క, జీలకర్ర: ఒక టీస్పూన్, గరం మసాల: అర టీస్పూన్, ఉప్పు: తగినంత, నూనె: వేయించడానికి సరిపడా.

తయారీ : పుదీనా ఆకును శుభ్రంగా కడిగి పెట్టు కోవాలి. మిక్సీ గిన్నెలో పుదీనా, పచ్చిమిర్చి, అల్లం, జీలకర్ర, గరంమసాల, ఉప్పు వేసి మెత్తగా రుబ్బుకోవాలి. ఒక గిన్నెలో గోధుమపిండి, పుదీనా మిశ్రమం, ఒక టేబుల్ స్పూన్ నూనె వేసి తగినన్ని నీళ్లు పోసి చపాతీ పిండిలా కలిపి అరగంట పాటు నాననివ్వాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి వేయించడానికి సరిపడా నూనెపోసి వేడిచేయాలి. పిండిని కొద్దికొద్దిగా తీసుకుని పూరీలు ఒత్తుకుని కాగిన నూనెలో దోరగా వేయించుకుంటే పుదీనా పూరి సిద్ధం.

ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47 - AK47e చిత్రం నుంచి 'సంపూర్ణ'గా యువినా పార్థవి

ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47 – AK47e చిత్ర బృందం కుటుంబంలోని మరో సభ్యురాలిని పరిచయం చేసింది.ఈ చిత్రంలో చిట్టిబాబు, స్వర్ణ దంపతుల ముద్దుల కుమార్తె 'సంపూర్ణ' పాత్రలో బాలనటి యువినా పార్థవి నటిస్తోంది. అమాయకత్వం, చిలిపితనం, అల్లరితో నిండిన సంపూర్ణ పాత్ర చిట్టిబాబు జీవితంలో నవ్వులు పూయించడంతో పాటు, అనూహ్యమైన చిన్న చిన్న సంఘటనలకు కూడా కారణమవుతుంది. ఈ పాత్ర ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకునేలా ఉండనుందని చిత్ర బృందం తెలిపింది. పాత్రల పరిచయాలతో సినిమాపై రోజురోజుకూ ఆసక్తిని పెంచుతున్న మేకర్స్, తదుపరి˘సర్వ పాత్రలో నటిస్తున్న రాజా ప్రజ్వల్ను పరిచయం చేయ నున్నారు. రచన,దర్శకత్వం త్రివిక్రమ్ శ్రీనివాస్ వహిస్తున్న ఈ చిత్రాన్ని హారిక హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) అత్యంత ప్రతి ష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు.ఈ చిత్రానికి ఎస్. థమన్ సంగీతం అందిస్తుండగా, రవి. కె. చంద్రన్ సినిమాటోగ్రఫీ, శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తు న్నారు.ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47 – AK47e చిత్రం 2026 అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల కానుంది.

తెర

'ఇరుముడి' చిత్రం ఆగస్టు 21న రిలీజ్

మాస్ మహారాజా రవితేజ ఎమోషనల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఇరుముడి'పై భారీ అంచనాలు ఉన్నాయి. శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రం 'ఫస్ట్ గ్లింప్స్', చార్ట్‌బస్టర్ అయ్యప్ప భక్తి పాట 'ఇరుముడి కట్టు'తో ప్రేక్షకులను అలరించిన ఈ చిత్రం, ఇప్పుడు మరో కీలక అప్‌డేట్‌తో ముందు కొచ్చింది. విడుదల తేదీకి సంబంధించి నెలకొన్న ఊహాగానాలకు తెరదించుతూ, అనుకున్న సమయానికే అంటే ఆగస్టు 21న 'ఇరుముడి' ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుందని చిత్ర బృందం అధికారికంగా అనౌన్స్ చేసింది. విడుదల షెడ్యూల్‌లో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేస్తూ, "25 Days To Go" పోస్టర్‌ను విడుదల చేశారు.కొత్తగా విడుదలైన ఈ పోస్టర్ సినిమాలోని ఎమోషన్ ని అద్భుతంగా ఆవిష్కరించింది. ఇందులో రవితేజ, చిన్నారి నక్షత్ర మధ్య తండ్రీకూతుళ్ల అనుబంధం ఎంతో ఆప్యాయంగా కనిపిస్తోంది. రవితేజ పేకాటలో నిమగ్నమై ఉండగా, ఆ చిన్నారి వెనుక నుండి ఆప్యాయంగా అతన్ని కౌగిలించుకోవడం, ఈ కథలోని ఎమోషన్‌ని ప్రజెంట్ చేస్తోంది. కుటుంబ కథా చిత్రాలను తెరకెక్కించడంలో దర్శకుడు శివ నిర్వాణకు మంచి పేరుంది; ఆయన 'ఇరుముడి'ని ఒక కంప్లీట్ ఎంటర్‌టైనర్‌గా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటివరకు విడుదలైన ప్రచార చిత్రాలు, వీడియోలు ఆయన ఈ సినిమాను ఎంత శ్రద్ధతో రూపొందిస్తున్నారో తెలియజేస్తున్నాయి. ప్రియా భవాని శంకర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి అత్యుత్తమ సాంకేతిక నిపుణుల బృందం పని చేస్తోంది. విష్ణు శర్మ సినిమాటోగ్రఫీని, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైన్‌ను, ప్రవీణ్ పూడి ఎడిటింగ్ ను పర్యవేక్షి స్తుండగా, జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం ఈ చిత్రానికి ప్రధాన బలాలుగా నిలుస్తోంది.

'శ్రీనివాస మంగాపురం' నా కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్ : దర్శకుడు అజయ్ భూపతి

ఈ సినిమా ప్రయాణం ఎలా మొదలైంది?
నేను జెమినీ కిరణ్ గారికి ఒక సినిమా చేయాలి. ఈ సినిమా అనుకున్నప్పుడు దత్ గారిని వెళ్లి కలిశాను. తర్వాత జై కృష్ణను రెండు, మూడు సార్లు కలిశాను. తనపై కాన్ఫిడెన్స్ వచ్చిన తర్వాత మొదలు పెట్టాను.

కృష్ణ కుటుంబం నుంచి ఒక హీరోని పరిచయం చేయడం అంటే కచ్చితంగా బాధ్యత, ఒత్తిడి ఉంటుంది కదా?
నేను మొదట్లో అది పట్టించుకోలేదు. నిజానికి నేను ఎప్పుడూ నా స్టైల్‌లోనే సినిమాలు చేసుకుంటూ వెళ్తాను. వాళ్లు కూడా నా స్టైల్‌కే వదిలేశారు. కాకపోతే జై కృష్ణతో ఒక జర్నీ మొదలైన తర్వాత నేను చాలా ఎమోషనల్ అయ్యాను.

శ్రీనివాస మంగాపురం టైటిల్ గురించి?
నేను ఈ టైటిల్‌తోనే కథ రాసుకున్నాను. ఈ కథకు, టైటిల్‌కు పూర్తి జస్టిఫికేషన్ ఉంటుంది. ఈ కథ బ్యాక్‌డ్రాప్, క్యారెక్టర్ల పేర్లు, వాళ్ల లవ్ స్టోరీ... వీటన్నింటికీ ఈ టైటిల్ సరిపోతుంది. ఇది సినిమాకు చాలా ప్లస్ అయింది.

మోహన్ బాబు క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది?
మోహన్ బాబు గారిది వెరీ ఎమోషనల్ క్యారెక్టర్. గత 20 సంవత్సరాలుగా ఆయనను ఇంత ఎమోషనల్‌గా ఆడియన్స్ చూసి ఉండరు.

మహేష్ బాబు సినిమా చూశారు కదా... ఆయన ఇచ్చిన కాంప్లిమెంట్ ఏమిటి?
మహేష్ బాబు గారు సినిమా చూసి అదిరిపోయింది అని మెసేజ్ పెట్టారు. ముఖ్యంగా జై కృష్ణ, రాషా తడానీ జోడిని మెచ్చుకున్నారు.

ఎమోషన్ పరంగా సినిమా ఎలా ఉంటుంది?
ఎమోషన్ అదిరిపోతుంది. లాస్ట్ 30 నిమిషాలు చూస్తున్నప్పుడు యూత్ అందరూ కన్నీళ్లు పెట్టుకుంటారు

తిరుపతిలో షూట్ చేసినప్పుడు చాలా నిబంధనలు ఉంటాయి కదా?
తిరుమల స్టెప్స్ నుంచి పైకొండ వరకు ఏమీ చేయకూడదు. తిరుపతి అనేది మామూలుగా అన్ని టౌన్స్‌లాగే ఒక టౌన్.

ఈ షూటింగ్ జర్నీలో జై కృష్ణలో వచ్చిన మార్పు ఏమిటి?
జై కృష్ణ చాలా సిగ్గరి. చాలా ఇంట్రోవర్ట్. మహేష్ బాబులాగే తనలో కూడా మంచి సెన్స్ ఆఫ్ హ్యూమర్ ఉంది. బాగుంటుంది.

'మకుటం' నుంచి 'కలతేలా' సాంగ్ విడుదల

సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్ మీద 99వ ప్రాజెక్ట్‌గా విశాల్ హీరోగా, దర్శకుడిగా చేస్తున్న చిత్రం˘మకుటం̥. స్వర్గీయ ఆర్ బీ చౌదరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో అంజలి, దుషార విజయన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ మూవీ నుంచి వచ్చిన టీజర్, ఫస్ట్ సింగిల్ 'ది రైజ్ ఆఫ్ లింగా', ఫోక్ సాంగ్˘నచ్చాకే వచ్చేర్రా̥ అనే పాటలు అన్నీ కూడా అందరిలోనూ అంచనాలు పెంచేశాయి. ఇక తాజాగా మరో పాటను చిత్రయూనిట్ రిలీజ్ చేసింది. 'కలతేలా'అంటూ సాగే సాంగ్‌ను తాజాగా రిలీజ్ చేశారు. ఇదొక ఫ్యామిలీ, మోటివేషనల్ సాంగ్‌లా కనిపిస్తోంది. ఇందులో విశాల్, దుషారలతో పాటుగా పిల్లలు కూడా కనిపిస్తున్నారు. ఈ పాటను రాజశ్రీ సుధాకర్ రచించగా.. కృష్ణ తేజస్వీ ఆలపించారు. ఇక జీవీ ప్రకాష్ అందించిన బాణీ ఎంతో క్యాచీగా ఉంది. ఇక ఈ పాట యూట్యూబ్‌లో ఇట్టే ట్రెండ్ అయ్యేలా కనిపిస్తోంది. ఈ సినిమాకి రిచర్డ్ ఎం. నాథన్, అభినందన్ రామానుజం కెమెరామెన్లుగా, ఎన్.బి.శ్రీకాంత్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు.

'ఇమ్మోర్టల్' నుంచి 'షీ ఈజ్ మై' సాంగ్ రిలీజ్

మల్టీ ట్యాలంటెడ్ జి.వి. ప్రకాష్ కుమార్, కయదు లోహర్ జంటగా నటిస్తున్న డార్క్ ఫాంటసీ సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'ఇమ్మోర్టల్' మరియప్పన్ చిన్న దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అరుణ్‌కుమార్ ధనశేఖరన్ నిర్మిస్తున్నారు ఇప్పటికే రిలీజ్ చేసిన సాంగ్‌కి అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది.తాజాగా 'ఇమ్మోర్టల్' నుంచి రొమాంటిక్ మెలోడీ 'షీ ఈజ్ మై' లిరికల్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు.ఈ పాటకు సామ్ సీఎస్ అందించిన సంగీతం ప్రత్యేక vamsishekarpro gmail¨com6గా నిలుస్తోంది. అరవింద్ శ్రీనివాస తన వోకల్స్ పాటకు ప్రాణం పోయగా, రాజశ్రీ సుధాకర్ రాసిన సాహిత్యం ప్రేమలోని భావోద్వేగాలను అందంగా పలికించింది.ఈ పాటలో జి.వి. ప్రకాష్ కుమార్, కయదు లోహర్‌ల మధ్య కెమిస్ట్రీ చాలా ఆసక్తికరంగా వుంది. మనసును హత్తుకునే ట్యూన్, లిరిక్స్‌తో 'షీ ఈజ్ మై' సంగీత ప్రియులను ఆకట్టుకునే మెలోడీగా నిలిచింది.

'ఆకాశంలో ఒక తార' 'చిట్టి చిట్టి చీమ'సాంగ్ రిలీజ్

వెర్సటైల్ స్టార్ దుల్కర్ సల్మాన్ పుట్టినరోజు సందర్భంగా 'ఆకాశంలో ఒక తార' చిత్ర యూనిట్ ఫస్ట్ సింగిల్ 'చిట్టి చిట్టి చీమ'ను విడుదల చేసింది.జివి ప్రకాష్ కుమార్ స్వరపరిచిన 'చిట్టి చిట్టి చీమ' పాట హృదయాన్ని హత్తుకునే మెలోడి.. భావోద్వేగంగా సినిమాలో ఏం చెప్పాలనుకున్నారో ఆ పాయింట్‌ను అద్భుతంగా ప్రతిబింబిస్తుంది. హీరోయిన్ కోణంలో పాడిన ఈ పాట, నక్షత్రాలను చేరాలనే ఒక మహిళ కలను, ఆమె పక్కన నిలబడి నిశ్శబ్దంగా అండగా నిలిచే వ్యక్తి ప్రేమను చూపిస్తుంది. సాంప్రదాయ ప్రేమకథలను దాటి, ఒక ప్రత్యేకమైన బంధాన్ని ఈ పాట అందంగా సెలబ్రేట్ చేస్తుంది.శ్రీమణి రాసిన ఈ పాటను రమ్య బెహరా ఎంతో చక్కగా ఆలపించారు. చిట్టి చీమ చక్కెర మోసుకెళ్లడం, కొండపల్లి బొమ్మ కొండలు దాటడం, గాలికి ఎదురుగా మాత్రమే ఎగిరే గాలిపటం వంటి ఆకర్షణీయమైన ఉపమానాల ద్వారా ఈ పాట పట్టుదల, ఆశ, ప్రతి కల వెనుక ఉన్న నిశ్శబ్ద బలాన్ని అద్భుతంగా ఆవిష్కరించింది. ఆకాశంలో ఒక తార చిత్రంలో దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి, శ్రుతి హాసన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. పావన్ సాదినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని లైట్‌బాక్స్ మీడియా బ్యానర్‌పై సందీప్ గున్నం, రమ్య గున్నం నిర్మిస్తున్నారు. స్వప్న సినిమా, గీతా ఆర్ట్స్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నాయి.

30vzm15:30vzm15.qxd 29-07-2026 22:59 Page 1

భోజన ఏర్పాట్లను పరిశీలించిన మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు

భోగాపురం ,జూలై 29,ప్రభాతవార్త:

భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విచ్చేయనున్న సందర్భంగా నిర్వహించనున్న మహాసభకు హాజరయ్యే లక్షలాది మంది ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా భోజన సదుపాయాల ఏర్పాట్లపై ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. సభా ప్రాంగణం పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న ఫుడ్ పాయింట్లకు అనువైన స్థలాలను పరిశీలించిన బంగార్రాజు ప్రజలు సులభంగా చేరుకునేలా, రద్దీ లేకుండా, పరిశుభ్రమైన వాతావరణంలో భోజన పంపిణీ జరిగేలా అధికారులకు పలు సూచనలు చేశారు. భోజన పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రధానమంత్రి పర్యటన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ మహాసభ విజయవంతం కావడానికి అవసరమైన ప్రతి ఏర్పాటును సమన్వయంతో చేపట్టాలని బంగార్రాజు సూచించారు. సభకు వచ్చే ప్రతి ఒక్కరికీ మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా గురు పౌర్ణమి ఉత్సవాలు

చీపురుపల్లి ,జూలై 29, ప్రభాతవార్త :

చీపురుపల్లి పట్టణంలోని దత్తసాయి మందిరంలో బుధవారం గురుపౌర్ణమి మహోత్సవం వేడుకలు సత్య సాయి వ్రతములు ఘనంగా నిర్వహించారు. పూజలలో భాగంగా ఉదయం ఐదు గంటలకే కాకడ హారతి, 6:30 కు శ్రీ శిరిడి సాయి పంచామృత క్షీరాభిషేకం, నిత్య పూజా కార్యక్రమం, సువర్ణ పుష్పార్చన, సామూహిక సత్యసాయి వ్రతాలు మధ్యాహ్న హారతి తో పాటు భక్తులకు అన్నప్రసాద వితరణ జరిపారు. కార్యనిర్వాహకులు తంగుడు రామకృష్ణారావు, ఆలయ నిర్మాణ సహకారదాత కుందం విద్యాసాగర్, వేద పండితుల ఆధ్వర్యంలో పూజలను ఘనంగా నిర్వహించారు. చీపురుపల్లి పట్టణ పరిధిలోని వేలాది మంది భక్తులు గౌరీ పౌర్ణమి ఉత్సవాల్లో పాల్గొని దత్త సాయి మందిరంలో పూజలు జరిపారు. అదేవిధంగా అన్నప్రసాద్ వితరణ కూడా వేరాది మంది భక్తులు హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు కార్యక్రమంలో ఆలయ అర్చకులు నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోటలో

శృంగవరపుకోట,జూలై29,ప్రభాతవార్త :

గురుపౌర్ణమి వేడుకలను ఎస్.కోటలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న షిర్డీసాయి ఆలయంలో బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆరు గంటల నుంచే సాయినాధుడుకు పాలాభిషేకాలు, అభిషేకాలు ప్రారంభమయ్యాయి. ఆలయానికి స్థానికంగా ఉన్న భక్తులతో పాటు మండలంలో పలు ప్రాంతాల నుంచి భక్తులు అత్యంత సంఖ్యలో తరలివచ్చి సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కేసులు ఉపసంహరణ తర్వాతే చెక్కుల పంపిణీ

శృంగవరపుకోట,జూలై29,ప్రభాతవార్త :

జిందాల్ రైతులకు చెక్కులు పంపిణీలో ఆలస్యమయ్యే అవకాశం కన్పిస్తుంది.ఎందుకంటే గతంలో రైతులు హైకోర్టులో కేసులు వేయడంతో చెక్కులు పంపిణీకి అడ్డంగా మారింది.ముందుగా కోర్టులో కేసులను రైతులు ఉపసంహరించుకున్న తర్వాతే చెక్కులు పంపిణీ జరగనుందని విశ్వసనీయ సమాచారం.అంతవరకు చెక్కులు పంపిణీలో జాప్యం జరిగే అవకాశం ఉందని తెలుస్తుంది.ఈమేరకు కోర్టులో వేసిన కేసులను ఉపసంహరణ దిశగా రైతులు అడుగులు వేస్తున్నట్లు సమాచారం.మరో వారం రోజుల్లో చెక్కులు పంపిణీకి పూర్తి స్థాయిలో క్లియరెన్స్ వచ్చే అవకాశం కన్పిస్తుంది.ఇక జిందాల్ యాజమాన్యానికి భూములు కోల్పోయిన బొడ్డవర ప్రాంతం రైతులకు మధ్య గతంలో జరిగిన చర్చల్లో ఎకరాకు అదనంగా రెండు లక్షల 50వేల రూపాయలు అలాగే జిందాల్ భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేసిన తరువాత కుటుంభంలో ఒకరికి అందులో ఉద్యోగం కల్పిస్తామని ఒప్పందం జరిగిన విషయం అందరికీ తెలిసిందే.

తీరిన తాగునీటి కష్టాలు

మెరకముడిదాం, జులై 29,ప్రభాత వార్త :

కొండలావేరులో 15వ ఆర్థిక సంఘ నిధులతో బోరు బావి ఏర్పాటు చేయడంతో గ్రామస్తులకు తాగునీటి కష్టాలు తీరినట్లు అయింది. కొండ లావేరు మాజీ సర్పంచ్ చోడవరపు బంగారం నాయుడు ఆధ్వర్యంలో ఈ బోరు పనులు చేపట్టారు. దీంతో గ్రామస్తుల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామికి ఘనంగా ప్రత్యేక పూజలు



విజయనగరం, జూలై 29, ప్రభాతవార్త

గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని నగరంలోని మునిసిపల్ కార్యాలయం జంక్షన్ వద్ద ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహానికి వీరబ్రహ్మేంద్రస్వామి భక్తుల బృందం బుధవారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిం చారు. అనంతరం సుమారు వెయ్యి మందికి అన్న సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా జరిపించారు. ప్రముఖ విశ్వబ్రాహ్మణ పురోహితుడు లక్కోజు ఓంకార్ సిద్ధాంతి, మాజీ కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు, ప్రతినిధులు వేముల సురేష్ బాబు, లక్కోజి బాబు, పి. సంజీవి, టి శ్రీనివాసరావు, పలువురు వీరబ్రహ్మేంద్రస్వామి భక్తులు పాల్గొన్నారు.

నాణ్యత లేని జీడి మొక్కల పంపిణీపై ఎంపిటిసి ధ్వజం

కురుపాం, జూలై 29,ప్రభాతవార్త :

మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా నాణ్యత లేని మొలక రాని జీడి మొక్కలు గిరిజన ప్రాంతంలో పంపిణీ చేశారని పలువురు ఎంపిటిసిలు ధ్వజం ఎత్తారు. బుధవారం కురుపాం మండల చివర సర్వసభ్య సమావేశం ఎంపీపీ పద్మావతి అధ్యక్షున మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీలు వారి ఆవేదనను వ్యక్తం చేశారు. మొదటగా వ్యవసాయ శాఖపై ఎరువులు చాలీచాలని పంపిణీ చేశారని పూర్తిస్థాయిలో సీజన్ అయిపోయిన తర్వాత అందజేస్తారా అని పలువురు ఎంపీటీసీలు వ్యవసాయ అధికారి నాగేశ్వరరావుకి ప్రశ్నించారు. గిరి సీమలలో మలేరియా ఎక్కువగా వ్యాప్తి చెందుతుందని కనుక వైద్యాధికారులు అప్రమత్తంగా పనిచేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వరి అన్నారు . కురుపాం ఆసుపత్రిలో వైద్యులు పనితీరు బాగుగా ఉన్నప్పటికీ సిబ్బంది రోగులపై నిర్లక్ష్యము వహిస్తున్నారని దీనిని సరిదిద్దాలని ఎంపీపీ పద్మావతి అన్నారు. ఈ సందర్భంలో రామభద్రపురం పిహెచ్సి వైద్యాధికారిని కలుగజేసుకొని తమ పీహెచ్ నుండి రోగులకు తీసుకొస్తే ఇక్కడ సిబ్బంది నిర్లక్ష్య వైఖరి చూపించారని కురుపాం సిహెచ్ సి వైద్యాధికారికి తెలియజేశారు. సమావేశం లో పలు సమస్యలపై ఎంపీటీసీలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి రజినీ దుర్గ, హౌసింగ్ శాఖ ఏఈ అచ్చియమ్మ,మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ పంచాయతీరాజ్ ఏఈ మురళీధర్ విద్యుత్ శాఖ పలు శాఖల అధికారులు, పిఎసిఎస్ అధ్యక్షుడు డొల్లు కిషోర్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

మక్కువ ,జులై 29, ప్రభాతవార్త:

మక్కువ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మర్రి పారమ్మ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. అన్ని శాఖలవాళ్లు శాఖపరమైన అంశాలను సభ్యులకు తెలియజేశారు. స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా పంట బీమా చేసుకోవాలని ఆమె సభ్యులకు వివరించారు. అనంతరం వైద్యానికి శాఖ కు సంబంధించి 14 నుండి 15 సంవత్సరాల లోపు ఆడపిల్లలు తప్పనిసరిగా వ్యాక్సినేషన్ వేపించుకోవాలని వాక్సినేషన్ ద్వారా భవిష్యత్తులో క్యాన్సర్కు గురయ్యే అవకాశం తక్కువ ఉంటుందని వివరించారు. డిప్యూటీ తహసీలర్ షేక్ ఇబ్రహీం మాట్లాడుతూ 5 దశలలో రీ సర్వే పూర్తి అయిందని ఆరవ దశ ఆగస్టు మొదటివారం నుండి ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో అర్జునరావు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సూర్య పీఠంలో వ్యాస పూర్ణిమ గురుపాదుకార్చనలు

పార్వతీపురం, జూలై 29, ప్రభాతవార్త:

స్థానిక శ్రీ సూర్య పీఠంలో వ్యాస పూర్ణిమ సందర్భంగా గురుపాదుకార్చనలు జరిపారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ వేమకోటి నరహరి శాస్త్రి గురు పౌర్ణమి గురించి మాట్లాడుతూ జ్ఞాన విజ్ఞాన సంపద భారతీయ వేద పురాణ ఇతిహాసములలో దాగి ఉన్నవి. వేద సారాన్ని వేదవ్యాసుడు అష్టాదశ పురాణాలుగా మనకందించి, భారతజాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటారు. అంతేకాక భారత ఇతిహాసాన్ని ఇప్పటికీ స్మరిస్తూ మనం స్ఫూర్తిని పొందుతున్నాం. ఆ మహానుభావుని జన్మదినం ఈ గురుపూర్ణిమ. అందుకే ఎందరో మహానుభావులు, జగద్గురువులు, అవతార పురుషులు సైతం ఈరోజు వ్యాసుని ఆది శంకరాచార్యుని, తమ గురువులను స్మరిస్తూ తరిస్తున్నారు అని అన్నారు. సూర్యపీఠంలో ఈరోజు ముందుగా ఆది శంకర, గౌడపాద, శ్రీకృష్ణ భగవానుని మరియు భాస్కరానంద తీర్థ గురు పాదుకులను అర్చించి దత్తాత్రేయునికి క్షీరాభిషేకం అనంతరం గురు మంత్ర విశ్వశాంతి హోమం చేశారు. బ్రహ్మశ్రీ వేమకోటి నరహరి శాస్త్రి ఆశీస్సులతో వేమకోటి వివేకానంద శర్మ ఈ కార్యక్రమాన్ని సౌరయాగశాలలో నిర్వహించారు.

రెండేళ్లలో అభివృద్ధి , సంక్షేమంలో కూటమి ప్రభుత్వం ముందంజ

గరుగుబిల్లి, జూలై 29, ప్రభాతవార్త:

పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం కారివలస గ్రామంలో బుధవారం నిర్వహించిన రెండేళ్ల నమ్మకం - సంక్షేమం, అభివృద్ధిపై ఇంటింటికీ తెలుగుదేశకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో అరాచక పాలనకు ముగింపు పలికి, అభివృద్ధి మరియు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం రోజురోజుకూ పెరుగుతోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా వెనుకబడిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందనివిమర్శించారు. అయితే, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తోందని తెలిపారు. ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లను పెంచి లబ్ధిదారులకు అందిస్తున్నామని, గృహిణులకు గ్యాస్ సిలిండర్లపై రాయితీలు కల్పిస్తున్నామని చెప్పారు. అలాగే, గత ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని ఒకే విద్యార్థికి పరిమితం చేయగా, ప్రస్తుతం కుటుంబంలోని అర్హులైన ప్రతి విద్యార్థికి ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన యూరియా, ఇతర ఎరువుల సరఫరాలో ఎలాంటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, అన్నదాత సుఖీభవ -- పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు ఎలాంటి వివక్ష లేకుండా ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులను కూడా పారదర్శకంగా, వేగవంతంగా అమలు చేస్తున్నామని వెల్లడించారు.

కురుపాంలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

కురుపాం, జూలై 29, ప్రభాతవార్త :

గురుపౌర్ణమి పురస్కరించుకొని కురుపాంలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు.స్థానిక షిర్డీసాయి ద్వారకామాయి ఆలయంలో ప్రత్యేక పూజలు ,అభిషేకాలు ధర్మకర్త కోరో రమాబాయి, సాయి సత్సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళలచే లలితపారాణి భక్తులకు వినిపించారు.కురుపాం మరియు పరిశరాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని షిర్డీసాయికి ప్రత్యేక పూజలు చేపట్టారు. మద్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. అలాగే గాయత్రి ప్రజ్ఞ మందిరం,రావాడ రోడ్డు వద్ద గల దుర్గాదేవి గుడిలో ,బిజెపి కార్యాలయం వద్ద ఘనంగా గురుపౌర్ణమి నిర్వహించి అన్నప్రసాదం పంపిణీ చేశారు .

విమానాశ్రయం ప్రారంభోత్సవం విజయవంతం చేయాలి

పార్వతీపురం, జూలై29, ప్రభాతవార్త:

భోగాపురం వద్ద నిర్మించిన శ్రీ అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే విజయ్ చంద్ర పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం దీనికి సంబంధించిన ఏర్పాట్లపై విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ పార్వతీపురం నియోజకవర్గ పరిశీలకులుగా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్ చంద్ర మాట్లాడుతూ శ్రీ అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఆగస్టు 1న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానుండగా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొననున్నారని తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి చారిత్రాత్మక మైలురాయిగా నిలిచే ఈ కార్యక్రమానికి పార్వతీపురం నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

గ్రామాల్లో మహిళా రైతులు సభ్యులుగా చేరాలి

దత్తిరాజేరు, జులై 29, ప్రభాతవార్త :

గ్రామాల్లో 15 మందితో మహిళా రైతు గ్రూపు సభ్యులుగా చేరి సంఘం పేరుతోనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మహిళా రైతు సంఘాల ఇన్చార్జి అధికారి టి. రాము తెలిపారు వెలుగు సమాఖ్య కార్యాలయంలో సీసీలుతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఎపిఎం మాట్లాడుతూమహిళా రైతు సంఘాల బలోపేతం చేయడానికి సిసిల కృషి చేయాలని వారికి సూచించారు. మహిళ రైతు గ్రూపు సభ్యులకు వ్యవసాయ శాఖ ఉద్యాన శాఖకు సంబంధించి ప్రభుత్వ స్కీములన్ని గ్రూపు సభ్యుల ద్వారా రైతులకు అందించడం జరుగుతుందన్నారు రైతులు పండించే పంటలను మహిళా రైతు సంఘాలు కొనుగోలుచేస్తారన్నారు వాటి వల్ల రైతులకు ఆదాయం పెరుగుతుంది అన్నారు. ఇంకా దళారులును అరికట్టడానిక గ్రామాల్లో మహిళ రైతు గ్రూప్ సంఘాలు ఉండాలన్నారు. గ్రూప్ సభ్యులకు ప్రభుత్వం పంటల సంబంధించిన విత్తనాలన్నీ సబ్సిడీ ద్వారా ప్రభుత్వంఅందజేస్తారన్నారు. మహిళా రైతు గ్రూపులకు బ్యాంకు రుణాలు ఇస్తారన్నారు వ్యవసాయ పరికరాలు పంట రుణాలు సంఘాలకు వర్తిస్తాయన్నారుఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఏపీఎం రాము సి సి లు రాము అప్పలరాజు పాల్గొన్నారు.

టిఎస్ఎఫ్ నాయకునిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

మైదాన ప్రాంత గిరిజన నిరుద్యోగ సంఘం డిమాండ్

రామభద్రపురం,జూలై 29,ప్రభాత వార్త:

రామభద్రపురం మండల పరిధిలోని కొట్టక్కి పంచాయతీ మధురా ఎరుకల పాకలకు చెందిన గిరిజన విద్యార్థి సమైఖ్య నాయకుడు పాలవలస భగవాన్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ భాద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మైదాన ప్రాంత గిరిజన నిరుద్యోగ సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షుడు రఘుపతుల శశిభూషన్ డిమాండ్ చేస్తూ స్థానిక విలేఖర్లకు ఒక ప్రకటన విడుదల చేశారు.కొట్టక్కి ఎరుకులపాకలకు చెందిన పాలవలస సూరమ్మ, విశాఖపట్నంకి చెందిన గేదెల ప్రకాష్,గేదెల ప్రదీప్ లు ఉత్తర్య జిల్లాలో గిరిజన సంఘం నాయకులపై గతంలో ఇఛటువంటి ఘటనలు జరగలేదని మరలా ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.తీవ్రంగా గాయపడిన భగవాన్ ను మెరుగైన వైద్యం కోసం విజయనగరం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్న ఆయనను గిరిజన సంఘాల నాయకులు పరామర్శించారు.

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

అంతర్జాతీయ విమానాశ్రయంతో అభివృద్ధి పరుగులు

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

నెల్లిమర్ల, జూలై 29,ప్రభాతవార్త :

భోగాపురంలో నిర్మించిన అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుతో ఉత్తరాంధ్ర అభివృద్ధి పరుగులు పెడుతుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. నెల్లిమర్లలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద టీడీపీ సీనియర్ నాయకుడు సువ్వాడ రవిశేఖర్ అధ్యక్షతన బుధవారం సాయంత్రం జరిగిన సమావేశానికి రవికుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వేల కోట్ల రూపాయలతో విమానాశ్రయాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మించారని, విమానాశ్రయం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని అన్నారు. కార్యక్రమంలో సువ్వాడ రవి శేఖర్ తో పాటు వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ గోపాల్, కడగల ఆనంద్ కుమార్, చనమల్లు వెంకటరమణ, గేదెల రాజారావు లెంక అప్పలనాయుడు, ఎంపీడీవో రవికుమార్, డిప్యూటీ ఎంపీడీవో శంకర్ జగన్నాథ్, అధికారులు తెలుగుదేశం పార్టీ నాయకులు, వెలుగు మెప్మా సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్మోహన్ రెడ్డికి స్వాగతం పలికేందుకు తరలి రావాలి

గరివిడి, జూలై 29, ప్రభాత వార్త:

శ్రీకాకుళం జిల్లా పర్యటనకు ఈ నెల 30న విచ్చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి, వైకాపా జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని స్వాగతం పలికేందుకు వైకాపా శ్రేణులు తరలి రావాలని జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైకాపా యువనాయకురాలు డాక్టర్ బొత్స అనూష పిలుపునిచ్చారు. ఈ మేరకు గరివిడి లో శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన వైకాపా సమావేశంలో వారు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు కి సూచించారు. పైడి భీమవరం హైవే లో జగన్మోహన్ రెడ్డి కి స్వాగతం పలకనున్నామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో చీపురుపల్లి నియోజకవర్గ వైకాపా నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

లక్కవరపుకోట, జూలై 29 ప్రభాత వార్త :

మండలంలో గురు పౌర్ణమి వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా మండలంలోని పలు శ్రీ శిరిడి సాయి ఆలయాలలో ప్రత్యేక పూజలు హోమాధి కార్యక్రమాలు నిర్వహించారు అన్న సమారాధన నిర్వహించి ప్రసాద్ పంపిణీ చేశారు ఎల్ కోట గోల్డ్ స్టార్ జంక్షన్ తలారి గొల్జం తదితర గ్రామాల్లో గల ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది లక్కవరపుకోట మైదుకూరు పంచాయతీలో గల షిరిడి సాయి ఆలయంలో వేద పండితులు అక్కా జోస్యల శ్రీ హరి శర్మ ఆధ్వర్యంలో మేలుకొలుపు హారతి,పాలాభిషేకం,108 జల కలశాలతో సుగంధ ద్రవ్యాభిషేకం భస్మార్చన, శ్రీ గురు హోమం పూర్ణాహుతి అర్చన నివేదన మధ్యాహ్న హారతి తదితర కార్యక్రమాలు తెల్లవారి ఐదు గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించారు మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు సాయంత్రం సాయినాధుని ఉత్సవ విగ్రహ ఊరేగింపు (గ్రామ ప్రదక్షిణ) కార్యక్రమం అత్యంత వైభవంగా మేళతాళాలతో సాయినాధుని భజన పాటలతో భక్తులు నిర్వహించారు ఈ సందర్భంగా వేదపండితులు శ్రీ హరి శర్మ గురు పౌర్ణమి విశిష్టతను గురు పౌర్ణమికీ వేదవ్యాస మహర్షికి ఉన్న ప్రత్యేకతను తెలియజేశారు .

జ్ఞాన ప్రదాత గురువే : జెసి రాజు

రామభద్రపురం, జులై 29,ప్రభాత వార్త:

ప్రపంచంలో విద్యార్థులకు జ్ఞన ప్రదాత గురువే నని గురువే లేకుంటే అంధకారమే నని నాయుడు వలస ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె సి రాజు విద్యార్థులకు సూచించారు.బుధవారం పాఠశాలలో గురు పూర్ణిమ లేదా వ్యాస పూర్ణిమ (మహర్షి వేద వ్యాసుడు జన్మదినం) దినోత్సవాన్ని విద్యార్థులు నిర్వహించారు. చిత్ర పటానికి పూల మాలలు వేసి సమాజంలో ,వ్యక్తి జీవితం లో గురువు ప్రాముఖ్యతను తెలియ చేశారు.విద్యార్థులు ఉపాధ్యాయుల పాదముల వద్ద పువ్వులను వేసి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా హెచ్ ఎం జె సి రాజు మాట్లాడుతూ గురువు విద్యార్థుల జీవితాల్లో అంధకారాన్ని పారద్రోలి వెలుగును నింపేవాడని అందుకే గురువును బ్రహ్మతో పోల్చారన్నారు.ప్రతివారు గురువును గౌరవించాలని తెలియ చేశారు.ఉపాధ్యాయులు రాజమ్మ,కృష్ణం నాయుడు, ఎన్ వి రమణ విద్యార్థులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ కృషి అమోఘం

శృంగవరపుకోట,జులై29, ప్రభాతవార్త :

విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ ఎస్.కోట నియోజకవర్గ అభివృద్ధికి బాగా కృషి చేస్తున్నారని వారి సేవలు అమోఘమని డీసీఎంఎస్ చైర్మన్ గొంపక్రిష్ణ తెలిపారు.బుధవారం ఎంపీ భరత్ పుట్టినరోజు సందర్భంగా ఎస్.కోట గొంపక్రిష్ణ కార్యాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.ముందుగా గురుపౌర్ణమి సందర్భంగా స్థానిక షిర్డీసాయి ఆలయంలో ఎంపీ భరత్ పేరుమీద ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం గొంప భారీ కేక్ ను కట్ చేసి వేడుకలను ప్రారంభించారు.అలాగే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సుమారు 200మంది రోగులకు,బ్రెడ్,పండ్లు పంపిణీ చేశారు.ఈసందర్భంగా గొంపక్రిష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ రెండేళ్లపాలనలో ఎస్.కోట నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ భరత్ ఎనలేని కృషిచేశారని ఆయన కొనియాడారు.రాబోయే రోజుల్లో నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు వెచ్చించి ఇంకా అభివృద్ధికి దోహదపడుతారని ఆశిస్తున్నామని గొంప ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో పెద్ద ఎత్తున నియోజకవర్గంలో ఉన్న టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

విమానాశ్రయం సభను విజయవంతం చెయ్యండి : మంత్రి

సాలూరు ,జూలై 29, ప్రభాతవార్త :

ప్రధానమంత్రి మోదీ చేతుల మీదుగా ఆగస్ట్1తేదీన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ సభను విజయవంతం చేయ్యాలని నియోజకవర్గ టీడీపీ శ్రేణులతో బుధవారం ఉదయం మంత్రి సంధ్యారాణి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతు భోగాపురంలో జరగనున్న పీఎం సభకు నియోజకవర్గం నుంచి సుమారు 5వేలు మంది జనాలను సమీకరించాని క్లారిటీ ఇచ్చారు. అలాగే 13 వేల మంది గిరిజన బాలికలు సాయంత్రానికల్లా సభా ప్రాంగణానికి చేరుకుని దింసా నృత్యం ప్రాక్టీస్ చేసి కార్యక్రమంలో పాల్గొనేందుకు సిద్ధమవు తున్నట్లు స్పష్టం చేసారు. ప్రత్యేక పరిశీలకులు పొలంరెడ్డి. దినేష్ రెడ్డి,చిట్టి, హర్షవర్ధన్,ఆముదాల పరమేష్,ముఖి.సూర్యనారాయణ,అక్యాన.అప్పారావు,కొనిసి.చిన్ని తదితరులు పాల్గొన్నారు.

ప్రధానికి మోదీకి స్వాగతం పలకడానికి వెళ్లిన విద్యార్థులు

పాచిపెంట, జూలై 29, ప్రభాతవార్త :

భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయవిమానాశ్రయం ప్రారంభోత్సవంకి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి స్వాగతం పలికేందుకు పాచిపెంట మండలం పి.కొనవలస గిరిజన బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు బస్సును గిరిజన, మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి బుధవారం జండా ఊపిప్రారంభించారు. అలాగే మంత్రి బయలుదేరిన 230 మంది గిరిజన బాలికలను ఆప్యాయంగా కలిసి అభినందించారు. గురుకుల పాఠశాలలోబాలికలతో కలిసి సంప్రదాయ ధింసా నృత్యం చేస్తూ వారిలో ఉత్సాహాన్ని నింపిన మంత్రి , ప్రయాణంలో జాగ్రత్తలు పాటించాలని, క్రమశిక్షణతో వ్యవహరించాలని సూచించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా గిరిజన బాలికల పాఠశాలల నుంచి మొత్తం 13,000 మంది గిరిజన బాలికలు ఈ చారిత్రాత్మక వేడుకలో పాల్గొని ధింసా నృత్య ప్రదర్శన ఇవ్వనున్నారని తెలిపారు.మన గిరిజన సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని దేశం ముందుంచే ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి విద్యార్థిని రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి గారు ఆకాంక్షించారు.

వ్యాసరచన పోటీల్లో విజేతగా నిలిచిన భానుప్రకాష్

నెల్లిమర్ల, జూలై 29, ప్రభాతవార్త :

ఆగస్టు ఒకటో తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా జరగనున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులకు ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు పేరిట నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపు పేట ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి ఎస్. భాను ప్రకాష్ ప్రథమ బహుమతి సాధించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుసర్ల కామేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భాను ప్రకాష్‌ను ప్రధానోపాధ్యాయిని కామేశ్వరి తో పాటు, ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రులు అభినందించారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా 119 Bank of Baroda

బ్యాంక్ ఆఫ్ బరోడా
కొత్త అగ్రహారం (మెయిన్) బ్రాంచ్
NCS థియేటర్ దగ్గర, విజయనగరం-535002, ఆంధ్రప్రదేశ్.
ఫోన్ : 08922-224060, ఇ-మెయిల్ : vizkot@bankofbaroda.bank.in

ఋణగ్రహీత కొరకు డిమాండ్ నోటీసు
(సర్ఫేసి చట్టం, 2002 లోని సెక్షన్ 13 యొక్క సబ్- సెక్షన్ (2) క్రింద)

ఋణగ్రహీత : శ్రీ అవ్వ రమణ, తండ్రి: అప్పల కొండ, సర్వే నెం.159/1, అవ్వపేట గ్రామం, సవరవిల్లి పోస్ట్, భోగాపురం మండలం, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్-535 216.

విషయము: మా కొత్త అగ్రహారం బ్రాంచ్, విజయనగరం నుండి పొందిన ఋణసౌకర్యాలు – అకౌంట్ నెంలు.24220600005677 & 24220600007331

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారం దిగువ సంతకందారు స్పీడ్ పోస్ట్ ద్వారా తేది.20.06.2026 న మీకు తిరుగు రశీదులతో కూడిన డిమాండ్ నోటీసు మీచే పొందుపరచబడిన చిరునామాకు జారీచేయడమైనది. మేము మీకు పంపిన రిజిష్టర్డ్ నోటీసు యొక్క ఎక్నాలెడ్జ్‌మెంట్, పోస్టల్ డిపార్ట్‌మెంట్ ద్వారా అందజేయబడలేదు కావున, మేము ఈ పత్రికా ప్రకటన ద్వారా సదరు నోటీసు ప్రచురించబడినది. సదరు నోటీసు యొక్క వివరము దిగువ తెలుపబడినది. మీ యొక్క లోన్ ఖాతా బకాయిలు సరిగా చెల్లించనందున సదరు అకౌంట్ తేది.18.06.2026 నుండి నిరర్థక ఆస్తిగా (ఎన్.పి.ఎ) పరిగణించబడినది. ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా మీరు బకాయి మొత్తము తేది.19.06.2026 నాటికి రూ.32,41,544/- (అక్షరాల ముప్పై రెండు లక్షల నలభై ఒక వేయి ఐదు వందల నలభై నాలుగు రూపాయలు మాత్రమే) ప్లస్ వసూలుకాని వడ్డీ రూ.64,918.24 (అక్షరాల అరవై నాలుగు వేల తొమ్మిది వందల పద్దెనిమిది రూపాయల ఇరవై నాలుగు పైసలు మాత్రమే) ప్లస్ వర్తింపని వడ్డీ రూ. 6,247.86 (అక్షరాల ఆరు వేల రెండు వందల నలభై ఏడు రూపాయల ఎనభై ఆరు పైసలు మాత్రమే) ప్లస్ చక్రవడ్డీ రూ. 250/- (అక్షరాల రెండు వందల యాభై రూపాయలు మాత్రమే) + తేది.20.06.2026 నుండి వర్తించని వడ్డీతో పాటు చట్టపరమైన మరియు ఇతర ఛార్జీలతో మొదలగునవి మీరు చెల్లింపు చేయు తేది వరకు పేర్కొన్న విధంగా బ్యాంక్ ఆఫ్ బరోడా వారికి చెల్లించవలెను. పైన చెప్పిన సదరు చట్టంలోని సెక్షన్ 13(13) నియమానుసారం సెక్యూరిటీగా ఉంచిన ఆస్తులకు సంబంధించి బ్యాంక్ ఆఫ్ బరోడా వారి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి అమ్మకము, లీజు లేదా ఇతరత్రా లావాదేవీలు (సాధారణ వ్యాపార అవసరాలు తప్ప) ద్వారా బదిలీ చేయుట నిషేధించబడతాయని మీరు గమనించవలెను. ఈ నోటీసు సదరు చట్టంలోని సెక్షన్ 13(2) నిబంధనల ప్రకారం జారీచేయబడినది.

స్థిరాస్తి వివరములు

ఆంధ్రప్రదేశ్, విజయనగరం జిల్లా, విజయనగరం రెవెన్యూ జిల్లా, భోగాపురం సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్, సవరవిల్లి గ్రామ పంచాయితీ యొక్క పరిధి, భోగాపురం మండలం, సవరవిల్లి గ్రామం, సర్వే నెం.159/1 నందు విస్తీర్ణం 555 చ॥గ॥ల స్థలంలో నిర్మించిన గ్రౌండ్, మొదటి మరియు రెండవ అంతస్తులుతో రెసిడెన్షియల్ భవనం కలదు. ఆస్తి కొలతలు మరియు సరిహద్దులు ఈ క్రింది విధంగా ఉన్నాయి: ఆస్తి కొలతలు: తూర్పు నుండి పడమర: 50 అ॥లు, ఉత్తరం నుండి దక్షిణం: 100 అ॥లు. మొత్తం ఆస్తి హద్దులు: తూర్పు: అవ్వ రామస్వామి గారికి చెందిన ఖాళీ స్థలం, పడమర: రోడ్డు, ఉత్తరం: రోడ్డు, దక్షిణం: అవ్వ నరసింగ రావు గారికి చెందిన ఖాళీ స్థలం.

సెటిల్‌మెంట్ డీడ్ నెం. 4437/2019, తేది.28.08.2019 ప్రకారం శ్రీ అవ్వ రమణ, తండ్రి: అప్పలకొండ గారి పేరున ఉన్న ఆస్తి.

తేది : 20.06.2026 | సం/- అధీకృత అధికారి
స్థలం : విజయనగరం | బ్యాంక్ ఆఫ్ బరోడా

30-7pg10.qxd:30-7pg10.qxd 1/1/02 6:08 AM Page 1

లంక ప్రీమియర్ లీగ్‌లో మ్యాచ్ ఫిక్సింగ్?

న్యూఢిల్లీ: లంక ప్రీమియర్ లీగ్-2026 (ఎల్‌పిఎల్) ప్రస్తుత సీజన్ ప్రారంభం నుంచీ వరుస వివాదాలతో వార్తల్లో నిలుస్తోంది. ఫ్రాంచైజీల అవినీతి, షాహీన్ అఫ్రిది ఎంపికపై వివాదం, ఒక ఫ్రాంచైజీ యజమాని అరెస్ట్ వంటి వరుస పరిణామాలతో లీగ్ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. ఇంకా ఈ సీజన్‌లో రెండు వారాల క్రికెట్ మిగిలి ఉండగానే, లీగ్ ప్రతిష్టను మరింత దెబ్బతీసేలా మరో సంచలన సంఘటన చోటుచేసుకుంది. కొలంబో క్యాప్స్, జాఫ్నా కింగ్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో జరిగిన ఓ పరిణామం లీగ్‌పై ఉన్న నమ్మకాన్ని మరింతగా సడలించింది. కొలంబో క్యాప్స్ తరఫున బౌలింగ్ ప్రారంభించిన పాకిస్థాన్ ఫాస్ట్ బౌలర్ షానవాజ్ దహానీ ఈ మ్యాచ్‌లో దారుణమైన ప్రదర్శన ఇచ్చాడు. తన 4 ఓవర్ల స్పెల్‌లో ఏకంగా 6 ఎక్స్‌ట్రాలతో కలిపి 71 పరుగులు సమర్పించుకున్నాడు. వికెట్ ఏమీ తీయలేకపోయాడు. తొలి ఓవర్లో వైడ్‌తో పరుగుల ఖాతా తెరిచి 6 పరుగులు ఇవ్వగా, రెండో ఓవర్లో జాఫ్నా బ్యాటర్లు విరుచుకుపడి రెండు సిక్సర్లు, రెండు ఫోర్లతో 21 పరుగులు పిండుకున్నారు. ఆ తర్వాత ఆఖరి ఓవర్లలో తిరిగొచ్చిన దహానీ వరుసగా వైడ్లు, నోబాల్స్‌తో వైఫల్యం చెందాడు. ఇక చివరి ఓవర్లో తోహిద్ హృదోయ్ వరుసగా మూడు సిక్సర్లు, ఆపై మరో సిక్స్, ఫోర్‌తో ఒకే ఓవర్లో ఏకంగా 31 పరుగులు రాబట్టాడు. ఎల్‌పిఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన బౌలింగ్ స్పెల్ నమోదవడంతో ఇప్పుడు అందరి దృష్టి దీనిపైనే కేంద్రీకృతమైంది.

4 ఓవర్లలో 71 పరుగులు

ఈ లీగ్‌లో పక్కాగా మ్యాచ్ ఫిక్సింగ్ జరుగుతోందని, లీగ్ పారదర్శకతపై పెద్ద ఎత్తున అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఈ నెల ప్రారంభంలోనే అక్రమాలకు పాల్పడ్డాడనే ఆరోపణలతో జాఫ్నా కింగ్స్ జట్టు యజమానుల్లో ఒకరైన మన్జోత్ కల్రాను శ్రీలంక పోలీసుల స్పెషల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ అరెస్ట్ చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. క్యాచ్‌లను కావాలనే వదిలేస్తున్నారని, మ్యాచ్‌లో ఎలాంటి తీవ్రత లేకుండా 30 పరుగుల ఓవర్లు మామూలైపోయాయని పోస్టులు పెడుతున్నారు. ఒకప్పుడు అత్యుత్తమ టి20 బౌలర్‌గా పేరొందిన 27 ఏళ్ల దహానీకి ఇది అత్యంత చేదు జ్ఞాపకంగా మిగిలిపోయింది. పిఎస్ఎల్ సీజన్‌లో ముల్తాన్ సుల్తాన్స్ తరఫున 20 వికెట్లు, తదుపరి సీజన్లో 17 వికెట్లు తీసి దహానీ వెలుగులోకి వచ్చాడు.

వరల్డ్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్..

క్వార్టర్ ఫైనల్స్‌కు భారత్ పురుష, మహిళా జట్లు

న్యూఢిల్లీ: ప్రపంచ జూనియర్ స్క్వాష్ టీమ్ ఛాంపియన్‌షిప్‌ల నాకౌట్ దశల్లో విభిన్నమైన విజయాలు సాధించిన భారత పురుషుల, మహిళల జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఐదవ సీడ్ భారత పురుషుల జట్టు, ఆరంభంలో ఎదురైన ఎదురుదెబ్బ నుండి కోలుకుని ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో 11వ సీడ్ కువైట్‌ను 2-1 తేడాతో ఓడించింది. మరోవైపు, మహిళల జట్టు గ్రూప్ దశలో తమ అజేయ పరంపరను కొనసాగిస్తూ, దక్షిణాఫ్రికాపై 3-0 తేడాతో ఘన విజయం సాధించింది. అబ్దుల్లా అలీ చేతిలో యుషా నఫీస్ వరుస గేమ్‌లలో తొలి షాట్‌ను కోల్పోవడంతో భారత పురుషుల జట్టుకు ఆరంభం కష్టంగా మారింది. అయితే, ఖలీద్ వలీద్ అల్ ఫౌజైన్‌పై 11-5, 11-6, 11-5 తేడాతో ఆధిపత్య విజయం సాధించి ఆర్యవీర్ దీవాన్ టైని సమం చేశాడు. ఆ తర్వాత గుర్వీర్ సింగ్ అద్భుతమైన ప్రదర్శనతో అబ్దుల్ రహ్మాన్ అల్ సానియాను 11-3, 11-3, 11-4 తేడాతో ఓడించి జట్టు స్థానాన్ని ఖాయం చేశాడు. మరోవైపు, భారత మహిళల జట్టు దక్షిణాఫ్రికాపై ఏకపక్ష ప్రదర్శన కనబరిచింది. రుద్ర సింగ్, మకైలా నాయుడుపై 11-4, 11-5, 11-3 తేడాతో విజయం సాధించి మ్యాచ్‌ను ప్రారంభించగా, ఆ తర్వాత అనాహత్ సింగ్, బ్రియానా రాబిన్సన్‌ను 11-1, 11-1, 11-3 తేడాతో ఓడించింది. సాన్వి కలంకి, వివియెన్ వాన్ డెర్ షిఫ్‌ను 11-4, 11-3, 11-3 తేడాతో ఓడించి క్లీన్ స్వీప్ పూర్తి చేసింది..

తైపే ఓపెన్‌లో రెండో రౌండ్‌కు

ప్రణయ్, ఉన్నతి

న్యూఢిల్లీ: భారత జట్టు ప్రచారానికి సారథులుగా ఉన్న అనుభవజ్ఞులైన షట్లర్లు హెచ్.ఎస్. ప్రణయ్, ఉన్నతి హూడా, బుధవారం తైపే ఓపెన్ సూపర్ 300లో తమతమ సింగిల్స్ ఈవెంట్లలో రెండవ రౌండ్‌కు చేరుకున్నారు. ఏడవ సీడ్ అయిన ప్రణయ్, కేవలం 35 నిమిషాల్లో ముగిసిన తన తొలి రౌండ్ పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో జపాన్‌కు చెందిన మినోరు కోగాను 21-11, 21-14 తేడాతో ఓడించాడు. రెండో రౌండ్‌కు చేరుకున్న ఇతర భారత పురుషుల సింగిల్స్ ఆటగాళ్లలో కిరణ్ జార్జ్, తరుణ్ మన్నేపల్లి ఉన్నారు. జార్జ్ చైనీస్ తైపీకి చెందిన వాంగ్ పోవెయ్‌ను 21-10, 21-18 తేడాతో, మన్నేపల్లి కొరియాకు చెందిన ఎనిమిదో సీడ్ జియోన్ హ్యోక్ జిన్‌ను 21-12, 21-15 తేడాతో అనూహ్యంగా ఓడించారు. పురుషుల సింగిల్స్ క్వాలిఫైయర్స్‌ద్వారా ముందుకు సాగిన వర్ధమాన ఆటగాడు రౌనక్ చౌహాన్‌కు మాత్రం తెరపడింది. ఇండోనేషియాకు చెందిన రిచీ దూటా రిచర్డో చేతిలో అతను 14-21, 16-21 తేడాతో ఓడిపోయాడు. మూడో సీడ్ ఉన్నతి, చైనీస్ తైపీకి చెందిన పెయ్ యు వాంగ్‌పై 21-12, 21-18 తేడాతో విజయం సాధించి తన మహిళల సింగిల్స్ ప్రచారాన్ని సానుకూలంగా ప్రారంభించింది. ఎనిమిదో సీడ్‌గా ఉన్న యువ దేవికాసిహాగ్, తన్వి శర్మ, అన్మోల్ ఖర్బ్‌కూడా మహిళల సింగిల్స్ తదుపరి రౌండ్‌కు చేరుకున్నారు. దేవిక˘గా యున్ పార్క్‌ను 14-21, 21-7, 21-15 తేడాతో ఓడించగా, తన్వి తస్నీమ్ మీర్‌పై 21-16, 22-20 తేడాతో విజయం సాధించింది.

ఐసిసి ర్యాంకింగ్స్‌లో..

టి20 వరల్డ్ నంబర్‌గా కిషన్

వన్డే ఫార్మట్‌లో అగ్రస్థానంలో శుభమన్ గిల్

న్యూఢిల్లీ: ప్రపంచ క్రికెట్‌లో భారత ఆటగాళ్ల హవా నిరంతరంగా కొనసాగుతోంది. ఐసిసి బుధవారం విడుదల చేసిన టి20 ర్యాంకింగ్స్‌లో టీమిండియా కుర్రాళ్లు ఊహించని సంచలనాలు సృష్టించారు. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత డాషింగ్ వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ అగ్ర పీఠాన్ని అధిరోహించి చరిత్ర తిరగరాశాడు. జింబాబ్వేతో జరిగిన రెండో టి20లో 81 పరుగులతో చెలరేగిన కిషన్ తన కెరీర్‌లోనే అత్యధికంగా 916 రేటింగ్ పాయింట్లను తాకాడు. సిరీస్ ముగిసే సమయానికి 910 పాయింట్లతో నంబర్ వన్ స్థానంలో తిరుగులేని ఆధిపత్యం చలాయిస్తున్నాడు. జింబాబ్వే సిరీస్‌లో అద్భుతంగా బౌలింగ్ చేసి మూడు వికెట్లు పడగొట్టిన స్పిన్నర్ రవి బిష్ణోయ్ ఐసిసి టి20 బౌలర్ల జాబితాలో 41వ ర్యాంకుకు చేరుకున్నాడు. బ్యాటర్ల విభాగంలో తిలక్ వర్మ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని ఆరో ర్యాంకులో నిలవగా, మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ 24వ ర్యాంకును దక్కించుకున్నాడు. జింబాబ్వే ఆటగాళ్లలో ఫాస్ట్ బౌలర్ బ్లెస్సింగ్ ముజరబాని బౌలర్ల జాబితాలో 26వ స్థానంలో నిలిచారు. జింబాబ్వే సిరీస్‌లో వైభవ్ సూర్యవంశీ ప్రదర్శనతో 48వ ర్యాంకుకు చేరుకున్నాడు. వన్డే ఫార్మట్‌లో భారత ఓపెనర్ శుభ్‌మన్ గిల్ తిరిగి నంబర్ వన్ కిరీటాన్ని కైవసం చేసుకున్నాడు. అగ్రస్థానంలో ఉన్న న్యూజిలాండ్ ప్లేయర్ డారిల్ మిచెల్, వెస్టిండీస్ సిరీస్‌కు దూరం కావడంతో ఆ స్థానం గిల్ వశమైంది. అటు టెస్టుల్లో వెస్టిండీస్‌కు చెందిన బౌలర్ జేడెన్ సీల్స్ 24వ ర్యాంకుకు చేరుకోగా, పాకిస్థాన్ మాజీ కెప్టెన్ బాబర్ ఆజం తన 32వ టెస్ట్ హాఫ్ సెంచరీతో బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో 15వ స్థానానికి చేరుకున్నాడు.

కామన్వెల్త్ గేమ్స్..

గుల్వీర్‌కు రజత పతకం

న్యూఢిల్లీ: కామన్వెల్త్ గేమ్స్‌లో పురుషుల 10,000 మీటర్ల పరుగు పందెంలో పతకం గెలిచిన భారతదేశపు మొట్టమొదటి అథ్లెట్‌గా గుల్వీర్ సింగ్ నిలిచాడు. ఆస్ట్రేలియాకు చెందిన కై రాబిన్సన్ (27:48.93) వెనుక, మరియు 27:50.28 సమయంతో కాంస్యం గెలుచుకున్న ఐల్ ఆఫ్ మ్యాన్‌కు చెందిన డేవిడ్ ముల్లార్కీ కంటే కొద్దిగా ముందుగా, గుల్వీర్ 27:49.78 సమయంతో ముగింపు రేఖను చేరుకున్నాడు. ఆందోళన, ఆపై ఉద్వేగభరితంగా అతను రెండవ స్థానంలో ప్రారంభించి, సగం దూరం పూర్తయ్యే వరకు మొదటి మూడు స్థానాల్లో కొనసాగి, ఆ తర్వాత ఆరవ స్థానానికి పడిపోయాడు. 5,600 మీటర్ల తర్వాత వేగం పుంజుకోవడంతో అతను తొమ్మిదో స్థానానికి చేరుకున్నాడు. ఆపై చివరి 1,200 మీటర్లలో వేగం పుంజుకుని, ల్యాప్‌లోకి ప్రవేశించే ముందు మూడో స్థానానికి చేరుకున్నాడు, అనంతరం అద్భుతమైన వేగంతో దూసుకెళ్లి రెండో స్థానంలో నిలిచాడు. అతను 3,000 మీటర్ల దూరాన్ని 8:39.2 సమయంలో పూర్తి చేసి, 6,000 మీటర్ల వరకు ఐదవ స్థానానికి పడిపోయినప్పటికీ పోటీలో నిలిచి, చివరి ల్యాప్‌కు ముందు తిరిగి తన స్థానానికి చేరుకున్నాడు.

కేంద్రానికి ఎల్ఐసి రూ.12,207 కోట్ల డివిడెండ్



న్యూఢిల్లీ,జులై 29: కేంద్ర ప్రభుత్వానికి ప్రభుత్వ రంగ సంస్థల నుంచి భారీగా డివిడెండ్లు అందుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి దేశంలోనే అతిపెద్ద బీమా సంస్థ ఎల్ఐసి రూ.12,207 కోట్ల డివిడెండ్‌ను కేంద్రానికి అందించింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎల్ఐసి ఎండీ, సిఇఒ ఆర్. దొరైస్వామి రూ.12,207 కోట్ల డివిడెండ్ చెక్కును బుధవారం అందజేశారు. ఈ విషయాన్ని ఆర్థిక మంత్రి ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఎల్ఐసి ఎండి రత్నాయక్ పట్నాయక్, ఎండి ఆర్ చందర్, జోనల్‌మేనేజర్ ఎన్ఎస్ రాఘవ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సిఇఒ ఆశీష్ పాండే రూ.2,853 కోట్ల డివిడెండ్ చెక్కును అందించారు. న్యూ ఇండియా అష్యూరెన్స్ సిఎండీ గిరిజా సుబ్రహ్మణియన్ రూ.211 కోట్ల డివిడెండ్‌ను అందజేశారు. 2025-26లో ప్రభుత్వ రంగ బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తుల (జిఎన్‌పిఎ) నిష్పత్తి 1.9 శాతానికి తగ్గిపోయింది. ఇది ఇప్పటివరకు నమోదైన కనిష్ఠ స్థాయి. మరోవైపు ఈ బ్యాంకుల ఉమ్మడి నికర లాభం రూ.1.98 లక్షల కోట్లకు చేరింది. వరుసగా నాలుగో ఏడాది లాభాలను నమోదు చేయడం విశేషం. సంస్కరణలు, మెరుగైన పాలన, బలమైన మూలధన స్థితి ఈ ఫలితాలకు ప్రధాన కారణాలుగా ప్రభుత్వం పేర్కొంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం 2025-26లో ప్రభుత్వ రంగ బ్యాంకుల నికర లాభం ఏడాది ప్రాతిపదికన 11.1 శాతం పెరిగింది. రుణాల వృద్ధి, వడ్డీ ఆదాయం పెరగడం, ఆస్తుల నాణ్యత మెరుగుపడటం లాభాలకు బలాన్నిచ్చాయి. 2026 మార్చి 31 నాటికి ఈ బ్యాంకుల మొత్తం వ్యాపారం రూ.283.3 లక్షల కోట్లకు చేరింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 12.8 శాతం వృద్ధిని నమోదు చేసింది. మార్చి 31 నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకుల నికర నిరర్థక ఆస్తుల (ఎన్‌పిఎ) నిష్పత్తి 0.39 శాతానికి తగ్గింది.

ఆర్‌బిఐ రూ.12,604 కోట్ల ప్రభుత్వ బాండ్ల బైబాక్

ముంబయి,జులై 29: భారతీయ రిజర్వ్ బ్యాంక్ నిర్వహించిన ప్రభుత్వ సెక్యూరిటీల బైబ్యాక్ వేలంలో మార్కెట్ పాల్గొనేవారి నుంచి మొత్తం రూ.16,959.07 కోట్ల విలువైన బిడ్లు అందితే వాటిలో రూ.12,604.07 కోట్ల విలువైన బిడ్లను ఆమోదించింది. ఈ బైబ్యాక్‌లో అత్యధికంగా 7.33 శాతం జీఎస్2026 సెక్యూరిటీలను ఆర్‌బిఐ తిరిగి కొనుగోలు చేసింది. ఈ విభాగంలో రూ.9,160.69 కోట్ల విలువైన ఆఫర్లు రాగా, వాటిలో రూ.8,960.69 కోట్ల విలువైన సెక్యూరిటీలను స్వీకరించింది. అదనంగా 8.15 శాతం జిఎస్ 2026 సెక్యూరిటీలలో రూ.2,400.387 కోట్లు, 5.74 శాతం జిఎస్2026లో రూ.893 కోట్లు, 8.24 శాతం జిఎస్2027లో రూ.350 కోట్ల విలువైన బాండ్లను కూడా ఆర్‌బిఐ తిరిగి కొనుగోలు చేసింది.ఈ బైబ్యాక్‌కు సంబంధించి కట్‌ఆఫ్ ధరలను 7.33 శాతం జిఎస్2026కు రూ.100.48, 5.74 శాతం, జీఎస్2026కు రూ.100.10, 8.15 శాతం జీఎస్2026కు రూ.100.86, 8.24 శాతం, జీఎస్2027కు రూ.101.40గా నిర్ణయించింది. వెయిటెడ్ యావరేజ్ ధరలు వరుసగా రూ.100.47, రూ.100.10, రూ.100.86, రూ.101.39గా నమోదయ్యాయి.

ఐటి, మెటల్, ఎఫ్ఎంసిజిల మద్దతు

లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

ముంబయి,జులై 29: దేశీయ ఈక్విటీ మార్కెట్లు బుధవారం భారీ లాభాలతో ముగిశాయి. ఐటీ, మెటల్, ఎఫ్ఎంసీజీ షేర్లలో బలమైన కొనుగోళ్లు కొనసాగడంతో పాటు విస్తృత మార్కెట్లలో కూడా కొనుగోళ్ల జోరు కనిపించింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు వరుసగా నాలుగు రోజుల విక్రయాల తర్వాత మళ్లీ కొనుగోలుదారులుగా మారడం, మార్కెట్ అస్థిరత తగ్గడం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచుతుందన్న ఆశావహ అంచనాలు మార్కెట్‌కు ఊతమిచ్చాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 888.68 పాయింటు ఎగిసి 77,654.60 వద్ద ముగిసింది. నిఫ్టీ50 సూచీ 264.85 పాయింటు లాభపడి 24,250.20 వద్ద స్థిరపడింది.నిఫ్టీ ర్యాలీకి ప్రధానంగా ఇన్ఫోసిస్ 4.32, భారతి ఎయిర్‌టెల్ 2.32, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్1.75 షేర్లు మద్దతునిచ్చాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్150 సూచీ 0.78 శాతం, బిఎస్ఇ స్మాల్‌క్యాప్250 సూచీ 1.47 శాతం చొప్పున పెరిగాయి. బిఎస్ఇలో మొత్తం 2,533 షేర్లు లాభపడగా, 1,705 షేర్లు నష్టాల్లో ముగిశాయి. 201 షేర్లు ఎలాంటి మార్పు లేకుండా ట్రేడయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లో సెప్టెంబర్ 2026 డెలివరీకి సంబంధించిన బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 3.82 డాలర్లు పెరిగి 87.91 డాలర్లకు చేరింది.రూపాయి మారకం విలువ డాలర్‌తో పోలిస్తే 95.6600 వద్ద ట్రేడవగా, గత ముగింపు 95.8200గా నమోదైంది. ఎంసీఎక్స్‌లో ఆగస్టు 5, 2026 డెలివరీకి సంబంధించిన బంగారం ఫ్యూచర్స్ ధర స్వల్పంగా 0.01 శాతం పెరిగి రూ.1,41,639 వద్ద ట్రేడైంది. నిఫ్టీ ఐటీ సూచీ 2.32 శాతం ఎగిసింది. ఇందులో ఇన్ఫోసిస్ 4.32 శాతం లాభపడగా, ఎల్‌టిఐ మైండ్‌ట్రీ 2.34, టిసిఎస్ 1.75, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ 1.70, కోఫోర్జ్1.25, విప్రో 1.20, పర్సిస్టెంట్ సిస్టమ్స్0.62, ఒరాకిల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సాఫ్ట్‌వేర్ 0.56 , టెక్ మహీంద్రా 0.42 లాభాలతో ముగిశాయి.

కనీస నిల్వల ఛార్జీలతో

బ్యాంకులు దూకుడు

నూఢిల్లీ,జులై 29: దేశంలోని బ్యాంకులు తమ ఖాతాదారులకు భారీ షాక్ ఇచ్చాయి. అకౌంట్లలో కనీస సగటు బ్యాలెన్స్ నిర్వహించనందుకు గత నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో ఏకంగా రూ.26,170 కోట్లకు పైగా జరిమానాల రూపంలో వసూలు చేశాయి. ఈ వివరాలను కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో వెల్లడించింది. రాజ్యసభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఒక లిఖితపూర్వక సమాధానంలో ఈ గణాంకాలను అందించారు. 2022-23 నుంచి 202526 ఆర్థిక సంవత్సరం మధ్య కాలంలో ఈ భారీ మొత్తాన్ని బ్యాంకులు ఆర్జించాయి. ఈ వసూళ్లలో ప్రభుత్వ రంగ బ్యాంకులతో పోలిస్తే ప్రైవేట్ రంగ బ్యాంకుల వాటానే అధికంగా ఉండటం గమనార్హం. కేవలం గత ఆర్థిక సంవత్సరంలోనే బ్యాంకులు రూ.7,086.63 కోట్లను మినిమమ్ బ్యాలెన్స్ ఛార్జీల కింద వసూలు చేశాయి. ఇందులో ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.2,137.92 కోట్లు వసూలు చేయగా, ప్రైవేట్ బ్యాంకులు ఏకంగా రూ.4,948.71 కోట్లు ఆర్జించాయి. ఇది ప్రభుత్వ బ్యాంకుల వసూళ్ల కన్నా రెండింతలకు పైగా ఉండటం గమనార్హం. ప్రైవేట్ బ్యాంకుల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అత్యధికంగా రూ.1,798.14 కోట్లతో మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత యాక్సిస్ బ్యాంక్ రూ.1,081.33 కోట్లు వసూలు చేసింది. ఈ రెండు బ్యాంకుల వాటానే ప్రైవేట్ బ్యాంకుల మొత్తం వసూళ్లలో దాదాపు 58 శాతంగా ఉంది. ఐసిఐసిఐ బ్యాంక్ (రూ.353.50 కోట్లు), కోటక్ మహీంద్రా బ్యాంక్ రూ.290.65 కోట్లు, యెస్ బ్యాంక్ రూ.195.05 కోట్లు వంటివి కూడా గణనీయంగా జరిమానాలు విధించాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.477.27 కోట్లతో అగ్రస్థానంలో ఉంది. ఈ మొత్తం కేవలం కరెంట్ అకౌంట్లకు సంబంధించినదేనని, 2020 మార్చి నుంచే సేవింగ్స్ ఖాతాలపై మినిమమ్ బ్యాలెన్స్ జరిమానాలను ఎస్బీఐ రద్దు చేసిందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎస్బీఐ తర్వాత బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.394.10 కోట్లు, ఇండియన్ బ్యాంక్ రూ.299.17 కోట్లు ఉన్నాయి. ఇటీవలి కాలంలో చాలా ప్రభుత్వ రంగ బ్యాంకులు ఈ ఛార్జీలను తగ్గించాయని ప్రభుత్వం తెలిపింది. మొత్తం 12 ప్రభుత్వ బ్యాంకుల్లో 10 బ్యాంకులు సేవింగ్స్ ఖాతాలపై ఈ పెనాల్టీలను పూర్తిగా రద్దు చేశాయని పేర్కొంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.